ఆదివారం 4-5-2025


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18 సంచిక: 42

'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆదివారం 4-5-2025




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18 సంచిక: 42

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 42

SUNDAY Special | ఆదివారం | 4-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL







## ఉత్కంఠ పోరులో బెంగళూరు విజయం

చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 పరుగుల తేడాతో గెలుపొందింది. బెంగళూరు 213 పరుగులు చేయగా, చెన్నై 211 పరుగులకే పరిమితమైంది.

- వివరాలు 14లో



## డాబా నిద్రలూ కజిన్స్‌తో కబుర్లూ

కజిన్స్‌తో డాబా మీద చాపలు పరుచుకుని ఆకాశాన్ని చూస్తూ చల్లటి గాలిలో కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం పెద్ద లగ్జరీ. కానీ పిల్లలకు ఈ భాగ్యం ఉండటం లేదు.

- వివరాలు 13లో



## ఉగ్రవాదంపై చర్యలు తథ్యం

భారత్, ఆఫ్రికన్ యూనియన్ గ్లోబల్ సౌత్‌కు ఇరుపక్షాలు మూలస్తంభాలని ప్రధాని మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని సహించబోమన్నారు.

- వివరాలు 6లో ▶



## తొక్కిసలాటలో ఏడుగురు మృతి

గోవాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆలయ జాతరలో జరిగిన తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు.


- వివరాలు 6లో ▶



## మధ్యవర్తిత్వమే మేలైన మార్గం

మధ్యవర్తిత్వాన్ని తక్కువ చేసి చూడొద్దని, వివాదాల పరిష్కారానికి అది తెలివైన మార్గమని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు.

- వివరాలు 6లో ▶



## ఆస్ట్రేలియాలో లేబర్ పార్టీ విజయం

ఆస్ట్రేలియా ఫెడరల్ ఎన్నికల్లో అధికార లేబర్ పార్టీ మరోసారి గెలిచింది. ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ చరిత్ర సృష్టించారు.

- వివరాలు 6లో ▶

# కరువు ఎరుగని కృషీవలురు!

## సమష్టి కృషితో బొట్టుబొట్టును ఒడిసి పట్టిన రైతులు

చెక్ డ్యాంల నిర్మాణంతో వేసవిలోనూ పుష్కలంగా నీరు

సరికొత్త ఆలోచనతో జలసిరులు సృష్టించిన మరికొందరు

బంగారు పంటలు పండిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న వైనం



కొడిమ్యాల మండలం పూడూరు వాగుపై 7 చెక్ డ్యాంలు ఉన్నాయి. వాగుకు ఇరువైపులా మోటార్లు పెట్టుకుని రైతులు ఈ నీటితో పంటలు సాగు చేసేవారు. ఇటీవల వాగు పూర్తిగా ఎండిపోవటంతో ఆరెపల్లి, అప్పారావుపేట, పూడూరు గ్రామ రైతులు చందాలు వేసుకొని దాదాపు రూ. లక్ష జమచేసి 40 పైపులు కొనుగోలు చేసి, కొండాపూర్ మైసమ్మ చెరువు మత్తడి నుంచి సాగు నీటిని తరలించారు. దీంతో కొడిమ్యాల పెద్దవాగుతోపాటు పూడూరు వాగుపై ఉన్న ఏడు చెక్ డ్యాంలు నిండి పొంగిపొర్లుతున్నాయి. ఈ నీటితో ఆ చుట్టుపక్కల 500 ఎకరాల వరి పంట ఎండిపోకుండా రైతులు కాపాడుకున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేసవికాలం వచ్చిందంటే చాలాచోట్ల ఎండిన పంటలు.. పశువుల మేతకు వదిలేసిన పొలాల చిత్రాలే కన్పిస్తాయి. ఎండిపోయిన వాగులు.. ఒట్టిపోయిన బావులు సర్వసాధారణం.. కానీ, కొన్నిచోట్ల ప్రభుత్వం వాగులు, వంకలపై నిర్మించిన చిన్నచిన్న చెక్‌డ్యాంలు అన్నదాతల తలరాతలను మార్చేశాయి. మండు వేసవిలోనూ నిండైన జలకళతో పచ్చని పంటలకు ప్రాణం పోస్తున్నాయి. మరికొన్నిచోట్ల అన్నదాతలు సరికొత్త ఆలోచనలతో సొంతంగానే నీటిని ఒడిసిపట్టి మండు వేసవిలో బంగారు పంటలు పండిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కన్నీటి జీవితాలను ప'న్నీటి'గా మార్చుకున్న పలువురు రైతుల విజయగాథలివీ...

**ఐదేళ్లుగా కరువు ఎరగని వీణవంక పల్లె**

కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం.. ఆ ప్రాంతంలో

మిగతా 2వ పేజీలో ▶

### భూగర్భ జల ఘోష

- 10.17 మీటర్లకు పడిపోయిన సగటు భూగర్భ జల మట్టాలు
- ఒక్క జిల్లాలో కూడా సురక్షిత స్థాయిలో లేని వైనం

2 లో




# దిగుమతులు బంద్

## పోస్టల్ సేవలు కూడా.. పాక్‌కు భారత్ మరిన్ని షాక్‌లు

| పాక్ నౌకలకు నో ఎంట్రీ | ఐఎంఎఫ్ రుణాన్ని అడ్డుకుంటోంది | భారత్ చర్యలపై పాకిస్తాన్ ఆక్రోశం |
|---|---|---|

పహల్గాం దుస్సాహసానికి ముష్కరులను ప్రేరేపించిన దాయాదికి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. పాకిస్తాన్ నుంచి దిగుమతులను పూర్తిగా నిషేధిస్తూ భారత్ శనివారం నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులకూ ఇది వర్తిస్తుంది. పాక్‌లో ఉత్పత్తయ్యే, ఆ దేశం గుండా ఎగుమతయ్యే అన్ని రకాల వస్తువులు, ఉత్పత్తుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులను పూర్తిగా నిషేధిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం వెల్లడించింది. ఆ దేశానికి సముద్ర రవాణా మార్గాలను పూర్తిగా మూసేసింది. దీంతోపాటు పాక్‌కు అన్నిరకాల పార్సిల్, పోస్టల్ సేవలను కూడా సంపూర్ణంగా నిలిపేసింది. ఈ నిర్ణయాలన్నీ తక్షణం అమల్లోకి వచ్చినట్టు కేంద్రం ప్రకటించింది. దీని ప్రభావం పాక్‌పై తీవ్రంగా ఉండనుంది.

- 6లో

### రెచ్చగొట్టేలా పాకిస్తాన్ క్షిపణి పరీక్షలు

450 కి.మీ. రేంజ్‌తో కూడిన క్షిపణి పరీక్ష

6 లో

### 'సింధూ' నిర్మాణాలను పేల్చేస్తాం

పాక్ రక్షణ మంత్రి ప్రేలాపనలు

## న్యూస్‌రీల్

### నేడు నీట్ పరీక్ష




వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం 'జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష'(నీట్)'ఆదివారం జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా నీట్ పరీక్షకు 72,507 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈసారి నీట్ పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 190 కేంద్రాలు ఏర్పాటుచేశారు.

- వివరాలు 2లో ▶

### కాంగ్రెస్ కుల సర్వేతో బీసీలకు అన్యాయం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు.

- వివరాలు 12లో ▶

### ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా ఈ-సిటీ



'ఫ్యూచర్ సిటీ'లో అంతర్భాగంగా ప్రత్యేకంగా ఈ-సిటీని అభివృద్ధి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సిరా నెట్‌వర్క్స్, ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ సంస్థలు రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రెడీ అన్నాయి.

- వివరాలు 12లో ▶

### ఆ ఆస్తులు ఎలా కొన్నారు?




'ఆ ఆస్తులు ఎలా కొనుగోలు చేశారు? మీకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? మీకు ఇతర ఆదాయ మార్గాలు ఉన్నాయా?' అని ఏసీబీ హరిరామ్‌ను ప్రశ్నించింది.

- వివరాలు 16లో ▶



## సైబర్‌కాండ్రియా.. నెట్ వైద్యం



- వైద్యుడు వద్దు, నెట్టే ముద్దు
- సమస్య గోరంత, నెట్ చూపేది కొండంత
- ఆన్‌లైన్‌లో వెతకడం, ఆందోళన పడటం
- పిల్లలూ, యువతలోనే ఎక్కువ
- విజ్ఞత, విజ్ఞానమే ప్రధానం

- వివరాలు 3లో

## మీరు తినే పనీర్ సహజమైనదేనా?



- హోటళ్లలో పెరిగిన ప్రత్యామ్నాయ పనీర్ వాడకం
- దీనివల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు
- మెనూలో పనీర్ వివరాలు పెట్టాల్సిందే
- హోటళ్లకు ఇకపై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిబంధనలు

- వివరాలు 16లో

## ఐఫోన్ భారత్‌లో తయారీ.. అమెరికాలో అమ్మాలి



- మెజార్టీ ఫోన్ల తయారీ ఇక మన దేశంలోనే
- వెల్లడించిన యాపిల్ సీఈఓ టిమ్ కుక్
- 2026 నాటికి అగ్ర రాజ్యానికి 6 కోట్ల యూనిట్లు
- భారత్‌లో ఐఫోన్ల తయారీ సామర్థ్యం పెంపు
- చైనాపై ఆధారపడడం తగ్గించేందుకే నిర్ణయం
- టాటా కొత్త ప్లాంటులో ప్రారంభమైన ఉత్పత్తి
- కొద్ది రోజుల్లో ఫాక్స్‌కాన్ నూతన ప్లాంటులోనూ

- వివరాలు 2లో

## పిల్లలతోపాటు తల్లిదండ్రులూ కోర్టుకు!

### మైనర్ డ్రైవింగ్ విషయంలో పోలీసులు సీరియస్

- ఉల్లంఘనులు సైతం జువెనైల్ బోర్డులో హాజరు
- భారీగా జరిమానాలు విధిస్తున్న న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: నగరంలో మైనర్ డ్రైవింగ్ నిరోధంపై దృష్టి పెట్టిన ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ ఉల్లంఘనకు పాల్పడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులు (వాహన యజమానులైతే)/వాహన యజమానిపై చర్యలు తీసుకుంటున్నారు. మైనర్లను జువెనైల్ బోర్డు ఎదుట హాజరుపరుస్తున్న ట్రాఫిక్ విభాగం అధికారులు, తల్లిదండ్రులు/వాహన యజమానిని సాధారణ కోర్టుకు తరలిస్తున్నారు. దీనికి ముందు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) వీరికి పూర్తి స్థాయిలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు హైదరాబాద్ నగర ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ 'సాక్షి'కి తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ విభాగం అధికారులు గత నెల 5 నుంచి స్పెషల్ డ్రైవ్స్ చేస్తున్నారు. శనివారం వరకు నిర్వహించిన తనిఖీల్లో 2,067 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ చిక్కారని, వీరిపై కేసులు నమోదు చేశామని జోయల్ డెవిస్ పేర్కొన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు మైనర్‌తో పాటు తల్లిదండ్రులు/వాహన యజమానిని టీటీఐకి రప్పిస్తున్నారు. అక్కడ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత అభియోగపత్రాలు సిద్ధం చేసి మైనర్‌ను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు, తల్లిదండ్రులు/వాహన యజమానిని సంబంధిత కోర్టులో హాజరుపరుస్తున్నారు. న్యాయమూర్తులు మైనర్లకు సామాజిక సేవ వంటి శిక్షలు విధిస్తుండగా... తల్లిదండ్రులు/వాహన యజమానులకు భారీ జరిమానాలు వేస్తున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వీరికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలుశిక్షపడే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత వాహనంతో పాటు ఆ మైనర్‌కు సంబంధించిన

మిగతా 15వ పేజీలో ▶

హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద దేవాదుల పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా



## రెండేళ్లలో దేవాదుల పూర్తి..

### పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక ప్రణాళిక

- 84 శాతం మందికి సన్నబియ్యంతో భోజనం పెడుతున్నాం
- ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- దేవాదుల పంప్‌హౌస్, ధర్మసాగర్ రిజర్వాయర్ పరిశీలన

3 లో

## విదేశీ విద్యలో బీసీలకు కత్తెర



- పూలే విద్యానిధి కోటా పెంపుపై చేతులెత్తేసిన బీసీ సంక్షేమ శాఖ
- అర్హుల పరిమితి పెంచుతామంటూ ఏడాదిన్నరగా ఎంపిక జాబితాలు నిలుపుదల
- పాత కోటా ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ

12 లో

## ఇదం జగత్




# ఇదీ తెలంగాణ బ్రాండ్..

### మిస్ వరల్డ్ పోటీల ద్వారా ప్రపంచానికి చాటాలని సర్కారు నిర్ణయం

విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు ఉపకరిస్తుందనే భావన

టూరిజం పాలసీకి విశ్వవ్యాప్త ప్రాచుర్యం కల్పించే యత్నం

సురక్షిత ప్రాంతం, మౌలిక వసతుల నిలయం,

ఘనమైన చారిత్రక వారసత్వం, ఆధునిక వైద్యం..

4 అంశాలపై విస్తృత ప్రచారం

హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరిగే ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ బ్రాండ్‌కు గుర్తింపు దక్కేలా మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విదేశీ పెట్టుబడులు వీలైనంత ఎక్కువగా ఆకర్షించాలంటే తెలంగాణకు విశ్వవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు అవసరమని భావిస్తోంది. ఇందుకు ప్రపంచ సుందరి పోటీలు సరైన అవకాశమని భావిస్తోంది. వీటిని విజయవంతం చేయడం ద్వారా రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటాలనే పట్టుదలతో ఉంది. ఇటీవలే ప్రత్యేకంగా టూరిజం పాలసీని తీసుకొచ్చిన ప్రభుత్వం.. దాన్ని ఈ పోటీల నిర్వహణతో ముడిపెట్టి విశ్వవ్యాప్త ప్రచారం కల్పించనుంది. 'తెలంగాణ.. జరూర్ ఆనా, తెలంగాణ.. హార్ట్ ఆఫ్ ది డెక్కన్'లాంటి నినాదాలను విస్తృతంగా వినియోగిస్తోంది. మిస్ వరల్డ్ పోటీల లోగోలో కూడా వీటిని పొందుపరిచింది.

**నాలుగు అంశాలు.. నలుదిక్కులా ప్రచారం**

ప్రపంచ సుందరి 72వ ఎడిషన్ పోటీలు ఈ నెల 10 నుంచి నెలాఖరు వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో 120కి పైగా దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్నారు. ఈ పోటీలను కవర్ చేసేందుకు 150 దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు హైదరాబాద్‌లో

మిగతా 3వ పేజీలో ▶

# ప్రొటోకాల్ ఏదీ?

### నల్లగొండ జిల్లా ముఖ్య నేత అంతర్మథనం



- ప్రొటోకాల్‌లో పెద్ద హోదానే అయినా కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకూ పిలవని వైనం
- ఇద్దరు మంత్రులు పాల్గొన్న కార్యక్రమానికి ఆహ్వానం కరువు... సీఎం దృష్టికి తీసుకెళ్లిన ముఖ్యనేత

సాక్షి, హైదరాబాద్: ఆయన హోదా పెద్దది... ఆయన కూర్చునే సభ కూడా పెద్దదే... గవర్నర్, ముఖ్యమంత్రి తర్వాత రాజకీయ ప్రొటోకాల్ ఆయనదే. అటు హోదా, ఇటు ప్రొటోకాల్ ఒకదాని మించి మరోటి పెద్దవైనా నల్లగొండ జిల్లాకు చెందిన ఆ ముఖ్య నాయకుడికి మాత్రం ప్రతీసారి ప్రొటోకాల్ సమస్య ఎదురవుతోంది. జిల్లా రాజకీయాల్లో ప్రముఖుడిగా గుర్తింపు పొంది రాష్ట్ర స్థాయి పదవిని నిర్వహిస్తున్న ఆ ముఖ్యనేతకు జిల్లాలో జరిగే ప్రజా కార్యక్రమాల్లో లభించాల్సిన మర్యాద మాత్రం ఆమడదూరంలోనే నిలిచిపోతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఆయన ప్రొటోకాల్ సమస్యకు స్థానిక రాజకీయాలే కారణమని, అప్పుడయినా, ఇప్పుడయినా జిల్లా మంత్రుల వైఖరితోనే ఆ 'పెద్దాయన'మనస్తాపం చెందుతున్నారని అటు జిల్లా, ఇటు

మిగతా 3వ పేజీలో ▶

# ఐఫోన్ భారత్‌లో తయారీ.. అమెరికాలో అమ్మాలి



ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే మెజార్టీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో అమ్మేవి కాకుండా ఇతర దేశాల్లో విక్రయించే ఉత్పత్తులు మాత్రమే అత్యధికంగా చైనాలో తయారవుతాయని స్పష్టం చేశారు. టిమ్ కుక్ నిర్ణయం వెనక కారణాలేంటి? భారీ టారిఫ్‌ల కారణంగా యాపిల్ కంపెనీ నెమ్మదిగా చైనాతో తెగతెంపులు చేసుకుంటోందా? ఈ నిర్ణయంతో మనదేశానికి లాభమేంటి?

**- సాక్షి, స్పెషల్ డెస్క్**

## మెజార్టీ ఫోన్ల తయారీ ఇక మన దేశంలోనే

- వెల్లడించిన యాపిల్ సీఈఓ టిమ్ కుక్
- 2026 నాటికి అగ్ర రాజ్యానికి 6 కోట్ల యూనిట్లు
- భారత్‌లో ఐఫోన్ల తయారీ సామర్థ్యం పెంపు
- చైనాపై ఆధారపడడం తగ్గించేందుకే నిర్ణయం
- టాటా కొత్త ప్లాంటులో ప్రారంభమైన ఉత్పత్తి
- కొద్ది రోజుల్లో ఫాక్స్‌కాన్ నూతన ప్లాంటులోనూ

### దిద్దుబాటలో కంపెనీ..

ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్ల ఉత్పత్తిలో చైనా వాటా ఏకంగా 75% పైగా ఉంది. ఈ అంశమే ఇప్పుడు యాపిల్‌కు కష్టాలను తెచ్చిపెట్టింది. యూఎస్-చైనా వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరడమే ఇందుకు కారణం. చైనా నుంచి యూఎస్‌కు దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా 145% సుంకాలు విధించడం.. ఆ తరువాత ప్రతీకార సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్‌ను మినహాయించడంతో వీటిపై టారిఫ్ కాస్తా 20%కి వచ్చి చేరింది. టారిఫ్‌ల విషయంలో ప్రస్తుతానికి ఉపశమనం ఉన్నా.. తయారీపై సింహభాగం ఒక దేశంపై ఆధారపడడం ఏమాత్రం శ్రేయస్కరం కాదన్న వాస్తవం యాపిల్‌కు అర్థం అయినట్టుంది. అందుకే చైనాలో తయారీ తగ్గించి భారత్‌పై ఫోకస్ చేసింది. యూఎస్ మార్కెట్‌కు పూర్తిగా భారత్ నుంచే ఐఫోన్లను సరఫరా చేయాలని నిర్ణయించింది. జనవరి-మార్చి కాలంలో రూ.48,000 కోట్ల విలువైన మేడిన్ ఇండియా ఐఫోన్ యూఎస్‌కు ఎగుమతి అయ్యాయి. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఎగుమతయిన ఫోన్ల విలువ రూ.28,500 కోట్లు. మొత్తం ఐఫోన్ తయారీలో గత ఏడాది భారత్ వాటా 20% ఉంది. 2025లో ఇది 25-30 శాతానికి చేరే అవకాశం ఉంది.

### రెండు కొత్త ప్లాంట్లు..

యూఎస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని చైనాకు ప్రత్యామ్నాయ తయారీ స్థావరంగా భారత్‌ను తీర్చిదిద్దే పనిలో యాపిల్ నిమగ్నమైంది. ఈ నిర్ణయం భారత్‌కు లాభించే విషయమే. ఈ క్రమంలో యాపిల్ ఉత్పత్తులను తయారు చేస్తున్న భాగస్వామ్య కంపెనీలూ తమ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. తమిళనాడులోని హోసూర్ వద్ద ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కొత్త ప్లాంట్‌లో ఐఫోన్ల తయారీ ఇటీవలే ప్రారంభం అయింది. కర్ణాటకలోని బెంగళూరు వద్ద రూ.22,139 కోట్లతో ఫాక్స్‌కాన్‌నిర్మిస్తున్న కేంద్రంలో కొద్ది రోజుల్లో తొలి దశ ఉత్పత్తి మొదలు కానుంది.

### ఐఫోన్స్ ముచ్చట్లు..

- 2024లో ప్రపంచవ్యాప్తంగా 23.2 కోట్ల ఐఫోన్ల అమ్మకాలు
- 2024లో దేశంలో ఐఫోన్ల విక్రయాల్లో 35% వృద్ధి. 1.2 కోట్ల ఐఫోన్ల అమ్మకాలు.
- భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమ్మకాల విలువ పరంగా అగ్రస్థానంలో ఐఫోన్.
- 2024-25లో భారత్ నుంచి రూ.1,50,000 కోట్ల విలువైన ఐఫోన్లు ఎగుమతి. 2023-24లో ఇది రూ.85,000 కోట్లు.
- గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో 4.3 కోట్ల యూనిట్ల యాపిల్ ఫోన్లు తయారయ్యాయి.

### వాటా రెండింతలకు..

దేశంలో 2017 నుంచి ఐఫోన్ల అసెంబ్లింగ్ మొదలైంది. 2026 చివరినాటికి భారత్‌లో ఏటా 7-8 కోట్ల ఐఫోన్లు ఉత్పత్తి కానున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అలాగే ఒక్క యూఎస్ కోసమే 6 కోట్ల యూనిట్లను భారత్ నుంచి దిగుమతి చేసుకోవాలని కంపెనీ నిర్ణయించినట్లు సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో 4.3 కోట్ల యాపిల్ ఫోన్లు తయారయ్యాయి. వీటి విలువ రూ.1,87,000 కోట్లు. ఇందులో 80% ఎగుమతులు. ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్ల తయారీలో భారత్ వాటా 18 నెలల్లో రెండింతలకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. కాగా, ఐఫోన్స్‌ను తయారు చేయడానికి చైనా నుండి కీలక యంత్రాలను దిగుమతి చేసుకోవడానికి అనుమతిలో పెరుగుతున్న జాప్యం ఐఫోన్ 17 విడుదలను మాత్రమే కాకుండా.. దేశం నుండి ఫోన్ల ఉత్పత్తిని రెట్టింపు చేయాలనే కంపెనీ ప్రణాళికను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### యాప్ స్టోర్ సైతం..

ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచంలో అతిపెద్దదైన యాపిల్ కంపెనీకి భారత్‌లో ఐఓఎస్ యాప్ వ్యవస్థ 2024లో రూ.44,447 కోట్ల ఆదాయం సమకూర్చింది. యాపిల్‌కు గత ఏడాది అన్ని విభాగాల్లో కలిపి భారత్ సుమారు రూ.2.3 లక్షల కోట్ల ఆదాయాన్ని అందించినట్టు తెలుస్తోంది. భారత్‌లో డెవలపర్లకు అద్భుత అవకాశాలు ఉన్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ గతంలో అన్నారు. ప్రతి వారం సగటున 2.2 కోట్ల మంది ఇండియా యాప్ స్టోర్‌ను వినియోగిస్తున్నారు. 2024లో యాప్ డౌన్‌లోడ్స్ 110 కోట్లకుపైమాటే.

## క్లుప్తంగా...

### ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం కింద ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర నెలల కాల వ్యవధి గల అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియెట్, ఆటోమొబైల్ టూ వీలర్ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈ నెల 5న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### రైతు కూలీల పిల్లలకు వ్యవసాయ కోర్సుల్లో 15 శాతం కోటా

**ఏజీ వర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య**

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వ్యవసాయ విద్య కోర్సుల ప్రవేశాల్లో రైతు కూలీల పిల్లలకు 15 శాతం కోటా అమలు చేయాలని నిర్ణయించినట్లు ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే రైతుల పిల్లలకు 25 శాతం కోటా ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రైతు కూలీల కుటుంబాల విద్యార్థులకు కూడా 15 శాతం కోటాను అమలు చేయనున్నట్లు తెలిపారు. జాబ్ కార్డున్న కుటుంబాల పిల్లలు ఈ కోటా కింద అర్హులని స్పష్టం చేశారు.

# భూగర్భ జల ఘోష!

**రాష్ట్రంలో 10.17 మీటర్లకు పడిపోయిన సగటు భూగర్భ జల మట్టాలు**

- ఒక్క జిల్లాలో కూడా సురక్షిత స్థాయిలో లేని వైనం
- 15 జిల్లాల్లో ఆందోళనకరంగా పరిస్థితి
- 172 మండలాల్లో దశాబ్ద కాలంలో లేనంత క్షీణత
- భూగర్భ జలాల పరిస్థితిపై నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఓ వైపు మండుటెండలు..మరోవైపు సాగు, తాగు, ఇతర అవసరాలకు బోరుబావుల నుంచి నీళ్లను తోడుతుండడంతో రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గత డిసెంబర్‌లో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం.. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ జనవరిలో 7.46 మీటర్లు, ఫిబ్రవరిలో 8.68 మీటర్లు, మార్చిలో 9.91 మీటర్ల లోతుకు పడిపోయింది. తాజాగా ఏప్రిల్‌లో మరింత దిగజారి 10.17 మీటర్లకు చేరింది. డిసెంబర్‌తో పోల్చితే మార్చి నాటికి ఏకంగా 3.47 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక మార్చితో పోల్చితే ఏప్రిల్ నాటికి కేవలం నెల రోజుల వ్యవధిలో 0.23 మీటర్ల మేర పడిపోవడం గమనార్హం. రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటి అవసరాలు, ఇతర అవసరాలు పెరిగి.. వేసవి ముగిసేలోగా భూగర్భ జల మట్టాలు మరింత పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.



రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. ఆయా జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, ఆ తదుపరి నెలలో నివేదికలను భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేస్తూ ఉంటుంది.

### వికారాబాద్ జిల్లాలో 16.6 మీటర్ల లోతుకు..

రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 16.6 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టాలు పడిపోయాయి. జగిత్యాల జిల్లాలో అత్యల్పంగా 5.57 మీటర్ల లోతులోనే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0-5 మీటర్లు, 5-10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0- 5 మీటర్ల లోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0-5 మీటర్ల లోతులో భూగర్భ జల మట్టం లేదని గుర్తించారు. 18 జిల్లాల్లో 5-10 మీటర్ల లోతులో, 11 జిల్లాల్లో 10-15 మీటర్ల లోతులో, 4 జిల్లాల్లో 15 మీటర్లకి మించిన లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది. 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు. 15 జిల్లాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో భారీ క్షీణత నమోదైంది.

### 3,452 చ.కి.మీ.లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలు..

అత్యంత లోతు (20మీటర్లకి మించిన లోతు)ల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం (డీప్ వాటర్ లెవల్ ఏరియా) మే 2024తో పోల్చితే ఏప్రిల్ 2025లో.. 1,262 చ.కి.మీ.ల నుంచి 3,452 చ.కి.మీ.లకి పెరిగింది. దశాబ్ద కాల సగటు (2015-2024)తో పోల్చితే మాత్రం ఏప్రిల్‌లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం 5,527 చ.కి.మీ.ల నుంచి 4,714 చ.కి.మీ.లకి తగ్గింది.

### ఈ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..

రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల నైరుతి, మధ్య ప్రాంతాలు, వికారాబాద్, యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమ ప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయ ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15-20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లిపోయినట్టు తేల్చారు.

### 172 మండలాల్లో దశాబ్ద సగటుకన్నా తగ్గి..

గత దశాబ్ద కాల (2015-2024) సగటుతో పోల్చినప్పుడు.. రాష్ట్రంలోని మొత్తం 612 మండలాలకుగాను 440 మండలాల్లో భూగర్భ జల మట్టాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. మిగిలిన 172 మండలాల్లో 0.01 మీటర్ల నుంచి 25.89 మీటర్ల వరకు గణనీయంగా క్షీణించాయి. 41 మండలాల్లో 0.5 మీటర్ల వరకు, 34 మండలాల్లో 0.5 మీటర్ల నుంచి మీటర్ వరకు, 43 మండలాల్లో 1-2 మీటర్ల మేర, 54 మండలాల్లో 2 మీటర్లకు పైగా పడిపోయాయి. భూగర్భ జల వనరుల శాఖ తన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది.

# నేడు నీట్ పరీక్ష

**హాజరు కానున్న 72,507 మంది విద్యార్థులు**

- 190 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష
- 1.30 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేత

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం 'జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష'(నీట్)'ఆదివారం జరుగనుంది. రాష్ట్రవ్యాప్తంగా నీట్ పరీక్షకు 72,507 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య తగ్గింది. 2023లో 72,842 మంది, 2024లో 77,849 మంది నీట్ పరీక్ష రాశారు. ఈసారి దరఖాస్తుల సంఖ్య 5 వేలకు పైగా తగ్గింది. ఈసారి నీట్ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 190 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే 'నీట్'పరీక్ష కోసం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటలలోపు విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారు. 1.30 గంటల తరువాత గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత పరీక్ష కేంద్రం లోపలికి అనుమతివ్వరు. పెన్, పేపర్ విధానం (ఓఎంఆర్ షీట్) ద్వారా జరిగే ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే పరీక్ష కేంద్రం వివరాలను 'సిటీ ఇంటిమేషన్ స్లిప్'ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. తదనుగుణంగా విద్యార్థులు మే 1 నుంచి అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆదివారం పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు అడ్మిట్ కార్డుతో పాటు అంటించడానికి ఒక ఫొటోను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఫొటో ఐడీ ప్రూఫ్‌ను మాత్రమే పరీక్ష హాల్‌లోకి విద్యార్థులకు అనుమతిస్తారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు, జ్యువెల్లరీ, పేపర్లు, పర్సులు వంటివి వేటినీ అనుమతించ కూడదని నీట్ పరీక్ష నిర్వహిస్తున్న 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**హైదరాబాద్‌లో అత్యధిక కేంద్రాలు**

నీట్ పరీక్షలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 190 కేంద్రాలు ఉండగా, హైదరాబాద్ జిల్లాలోనే అత్యధికంగా 62 కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో 26,000 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రతీ పరీక్షా కేంద్రంలో ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా, ఒక పోలీస్ అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నారు. అలాగే అన్ని కేంద్రాలలో సి.సి టీవీలను, తాగునీరు, మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అన్ని పరీక్ష కేంద్రాల విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తెలిపారు.

### టీజీ ఐసెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

నల్లగొండ టూటౌన్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్-2025 దరఖాస్తుల గడువును.. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఐసెట్ కన్వీనర్, మహాత్మాగాంధీ వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 51,857 మంది అభ్య ర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

# కరువు ఎరుగని కృషీవలురు!

▶ మొదటి పేజీ తరువాయి

కరువును దూరం చేసింది. ఒకప్పుడు తాగు, సాగు నీటికి అల్లాడిన అక్కడి ప్రజలు.. చెక్‌డ్యాం వల్ల గత ఐదేళ్లుగా నిశ్చింతగా బతుకుతున్నారు. మండల కేంద్రానికి అర కిలోమీటర్ దూరం



వీణవంక సమీపంలోని చెక్‌డ్యాం

లోనే ఉన్న వాగులో వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసేందుకు 2018లో రూ.1.54 కోట్లతో 15 ఎకరాల విస్తీర్ణంతో చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వీణవంకతోపాటు, బ్రాహ్మణపల్లి, రెడ్డిపల్లి, రామక్రిష్టాపూర్ గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందిస్తోంది. సుమారు 220 ఎకరాల భూమి దీని కింద సాగవుతోంది.

### 9 చెక్‌డ్యాంలతో నీటి సమస్య దూరం

మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని ఊకచెట్టు వాగులో గతంలో నీరు ఉండక భూగర్భ జలాలు అడుగంటేవి. గత ప్రభుత్వం ఈ వాగుపై 9 చెక్‌డ్యాంలు నిర్మించటంతో నీటి నిల్వ పెరిగి, చుట్టుపక్కల భూగర్భ జలాల పైపైకి వచ్చాయి. దీంతో సాగు, తాగు నీటి సమస్య దూరమైంది. సమీపంలోని బండ్రపల్లి, పల్లమరి, లాల్ కోట, నెల్లికొండి, పెద్ద వడ్డేమాన్, చిన్న వడ్డేమాన్, ఏదిలాపురం, చిన్న చింతకుంట, మద్దూరు, అల్లిపురం, కురుమూర్తి, అమ్మాపురం, గూడూరు, అప్పంపల్లి, ముచ్చింతల తదితర గ్రామాలలో 7,000 ఎకరాలలో రైతులు రెండు పంటలు పండిస్తున్నారు.



ఎదులాపురం చెక్‌డ్యాంలో పారుతున్న అలుగు

### సొంత భూమిలో చెరువు తవ్వించి..

నిజామాబాద్ జిల్లా బోధన్ మున్సిపల్ విలీన గ్రామం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పుట్ట బాబు తన పంట పొలంలో 2 ఎకరాల విస్తీర్ణంలో 15 ఏళ్ల క్రితమే చెరువును తవ్వించి నీటి సంరక్షణ చేపట్టారు. వర్షం నీటితో పాటు ఆరు బోరు బావులతో చెరువును నింపుతున్నాడు. ఈ చెరువు ద్వారా 12 ఎకరాల్లో వర్షాకాలం, యాసంగి సీజన్లలో వరి పంట సాగుచేస్తున్నాడు. చెరువు గట్టు చుట్టూ కొబ్బరి, మామిడి, సీతాఫలం చెట్లు పెంచి అదనపు ఆదాయం పొందుతున్నాడు.



పుట్ట బాబు నిర్మించుకున్న చెరువు

### వర్షపు నీరు గుంతల్లో నిల్వ..

నల్లగొండ జిల్లా చందూరులో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు రైతు పాల్వాయి సత్యనారాయణరెడ్డి తన భూమిలోనే కందకాలు తవ్వించాడు. ఆరేళ్ల క్రితం తనకున్న దాదాపు 100 ఎకరాలలో పలు చోట్ల కందకాలు తవ్వించాడు. గొల్లగూడకు వెళ్లే దారిలో గల 50 ఎకరాలలో సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో వర్షపు నీటి గుంతలను తవ్వారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నా ఈ గుంతల్లో నీరు పుష్కలంగా ఉండటం గమనార్హం. ఈ నీటివల్ల భూగర్భ జలాలు పెరిగి పంటకు నీటి కరువు తీరింది.



పొలంలో నిండుకుండలా వర్షపునీటి గుంత

### వాననీటిని ఒడిసి పట్టి..

మెదక్ జిల్లా రత్నాపూర్ గ్రామానికి చెందిన నింబాద్రిరావు అనే రైతు వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు సరికొత్త ఆలోచన చేశారు. తన ఏడు ఎకరాల భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టించి, వర్షాకాలంలో పడిన వర్షం నీరు భూమిలోకి ఇంకేలా ఏర్పాట్లు చేశాడు. దీనికి రాళ్లు, సిమెంట్ లైనింగ్ చేసి నీటిని నిలువ చేస్తున్నాడు. ఈ నీటి ద్వారా ఎండా కాలంలోనూ పంటలకు నీరందేలా ఏర్పాటు చేసుకున్నాడు. డ్రిప్ ద్వారా మామిడి పంటకు నీళ్లు పారిస్తున్నాడు. ఒకప్పుడు బీడుగా ఉన్న భూమిని ఇప్పుడు బంగారు పంటలు పండే సారవంతమైన భూమిగా తీర్చి దిద్దుకుని ఆదర్శంగా నిలుస్తున్నాడు.

### వట్టిపోని వట్టివాగు..



జలకళతో వట్టివాగు..

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కాట్రపల్లి, వెంకటగిరి, అర్పణపల్లి, ఉప్పరపల్లి, పెనుగొండ గ్రామాల మీదుగా వెళ్లే వట్టివాగు ఇప్పుడు మండు వేసవిలోనూ నిండుకుండలా కనిపిస్తోంది. ఇటీవల యాసంగి పంటల కోసం కొంత ఆలస్యంగా ఎస్సారెస్పీ జలాలను వట్టివాగులోకి మళ్లించటంతో వెంకటగిరి, అర్పణపల్లి, ఉప్పరపల్లి గ్రామాల పరిధిలో వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి.



### జహీరాబాద్ ప్రాంతంలో జలకళ

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో గతంలో చేపట్టిన వాటర్‌షెడ్ పనులు ఇప్పుడు రైతులకు జల సిరులు పారిస్తున్నాయి. ప్రముఖ ఇంజనీర్ హన్మంత్‌రావు ఇక్కడ చతుర్విధ జల ప్రక్రియను ఆవిష్కరించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని గొట్టిగారిపల్లి గ్రామంలో 2001లో వాటర్‌షెడ్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఫలితంగా నేడు 30 వేల ఎకరాలకు నీటి కొరత తీరింది. ఏడాది పొడవునా మూడు పంటలు పండుతున్నాయి.



రైతు నింబాద్రి నిర్మించిన వర్షపు నీటి గుంత

# సైబర్‌కాండ్రియా!
# నెట్ వైద్యం

వైద్యుడు వద్దు, నెట్టే ముద్దు | సమస్య గోరంత, నెట్ చూపేది కొండంత | ఆన్‌లైన్‌లో వెతకడం, ఆందోళన పడటం | పిల్లలు, యువతలోనే ఎక్కువ | విజ్ఞత, విజ్ఞానమే ప్రధానం

**అన్నింటినీ గూగుల్‌లో వెతకడం అలవాటైపోయిన చాలా మంది.. అనారోగ్య సమస్యలకు వైద్యం, మందులను కూడా నెట్‌లోనే వెతికేస్తున్నారు. అంతటితో ఆగకుండా.. దాని గురించి లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని తెగ ఆందోళన పడిపోతున్నారు. వెతికింది జబ్బో కాదో తెలీదు గానీ.. ఇలా అనవసరంగా వెతకడం మాత్రం పెద్ద జబ్బే. దీనిపేరు సైబర్‌కాండ్రియా లేదా కంప్యూకాండ్రియా. ఇదో విచిత్రమైన వ్యాధి. పిల్లలు, యువతలో ఇప్పుడిది ఎక్కువైపోయింది.**

సాక్షి, స్పెషల్ డెస్క్

పత్రికలూ లేదా మేగజైన్లలోనూ ఆరోగ్య సమాచారాన్ని చదువుతూ ఆందోళన చెందడాన్ని 'హైపోకాండ్రియా'గా చెబితే.. ఇప్పుడు ఇలా ఇంటర్‌నెట్‌లో చదువుతూ ఆందోళన చెందడాన్ని 'సైబర్' కాండ్రియాగా పేర్కొంటున్నారు.

ఈ సమస్య ఉన్నవారు.. తమ ఆరోగ్య సమస్యల గురించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వెతికి.. బాగా లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని భ్రమ పడుతుంటారు. ఉదాహరణకు ఓ వ్యక్తికి మామూలుగా తలనొప్పి వచ్చిందనుకోండి. ఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు దొరికిన సమాచారంలో దాన్ని 'బ్రెయిన్ ట్యూమర్' తాలూకు ఓ మ్యానిఫెస్టేషన్‌గా చదివాక.. తనకూ బ్రెయిన్ ట్యూమర్ లేదా బ్రెయిన్ క్యాన్సర్ ఉందేమోనని అనవసరంగా అపోహపడటం, ఆ భయాలతో ఆందోళనపడటం చేస్తుంటారు. ఇలా తమకున్న గోరంత సమస్యను కొండంత చేసుకుంటారు. వైద్యపరిశోధకులైన డాక్టర్ రయెన్ వైట్, డాక్టర్ ఎరిక్ హార్విట్జ్ 2009లో నిర్వహించిన ఓ అధ్యయనంలో.. ఇలా వెతికేవారు కేవలం మామూలు లక్షణాలకే పరిమితం కాకుండా.. అరుదైన, తీవ్రమైన వ్యాధుల తాలూకు పేజీలనూ ఎక్కువగా క్లిక్ చేసినట్టు తేలింది. వీరిలో స్వల్ప లక్షణాలున్నా పెద్ద వ్యాధి ఉందేమో అని ఆందోళన చెందడం సర్వసాధారణమైందని ఆ అధ్యయనవేత్తలు వెల్లడించారు. సెర్చ్ ఇంజిన్ల లాగ్స్‌ను ఉపయోగించి, 515 మందిపై వీరు ఈ సర్వే నిర్వహించారు.



### పెద్దలూ అతీతులు కారు...

సైబర్ కాండ్రియాకు పెద్దలూ అతీతులు కాదు. ఉదాహరణకు ఓ కొత్త బ్రాండ్ వాషింగ్ పౌడర్ వాడాక ఒంటి మీద అలర్జీ వచ్చినప్పుడు ఇంటర్నెట్‌లో వెదుకుతారు. ఆ లక్షణాలను బట్టి అది లూపస్ లేదా లైమ్ వ్యాధి అని చెబితే దాని గురించి మరింత భయపడతారు. అవసరం లేని పరీక్షలు చేయించడంతో పాటు అవసరం లేని మందులూ వాడతారు. ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి మీదా దుష్ప్రభావం చూపవచ్చు. ఆరోగ్య భయం ఎక్కువగా ఉన్నవారు ఇంటర్నెట్‌లో ఆరోగ్య సమాచారం కోసం మరింత ఎక్కువ వెతుకుతారు. ఆ తర్వాత అది వారిలో మరింత ఆందోళనకు దారితీస్తుంది. ఇలా ఇదొక విష వలయంలా కొనసాగుతూ ఉంటుంది.

### కొంత మంచి సమాచారమూ..

ఇంటర్‌నెట్‌లో దొరికే ప్రతి విషయమూ చెడ్డది కాదు. మయో క్లినిక్, కిడ్స్ హెల్త్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్‌ఐహెచ్) వంటి వెబ్‌సైట్లు అందరికీ అర్థమయ్యే రీతిలో నమ్మదగిన ఆరోగ్య సమాచారాన్ని అందిస్తున్నాయి. అవి మంచి వెబ్‌సైట్లే అయినా అందులోని విషయాన్ని చదివి తప్పుగా అర్థం చేసుకుంటే అదీ ప్రమాదమే. అందుకే ప్రతి అనారోగ్య సమస్య గురించీ ఆన్‌లైన్‌లో ఎక్కువ సేపు వెతకడం తగ్గించాలి. అది త్వరగా తగ్గకపోతే ముందుగా తమ పెద్దవారికి చెప్పడం లేదా మంచి డాక్టర్ని సంప్రదించాలి.

సైబర్‌కాండ్రియా.. ఇప్పుడు కొత్త జనరేషన్‌లో కనిపిస్తున్న సమస్య. చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌తో మనకు ఎంతైనా సమాచారం అందుబాటులో ఉండవచ్చు. కానీ దాన్ని విజ్ఞతతో ఉపయోగించుకోవడం తెలియనప్పుడు ఎదురయ్యే సమస్య ఇది. ఆ విజ్ఞత నేర్పడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తెరగాలి.

### వైద్యులపైనా నమ్మకం పోవచ్చు!

సైబర్ కాండ్రియా వల్ల జరిగే మరో ప్రధాన నష్టం ఏంటంటే.. ఇలా ఇంటర్‌నెట్‌లో వెదకడమన్నది వైద్యులపై ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయవచ్చు. ఆన్‌లైన్‌లో చదివిన దానికి డాక్టర్ చెప్పిన అంశాలు భిన్నంగా ఉంటే, వైద్యుని మాటనూ నమ్మకపోవచ్చు. డాక్టర్‌ను అనుమానించవచ్చు. కొంతమంది డాక్టర్ దగ్గరకు వెళ్లకుండానే ''నేనే నిర్ధారణ (సెల్ఫ్ డయాగ్నోస్) చేసుకున్నా'' అనేలా ప్రవర్తిస్తుంటారు. ఇది మరింత ప్రమాదకరం. దీనివల్ల ఏమాత్రం ముప్పు కలిగించని ఓ చిన్న సమస్యను పెద్దదిగా భావించడం, పెద్ద సమస్యను చిన్నదిగా భావించడం జరగవచ్చు. నిజానికి ఓ వ్యక్తి తాలూకు పూర్తి వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) ఇంటర్‌నెట్‌కు తెలియదు. అలా అది చిన్న జలుబు నుండి క్యాన్సర్ వరకు అన్నింటికీ.. అందరికీ ఒకే రకమైన పరిష్కారాలు చూపిస్తుంది.

### మిడిమిడి జ్ఞానంతో వీడియోలు

ఇటీవలి కాలంలో ఆరోగ్య సమాచారాలకు మంచి వ్యూవర్‌షిప్ ఉండటంతో వీడియోలు, రీల్స్ తయారు చేసే కొందరు రేటింగ్ కోసం తమ మిడిమిడి జ్ఞానంతో ఆందోళన పెంచే అభూత కల్పనలనూ వైరల్ చేస్తుండటంతో 'సైబర్‌కాండ్రియా'కు లోనయ్యేవారి సంఖ్య పెరుగుతోంది.



### సైబర్‌కాండ్రియా నివారణకు..

సైకలాజిస్టులు దీన్నో మానసిక సమస్యగా పరిగణిస్తున్నారు. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ) అనే చికిత్సతో దీన్ని తగ్గించడం సాధ్యమవుతుంది. సైబర్‌కాండ్రియా నివారణ కోసం కొన్ని సూచనలు..

సెర్చ్ ఇంజిన్ కంటే వైద్యులను నమ్మడమే మేలు.

ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. నిజానికి కొన్నిసార్లు ఆందోళన వల్లే శారీరక సమస్యలు కనిపిస్తాయి.

ధ్యానం, శ్వాస వ్యాయామాలు (బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్), నలుగురితో కలిసి వినోదాత్మకమైన కార్యకలాపాల్లో పాల్గొనడం, ఏదైనా పనితో తమను తాము బిజీగా ఉంచుకోవడం వంటివి సైబర్‌కాండ్రియా సమస్యను చాలావరకు నివారిస్తాయి.

– డాక్టర్ ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

### పిల్లలు, యువతలోనే ఎక్కువ

సైబర్‌కాండ్రియా సమస్యకు లోనవుతున్న వారిలో ముఖ్యంగా టీనేజ్ పిల్లలతో పాటు కౌమార యువత (అడాలసెంట్ యూత్) ఎక్కువగా ఉంటున్నారు. తమ సమస్యను బయటకు చెప్పుకోలేనప్పుడు వారు ఇంటర్‌నెట్‌నే ఆశ్రయిస్తున్నారు. పైగా తమకు ఉండే ఉత్సుకతకు తోడుగా ఆ వయసు పిల్లల్లో సహజంగా టెక్నాలజీ వాడకంలో ఉన్న నైపుణ్యాలు వారిని ఇంటర్‌నెట్ వైపునకు మళ్లేలా చేస్తున్నాయి. అయితే అక్కడ లభ్యమయ్యే సమాచారాన్ని ఏమేరకు తీసుకోవాలన్న విజ్ఞతగానీ, విజ్ఞానంగానీ ఆ వయసులో ఉండకపోవడమే వారిని అపార్థాలూ, అపోహల వైపునకు నెడుతోంది.

ఉదాహరణకు, స్కూల్ ముగిసేసరికి తాను అలసిపోతుండటాన్ని ప్రస్తావిస్తూ ఓ బాలిక.. అదే విషయాన్ని గూగుల్‌ను అడిగింది. నిజానికి అది మామూలు అలసట మాత్రమే. కానీ గూగుల్ తన సమాచారంలో ''ల్యూకేమియా లేదా గుండె సమస్యల వల్ల ఇలా జరగవచ్చు'' అనే సమాధానం ఇచ్చింది. దాంతో ఆమె చాలా ఆందోళనకు లోనైంది. నిజానికి ఆమె అలసటకు మరెన్నో మామూలు కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు తగిన నిద్ర లేకపోవడం లేదా మొబైల్ ఎక్కువ సేపు చూడటం వంటివి. కానీ గూగుల్ సమాధానంతో ఆమెలో కొత్తగా గుండె వేగంగా కొట్టుకోవడం, నిద్రలేమి వంటి ఇతర లక్షణాలు కనిపించవచ్చు. వాటి గురించి మళ్లీ వెదికినప్పుడు దొరికే సమాధానాలు ఆ చిన్నారి లేత మెదడును మరింత గందరగోళానికి గురిచేసే ప్రమాదం ఉంది.

---

## వైద్య మంత్రి చొరవతో నిలిచిన విద్యార్థిని ప్రాణం

- ప్రైవేటు వైద్యులు చేతులెత్తేస్తే.. ప్రాణం కాపాడిన నిమ్స్ వైద్యులు
- డైరెక్టర్ బీరప్పకు కృతజ్ఞతలు తెలిపిన బాలిక తల్లిదండ్రులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న విద్యార్థినిని కాపాడటం తమ వల్ల కాదని ప్రైవేటు ఆస్పత్రి చేతులు ఎత్తేస్తే, నిమ్స్ వైద్యులు ఆ బాలికకు మెరుగైన వైద్యం అందించి ప్రాణం నిలబెట్టారు. నిమ్స్ వైద్యుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మల్లా శృతి ఇంటర్ పరీక్ష తప్పడంతో మనస్తాపం చెంది హెర్బల్ హెన్నాను నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న శృతిని తల్లిదండ్రులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు రోజుల పాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించినా పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో హైదరాబాద్ తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. నిరుపేదలైన తల్లిదండ్రులు తమ దీనస్థితిని వైద్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల ఫోన్ కాల్‌కు వెంటనే స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ, బాలికకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్ బీరప్పను ఆదేశించారు. దీంతో గత నెల 25న అపస్మారక స్థితిలో ఉన్న శృతిని నిమ్స్‌లో చేర్చుకున్నారు. జాతీయ పాయిజన్ సెంటర్ గైడ్‌లైన్స్ మేరకు శృతికి అత్యాధునిక వైద్య సేవలను అందించారు. ఏడు రోజుల చికిత్స అనంతరం శృతి ఆరోగ్యం మెరుగుపడింది. శుక్రవారం ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న తమ కుమార్తెను కాపాడిన నిమ్స్ వైద్యులకు, డైరెక్టర్ బీరప్పకు, మంత్రి దామోదరకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



నిమ్స్ డైరెక్టర్‌ని కలిసిన శృతి తల్లిదండ్రులు

## రెండేళ్లలో దేవాదుల పూర్తి..

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక ప్రణాళిక
- 84 శాతం మందికి సన్నబియ్యంతో భోజనం పెడుతున్నాం
- ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- దేవాదుల పంప్‌హౌస్, ధర్మసాగర్ రిజర్వాయర్ పరిశీలన



భద్రకాళి చెరువు పూడికతీత పనుల గురించి ఉత్తమ్‌కు వివరిస్తున్న పొంగులేటి

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును రేండేళ్లలో పూర్తిచేస్తామని చెప్పారు. ఇందుకోసం స్పష్టమైన ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన హనుమకొండ జిల్లాలో పర్యటించారు. మొదట హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంపుహౌస్ స్టేషన్‌ను సందర్శించారు. తర్వాత ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న దేవాదుల పైపులను పరిశీలించారు. అక్కడి నుంచి భద్రకాళి చెరువుకు చేరుకుని పూడికతీత పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రుల సమీక్ష నిర్వహించారు.

**84 శాతం జనాభాకు సన్నబియ్యం**

రాష్ట్రంలో 84 శాతం జనాభాకు సన్నబియ్యంతో కడుపునిండా భోజనం పెడుతున్న ఘతన తమ ప్రభుత్వానిదేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు సీజన్లలో ఇప్పుడు తెలంగాణలో పండినంత ధాన్యం, ఉమ్మడి రాష్ట్రంలో కూడా పండలేదని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, మూడు లక్షల మందికి కార్డులు అందజేస్తామని తెలిపారు. సమ్మక్క సారక్క బరాజ్‌కు గోదావరి జలాలను 40 శాతానికిపైగా కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వంతోపాటు ఛత్తీస్‌గఢ్ సీఎంతోనూ చర్చించినట్లు వెల్లడించారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఏడాదికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యేలు, అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసి రైతన్నలకు సమృద్ధిగా నీరందిస్తామని తెలిపారు. సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, కేఆర్.నాగరాజు, సత్యనారాయణరావు, మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటోకాల్ ఏదీ?

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఉపాధి 'హామీ'కి కూడా లేని 'గ్యారంటీ'**

ప్రొటోకాల్ మర్యాద దూరమైన ఈ నల్లగొండ ముఖ్య నేతకు ఉపాధి హామీ పనుల విషయంలోనూ రాజకీయంగా చుక్కెదురైంది. గతంలో రూ.4 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులను తన ఎమ్మెల్సీ కోటాలో ఆయన ప్రతిపాదించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుమతించారు. సంబంధిత మంత్రి సీతక్క కూడా మంజూరు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పేషీ నుంచి జిల్లా కలెక్టర్‌కు మంజూరు పత్రాలు వెళ్లాయి. కలెక్టర్ వెంటనే ఈ ప్రతిపాదనల మేరకు పనుల అర్డర్‌కు సంబంధించిన కాపీని కూడా అందజేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అంతలోనే ఏమైందో కానీ వర్క్ ఆర్డర్లు రద్దయ్యాయి. కలెక్టర్ నుంచి ఉత్తర్వులు మారిపోయి పెద్దాయన ప్రతిపాదించిన పనుల స్థానే వేరే పనులు ప్రతిపాదించారు. దీనిపై ఆయనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మనస్తాపం చెందిన ఆయన అసెంబ్లీ కార్యదర్శి ద్వారా సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వగా.. రాజకీయ జోక్యం కారణంగానే పనులను మార్చాల్సి వచ్చిందని కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఇది పునరావృతం కానివ్వబోమని హామీ ఇచ్చారు. ఈ ఉపాధి పనుల కథ మర్చిపోకముందే మళ్లీ ఇప్పుడు ప్రొటోకాల్ సమస్య వచ్చిపడింది. గత నెల 28న నల్లగొండ జిల్లా కేంద్రంలో లిఫ్టు ఇరిగేషన్ పథకాల ప్రారంభం, కలెక్టరేట్‌లో నూతన భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగాయి. ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరైన ఈ కార్యక్రమానికి పెద్దాయనకు పిలుపు రాలేదు.

### సీఎం గారూ... చూడండి

జిల్లాలో జరిగే అధికారిక కార్యక్రమాలకు అటు మంత్రి, ఇటు కలెక్టర్ పిలవడం లేదని పెద్దాయన సన్నిహితుల వద్ద వాపోయారు. నల్లగొండలో మీడియాతో చిట్‌చాట్ పెట్టి మరీ తన ఆవేదనను వెలిబుచ్చారు. తనకు ప్రతిసారీ ప్రొటోకాల్ సమస్య వస్తోందని, ప్రభుత్వం మారినా ఈ సమస్య మారలేదన్నారు. తన విషయంలో ప్రొటోకాల్ ఉల్లంఘన గురించి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంలో పెద్దాయన వివరించారని, అలా జరగకుండా చూడాలని కోరినట్టు సమాచారం. ఇందుకు స్పందించిన సీఎం దీనిపై కచ్చితంగా మాట్లాడతానని, భవిష్యత్తులో ఎలాంటి సమస్య రాకుండా చూస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం.

## ముగిసిన సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన

### హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు బయల్దేరారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఢిల్లీకి వచ్చిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి వరకు ఆయన ఇక్కడే ఉన్నారు. కొంతమంది కేంద్రమంత్రులను సీఎం కలవాలనుకున్నారు. కానీ.. వారెవరూ అందుబాటులో లేరు. దీంతో శనివారం మధ్యాహ్నం సన్నిహితులు, కొందరు నేతలతో కలిసి రేవంత్‌రెడ్డి గంటపాటు బయటకు వెళ్లి వచ్చినట్లు తెలిసింది. ఆయన ఎందుకు, ఎక్కడకు వెళ్లారనేది తెలియరాలేదు. అనంతరం ఆయన శనివారం రాత్రి 8 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

## దేశం గర్వించేలా 'యంగ్ ఇండియా' స్కూళ్లు

- 105 స్కూళ్ల ఏర్పాటుకు రూ.21 వేల కోట్లు
- పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి



స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బోనకల్: దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటుచేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. శనివారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం లక్ష్మీపురంలో స్కూల్ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ, రాష్ట్రంలో 105 స్కూళ్ల ఏర్పాటుకు రూ.21వేల కోట్లు వెచ్చిస్తున్నామని, అద్భుతమైన మేధస్సుతో సమాజానికి మానవ వనరులను అందించడం, సానపట్టిన వజ్రాల్లా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ స్కూళ్ల ఏర్పాటు లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచేలా ఈ స్కూళ్ల ఏర్పాటుపై ప్రకటన చేసినప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేశారని, ఆ పార్టీ హయాంలో కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పి వారు విస్మరించినట్లుగానే తామూ చేస్తామని భావించారని పేర్కొన్నారు. కానీ మొదటి సంవత్సరంలోనే తమ ప్రభుత్వం 58 స్కూళ్లను మంజూరు చేసిందని వెల్లడించారు.

**డిమాండ్ మేరకు మరో 47 కూడా..**

స్కూళ్ల ఏర్పాటుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి డిమాండ్ రావడంతో పిల్లల భవిష్యత్తే బాధ్యతగా భావించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రిమండలి సమష్టిగా ఆలోచన చేసి మరో 47 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేశామని భట్టి వెల్లడించారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బోధన చేయడమే కాక క్రీడాప్రాంగణాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, థియేటర్, విద్యార్థులు, ఉపాధ్యాయ, ఉద్యోగుల హాస్టల్ భవనాలు కలిపి 25 ఎకరాల్లో నిర్మాణానికి డిజైన్లు రూపొందించామని తెలిపారు. ఈ పాఠశాలలో చేరిన విద్యార్థులకు 12వ తరగతి వరకు బోధిస్తూ, పోషకాహారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఇదీ తెలంగాణ బ్రాండ్..

▶ మొదటి పేజీ తరువాయి

మకాం వేస్తున్నారు. పోటీలకు సంబంధించిన వివిధ ఘట్టాలు హైదరాబాద్‌లోని వివిధ వేదికల్లో జరుగుతున్నప్పటికీ, ఈ హడావుడి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా యావత్ తెలంగాణను భాగస్వామ్యం చేసేలా.. పోటీదారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించేలా ఏర్పాట్లు చేసింది. నాగార్జునసాగర్ బుద్ధవనం, చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్, వరంగల్, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట ఆలయం, పోచంపల్లి, మహబూబ్‌నగర్ పిల్లలమర్రి, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐపీఎల్ మ్యాచ్ సందర్శన, శిల్పారామం.. తదితర ప్రాంతాలను సుందరీమణులు సందర్శించనున్నారు. ప్రతి టూర్‌కు అంతర్జాతీయ మీడియా ప్రచారం కల్పించనుంది. సురక్షిత ప్రాంతం, మౌలిక వసతుల నిలయం, ఘనమైన చారిత్రక వారసత్వం, ఆధునిక వైద్యం..అంశాల ఆధారంగా తెలంగాణ బ్రాండ్‌ను ప్రచారం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**సురక్షిత ప్రాంతం**

ప్రశాంత వాతావరణం ఉండే చోటుకే పెట్టుబడులు ఎక్కువగా వచ్చే వీలుంటుంది. దీన్ని ప్రధానంగా ఎస్టాబ్లిష్ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. చిన్నపాటి అవాంఛనీయ ఘటనా జరగకుండా కనీవినీ ఎరుగని రీతిలో భద్రత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిస్ వరల్డ్ పోటీదారులు పర్యటించే అన్ని ప్రాంతాల్లోనూ పటిష్టభద్రతా ఏరాట్లు చేస్తున్నారు. ప్రత్యేక కాన్వాయ్ ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. సుమారు 1,200 మంది రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసింది.

**మౌలిక వసతులు**


పోటీలకు హాజరయ్యే వారికి అత్యంత అభివృద్ధి చెందిన హైటెక్ సిటీలోని స్టార్ హోటళ్లలో బస కల్పించారు. ప్రధాన పోటీలు జరిగే వేదికలను ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలపై పోటీదారులు, మీడియా దృష్టి పడేలా చేయడం ద్వారా హైదరాబాద్‌లో మౌలిక వసతులపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వివిధ దేశాలతో ఉన్న కనెక్టివిటీని వివరించనుంది.

**మెడికల్ టూరిజం**

అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఆధునిక వైద్య వసతి హైదరాబాద్‌లో ఉందని అతిథులకు వివరించబోతున్నారు. అమెరికా లాంటి దేశాలతో పోలిస్తే 80 శాతం తక్కువ ఖర్చుకే ఆ స్థాయి ఆధునిక వైద్యాన్ని అందించే ఆసుపత్రులకు హైదరాబాద్ కేంద్రమని ప్రత్యేకంగా పోటీదారులు, విదేశీ మీడియాకు తెలియజేయనున్నారు. పోటీదారులను నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రికి ప్రత్యేకంగా తీసుకెళ్లి ఇక్కడి ఆధునిక వైద్య పద్ధతులు ప్రత్యక్షంగా తెలుసుకు నే ఏర్పాటు చేశారు. ఏయే దేశాల నుంచి ఎంతమంది ఇక్కడికి వైద్యం కోసం వస్తున్నదీ, వారికి ఇక్కడ అందుబాటులో ఉండే వసతులు, వైద్య సదుపాయాలను ప్రపంచం ముందుంచే ప్రయత్నం చేస్తున్నారు.

**చరిత్ర..సంస్కృతి..రుచులు**

ఇటీవల స్ట్రీట్‌ఫుడ్ టూరిజం కూడా విస్తృతమవుతోంది. స్ట్రీట్ ఫుడ్‌ను ఆస్వాదించే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఘనమైన వారసత్వం, చరిత్ర, సంస్కృతి ఉన్న నగరంలో విహరిస్తూ అక్కడి సంప్రదాయ భోజనం ఆస్వాదించటాన్ని ఈ పోటీల సందర్భంగా షోకేస్ చేసే దిశలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం విఖ్యాత చౌమొహల్లా ప్యాలెస్‌లో స్వాగత విందు (డిన్నర్) ఏర్పాటు చేశారు. ఇందులో 38 రకాల తెలంగాణ సంప్రదాయ వంటకాలను వడ్డించబోతున్నారు. కాంటినెంటల్ వెరైటీలకు సైతం హైదరాబాద్ వేదికే అన్న విషయం కూడా తెలిసేలా వివిధ ప్రాంతాల రుచులనూ అందుబాటులో ఉంచే బాధ్యతను ఓ ఫైవ్ స్టార్ హోటల్‌కు అప్పగించారు. ఇక తాజ్ ఫలక్‌నుమా, చార్మినార్ ప్రాంతాలను చూపటం ద్వారా హైదరాబాద్ చారిత్రక నేపథ్యాన్ని కూడా కళ్లకు కట్టబోతున్నారు.




మిస్ వరల్డ్ లోగో

### పోటీలకు ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

మిస్ వరల్డ్ పోటీల కోసం జరుగుతున్న ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీనియర్ పోలీస్, ఇతర అధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాటిపై వివరణాత్మక నివేదికను సమర్పించాలని చెప్పారు. అతిథుల బస విషయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రత, బందోబస్తుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విమానాశ్రయం, హోటళ్ల వద్ద, అంతర్జాతీయ కార్యక్రమాల వేదికల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. పర్యాటక శాఖ తరఫున పోటీదారులకు అందజేయడానికి వివరణాత్మక బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని సూచించారు. అతిథులు, పోటీల్లో పాల్గొనేవారు సందర్శించే అన్ని ప్రదేశాలను సుందరీకరించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. డీజీపీ జితేందర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సీఎంఓ) జయేశ్ రంజన్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, ఐఅండ్‌పీఆర్ ఇన్‌చార్జి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రూ. 22 వేల కోట్లతో 4.50 లక్షల ఇళ్లు

### గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

- పేదోడి ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- మరికొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్ల అందజేత

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఈ సంవత్సరం రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇళ్లు నిర్మిస్తున్న ఏకై క రాష్ట్రం తెలంగాణ అని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతీ ఇంటి నిర్మాణానికి పేదలకు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్మించే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం మరికొద్ది రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు, పైలెట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని చెప్పారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)లో ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శనివారం మంత్రి వీరికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా, నిజాయతీతో పని చేయాలని, పేదవాడి కలను సాకారం చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్లను కోరారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మంది జాబితాలను ఫైనల్ చేయబోతున్నామని, విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురికాకుండా అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇళ్లు నిర్మించడానికి అధికారులకు పలు సూచనలు చేశానని, యువ ఇంజనీర్లు కూడా ఈ అంశాలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

### 21 మందికి పదోన్నతులు..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ -2లో పనిచేస్తున్న 10 మంది సబ్ రిజిస్ట్రార్‌లను గ్రేడ్–1కి, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్–2 రిజిస్ట్రార్‌లుగా పదోన్నతులు కల్పించారు.

నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను.
– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
**వైశాఖ మాసం, తిథి:** శు.సప్తమి ప.12.24 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పుష్యమి సా.5.42 వరకు, తదుపరి ఆశ్లేష,
**వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** సా.4.38 నుండి 5.30 వరకు,
**అమృత ఘడియలు:** ప.11.20 నుండి 12.55 వరకు, భాను సప్తమి, డొల్లు కర్తరి.

**సూర్యోదయం** : 5.37
**సూర్యాస్తమయం** : 6.16
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

జైరాం రమేష్ (కాంగ్రెస్)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అక్బర్ రోడ్డులోని పార్టీ ఆఫీసులో ఖర్గేజీ, నేను, 'ఇంకా కొందరం' సమావేశమై ఉన్నాం. నిజానికి, ఆ 'ఇంకా కొందరం' అనేవాళ్లలో కొందరింకా రానే లేదు. ఆ రానివాళ్ల కోసం చూడటం మానేసి, ఖర్గేజీ మాట్లాడటం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను నేను.

ఖర్గేజీ ఎంతకూ మాట్లాడటం లేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు కాకముందు ఆయన ఎలాగైతే ఉన్నారో, కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన తర్వాత కూడా అలాగే ఉన్నారు. ఖర్గేజీ వింతగా మెరిసే వజ్రంలా అనిపిస్తారు నాకెందుకో! బహుశా మా ఇద్దరిదీ ఒకే రాష్ట్రం కావటం వల్లనేమో!

వజ్రం మాట్లాడదు. ఊరికే మెరుస్తూ ఉంటుంది. మాట్లాడని 'ఖర్గే' అనే ఈ కాంగ్రెస్ వజ్రాన్ని చూసి ఏ పార్టీ వాళ్లయినా ఎంతో కొంత నేర్చుకోవలసింది తప్పక ఉంటుందని నాకొక నమ్మకం. ముఖ్యంగా మోదీ... ఖర్గేజీని చూసి మౌనంగా ఎలా ఉండాలో, లేదంటే మితంగా ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలి.

ప్రధాని ఎంత మితంగా మాట్లాడితే దేశం అంత ప్రశాంతంగా ఉంటుంది. పెద్దాయన చూసుకుంటాడులే అని ప్రజలు ధీమాగా ఉంటారు. పెద్దాయన కూడా మన పొరుగింటి



ఆయనలా మాట్లాడేస్తుంటే పాకిస్తాన్‌కు ఏం భయం ఉంటుంది? పాకిస్తాన్‌కు చైనా ఎందుకు సపోర్ట్ చేయకుండా ఉంటుంది?

దేశానికి మోదీజీ పెద్దాయన అయితే, కాంగ్రెస్‌కు ఖర్గేజీ పెద్దాయన. రాహుల్ బాబు, ఆయన బావగారు రాబర్ట్ వాద్రా ఎప్పుడైనా మితం తప్పి మాట్లాడినా, ఖర్గేజీ తన మౌనంతో బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్నారు. మౌనంతో ఏదైనా బ్యాలెన్స్ అవుతుంది. అతీ బ్యాలెన్స్ అవుతుంది, మితమూ బ్యాలెన్స్ అవుతుంది.

"విన్నారా ఖర్గేజీ?" అన్నాను, ఆయన్ని నా వైపు తిప్పుకునే ప్రయత్నంగా.

"ఏమిటి వినటం?" అన్నట్లు చూశారు.

"డెడ్ లైన్‌లు చెప్పకుండా మోదీజీ హెడ్ లైన్‌లు చెప్పేస్తున్నారు! దెబ్బకు దెబ్బ అంటున్నారు. ఆ దెబ్బ ఎప్పుడో చెప్పటం లేదు. జనాభా లెక్కలతో పాటే కులాల లెక్కలు అంటున్నారు. ఆ జనాభా లెక్కలు ఎప్పుడో చెప్పటం లేదు" అన్నాను.

"చెప్పవలసినవి ఇంకా చాలా లెక్కలు ఉన్నాయి" అన్నారు రాహుల్ బాబు లోనికి ప్రవేశిస్తూ. ఆ వెనుకే ప్రియాంక.

ఖర్గేజీ వారిద్దరి వైపూ చూశారు కానీ మాటలతో ఏమీ స్పందించలేదు. అలాగని మౌనంతోనూ స్పందించలేదు. ప్రియాంక పార్టీ జనరల్ సెక్రెటరీగా ఉండి, మీటింగ్‌కి లేట్‌గా రావటం ఆయనకు నచ్చినట్లు లేదు.

"సారీ ఖర్గేజీ... రేఖాగుప్తా సీఎం అయ్యాక ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ ఎక్కువైంది. అక్బర్ రోడ్డులో అయితే మరీ ఘోరం. అందుకే మీటింగ్‌కి లేటైంది" అన్నారు ప్రియాంక.

రాహుల్ సెల్ ఫోన్ చూసుకుంటూ వచ్చి, దొరికిన కుర్చీలో కూర్చొని, "చెప్పవలసినవి ఇంకా చాలా లెక్కలు ఉన్నాయి" అని మళ్లీ అన్నారు మోదీ గురించి.

"అవును రాహుల్‌జీ, దేశంలో కులగణన చేయించాలని మనం డిమాండ్ చేస్తున్నందుకు మోదీ మనల్ని అర్బన్ నక్సలైట్లు అన్నారు. ఇన్నాళ్లకు వాళ్లూ మన దారిలోకి వచ్చి కులగణన అంటున్నారు. మరి వాళ్లెప్పటి నుండి అర్బన్ నక్సలైట్ అయ్యారో" అన్నాను.

అంతా నవ్వారు. ఖర్గేజీ నవ్వలేదు!

"ఇప్పుడైనా... అదే పనిగా కాకుండా, పనిలో పనిగా మాత్రమే కులగణనను చేయిస్తామంటున్నారు" అన్నారు రాహుల్.

"అది నిజమే కానీ..." అని ఆగారు... ఖర్గేజీ హఠాత్తుగా మౌనం వీడి!

అందరం ఖర్గేజీ వైపు చూశాం.

"... వాళ్లు చేయాలనుకుంటున్నది జనగణనలో భాగంగా కులగణన కాదు. కులగణనలో భాగంగా జనగణన. నేరుగా కులగణన అంటే రాహుల్‌కి క్రెడిట్ దక్కుతుందని జనగణనలో భాగంగా కులగణన అంటున్నారంతే" అన్నారు ఖర్గేజీ!!

వజ్రం లాంటి మాట!

ఆ మాటతో మా మీటింగ్ మొదలైంది.

# వేదనలో రాజ్యం... వేడుకలో రాజధాని!



## జనతంత్రం

వర్ధెల్లి మురళి

"**థం**డా మతలబ్ కోకాకోలా..." ఇండియాలో బాగా పాపులరయిన వాణిజ్య ప్రకటనల్లో ఒకటి. మరి కోకాకోలా మతలబు? రెండొందల మిల్లీలీటర్ల కోక్ తయారు చేయడానికి గరిష్ఠంగా యాభై పైసలు ఖర్చవుతాయని మార్కెట్ టాక్. పది పైసల కంటే ఎక్కువ కాదనే వాళ్లు కూడా ఉన్నారు. కానీ మనం గరిష్ఠాన్నే లెక్కేసుకుందాం. దానికి పదింతలు ఎక్కువ ఖర్చు పెట్టి మార్కెటింగ్ నైపుణ్యాన్ని జోడిస్తారు. వినియోగదారుకు ఇరవై రూపాయలకు అమ్ముతారు. రవాణా ఖర్చులు, కమీషన్లు తీసేసినా మినిమమ్ నూటా యాభై శాతం లాభాలు కంపెనీ గల్లా పెట్టెలో పడతాయి. దీన్నే బ్రాండ్ బిల్డింగ్, మార్కెటింగ్ టెక్నిక్ వంటి పేర్లతో ఘనంగా చెప్పుకుంటారు.

ఈ ధోరణి రాజకీయాల్లోకి, ప్రభుత్వ పాలనలోకి కూడా దిగుమతయింది. ఇందులో ఉద్దండులైన ఇద్దరు అగ్ర నాయకులు నిన్న ఉద్దండరాయునిపాలెం సమీపంలో అమరావతి బ్రాండ్ షూటింగ్‌ను పునఃపునఃప్రారంభించారు. ప్రధాని సంగతి తెలిసిందే. భారతీయ వ్యాపార రంగంలో ఆరితేరిన వారైన గుజరాతీల ముద్దుబిడ్డ. అంతటా దొరికే వస్తువుపై కూడా అరుదైన సరుకుగా ముద్రవేసి అమ్మగల నేర్పరులు వారు. లేకపోతే, ఓ పిడికెడు మంది మినహా సమస్త ప్రజల్లో ఉండే సహజ లక్షణాలైన దేశభక్తి, దైవభక్తి వంటి అంశాలపై కూడా తమకే పేటెంట్ హక్కులున్నాయని ఎలా ప్రకటించుకోగలరు?

ఏపీ ముఖ్యమంత్రి కూడా ప్రధానికి దీటైనవారే. నిజం చెప్పాలంటే కొంచెం ఎక్కువ కూడా! మీడియా ప్రచారంతో ముఖ్యమంత్రి స్థాయికి ఎదగవచ్చన్న కిటుకును ఆయన తొలి రోజుల్లోనే కనిపెట్టారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మీద, సెల్‌ఫోన్‌ల మీదా తనకే పేటెంట్ దక్కాలని చిరకాలంగా ఆయన పోరాటం చేస్తున్నారు. ఇద్దరూ కలిసి అమరావతి షోలో పాల్గొని అమరావతి బ్రాండ్ వ్యాల్యూ పెంచే ప్రయత్నాన్ని చేశారు. ఈ షో జరగడానికి ముందునుంచే అమరావతి ప్రమోషన్ కార్యక్రమాన్ని ఏకసూత్ర పథకంగా భావించి, పరిపాలన సైతం పక్కన పెట్టి చంద్రబాబు ప్రయాసపడుతున్నారు. అప్పిచ్చువాడి కోసం డప్పు కొడుతూనే ఉన్నారు. ప్రపంచబ్యాంకూ, మరో రెండు సంస్థలూ 31 వేల కోట్ల షరతులతో కూడిన అప్పును మంజూరు చేసిన వెంటనే 47 వేల కోట్లకు టెండర్లను పిలవనే పిలిచారు. ఇందులో భారీ కమీషన్ల కోసం అంచనాలను అసహజంగా పెంచేశారన్న విమర్శలు వినిపించాయి.

ఇందులో చాలా పనులకు ఏడేళ్ల కింద కూడా టెండర్లను పిలిచారు. అప్పటి అంచనా వ్యయానికీ, ప్రస్తుతానికీ పోలికే లేదు. ఒక్క సెక్రటేరియట్ టవర్ల అంచనాయే నూరు శాతం పెరిగింది. 2018లో సెక్రటేరియట్ నాలుగు టవర్లూ, సీఎం కార్యాలయానికి కలిపి అంచనా వ్యయం 2,271 కోట్లుంటే ఇప్పుడది 4,688 కోట్లకు ఎగబాకింది. ఏడేళ్లలో నూరు శాతం ద్రవ్యోల్బణం పెరిగిందా? నిర్మాణ రంగంలో ప్రధాన పద్దులైన సిమెంటు, ఇనుము ధరలు పెరక్కపోగా అంతో ఇంతో తగ్గాయని మార్కెట్ సమాచారం. అమరావతి బ్రాండ్ బాజా మిరుమిట్లలో ఇటువంటి వాస్తవాలు మరుగున పడిపోవాలని పాలకుల ఉద్దేశం కావచ్చు.

అమరావతి కాసుల వేటలో పడి ప్రజాపాలనను పడకేయించిన పర్యవసానం ఎలా ఉన్నదో మచ్చుకు ఒక సన్నివేశాన్ని పరిశీలిద్దాం. రైతు పండించిన పంటలకు మార్కెట్‌లో పలికిన ధరలేమిటో ఒకసారి గమనించండి. మిరపకు జగన్ పాలనలో పలికిన సగటు ధర 24 వేల రూపాయలైతే, ఇప్పుడు 6,500. పత్తికి నాడు 10,500 పలికితే నేటి సగటు ధర 4,900. కందులు నాడు 11 వేలు, నేడు 5,850. పసుపు, మినుము, పెసలు, శనగలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, పొగాకు, చీనీపండ్లు, అరటి, బొప్పాయి, టమాటా, ఉల్లి... ఇలా ఏ వ్యవసాయిక ఉత్పత్తినైనా తీసుకొని పరిశీలించండి. ఒకే రకమైన రాజధాని పనులకు ఏడేళ్ల కాలంలో కాంట్రాక్టర్లకు ఇస్తున్న సొమ్ము నూరు శాతం ఎట్లా పెరిగింది? ఆరుగాలం కష్టించిన రైతన్నకు లభిస్తున్న ధర ఏడాది కాలంలోనే నూరు శాతం ఎట్లా పడిపోయింది? ఇదేమి రాజ్యం? అదేమి రాజధాని? పైగా అది ప్రజా రాజధానట! జన జీవితాల మీద ఇంతకంటే క్రూరమైన పరిహాసం ఇంకొకటి ఉంటుందా?

ఈ రాజధాని నిర్మాణానికి అర్జెంటుగా ఇంకో 47 వేల కోట్లు కావాలట! మరో 44 వేల ఎకరాలు సమీకరించాలట! అప్పుడుగానీ ఈ వ్యవహారం ఓ కొలిక్కి రాదట! పనుల పునఃప్రారంభం నాటికే రాష్ట్ర వ్యవసాయ రంగం వెన్ను విరిగింది. ఆ పనులన్నీ కొలిక్కి వస్తే ఇంకెన్ని దారుణాలు చూడాలో! గిట్టుబాటు ధర లేకపోవడం ఒక్కటే కాదు. రైతు కుటుంబాల మీద ఏడాది పొడుగునా పిడుగులే కురుస్తున్నాయి. రైతు భరోసా లేదు. అప్పిచ్చువాడి గడప తొక్కక తప్పలేదు. పంటల బీమా లేదు. దేవుడి మీదే భారం. ఇన్‌పుట్ సబ్సిడీ, కరువు సాయం బకాయిల ఊసెత్తితే ఒట్టు. ఆర్‌బీకేలు అలంకార ప్రాయంగా మారి ఆసరా ఇవ్వడం లేదు. ఒక్క అమరావతి కలవరింత తప్ప, సాధారణ పరిపాలనపైన కూడా ఈ ప్రభుత్వం పట్టు కోల్పోయింది. విజయవాడ వరదలు, తిరుపతి తొక్కిసలాట, సింహాచలం దుర్ఘటన వగైరాలు పాలనా వైఫల్యానికి నిదర్శనాలు.

అదే రాష్ట్రం, అవే వనరులు, అదే ఆదాయం. ఏ ఖర్చయినా అందులోంచే పెట్టాలి. ఏ అప్పయినా అందులోంచే చెల్లించాలి. లేదంటే మరిన్ని అప్పులు చేయాలి. ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన అద్భుతం ఆవిష్కృతం కాలేదు. సంపద సృష్టి జరగలేదు. ఎప్పుడు సృష్టిస్తారో కూడా చెప్పడం లేదు. రాజధాని మీద లక్ష కోట్ల దాకా ఖర్చు పెట్టాలని చెబుతున్నారు. ఆ ఖర్చుకు అప్పులే మార్గం. ఉన్న ఆదాయ వనరుల్లోంచే ఈ అప్పులు తీర్చాలి. అమరావతే తన అప్పుల్ని తీర్చుకుంటుందని మొదట్లో ఊదరగొట్టారు. ఎన్ని వేల ఎకరాలను అభివృద్ధి చేసి అమ్మితే అంత అప్పును తీర్చాలి? అన్ని వేల ఎకరాలను ఎగబడి కొనేందుకు ఎవరు ముందుకొస్తారు? ఇది జరగడానికి ఎన్ని పుష్కరాలు పడుతుంది? ఇటువంటి సందేహాలకు సమాధానాలేవీ ఇంతవరకు రాలేదు.

ఈలోగా ఒక్క ఏడాదిలోనే వ్యవసాయ రంగం కుదేలైంది. రాజధాని కోసం భూములను 'త్యాగం' చేసిన 28 వేల మంది రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లయినా దక్కుతాయని చెబుతున్నారు. కానీ, అమరావతి పేరుతో ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతుల త్యాగానికి ఎవరు వెల కట్టాలి? వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధినిస్తున్న ఎం.ఎస్. ఎం.ఈ. రంగంలో ఈ సంవత్సరం 20 లక్షల మంది ఉపాధి కోల్పోయారని పార్లమెంటుకిచ్చిన సమాధానంలో కేంద్రం తెలియజేసింది. ఈ లెక్కన అమరావతి నిర్మాణం కోసం ఇంకెన్ని సెక్షన్లు బలవ్వాలి? ఎంత విధ్వంసం జరగాలి? "మా కండలు పిండిన నెత్తురు, మీ పెండ్లికి చిలికిన అత్తరు" అన్నాడు ఒక కవి. అమరావతి కోసం ఆంధ్రదేశమంతా ఈ పాట పాడుకోవాలేమో?

శుభమా అని రాజధాని పనులు ప్రారంభిస్తుంటే ఈ కుశంకలేమిటనే వారు లేకపోలేదు. కుశంకలు కావు, వాస్తవాల పునాదులపై తలెత్తుతున్న సందేహాలు ఇవి. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, ఇల్లాలు ఏడ్చిన ఇల్లు బాగుపడవంటారు. రైతు ఇప్పుడు దుఃఖిస్తున్నాడు అన్నది ఒక వాస్తవం. రాష్ట్రంలోని మహిళలకు 'సూపర్ సిక్స్' పేరుతో పాలక కూటమి ఎన్నో ఆశలు పెట్టిందన్నది ఒక వాస్తవం. ఏడాది తర్వాత కూడా వారి ఆశలు అడియాసలుగానే మిగిలాయన్నది ఒక వాస్తవం. సంపద సృష్టి పేరు చెప్పి ఎడాపెడా అప్పులతో రాష్ట్రాన్ని ఊబిలోకి తోస్తున్న మాట వాస్తవం. ఈ అప్పుల ఊబి నుంచి బయటపడే మార్గం ఏమిటో ఇప్పటిదాకా ప్రభుత్వం విడమరచి చెప్పలేకపోయిన మాట కూడా వాస్తవం.

రమారమి 500 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిన్న అమరావతిలో 'పునరపి జననం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రిని తీసుకొచ్చి పొగడ్తల్లో ముంచారు. స్తోత్రకైవారాలు గావించారు. ఈ దేశ ప్రధానిని గౌరవించడం తప్పేమీ కాదు. గౌరవించాలి కూడా! అదే సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలబడాలి. తమ నాయకుడు సాగిలపడ్డంత పనిచేయడాన్ని, నంగి నంగి మాట్లాడటాన్ని ప్రజలు హర్షించరు. బిల్లు మంజూరు చేసే అధికారి తనిఖీకి వచ్చినప్పుడు చిన్నపాటి కాంట్రాక్టర్లు వ్యవహరించినట్టుగా బాడీ లాంగ్వేజ్ ఉండకూడదు. బహిరంగ సభల్లో బీజేపీ నాయకులు జనం చేత మూడుసార్లు 'వందేమాతరం' అనిపించడం చాలాకాలంగా వస్తున్న సంప్రదాయం. ఆ దీక్షను కూడా చంద్రబాబు ఈ సభలో స్వీకరించారు. నిజానికి తెలుగు దేశం పార్టీలో ఈ ఆచారం లేదు.

ఆరేళ్ల క్రింద నరేంద్ర మోదీని ఉద్దేశించి చంద్రబాబు చేసిన విపరీత విమర్శలు చాలామందికి ఇంకా గుర్తున్నాయి. కానీ, అటువంటిదేమీ జరగనట్టుగానే సభలో ఆయన ప్రవర్తన కనిపించింది. సాధారణంగా ఐటీ రంగానికి సంబంధించినంత వరకు ఘనత అంతా తనకే దక్కాలని కోరుకుంటారు. దాన్ని ఇంకెవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరు. కానీ ఆశ్చర్యకరంగా నిన్నటి సభలో "టెక్నాలజీ అంటే మోదీ, మోదీ అంటే టెక్నాలజీ" అని పొగిడేశారు. ఈ భజన కార్యక్రమం వెనుకనున్న ఉద్దేశం ఏమిటో గాని ప్రధాని మాట్లాడుతున్నప్పుడు అమరావతి కోసం అదనంగా తానేం చేస్తానన్నది మాత్రం చెప్పలేదు. చంద్రబాబు పొగడ్తలకు పొగడ్తలతోనే ఆయన సమాధానం చెప్పారు. మొదటి ప్రారంభానికి వచ్చినప్పుడు మట్టి-నీళ్లు తెచ్చిన ప్రధాని, ఈసారి పవన్ కల్యాణ్‌కు మాత్రమే ఒక చాక్లెట్ తీసుకువచ్చారు.

ఈ రాజధాని నిర్మాణానికి అర్జెంటుగా ఇంకో 47 వేల కోట్లు కావాలట! మరో 44 వేల ఎకరాలు సమీకరించాలట! అప్పుడుగానీ ఈ వ్యవహారం ఓ కొలిక్కి రాదట! పనుల పునఃప్రారంభం నాటికే రాష్ట్ర వ్యవసాయ రంగం వెన్ను విరిగింది. ఆ పనులన్నీ కొలిక్కి వస్తే ఇంకెన్ని దారుణాలు చూడాలో! గిట్టుబాటు ధర లేకపోవడం ఒక్కటే కాదు. రైతు కుటుంబాల మీద ఏడాది పొడుగునా పిడుగులే కురుస్తున్నాయి. రైతు భరోసా లేదు. అప్పిచ్చువాడి గడప తొక్కక తప్పలేదు. పంటల బీమా లేదు. దేవుడి మీదే భారం. ఇన్‌పుట్ సబ్సిడీ, కరువు సాయం బకాయిల ఊసెత్తితే ఒట్టు. ఆర్‌బీకేలు అలంకార ప్రాయంగా మారి ఆసరా ఇవ్వడం లేదు. ఒక్క అమరావతి కలవరింత తప్ప, సాధారణ పరిపాలనపైన కూడా ఈ ప్రభుత్వం పట్టు కోల్పోయింది. విజయవాడ వరదలు, తిరుపతి తొక్కిసలాట, సింహాచలం దుర్ఘటన వగైరాలు పాలనా వైఫల్యానికి నిదర్శనాలు.

అదే రాష్ట్రం, అవే వనరులు, అదే ఆదాయం. ఏ ఖర్చయినా అందులోంచే పెట్టాలి. ఏ అప్పయినా అందులోంచే చెల్లించాలి. లేదంటే మరిన్ని అప్పులు చేయాలి. ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన అద్భుతం ఆవిష్కృతం కాలేదు. సంపద సృష్టి జరగలేదు. ఎప్పుడు సృష్టిస్తారో కూడా చెప్పడం లేదు.

ఏదో వ్యూహం ప్రకారమే లోకేశ్‌తో ఈ సభలో మాట్లాడించినట్టుగా కనిపించింది. తన కుమారుడికి మోదీ ఆశీస్సులు లభించవలసిన సమయం ఆసన్నమైందని బాబు భావిస్తుండవచ్చు. ప్రసంగం ప్రారంభానికి ముందు లోకేశ్ 'నమో నమః' అంటూ మూడుసార్లు సంబోధించారు. ఆ నమస్కారం మోదీ కోసమే అనే సంగతి ఆయనకు అర్థమైందో లేదోనన్న అనుమానం కలిగినట్టుంది. మోదీని గురించి చెప్పాల్సిన ప్రతి చోట 'నమో గారు, నమో గారు' అంటూనే మాట్లాడారు. "వంద పాకిస్తాన్లు దండెత్తి వచ్చినా నమో మిస్సైల్ ముందు బలాదూర్" అన్నారు. ప్రధానమంత్రిని లోకేశ్ పొగుడుతున్నంతసేపు చంద్రబాబు ఉత్కంఠగా కనిపించారు. లోకేశ్ పొగడ్తలు ప్రధానికి అర్థమవుతున్నాయో లేదో తెలుసుకోవాలన్న కుతూహలం ఆయన మోములో కనిపించింది. అనూహ్యంగా ఆయన చాలాసార్లు చిరునవ్వులు చిందించారు. ఇటువంటి సైడ్ లైట్స్ తప్ప ఈ సభ గురించి చెప్పుకోవడానికి ఇంకో విశేషం లేదు. అమరావతికి బ్రాండ్ వ్యాల్యూ పెంచడానికి జరిగిన ఒక ఈవెంట్‌గా మాత్రమే ఇది చరిత్రలో మిగిలిపోతుంది. రాజ్యమంతటా ఆవేదన అలుముకుంటున్న వేళ వేడుకలు చేసుకున్న రాజధానిగా కూడా చరిత్రలో అమరావతి స్థానం సంపాదించుకుంటుంది.

vardhelli1959@gmail.com

# లోయలోంచి సమైక్యతారావం



సందర్భం

హసీబ్ ఎ ద్రాబూ

**ప**హల్‌గామ్ ఘటన తర్వాత కశ్మీర్ అట్టుడికిపోయింది. కుల్గామ్ నుంచి కుప్వారా వరకూ, షోపియాన్ నుంచి సోపోర్ వరకూ ప్రజలందరూ వీధుల్లోకి వచ్చారు. ఏప్రిల్ 22న జరిగిన ఆ ఉగ్రవాద దాడిని ఈనాటికీ ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. బాధితులను ఆదుకునే విషయంలోనే కాదు, వారికి నైతిక స్థైర్యాన్ని ఇవ్వడంలోనూ, వారి దుఃఖంలో భాగస్వాములు కావడంలోనూ కశ్మీర్ ప్రజలు తక్కిన దేశంతోపాటుగా ముందు వరుసలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే ఈ అంశానికి ప్రసార మాధ్యమాల్లో అంతగా ప్రాధాన్యం దక్కకపోవడం మాత్రం దురదృష్టకరం.

జమ్ము-కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితికి తగ్గట్టుగా స్పందించింది. సానుకూల దృక్పథంతో వ్యవహరించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ పరిణామం అరుదైంది మాత్రమే కాదు, ఉగ్రవాద సమస్యపై కశ్మీరీల దృక్కోణాన్ని ఆవిష్కరించేది కూడా. ఉగ్రదాడి అనంతర పరిస్థితులు చేయిదాటి పోకుండా ఉండేందుకు రాజకీయంగా ఒక ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నంగానూ దీన్ని చూడవచ్చు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రజల, రాజకీయ పార్టీల స్పందన కశ్మీర్ లోయలో శాంతి స్థాపన జరుగుతుందన్న ఆశలు చిగురించేలా చేస్తోంది. ఇదో కీలకమైన మలుపు. ఇప్పటి వరకూ పౌర సమాజం అన్నది సమస్య పరిష్కారానికి రాష్ట్రం నేతృత్వం వహించాలని యోచిస్తూండేది. ఇప్పుడు పౌర సమాజమే స్వయంగా ముందు వరుసలోకి చేరింది. సమాజంలోని అన్ని వర్గాల వారినీ కలుపుకొని ముందుకు నడుస్తోంది.

ఈ మార్పును అతి జాగ్రత్తగా వ్యవస్థీకృత శాంతి స్థాపన ఉద్యమంగా మలచాల్సిన అవసరం ఉంది. యువతతోపాటు సమాజంలోని ప్రతి వర్గం ఈ ఉద్యమంతో మమేకం కావాలి. ప్రభుత్వం కంటే పౌర సమాజమే ఇందుకోసం తన రాజకీయాలు, సిద్ధాంతాలను పక్కనబెట్టి మరీ ఉద్యమానికి సారథ్యం వహించాలి. హింసను తిరస్కరిస్తూ ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆగ్రహం వెనుక కశ్మీరీల విలువలను ధ్వంసం చేసేందుకు ఉగ్రవాదులు చేస్తున్న ప్రయత్నాలకు నిరసన వ్యక్తం చేయటం అన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

### కశ్మీరీలను దేశం కలుపుకొని పోవాలి!

భారతదేశంలో కశ్మీర్ అంతర్భాగమైనప్పటికీ చారిత్రకంగా కశ్మీర్ ప్రజలు దేశంలోని ఇతర ప్రాంతాలతో కలివిడిగా ఉన్నది తక్కువే. మరోవైపు పౌర సమాజం ఇన్నాళ్లూ కశ్మీర్‌ను నిర్లక్ష్యం చేసింది. వాణిజ్యం, వ్యాపారం, పర్యాటకం అన్నీ కశ్మీర్‌ను దేశంతో అనుసంధానం చేసేందుకు ఉపయోగపడుతున్నా, సామాజికంగా ఇతర ప్రాంతాలతో సంబంధ బాంధవ్యాలు తక్కువగా ఉండటం కూడా కశ్మీరీలు ఏకాకులయ్యేందుకు కారణమైంది. 1990ల నుంచి రాజకీయంగానూ కశ్మీర్‌ను మిగిలిన దేశానికి దూరంగా ఉంచడం కూడా ఒక కారణమే.

◆ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రజల, రాజకీయ పార్టీల స్పందన కశ్మీర్ లోయలో శాంతి స్థాపన జరుగుతుందన్న ఆశలను చిగురించేలా చేస్తోంది. ప్రభుత్వం వైపు చూడకుండా మునుపటికి భిన్నంగా పౌర సమాజమే ఇప్పుడు స్వయంగా ఇందుకు అడుగు వేసింది.



పహల్‌గామ్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించటం కోసం ప్రత్యేకంగా సమావేశమైన జమ్ము-కశ్మీర్ అసెంబ్లీ

ఇంకొంచెం వివరంగా ఆలోచిద్దాం. కశ్మీర్ సమస్యకు కారణాలు, పరిష్కారానికి అనుసరించిన మార్గాల గురించి అడిగినప్పుడు అన్ని వేళ్లూ కేంద్రం వైపు మళ్లుతాయి కానీ... సమస్య సృష్టి, సమస్య వ్యాప్తి అనే అంశాలలో పౌర సమాజం పాత్రను విస్తృత సామాజిక కోణంలోంచి మాత్రం చూడటం లేదు. దీనివల్ల ఈ సమస్యను పరిష్కరించడం మరింత జటిలమవుతూ వచ్చింది.

కశ్మీర్‌లో జరిగే పరిణామాలకు ఇతర ప్రాంతాల్లోని కశ్మీరీలను... మరీ ముఖ్యంగా విద్యార్థులు, యువతను వేధించడం అన్నది శాంతి స్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలకు విఘాతం కలిగిస్తుంది. అంతేకాదు, వారి మనసులను కలుషితం చేస్తుంది కూడా. అందుకే ఇది ఇలాగే కొనసాగేందుకు ఏమాత్రం వీల్లేదు. కేంద్రం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ వేధింపులపై నిర్ణయాత్మకంగా వ్యవహరించాలి. కశ్మీర్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి.

కశ్మీర్‌కు వచ్చే అతిథులను కశ్మీరీలు ఏనాడూ ఏటీఎంల మాదిరిగా చూడలేదన్న విషయం ప్రస్తుతం అక్కడి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. పర్యాటకుల రాక ఆదాయాన్ని తెస్తున్న మాట నిజమే కానీ... ఏళ్లు గడిచేకొద్దీ ఈ వ్యవహారాలన్నీ సామాజిక సంబంధాలను దృఢతరం చేసేవి కూడా! ట్రావెల్, టూరిజమ్ రెండూ శాంతి స్థాపనకు ఎంతో ఉపయోగపడే విషయాలే.

### పర్యాటకులు అనుసంధానకర్తలు

చారిత్రకంగా చూస్తే... భారతీయ పర్యాటకులు కశ్మీరీలను సామాజికంగా, ఆర్థికంగా మిగిలిన దేశానికి అనుసంధానం చేసేవాళ్లు. వీరికి ఇక్కడి సాంస్కృతిక వైవిధ్యం గురించి స్పష్టమైన అవగాహన, గౌరవం రెండూ ఉన్నాయి. దీనివల్ల స్థానిక సంస్కృతుల పునరుజ్జీవం కూడా సాధ్యమైంది. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయం లేకుండా కూడా కశ్మీరీలు తమ జీవితాలను గడిపేయగలరు. కానీ కశ్మీర్‌లోనే వారిని సామాజికంగా ఏకాకులను చేస్తే, దేశం వారిని పరాయివాళ్లుగా భావిస్తే మాత్రం మనలేరు.


కశ్మీర్‌లో అప్పుడప్పుడూ జరిగే హింసాత్మక ఘటనలు కూడా అక్కడి ఆర్థిక వ్యవస్థను బాగా దెబ్బతీయగలవు. పహల్‌గామ్ ఉగ్ర దాడి జరిగిన గంట లోపు విషయం ప్రపంచం మొత్తం తెలిసిపోయింది. రెండేళ్లుగా చిన్న చిన్న స్టార్టప్ కంపెనీలను స్థాపించి జాగ్రత్తగా నడుపుకొంటున్న విదేశీ మదుపరులు ఈ ఘటనతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఈ రెండేళ్లలో ఇక్కడి స్టార్టప్‌లలోకి ప్రవహించిన పెట్టుబడుల విలువ సుమారు రూ. 1.75 లక్షల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. పహల్‌గామ్ వంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతూంటే ఈ పెట్టుబడుల ప్రవాహం ప్రభావితం కావడం కచ్చితం. ఇది కాస్తా రాష్ట్రానికి ఆర్థికంగా నష్టదాయకం అవుతుంది.

దేశం ఇప్పుడు తనను తాను వెతుక్కునే పరిస్థితిలో ఉంది. సామాజికంగా, రాజకీయంగా కూడా! విదేశీ పాలకుల పెత్తనం ముగిసిన తరువాత భారతీయతను కాపాడుకునే విషయంలో కశ్మీర్ తన వంతు పాత్రను పోషించింది. ఇప్పుడు కూడా తన అస్తిత్వంపై గాయాలున్నప్పటికీ ఉగ్రవాద వ్యతిరేకతపై జాతీయ స్థాయి ఏకాభిప్రాయాన్ని సాధించడంలో కశ్మీర్ కీలకపాత్ర పోషించగలదు. కశ్మీర్ ప్రజల ప్రస్తుత నిరసన, ఆగ్రహం ఆ దిశలోనే ఉండటం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

వ్యాసకర్త జమ్మూ-కశ్మీర్ మాజీ ఆర్థిక మంత్రి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## కాల కర్మములు

'**క**లిమియు లేమియు పూర్వా కలితంబులు, వీనికంత కళవళమందక్ వలద'న్నాడు తెనాలి అన్నయమంత్రి 'సుదక్షిణా పరిణయం' కావ్యంలో. పూర్వ జన్మలలో చేసిన పాప పుణ్య కర్మముల ఫలితంగా సంభవించేవే సంపదల తోడివైన సుఖాలు, పేదరికంతో వచ్చే దుఃఖాలు అని అర్థం చేసుకుని ముందుకు సాగిపోవాలి మనిషి అని ఆ మాటల ఉద్దేశం. 'మేలుం గీడును వచ్చుం గాలముతో, రెంటి చేత గలగరు ధీరుల్' అన్నాడు నాచన సోమన 'ఉత్తర హరివంశం' కావ్యంలో. కాలం ఎప్పుడూ ఒకే రీతిగా, అన్నీ సుఖాలతో మాత్రమే రోజులు గడిచేలా ఉండదనీ, మంచి జరిగే సరదా రోజులు గడవగానే, ఆ వెనుకనే అంటి పెట్టుకుని వస్తున్నాయా అన్నట్లుగా, బాధలతోను, ఊహించని కష్టాలతోను గడిచే రోజులు వస్తాయనీ, అది కాలప్రభావమనీ, ధీరులైన వ్యక్తులు కాలగమనంలో చోటుచేసుకునే ఈ మార్పులకు కలవరపడి బెంబేలెత్తిపోయి, గోల చేయరనీ ఆ మాటల భావం.



జ్యోతిర్మయం

'మేలుకీడును నిజకర్మమే యొసంగ, నొరునిచే వచ్చెనంచు బామరుడు వల్కు' – మంచైనా చెడైనా తనకు జరగడం తాను చేసిన కర్మల పర్యవసానమే అయివుండగా, వేరే ఎవరి వలననో సంభవిస్తున్నాయని తత్త్వం తెలియని వ్యక్తి అంటాడని 'మూర్తిత్రయోపాఖ్యానం' కావ్యంలో దంతులూరి బాపకవి చెప్పిన మాటలు కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోదగినవి. 'తనదు సుఖదుఃఖములకును దాన ప్రాపకుండు గాని తలంప నన్యుండు గాడు' అని స్పష్టం చేసి, పాపకర్మలు చేసే వ్యక్తి ఆత్మదూషకుడని, పుణ్యకర్మములు ఆచరించే వ్యక్తి ఆత్మ పోషకుడని నిర్ణయించి, వ్యక్తి ఆచరించే పాపపుణ్యకర్మల ప్రభావం ఆ వ్యక్తి యొక్క ఆత్మపైన కూడా పడుతుందని పై మాటలకు కొనసాగింపుగా చెప్పాడు దంతులూరి బాపకవి.

మనిషికి తాను చేసిన మంచి చెడు పనుల ఫలితాలను తాను అనుభవించకుండా పోవడం జరగదని చెబుతూ 'తనువు సెడుం గాని కర్మతతి సెడదనఘా!' అన్నాడు ఎఱ్ఱాప్రెగ్గడ, ఆంధ్రమహాభారతం, అరణ్య పర్వంలోని చతుర్థాశ్వాసంలో!

మనిషి శరీరం ఎప్పటికైనా నశించేదే కాబట్టి, శరీరం నశించడంతో, చేసిన కర్మలు కూడా నశిస్తాయని భావించడం సరైనది కాదని, ఆ కర్మల ఫలాలను కర్తకు అందించకుండా కర్మల సముదాయం అంతరించేది కాదని ఆ మాటల సారాంశం.

– భట్టు వెంకటరావు

## క్లుప్తంగా...

### విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో ఈ ఏడాది జనవరి 27 నుంచి, తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో), ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్)ల్లో ఫిబ్రవరి 25 నుంచి మరో ఆరు నెలల పాటు నిషేధాన్ని పొడిగిస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం (టెస్మా) కింద ఈ మేరకు నిషేధం విధించారు.

### అప్పుల బాధతో నేత కార్మికుడు ఆత్మహత్య


విఠల్

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అప్పుల బాధతో ఒక నేత కార్మికుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బత్తుల విఠల్ (54) బట్టల తయారీకి వినియోగించే పవర్‌లూమ్ మెకానిక్(జాఫర్)గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఉపాధి లేక కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షలకు పైగా అప్పు చేశాడు. చేతినిండా పని లేకపోవడం, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం దూలానికి ఉరి వేసుకున్నాడు. గమనించిన పక్కింటి వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే విఠల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని భార్య శారద బీడీ కార్మికురాలు, కొడుకు అనిల్ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు.

### వడదెబ్బతో ఇద్దరి మృతి


ఫకీరు

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట)/దుగ్గొండి: వేర్వేరు జిల్లాల్లో శనివారం వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏనుబాముల గ్రామానికి చెందిన దూదేకుల ఫకీరు (61) కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో కూలీగా పనిచేస్తున్నాడు. ఎండల తీవ్రతకు శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. ఇంటివద్ద చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో శనివారం వడదెబ్బతో గొర్రెల కాపరి గద్దల నర్సయ్య (58) మృతి చెందాడు.

### రెండు బస్సులు ఢీ

- ఇద్దరు డ్రైవర్లు సహా 15 మందికి గాయాలు

మహేశ్వరం: శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఎనిమిది మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రుల్లో చేర్పించారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. రోడ్డుపై నిలిపి ఉంచిన టిప్పర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న మినీ టూరిస్టు బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇరు బస్సుల్లోని ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన మాలతి, మధురవేణి, వేముల నాగలక్ష్మి, కల్వకుర్తి రాఘవేంద్ర కాలనీకి చెందిన గాజుల కృష్ణయ్య, నాగర్ కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు నాగర్‌కర్నూలు జిల్లా ఊరుకొండకు చెందిన హసీనా బేగం, హైదరాబాద్ హఫీజ్‌బాబానగర్‌కు చెందిన తబస్సుం ఖాజూన్‌లతో పాటు మరో పది మంది స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో కలిపి మొత్తం 50 మంది ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనతో అటు కందుకూరు, ఇటు తుక్కుగూడ వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

### కేఎల్‌హెచ్‌లో ఘనంగా ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

సాక్షి, హైదరాబాద్: కేఎల్‌హెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. అజీజ్‌నగర్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేట్ కంపెనీ ప్రతినిధుల చేతుల మీదుగా ప్లేస్‌మెంట్స్ పొందిన విద్యార్థులు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జె.పి.మోర్గన్ కంపెనీ ఉపాధ్యక్షుడు మారియో డేవిడ్ మాట్లాడుతూ, మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సంపూర్ణంగా అవగాహన చేసుకుంటే అత్యుత్తమ ఉద్యోగాలతో పాటు ఎటువంటి ఆందోళనలు లేకుండా కెరీర్‌ను పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. కేఎల్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారధి వర్మ మాట్లాడుతూ, తమ విద్యార్థులు అత్యుత్తమ వార్షిక ప్యాకేజీలతో ప్లేసెమెంట్స్ సాధించారని, జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేసియా వంటి దేశాల్లో అంతర్జాతీయ ప్లేస్‌మెంట్స్ దక్కించుకున్నారని తెలిపారు.

# హక్కుల రక్షణ ఇలాగేనా?

## మూడేళ్లుగా ఒక్క కేసునూ పరిష్కరించని ఎస్‌హెచ్‌ఆర్‌సీ

- దేశవ్యాప్తంగా 17వ స్థానంలో తెలంగాణ
- జైళ్లను పరిశీలించిన ఘటన ఒక్కటీ లేదు
- ఇప్పటికీ వెబ్‌సైట్ లేని టీజీ హెచ్‌ఆర్‌సీ
- ఐజేఆర్–2025 గణాంకాలు చెబుతున్నది ఇదే..

సాక్షి, హైదరాబాద్: మానవ హక్కులను కాపాడటంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) అట్టడుగు ర్యాంక్‌కు చేరింది. హక్కుల రక్షణ కోసం ఎక్కడకు వెళ్లాలో తెలియని పరిస్థితి. కేసులు నమోదైనా పరిష్కరించేవారే లేరు. ఒకటి కాదు..రెండు కాదు.. దాదాపు మూడేళ్లుగా ఇదే పరిస్థితి. దీనికి ప్రధాన కారణం చైర్మన్, సిబ్బంది లేకపోవడమే. వ్యక్తి ప్రాథమిక హక్కులతోపాటు వ్యక్తిగత స్వేచ్ఛను హరించకుండా చూసేందుకు ఈ కమిషన్ ఏర్పాటైంది. జాతీయత, లింగం, జాతి, మతం సహా ఇతర ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ సమాన హక్కులు అందేలా చూడాలి. మానవ హక్కుల రక్షణపై ఇండియా జస్టిస్ రిపోర్టు (ఐజేఆర్) అధ్యయనంలో తెలంగాణ 17వ స్థానంలో నిలిచింది. ఇటీవల ప్రభుత్వం చైర్మన్, ఇతర సిబ్బందిని నియమించింది. ఐజేఆర్ నివేదిక మేరకు ప్రత్యేక కథనం..

- పదికి 3.4 స్కోర్‌తో తెలంగాణ 17వ స్థానానికి పడిపోగా, పశ్చిమబెంగాల్ 6.99 స్కోర్‌తో ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 2.08 స్కోర్‌తో దిగువన ఉంది.

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా సుమోటోగా కేసులు తీసుకుంటున్న శాతం: | 4 |
| దేశవ్యాప్తంగా మహిళా చైర్‌పర్సన్లు: | 0 |
| తెలంగాణలో దర్యాప్తు బృందంలో ఖాళీల శాతం: | 50 |
| 2023–24లో ఎస్‌హెచ్‌ఆర్‌సీలు స్వీకరించిన కేసులు : | 1,09,136 |
| కేసుల క్లియరెన్స్ రేట్: | 83 శాతం |
| తెలంగాణలో ఈ రేట్: | 0 |
| తెలంగాణలో విచారణాధికారుల్లో మహిళలు: | 0 |
| జైళ్ల సందర్శన: | 0 |

ఇతర చోట్ల ఎస్‌హెచ్‌ఆర్‌సీలు వెబ్‌సైట్లను కేసులు సహా అన్ని వివరాలతో ఎప్పటికప్పుడు నిర్వహిస్తుండగా, తెలంగాణలో అధ్యయనం జరిగే నాటికి ఎలాంటి వివరాలు లేవు.

### ఏర్పాటు జరిగిందిలా..

1990లో మానవ హక్కుల రక్షణ ప్రాముఖ్యతపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో చర్చ జరిగింది. హక్కులను ప్రోత్సహించడానికి, రక్షించడానికి బలమైన, దేశీయ సంస్థలు అవసరమని గుర్తించింది. 1993లో జరిగిన ప్రపంచ మానవ హక్కుల భేటీలో పారిస్ సూత్రాలను స్వీకరిస్తూ వ్యవస్థలు రావాలని తీర్మానించారు. స్వతంత్రంగా, విస్తృతంగా పనిచేసే సామర్థ్యం వాటికి ఉండాలని పేర్కొన్నారు. ఈ మేరకు అదే ఏడాది మన దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), ఆ తర్వాత రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ)లు ఏర్పడ్డాయి.

### ఆర్భాటం ఘనంగానే ఉన్నా..

కమిషన్లకు విస్తృతమైన అధికారాలు కల్పించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులపై ఫిర్యాదులొస్తే.. విచారణ చేసి నేరుగా చర్యలు చేపట్టొచ్చు.

- కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న విషయాల్లోనూ జోక్యం చేసుకోవొచ్చు.
- ఖైదీల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడానికి ప్రజలను నిర్బంధించిన ఏదైనా జైలును సందర్శించొచ్చు.
- చట్టాలను సమీక్షించి.. మానవ హక్కులను సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలను సిఫార్సు చేయొచ్చు.
- బాధితుల నుంచి నేరుగా పిటిషన్లు స్వీకరించి లేదా సుమోటోగా విచారణ చేపట్టొచ్చు. ఆర్భాటం ఘనంగానే ఉన్నా.. ఆర్థిక, మానవ వనరుల కొరతతో లక్ష్యాల సాధనలో ఇంకా బుడిబుడి అడుగులు మాత్రమే వేస్తున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లకేళ్ల చైర్‌పర్సన్‌లు, సభ్యులు, కార్యదర్శులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తెలంగాణలోనూ కొద్దిరోజుల క్రితం వరకు ఇదే పరిస్థితి. తీర్పు ఇచ్చేవారు, పరిపాలన మద్దతు, దర్యాప్తు చేపట్టేవారు.. ఇలా మూడు రకాల సిబ్బంది నియామకంలోనూ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధ్యయనం అభిప్రాయపడింది.




### ఎస్‌హెచ్‌ఆర్‌సీ (2021-2024)..

| | |
|---|---|
| స్వీకరించిన ఫిర్యాదులు: | 418 |
| పరిష్కరించినవి: | 327 |
| పెండింగ్: | 257 |
| స్వీకరించిన వాటిలో క్లియరెన్స్ రేట్: | 78.2 శాతం |

(పరిష్కరించిన, పెండింగ్ ఫిర్యాదుల్లో అంతకు ముందు సంవత్సరాలవి కూడా ఉన్నాయి)

### ఎస్‌హెచ్‌ఆర్‌సీలో కేసులిలా...

| సంవత్సరం | కేసుల నమోదు | పరిష్కారం | పెండింగ్ |
|---|---|---|---|
| 2020కి ముందు | 70,162 | 68,604 | 1,558 |
| 2020 | 4,927 | 3,718 | 1,209 |
| 2021 | 5,575 | 3,933 | 1,642 |
| 2022 | 5,441 | 3,372 | 2,069 |
| 2023 | 2,006 | 0 | 2,006 |
| 2024 | 2,247 | 0 | 2,247 |
| 2025 | 536 | 0 | 536 |


ఆమనగల్లు మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

## వానతో రైతుల హైరానా

ఆమనగల్లు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వాన రైతులను ఇబ్బంది పెట్టింది. అనుకోకుండా విరుచుకుపడిన వర్షంతో.. ధాన్యం ఆరబోసిన రైతులు ఆందోళనకు గురయ్యారు. స్థానిక మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన, తడిసిన ధాన్యాన్ని కుప్ప చేసేందుకు అవస్థలు పడ్డారు.

## విహారం మిగిల్చిన విషాదం

- రంగనాయక సాగర్‌లో ఇద్దరు మృతి


మెహరాజ్


అర్బాజ్

చిన్నకోడూరు (సిద్దిపేట): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు విహారానికి వచ్చిన రెండు కుటుంబాల్లో ఇద్దరు నీటిలో మునిగి మరణించారు. దీంతో ఆ రెండు కుటుంబాల్లో ఈ ఘటన విషాదాన్ని నింపింది. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎల్‌బీ నగర్‌లో నివాసముంటున్న రెండు కుటుంబాలకు చెందిన 11 మంది కుటుంబ సభ్యులు రంగనాయక సాగర్‌ను తిలకించడానికి వచ్చారు. అందరూ సరదాగా నీటిలోకి దిగారు. ఈ క్రమంలో మెహరాజ్ (13) నీటిలో మునిగిపోగా, ఆమెను రక్షించడానికి వెళ్లిన అర్బాజ్ (15) కూడా గల్లంతయ్యాడు. కాగా మెహరాజ్ తండ్రి యాకుబ్ బాబా వెంటనే నీటిలోకి దిగి మెహరాజ్‌ను బయటకు తీసుకురాగా, అప్పటికే బాలిక మృతి చెందింది. అర్బాజ్ కోసం వెతికినా దొరకకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని గజ ఈతగాళ్లతో గంటపాటు వెతికిన తరువాత అర్బాస్ మృతదేహాన్ని బయటకు తీశారు. సిద్దిపేట ఏసీపీ మధు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఆడుకుంటూ బావిలో పడ్డ చిన్నారులు

- ఒకరి పరిస్థితి విషమం
- బావిలో నీళ్లు లేకపోవడంతో తప్పిన ప్రమాదం


చిన్నారులు పడిన బావి

బాన్సువాడ: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు బావిలో పడిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో చోటు చేసుకుంది. పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన బైక్ మెకానిక్ ఇబ్రహీం కుమార్తె రోహెల (6), ఇఫ్రాన్ (5)లు శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటున్నారు. పక్కనే ఓ ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆ ఇంటి ఆవరణలోకి వెళ్లారు. అక్కడ ఉన్న బావిపై సిమెంట్ పైకప్పు మూసి ఉంది. దానిపైకి ఎక్కి చిన్నారులు ఆడుకుంటుండగా, పైకప్పు పగిలిపోవడంతో ఇద్దరు చిన్నారులు బావిలో పడిపోయారు. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వారిని బావిలోంచి తీసి ఆస్పత్రికి తరలించారు. బావిలో నీళ్లు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చిన్నారులిద్దరూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇఫ్రాన్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# మా సమస్యలు పరిష్కరించండి

## సీఎస్‌కు టీజీఓ సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై పదహారు నెలలు కావస్తున్నా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. శనివారం సచివాలయంలో టీజీఓ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసింది. కొత్తగా సీఎస్ బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం టీజీఓ ప్రతినిధులు తమ సమస్యల గురించి ప్రస్తావించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 57 డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీజీఓ సంఘం అధ్యక్షుడు ఏలూరి


సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీజీఓ సంఘం నేతలు

శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా గత 16 నెలలుగా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, ఏప్రిల్ – మే నెలలోనే సాధారణ బదిలీలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

- మృతుడు యోగేశ్ కోర్సా అలియాస్ ఐతుగా గుర్తింపు
- సెంట్రల్ కమిటీ సభ్యుడికి గార్డ్‌గా విధులు?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అందరి దృష్టి తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టల వద్ద ఆపరేషన్‌పై ఉండగా.. ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దులో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గరియాబంద్ జిల్లాలోని జుగాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో యోగేశ్ కోర్సా అలియాస్ ఐతు మరణించినట్టు పోలీసులు ప్రకటించారు. మృతుడు డివిజనల్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నాడని, ఆయనపై రూ.8 లక్షల రివార్డు ఉందని తెలిపారు. మావోయిస్టు పార్టీకి సంబంధించి ఓ సెంట్రల్ కమిటీ సభ్యుడికి యోగేశ్ గార్డుగా పనిచేసేవాడని అనుమానిస్తున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో ఇతర ముఖ్య నేతలు తప్పించుకోగా ఐతు మరణించాడు. ఘటనాస్థలి నుంచి ఒక ఎస్ఎల్ఆర్, విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**కేంద్ర కమిటీ సభ్యుడే టార్గెట్ !**

గత జనవరిలో గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి కన్నుమూశాడు. ఆయనపై రూ.కోటి రివార్డు ఉంది. మరోసారి గరియాబంద్ జిల్లాలో కేంద్ర కమిటీ సభ్యుడినే లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ జరిగినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఆపరేషన్‌లో కీలక నేత తప్పించుకోగా, బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కకేకోర్మా గ్రామానికి చెందిన యోగేశ్ కోర్సా అలియాస్ ఐతు మరణించాడు. సాధారణంగా డివిజన్ కమిటీ సభ్యులపై రూ.25 లక్షల రివార్డు ఉంటుంది. యోగేశ్‌ను డీవీసీఎంగా పేర్కొన్నా ఆయనపై రూ.8 లక్షల రివార్డే ఉందని పోలీసులు ప్రకటించడం గమనార్హం.

**దృష్టి మళ్లింపు?**

బచావో కర్రిగుట్టలు పేరిట ఆపరేషన్ మొదలు పెట్టి దాదాపు రెండు వారాలు కావొస్తున్నా భద్రతా దళాలు ఇక్కడ చెప్పుకోదగ్గ పురోగతి సాధించలేకపోయాయి. పైగా ఈ ఆపరేషన్ ఆరంభమైన తర్వాత తెలంగాణలో శాంతి చర్చల ప్రక్రియకు అనుకూలంగా గళం విప్పుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మరోవైపు మండుతున్న ఎండలకు జవాన్లు ఇబ్బందులు పడుతున్నారు. వెరసి రోజురోజుకూ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో పాల్గొంటున్న బలగాలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో కర్రిగుట్టలు – శాంతిచర్చల ప్రక్రియ నుంచి దృష్టి మళ్లించేందుకే గరియాబంద్ ఎన్‌కౌంటర్, కేంద్ర కమిటీ సభ్యుడి పరారీ అంశాలు తెర మీదకు తీసుకొచ్చారనే వాదనలు వినిపిస్తున్నాయి.

# అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు!

- నీళ్ల ట్యాంకు పైకెక్కి నిరసన


నీళ్ల ట్యాంకు పైకెక్కి నిరసన తెలుపుతున్న స్థానికులు

జూలూరుపాడు: అర్హులను కాదని.. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చోటు కల్పించారని ఆరోపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భేతాళపాడు గ్రామ పంచాయతీ పరిధి రేగళ్లతండాకు చెందిన పలువురు శనివారం నిరసన తెలిపారు. రేగళ్ల తండాకు చెందిన ధరావత్ బాలు, బానోత్ కల్యాణ్, బానోత్ కవిత, బానోత్ సునీత, బానోత్ బిందు, ధరావత్ నాగమణితోపాటు భేతాళపాడుకు చెందిన చౌడం వెంకటేశ్వర్లు పేర్లు ఇటీవల విడుదల చేసిన ఇళ్ల జాబితాలో లేవు. దీంతో వీరంతా రెండు గ్రామాల నడుమ పెద్దవాగు పక్కన ఉన్న నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి ఆందోళన చేపట్టారు. దీంతో ఏఎస్‌ఐ మల్లయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ తదితరులు అక్కడికి చేరుకుని అర్హులకు న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో.. రెండు గంటల తర్వాత ట్యాంకు పైనుంచి కిందకు దిగి వచ్చారు. అనంతరం వారు ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- సీఎస్‌కు టూరిజం ఉద్యోగుల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పర్యాటక రంగంలో 23 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు నూతనంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావును ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి వినతి పత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చాలా కాలం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## కవ్వాల్ నిర్వాసితులకు రెవెన్యూ పట్టాల మంజూరు

- రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: వన్యప్రాణి సంరక్షణ, గిరిజన హక్కుల సమన్వయంలో ఒక మైలురాయిగా... కవ్వాల్ పులుల అభయారణ్యం (కేటీఆర్) కోర్ ఏరియాలోని మైసంపేట (మైసంపేట, ధర్మాజీపేట గ్రామాలు), రాంపూర్ గ్రామాల నుంచి తరలించిన 94 గిరిజన కుటుంబాలకు పూర్తి రెవెన్యూ పట్టాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పట్టాలు పూర్తి అలీనబుల్ హక్కులతో (విక్రయం, తాకట్టు, వారసత్వ హక్కు) కలిగి ఉండటం ఒక విశేషం. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విధంగా నిర్వాసితులకు పూర్తి రెవెన్యూ పట్టాలు (అన్నిహక్కులతో సహా) ఇవ్వడం ద్వారా సమగ్ర వన్యప్రాణి సంరక్షణకు కొత్త ప్రమాణాలను నెలకొల్పినట్టు అయిందని భావిస్తున్నారు. మైసంపేట, రాంపూర్ గ్రామాల తరలింపుతో కేటీఆర్‌లో పులుల సంరక్షణకు బలం చేకూరింది. ఖాళీ అయిన ప్రాంతాలు గడ్డి భూములుగా మార్చడంతో జింకల సంతతి పెరుగుదలకు మద్దతుగా నిలువనున్నాయి. శనివారం ఈ మేరకు రెవెన్యూ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్.1) శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ జీవో విడుదల నేపథ్యంలో చీఫ్ కమిషనర్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, నిర్మల్ జిల్లా కలెక్టర్ తదుపరి చర్యలు వేగవంతం చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కవ్వాల్ నేపథ్యం.. తరలింపు, పునరావాసం ఇలా**

(వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో)

## పదవీ విరమణ ప్రయోజనాలు ఎందుకు చెల్లించలేదు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లా ఎన్కూర్ మండల జిల్లాపరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ కూరపాటి పాండురంగయ్య పదవీ విరమణ పొందినా ఆర్థిక ప్రయోజనాలు ఎందుకు చెల్లించలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జూన్‌కు వాయిదా వేసింది. ఎన్కూర్ మండల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కూరపాటి పాండురంగయ్య హెచ్ఎంగా పనిచేసి 2024, జూన్‌లో పదవీ విరమణ పొందారు. దాదాపు ఏడాది కాలంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూసి ఆయన మనోవేదనతో మృతిచెందారని ఇటీవల ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని సుమోటోగా విచారణ చేపట్టాలని హైకోర్టు నిర్ణయించింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. కథనాన్ని పరిశీలించిన ధర్మాసనం.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌కు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

## అరేబియా సముద్రంలో నేవీ వార్ డ్రిల్స్

### మోదీతో నేవీ చీఫ్ కీలక భేటీ

న్యూఢిల్లీ: ఉద్రిక్తతల నేపథ్యంలో గుజరాత్ తీరంలో నౌకాదళం శనివారం కీలక విన్యాసాలు చేపట్టింది. లైవ్ ఫైరింగ్ డ్రిల్స్ తదితరాలతో యుద్ధ సన్నద్ధతను చాటింది. వీటిలో భాగంగా యుద్ధ పరిస్థితులను సృష్టించి నిజమైన ఆయుధాలను నేవీ ప్రయోగించి చూస్తోంది. అరేబియా సముద్రంలో ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లో పాక్ నేవీ విన్యాసాలకు దిగిన ప్రాంతానికి కేవలం 85 నాటికల్ మైళ్ల దూరంలో ఇవి జరుగుతుండటం విశేషం! ఇవి మే 7 దాకా కొనసాగనున్నాయి. ఈ మేరకు పొరుగు దేశాలకు నేవీ ఇప్పటికే లాంఛనంగా సమాచారమిచ్చింది. శనివారం ప్రధాని నరేంద్ర మోదీతో నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి భేటీ అయిన కాసేపటికే లైవ్ విన్యాసాలు మొదలవడం విశేషం. మోదీతో నేవీ చీఫ్ భేటీ గంటకు పైగా సాగింది. యుద్ధ సన్నద్ధతతో పాటు పలు కీలకాంశాలను వారు చర్చించినట్టు తెలుస్తోంది. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో కొద్ది రోజులుగా నేవీ పలు విన్యాసాలకు తెర తీయడం తెలిసిందే. అందులో భాగంగా యుద్ధ నౌకలు తదితరాలను అంతర్జాతీయ జలాలకు సమీపంలో మోహరించి సిద్ధంగా ఉంచింది. వైమానిక దళం కూడా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సమాయత్తమవుతోంది. శుక్రవారం యూపీలో గంగా ఎక్స్‌ప్రెస్ వేపై ఫైటర్ జెట్ల లాండింగ్, టేకాఫ్ విన్యాసాలతో సత్తా చాటింది. పహల్గాం ఉగ్ర దాడికి దీటుగా బదులిచ్చేందుకు సైన్యానికి మోదీ ఇప్పటికే పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం తెలిసిందే.

## పాక్ మహిళను పెళ్లి చేసుకున్న జవాన్‌పై వేటు

న్యూఢిల్లీ: ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారమివ్వకుండా పాకిస్తాన్ మహిళను పెళ్లి చేసుకున్న జవాను మునీర్ అహ్మద్‌ను సీఆర్‌పీఎఫ్ విధుల నుంచి తొలగించింది. అతడి చర్య జాతి భద్రతకు ప్రమాదకరమని పేర్కొంది. 41వ బెటాలియన్‌లో పనిచేస్తున్న మునీర్ అహ్మద్ గతేడాది 24వ తేదీన పాకిస్తాన్‌కు చెందిన మినాల్ ఖాన్‌ను వర్చువల్‌గా పెళ్లి చేసుకున్నాడు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలపకుండా దాచి ఉంచాడు. వీసా గడువు ముగిసినప్పటికీ వెనక్కి పంపించలేదు. అయితే, పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్ జాతీయులు వెంటనే వెళ్లిపోవాలంటూ ఇటీవల కేంద్రం గడువు విధించిన నేపథ్యంలో మినాల్ ఖాన్ విషయం వెలుగు చూసింది. ఎలాంటి విచారణ అవసరం లేకుండానే మునీర్ అహ్మద్‌ను తక్షణమే తొలగించినట్లు సీఆర్‌ఎఫ్ ప్రతినిధి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ దినకరన్ చెప్పారు. అతడి చర్య దేశ భద్రతకు ప్రమాదకరమని తెలిపారు.

# దిగుమతులు బంద్

### పోస్టల్ సేవలు కూడా

- పాక్‌కు మరిన్ని షాక్‌లు
- దాయాది నౌకలకు నో ఎంట్రీ
- ఐఎంఎఫ్ రుణాన్ని అడ్డుకుంటోంది
- భారత్ చర్యలపై పాక్ ఆక్రోశం



న్యూఢిల్లీ/శ్రీనగర్: పహల్గాం దుస్సాహసానికి ముష్కరులను ప్రేరేపించిన దాయాదికి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. పాకిస్తాన్ నుంచి దిగుమతులను పూర్తిగా నిషేధిస్తూ భారత్ శనివారం నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులకూ ఇది వర్తిస్తుంది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాక్‌లో ఉత్పత్తయ్యే, ఆ దేశం గుండా ఎగుమతయ్యే అన్ని రకాల వస్తువులు, ఉత్పత్తుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్టు పేర్కొంది. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం వెల్లడించింది. అంతేగాక పాక్ నౌకలకు భారత్‌లోకి అనుమతి నిషేధించింది. ఆ దేశానికి సముద్ర రవాణా మార్గాలను పూర్తిగా మూసేసింది. దీని ప్రభావం కూడా పాక్‌పై తీవ్రంగా ఉండనుంది. ఇక పాక్‌కు అన్నిరకాల పార్సిల్, పోస్టల్ సేవలను కూడా సంపూర్ణంగా నిలిపేశారు. ఈ నిర్ణయాలన్నీ తక్షణం అమల్లోకి వచ్చినట్టు కేంద్రం ప్రకటించింది. పాక్‌కు మన గగనతలాన్ని ఇప్పటికే మూసేయడం తెలిసిందే. అంతేగాక సింధూ జల ఒప్పందం నిలిపివేత, పాక్ పౌరులకు వీసాల రద్దు వంటి పలు కఠిన చర్యలు కూడా కేంద్రం ఇప్పటికే తీసుకుంది. దివాలా ముంగిట ఉన్న పాక్‌కు ఆర్థికంగా ప్రాణాధారం వంటి 700 కోట్ల ఐఎంఎఫ్ రుణాన్ని అడ్డుకునే ప్రయత్నాలకు కూడా పదును పెట్టింది. ఉగ్రవాదులకు అడ్డాగా మారిన పాక్‌ను గ్రే లిస్టులో చేర్చి రుణాలు, ఆర్థిక సాయాలు పూర్తిగా నిలిపేయాలని అంతర్జాతీయ సంస్థలకు శుక్రవారం విజ్ఞప్తి చేయడం తెలిసిందే. తద్వారా దాయాది ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేలా కేంద్రం వ్యూహరచన చేస్తోంది. దీనిపై పాక్ శనివారం గగ్గోలు పెట్టింది. రాజకీయ దురుద్దేశాలతోనే ఐఎంఎఫ్ రుణానికి భారత్ మోకాలడ్డుతోందంటూ ఆక్రోశించింది.

#### దిగుమతులు అంతంతే

పాక్ నుంచి దిగుమతుల నిషేధం ప్రభావం మనపై ఏమీ ఉండదు. పుల్వామా దాడుల నేపథ్యంలో 2019 నుంచే ఆ దేశంతో వాణిజ్య కార్యకలాపాలను భారత్ దాదాపుగా తగ్గించుకుంది. గతేడాది దాయాది నుంచి మనం దిగుమతి చేసుకున్న వస్తువుల విలువ కేవలం 4.2 లక్షల డాలర్లు! ప్రధానంగా సేంద్రియ లవణంతో పాటు ఫార్మా ఉత్పత్తులు, పళ్ల వంటివి వీటిలో ఉన్నాయి. అదే సమయంలో పాక్‌కు మన ఎగుమతుల విలువ ఏకంగా 44.8 కోట్ల డాలర్లుగా ఉంది. పాక్ ఉత్పత్తులపై భారత్ ఇప్పటికే 200 శాతం విధిస్తోంది. పహల్గాం దాడి నేపథ్యంలో పాక్‌కు అన్ని ఎగుమతులనూ భారత్ ఇప్పటికే నిలిపేయడం తెలిసిందే.

#### తొమ్మిదో రోజూ కాల్పులు

సరిహద్దుల వెంబడి పాక్ దుశ్చర్యలు వరుసగా తొమ్మిదో రోజూ కొనసాగాయి. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం శనివారం కూడా కాల్పులకు తెగబడింది. వాటికి దీటుగా బదులిచ్చినట్టు సైన్యం ప్రకటించింది. పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల కోసం వేట సాగుతోంది. కశ్మీర్‌ను భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. శనివారం శ్రీనగర్‌లో ఐదుచోట్ల ముమ్మర తనిఖీలు కొనసాగాయి.

### రెచ్చగొట్టేలా పాక్ క్షిపణి పరీక్షలు

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్ర దాడితో అసలే దెబ్బ తిన్న పులిలా ఉన్న భారత్‌ను మరింత రెచ్చగొట్టేలా పాక్ వ్యవహరిస్తోంది. ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ క్షిపణి పరీక్షలకు దిగింది. 450 కి.మీ. రేంజ్‌తో కూడిన అబ్దాలీ సర్ఫేస్ టు సర్ఫేస్ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను పరీక్షించినట్టు పాక్ సైన్యం శనివారం ప్రకటించుకుంది. పైగా, ఇది 'సింధూ విన్యాసా'ల్లో భాగమంటూ గొప్పలకు పోయింది. ఇది అద్భుతమంటూ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షహబాజ్ షరీఫ్ సైన్యాన్ని అభినందనలతో ముంచెత్తారు. ఈ ఉదంతంపై భారత్ మండిపడింది. దీన్ని కచ్చితంగా రెచ్చగొట్టే చర్యగానే పరిగణిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

### 'సింధూ' నిర్మాణాలను పేల్చేస్తాం

#### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలు

ఇస్లామాబాద్: సింధూ నదీ వ్యవస్థపై భారత్ ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా పేల్చేస్తామంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలకు దిగారు. వాటిని తమపై దురాక్రమణ చర్యగానే పరిగణిస్తామన్నారు. ''నదీ జలాలను ఆపేస్తే మేం ఆకలిదప్పులతో అలమటిస్తాం. అందుకే అలాంటి పరిస్థితి రానివ్వబోం''అని చెప్పుకొచ్చారు. సింధూ ఒప్పందం నిలిపివేతపై అంతర్జాతీయ వేదికలను ఆశ్రయిస్తున్నట్టు చెప్పారు.

## విమానంలో ఉగ్రవాదులు?

### శ్రీలంకలో చెన్నై విమానంలో తనిఖీలు

సాక్షి, చెన్నై/కొలంబో: పహల్గాం ఉగ్రవాద దాడితో సంబంధం ఉన్న వ్యక్తులు తమిళనాడు రాజధాని చెన్నై నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు విమానంలో పరారవుతున్నారంటూ అందిన సమాచారం కలకలం సృష్టించింది. చెన్నై నుంచి శనివారం ఉదయం 12 గంటలకు కొలంబోలోని బండారు నాయకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న విమానాన్ని శ్రీలంక అధికారులు క్షుణ్నంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులెవరూ లేరని గుర్తించారు. చెన్నై ఏరియా కంట్రోల్ సెంటర్ నుంచి అందిన సమాచారం మేరకు విమానంలో తనిఖీలు చేపట్టినట్లు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. పహల్గాం దాడితో సంబంధం ఉన్న ఉగ్రవాదులు ఈ విమానంలో ప్రయాణించే అవకాశం ఉందంటూ తమకు సమాచారం అందిందని తెలిపారు. తనిఖీల అనంతరం ఎవరినీ అరెస్టు చేయలేదని చెప్పారు. మరోవైపు చెన్నై ఎయిర్‌పోర్టులో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానాలతో పాటు చెన్నై నుంచి శ్రీలంకకు వెళ్లే అన్ని విమానాల్లో శనివారం భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల ముసుగులో ఉగ్రవాదులు శ్రీలంకకు పారిపోతున్నారంటూ అందిన సమాచారంతోనే నిఘాను పెంచి ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి పంపించినట్లు విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు.

## బీఎస్‌ఎఫ్ అదుపులో పాక్ రేంజర్

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో భారత్–పాకిస్తాన్ సరిహద్దుల వద్ద పాక్ ఆర్మీ అధికారి ఒకరు బీఎస్‌ఎఫ్ జవాన్లకు పట్టుబడ్డారు. అతడిని వెంటనే కస్టడీలోకి తీసుకున్నామని బీఎస్‌ఎఫ్ తెలిపింది. పదిహేను రోజుల క్రితం, ఏప్రిల్ 23న బీఎస్‌ఎఫ్ జవాను పూర్ణం కుమార్ పాక్ భూభాగంలోకి పొరపాటున ప్రవేశించి అక్కడి జవాన్లకు దొరికిపోవడం తెల్సిందే. భారత బలగాలు తీవ్ర నిరసన తెలిపినప్పటికీ ఆయన్ను తిరిగి అప్పగించేందుకు పాక్ అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.



శనివారం అంగోలా అధ్యక్షుడు లోరెన్సోను స్వాగతిస్తున్న మోదీ

## ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు

### ముష్కరులను, వారి మద్దతుదారులను వదిలిపెట్టం

- ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటన
- అంగోలా అధ్యక్షుడు లోరెన్సోతో సమావేశం
- ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకోవాలని నిర్ణయం

న్యూఢిల్లీ: భారత్, ఆఫ్రికన్ యూనియన్ ప్రగతిశీల భాగస్వామ్యపక్షాలు అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. గ్లోబల్ సౌత్‌కు ఇరుపక్షాలు మూలస్తంభాలని చెప్పారు. ఆయన శనివారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో సమావేశమయ్యారు. పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సంప్రదాయ వైద్యం, వ్యవసాయం, సాంస్కృతిక సహకారం వంటి రంగాల్లో భారత్–అంగోలా మధ్య అవగాహనా ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ మరోసారి తేల్చిచెప్పారు. పహల్గాంలో పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ముష్కరులను, వారి మద్దతుదారులను శిక్షించడం తథ్యమని స్పష్టం చేశారు. ఉగ్రవాదులపై దృఢమైన, నిర్ణయాత్మక చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, అంతరిక్ష సాంకేతికత వంటి అంశాల్లో ఇండియా శక్తిసామర్థ్యాలను అంగోలాతో పంచుకుంటామని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, వజ్రాల ప్రాసెసింగ్, ఎరువులు, ఖనిజాల విషయంలో అంగోలాతో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు అంగోలా అధ్యక్షుడు లోరెన్సోకు రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సాదర స్వాగతం పలికారు. అనంతరం రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి లొరెన్సో ఘనంగా నివాళులర్పించారు. భారత్–అంగోలా మధ్య దౌత్య సంబంధాలు 1985లో ప్రారంభమయ్యాయి. ఆఫ్రికన్ యూనియన్‌కు ఈ ఏడాది అంగోలా దేశమే నేతృత్వం వహిస్తోంది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం లోరెన్సో గురువారం భారత్‌కు చేరుకున్నారు.

### అంగోలా సైనిక దళాల ఆధునీకరణకు రూ.1,691 కోట్ల రుణం

అంగోలా సైనిక దళాల ఆధునీకరణకు తమ వంతు సహకారం కచ్చితంగా అందిస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఇందుకోసం 200 మిలియన్ డాలర్లు (రూ.1,691 కోట్లు) రుణంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడు లోరెన్సో పర్యటన భారత్–అంగోలా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశను నిర్దేశిస్తుందని, భారత్–ఆఫ్రికా నడుమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

## ఉగ్రవాదుల పాపాలు పండాయి



### ఇక వారికి నరకమే గతి: ఫరూక్ అబ్దుల్లా

- ఉగ్ర దాడిపై జమ్మూకశ్మీర్ మాజీ సీఎం వ్యాఖ్యలు
- పహల్గాంలో పర్యటన.. టూరిస్టులతో సంభాషణ

శ్రీనగర్: ఉగ్రవాదుల పాపాలు పండాయని, దేశంలో ఉగ్రవాదాన్ని తక్షణమే పెకిలించివేయాలని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్రనేత ఫరూఖ్ అబ్దుల్లా తేల్చిచెప్పారు. ఉగ్రవాదం ఆనవాళ్లు సైతం ఉండడానికి వీల్లేదని అన్నారు. ఉగ్ర విష భుజంగాలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై మన ప్రభుత్వం చేపట్టే ప్రతీకార చర్యలకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. ఆయన శనివారం పహల్గాంలో పర్యటించారు. గత నెల 22న పర్యాటకులపై దాడి జరిగిన తర్వాత ఆయన ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఈ దాడికి పాల్పడిన ముష్కరులను, వారిని వెనుక ఉండి నడిపించిన కుట్రదారులకు నరకమే గతి అని స్పష్టంచేశారు. పహల్గాంలో పర్యాటకులను రక్షించే క్రమంలో ఉగ్రవాదులతో తలపడి ప్రాణాలు కోల్పోయిన అదిల్ షా కుటుంబాన్ని ఫరూఖ్ అబ్దుల్లా పరామర్శించారు. ముష్కరులు సాగించిన మారణకాండను తీవ్రంగా ఖండించారు. వారిపై నిప్పులు చెరిగారు. ''ఇక్కడ 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆరు రోజుల క్రితమే వివాహం జరిగిన ఓ నవ వధువు తన భర్తను పోగొట్టుకుంది. రక్తపు మడుగులో పడి ఉన్న తండ్రిని చూసి ఓ బిడ్డ బిగ్గరగా రోదించాడు. మారణకాండ చూసిన తర్వాత మాకు భోజనం సహించలేదు. మానవత్వాన్ని పొట్టనపెట్టుకున్న ఆ భూతాలు ఇప్పటికీ ప్రాణాలతో సంచరిస్తున్నాయి. వారు తమను తాము ముస్లింలం అని చెప్పుకుంటున్నారు. కానీ, వారు ముమ్మాటికీ ముస్లింలు కాదు. బాధితుల త్యాగాలు వృథా కావడానికి వీల్లేదు. ఉగ్రవాదుల పాపాల పుట్ట నిండిపోయింది. వారిపై తగిన ప్రతీకారం తీర్చుకోవాల్సిందే. జమ్మూకశ్మీర్‌లో 35 ఏళ్లుగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారు. కానీ, వారు ఎప్పటికీ విజయం సాధించలేరు'' అని ఫరూఖ్ అబ్దుల్లా తేల్చిచెప్పారు. మానవత్వాన్ని హత్య చేసిన వారు నరకానికి తప్ప స్వర్గానికి వెళ్లలేరని పేర్కొన్నారు. ఉగ్రవాదం ఆగిపోతేనే జమ్మూకశ్మీర్ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పహల్గాం తరహా దాడులను తీవ్రంగా వ్యతిరేకించాలని స్థానికులకు పిలుపునిచ్చారు.

**భయపడితే మరణించినట్లే...**

పహల్గాంలో పలువురు పర్యాటకులతో ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడారు. వారితో సెల్ఫీలు దిగారు. ఉగ్రదాడుల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్భయంగా ఉండాలని సూచించారు. జమ్మూకశ్మీర్‌ను మధ్యలోనే వదిలివెళ్లొద్దని కోరారు. పర్యటన పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఇక్కడికి మరెంతో మంది పర్యాటకులు రావాలని ఆకాంక్షించారు. ఎవరూ భయపడొద్దని అన్నారు. భయం అనేది చావుతో సమానమని వ్యాఖ్యానించారు. భయపడితే మరణించినట్లేనని పేర్కొన్నారు.

## తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు మృతి

### గోవాలో లైరాయిుదేవి ఆలయంలో దుర్ఘటన

- మరో 80 మందికిగా గాయాలు.. కొందరి పరిస్థితి విషమం
- ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామన్న సీఎం ప్రమోద్ సావంత్

పనాజీ: ప్రకృతి అందాలకు మారుపేరైన గోవాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆలయ జాతరలో జరిగిన తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలున్నారు. 80 మందికిపైగా భక్తులు గాయాలపాలయ్యారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రాజధాని పనాజీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉత్తర గోవాలో ఉన్న షిర్‌గావ్‌లోని శ్రీ లైరాయీ దేవి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు చెప్పారు. ఇక్కడ ఏటా భారీ జాతర నిర్వహించడం ఆనవాయితీ. గోవాతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయానికి వెళ్లే ఇరుకైన దారుల్లో కనీసం 40 వేల మంది గుమికూడారని, వారంతా ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆలయ సమీపంలో దారి ఏటవాలుగా ఉండడంతో తొలుత కొందరు కిందపడిపోయారని, మరికొందరు వారిపై పడిపోవడంతో బాధితుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. వందలాది మంది భక్తులు ఒకరిపై ఒకరు పడడంతో ప్రమాద తీవ్రత అధికంగా ఉన్నట్లు చెప్పారు. గాయపడిన వారిని వేర్వేరు ఆసుపత్రుల్లో చేర్పించి, చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గోవాలో షిర్‌గావ్ శ్రీ లైరాయీ దేవస్థానం ఎంతో ప్రసిద్ధిగాంచింది. లైరాయీ దేవతను పార్వతీదేవి మరో రూపంగా భావిస్తారు. ఏటా జరిగే సంప్రదాయ ధోండాచి జాతరకు స్థానికంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. జాతరలో భాగంగా పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసే అగ్నిగుండాలపై నడుస్తారు. శ్రీ లైరాయీ దేవి ఆలయంలో శుక్రవారమే జాతర ప్రారంభమైంది.

**ఘటనా స్థలికి సీఎం సావంత్**

గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఉత్తర గోవా జిల్లా ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తొక్కిసలాట ఘటనపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపిస్తామని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణమే నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో భక్తులకు తగిన భద్రత కల్పిస్తామని స్పష్టంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తనకు ఫోన్ చేసి మాట్లాడారని, అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

**రాష్ట్రపతి, ప్రధానమంత్రి సంతాపం**

గోవా ఆలయంలో తొక్కిసలాట జరిగిన భక్తులు మృతిచెందడం చాలా బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. శనివారం 'ఎక్స్'లో సంతాపం ప్రకటించారు. ఆలయ జాతరలో భక్తుల మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు.



## మధ్యవర్తిత్వమే మేలైన మార్గం

### అదే పరిపూర్ణ పరిష్కారం: సీజేఐ

కోర్టుల్లో అది సాధ్యం కాదు ● ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

న్యూఢిల్లీ: మధ్యవర్తిత్వాన్ని తక్కువ చేసి చూడటం సరికాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. వివాదాల పరిష్కారానికి అది మేలైన, తెలివైన మార్గమని చెప్పారు. ''సామాజిక న్యాయ సాధనలో మధ్యవర్తిత్వానిది ప్రధాన పాత్ర. అది పరిపూర్ణ పరిష్కారం. వైషమ్యాలను చల్లారుస్తుంది. బంధాలను పునరుద్ధరిస్తుంది. మానవీయ వైఖరితో వ్యవహరిస్తుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో వివాదం తాలూకు మూల సమస్యను పరిష్కరిస్తుంది. తద్వారా నిజమైన న్యాయం చేకూరుస్తుంది. కోర్టులతో ఇది సాధ్యం కాదు''అని అభిప్రాయపడ్డారు. శనివారం ఢిల్లీలో తొలి జాతీయ మధ్యవర్తిత్వ సదస్సు జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఏఐ)ను సీజేఐ ప్రారంభించారు. మధ్యవర్తిత్వ చట్టంలో సామాజిక మధ్యవర్తిత్వానికి వీలు కల్పించే సెక్షన్ 43కి చాలా ప్రాధాన్యముందని ఆయన చెప్పారు. స్థానిక వివాదాలను దీనిద్వారా చక్కగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. వివాదాల పరిష్కారంలో రెండు దశాబ్దాలుగా మధ్యవర్తిత్వం ప్రధాన పాత్ర పోషిస్తోంది. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా ఏకంగా 7.5 లక్షల పై చిలుకు కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యాయి''అని సీజేఐ పేర్కొన్నారు. ఇంతటి మెరుగైన పరిష్కార మార్గం ప్రజలకు ఇంకా పూర్తిగా చేరువ కాకపోవడం శోచనీయమన్నారు. మధ్యవర్తిత్వం ప్రాధాన్యతను భారత్ ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదని అభిప్రాయపడ్డారు. ఇది చక్కని పరిష్కార మార్గమని పౌరులకు, కక్షిదారులందరికీ అర్థమయ్యేలా చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. జామా మసీదు కేసులో సంభాల్‌లో మత ఉద్రిక్తతలను సెక్షన్ 43లో పేర్కొన్న మేరకు మధ్యవర్తిత్వం ద్వారా చల్లార్చే మార్గాలపై దృష్టి పెట్టాల్సిందిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సీజేఐ ధర్మాసనం ఇటీవల సూచించడం తెలిసిందే. కాబోయే సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, కేంద్ర న్యాయ మంత్రి మేఘ్వాల్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

**మధ్యవర్తులకు చట్టబద్ధత: ముర్ము**

గ్రామాల్లో అనాదిగా వివాదాలు మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కారమవుతూ వస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గుర్తు చేశారు. అయితే, ''పెద్దమనుషుల తీర్పులకు చట్టబద్ధత ఉండదన్న విషయం కక్షిదారులకు ఇప్పుడు బాగా తెలుసు. కనుక వీలు చూసుకుని తీర్పులను తుంగలో తొక్కుతున్నారు''అన్నారు. ఈ నేపథ్యంలో వివాదాలను గ్రామస్థాయిలోనే సమర్థంగా పరిష్కరించేందుకు వీలుగా మధ్యవర్తులకు చట్టపరంగా మరింత సాధికారత కల్పించాలని ఆమె అభిప్రాయపడ్డారు.

## తదుపరి తరం గగనతల రక్షణ వ్యవస్థ

### ఇప్పటికే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: తదుపరి తరం పరిమిత శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థను సమకూర్చుకొనే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాల కోసం ఈ వ్యవస్థ అవసరమని నిర్ణయించింది. రాత్రిపూట, పగటిపూట అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో ప్రత్యర్థి దేశాల గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించడానికి ఇది తప్పనిసరిగా అవసరమని గుర్తించింది. మంచు కురిసే ప్రాంతాల్లోనూ ఈ వ్యవస్థ పనిచేయనుంది. ఇందుకోసం రక్షణ శాఖ ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదన పంపించింది. దీన్ని ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో శనివారం పొందుపర్చారు. ''48 లాంచర్లు, 48 నైట్ విజన్ సైట్స్, 85 మిస్సైల్స్‌తోపాటు ఒక పరిమిత శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థను సమకూర్చుకుంటాం''అని రక్షణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థను రీసెర్చ్ సెంటర్ ఇమారత్, డీఆర్‌డీఓతోపాటు ఇతర సంస్థలు కలిసి అభివృద్ధి చేశాయి.

## ఆస్ట్రేలియాలో లేబర్ పార్టీ ఘన విజయం

- మరోసారి ప్రధానమంత్రిగా ఆంథోనీ అల్బనీస్
- గత 21 ఏళ్లలో వరుసగా రెండోసారి నెగ్గిన తొలి ప్రధానిగా రికార్డు



భార్యతో కలిసి అల్బనీస్ విజయానందం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఫెడరల్ ఎన్నికల్లో అధికార లేబర్ పార్టీ మరోసారి విజయం దక్కించుకుంది. ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ చరిత్ర సృష్టించారు. ఆస్ట్రేలియాలో గత 21 ఏళ్లలో వరుసగా రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తొలి ప్రధానిగా ఆయన రికార్డుకెక్కారు. అల్బనీస్ మరో మూడేళ్లపాటు ప్రధానిగా కొనసాగబోతున్నారు. ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభలో మొత్తం 150 సీట్లు ఉండగా, శనివారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ కడపటి వార్తలు అందేసరికి 83 సీట్లు గెలుచుకుంది. స్పష్టమైన మెజార్టీ సాధించింది. ప్రతిపక్ష లిబరల్ నేషనల్ పార్టీ 14 స్థానాలకే పరిమితమైంది. లిబరల్ పార్టీ 13, నేషనల్ పార్టీ 8 సీట్లు గెలుచుకున్నాయి. అలాగే ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు నెగ్గారు. కాటర్ పార్టీకి ఒక స్థానం, సెంట్రల్ అలయెన్స్‌కు ఒక స్థానం దక్కింది. మరికొన్ని స్థానాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ప్రతిపక్ష లిబరల్ నేషనల్ పార్టీ అగ్రనేత పీటర్ డ్రెయిగ్ డటన్ తమ ఓటమిని అంగీకరించారు. ఎన్నికల ప్రచారంలో తాము సరిగ్గా పని చేయలేకపోయామని అన్నారు. ఓటమికి బాధ్యతను తానే స్వీకరిస్తున్నానని చెప్పారు. ప్రధాని అల్బనీస్‌కు ఫోన్‌చేసి, అభినందనలు తెలియజేశానని పేర్కొన్నారు. లేబర్ పార్టీకి ఇది చరిత్రాత్మక సందర్భమని, దాన్ని తాము గుర్తిస్తున్నామని వెల్లడించారు. బ్రిస్బేన్ నియోజకవర్గంలో పీటర్ డ్రెయిగ్ డటన్ ఓడిపోవడం గమనార్హం. ఇక్కడ ఆయనపై లేబర్ పార్టీ అభ్యర్థి అలీ ఫ్రాన్స్ విజయం సాధించారు. ఆస్ట్రేలియాలో ద్రవ్యోల్బణం, అధిక ధరలు, ఇంధనం విధానం, ఇళ్ల కొరత, వడ్డీ రేట్లలో పెరుగుదల వంటి అంశాలే ప్రతిపాదికగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తాను ప్రధానమంత్రి అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దారిలో నడవనున్నట్లు పీటర్ డ్రెయిగ్ డటన్ సంకేతాలిచ్చారు. ప్రభుత్వ ఖర్చులకు కళ్లెం వేస్తానని, ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తానని ప్రకటించారు. ఆయన విధానాల పట్ల ప్రజలు విముఖత చూపినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. ఆంథోనీ అల్బనీస్ మరోసారి నెగ్గే అవకాశం ఉందని ముందే అంచనాలు వెలువడ్డాయి. ఆంథోనీ నార్మన్ అల్బనీస్ 1963 మార్చి 2న ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జన్మించారు. 1996లో తొలిసారిగా ఎంపీగా గెలిచారు. 2019 నుంచి లేబర్ పార్టీ అధినేతగా కొనసాగుతున్నారు. 2019 నుంచి 2022 దాకా ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 2022లో ఆస్ట్రేలియా 31వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరో మూడేళ్లు పదవిలో కొనసాగబోతున్నారు.

> "ఆస్ట్రేలియా విలువలకు ప్రజలు మరోసారి పట్టంకట్టారు. వాటికి అనుగుణంగానే నూతన ప్రభుత్వ పాలన సాగుతుంది. అంతే తప్ప ఎవరినీ అనుసరించబోం. ఎన్నికల వాగ్దానాలన్నింటినీ వీలైనంత త్వరలో అమలు చేసి చూపిస్తా"
> – విజయోత్సవ ప్రసంగంలో అల్బనీస్

### మోదీ అభినందనలు

అల్బనీస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా ఆయనతో కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నానంటూ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అల్బనీస్ నాయకత్వ సామర్థ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజల తిరుగులేని విశ్వాసానికి ఈ విజయమే తార్కాణమని పేర్కొన్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సౌభాగ్యాన్ని భారత్–ఆస్ట్రేలియా బలంగా కోరుకుంటున్నాయని మోదీ స్పష్టంచేశారు.

## పోప్ ట్రంప్!

### అధ్యక్షుని ఏఐ ఫొటోపై దుమారం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోప్ వేషధారణతో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యారు. కృత్రిమ మేధతో రూపొందించిన తన ఫొటోను సొంత ఆన్‌లైన్ వేదికపై శనివారం పోస్ట్ చేసుకున్నారు. అనంతరం వైట్‌హౌస్ సోషల్ మీడియా ఖాతాలోనూ అది ప్రత్యక్షమైంది. ఈ వైరల్ ఫొటోపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.



''పోప్‌గా నటించడమా? ఇదేమీ తమాషా కాదు. గౌరవప్రదం అంతకంటే కాదు. పోప్ అంత్యక్రియలకు నుంచి వస్తూనే ఇలా చేయడం పిల్లచేష్ట. మితిమీరిన అహంకారానికి నిదర్శనం'' అంటూ నెటిజన్లు దుయ్యబట్టారు. బైబిల్‌లోని టెన్ కమాండ్‌మెంట్స్‌ను ట్రంప్ ఉల్లంఘించారని దుమ్మెత్తిపోశారు. తదుపరి పోప్ ఎవరు కావాలన్న ప్రశ్నకు 'నేనే' అని ట్రంప్ ఇటీవల బదులివ్వడం తెలిసిందే.




# సాక్షి హైదరాబాద్





**గోల్డ్ సిక్కా.. మరో ముందడుగు!**
గోల్డ్ సిక్కా మరో ముందడుగు వేసింది. బంగారానికి సంబంధించిన మానవ రహిత ఏటీఎం ద్వారా అనేక సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. -10లో



**హిల్.. టు చిల్..**
సిటీజనులు వేసవి భగభగలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారాంతాల్లో హిల్ స్టేషన్లకు వెళ్లేందుకు సై అంటున్నారు. - సిటీప్లస్‌లో



గరిష్టం/కనిష్టం
**39.0/26.0**

**వాతావరణం**
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

## పాతబస్తీకి నయా లుక్

- జంక్షన్లలో, ఫ్లై ఓవర్ల కింద ప్రత్యేక శిల్పాలు
- త్వరలో ఏర్పాటుకు అధికారుల చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఇప్పటికే పలు జంక్షన్లలో సుందరీకరణలతో పాటు ప్రత్యేక థీమ్‌లతో శిల్పాలు ఏర్పాటు చేసిన అధికారులు పాతబస్తీ పరిధిలోని చార్మినార్ జోన్‌లోనూ ప్రత్యేక శిల్పాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్‌బీ నగర్, ఖైరతాబాద్ జోన్ల పరిధిలోని పలు జంక్షన్లలో ఇలాంటి శిల్పాలు కనిపిస్తుండగా, చార్మినార్ జోన్‌లో మాత్రం ఒకటి రెండు చోట్ల తప్ప లేవు. ఈ నేపథ్యంలో చార్మినార్ జోన్‌లోనూ ఆయా జంక్షన్లలో, వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక శిల్పాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కళాత్మకంగా.. జీవం ఉట్టిపడేలా..**

- తొలిదశలో గుర్రం, జెట్ ఫౌంటైన్, జంతువులు, పక్షులు, వాటర్‌ఫాల్స్, ముత్యపు చిప్ప, బాతు, కొంగ వంటి శిల్పాలను ఆయా జంక్షన్లలో, ఫ్లై ఓవర్ల దిగువన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో జెట్ ఫౌంటెన్‌తో కూడిన గుర్రపు శిల్పాన్ని ఒవైసీ జంక్షన్ వద్ద, ఏనుగు, కోతి, పాలపిట్ట, సింహం, పులి, చిరుత, ఖడ్గమృగం, పెద్ద జింక, చిన్న జింక, జిరాఫీ, కొంగ వంటి జంతువులు, పక్షుల శిల్పాలు, జలపాతాల దృశ్యాల్ని ఏపీజే అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్ దిగువన, ముత్యపు చిప్ప ఆకారంలో శిల్పాన్ని పురానాపూల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేయనున్నారు.
- వ్యవసాయానికి సంబంధించిన థీమ్‌తో ఆరాంఘర్ జంక్షన్ వద్ద, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బాతు, కొంగల శిల్పాల్ని కళాత్మకంగా, నిజంగా ఉన్నాయా అనిపించేట్లుగా తయారు చేయించి ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటిని రూపొందించేందుకు తగిన నైపుణ్యమున్న సంస్థల నుంచి కొటేషన్లు ఆహ్వానించారు. కొటేషన్ల పరిశీలన పూర్తయ్యాక ఎంపికయ్యే ఏజెన్సీలకు పనులప్పగించనున్నారు. మరోవైపు,' మిస్‌వరల్డ్–2025' పోటీల నేపథ్యంలో చార్మినార్, లాడ్‌బజార్‌లతోపాటు పోటీల్లో పాల్గొనేవారు సందర్శించే ఇతరత్రా ప్రాంతాలను కూడా ప్రత్యేకంగా వివిధ అందాలతో తీర్చిదిద్దనున్నారు.

## కొండాపూర్ ఫ్లై ఓవర్ పనుల్లో వేగం పెరగాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్




శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్ ఫేజ్–2 పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్ తదితరులు

గచ్చిబౌలి: ఔటర్ నుంచి కొండాపూర్ వైపు నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. శనివారం ఆయన శేరిలింగంపల్లి వెస్ట్ జోన్‌లో జెడ్సీ హేమంత్ సహదేవ్ రావుతో కలిసి ఆయన పర్యటించారు. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు శిల్పాలే అవుట్ ఫేజ్–2 పనులు, హెచ్–సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌లో ప్రతిపాదిత ఫ్లైఓవర్, అండర్ పాస్ స్థలా న్ని పరిశీలించారు. మల్కం చెరువులోకి వర్షపు నీరు ఎలా వస్తోందని ఆరా తీశారు. దుర్గం చెరువు, సమీప ప్రాంతాల నుంచి చెరువులోకి నీరు వస్తుందని అధికారులు వివరించారు. శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ పనులను సమీక్షించారు.

## ఎల్‌ఆర్‌ఎస్‌తో బల్దియాకు రూ.175.33 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 175.33 కోట్ల ఆదాయం లభించింది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో 1,08,000 దరఖాస్తులందాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం అనుమతించడం తెలిసిందే. వాటిలో 63,923 దరఖాస్తులకు రివైజ్డ్ ఫీజు లెటర్స్ పంపించినట్లు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం పేర్కొంది. శనివారం వరకు రూ.175.53 కోట్లు ఫీజుల రూపేణా వసూలైనట్లు తెలిపింది. ఐజీఆర్ఎస్ నుంచి కొత్తగా 576 దరఖాస్తులందినట్లు పేర్కొంది. అత్యధికంగా ఎల్‌బీనగర్ జోన్ నుంచి రూ.57.57 కోట్లు రాగా, కూకట్‌పల్లి నుంచి రూ.33.20 కోట్లు, ఖైరతాబాద్ నుంచి రూ.11.15 కోట్లు, శేరిలింగంపల్లి నుంచి రూ.42.18కోట్లు, సికింద్రాబాద్ నుంచి రూ. 5.68 కోట్లు, చార్మినార్ జోన్ నుంచి రూ.25.75 కోట్ల ఫీజు వసూలైనట్లు పేర్కొంది.



**అంబేడ్కర్ మ్యూజియం తరహాలో ఏర్పాటు చేస్తే మేలు..**

ప్రస్తుతం అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వద్ద పార్లమెంట్ ఆకృతిలో ఉన్న వేదిక భవనంలో మ్యూజియం ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇదే తరహాలో తెలంగాణ అమరుల స్మారకం వద్ద మ్యూజియం ఏర్పాటు చేస్తే తక్కువ వ్యవధిలోనే సందర్శకులను అనుమతించేందుకు అవకాశం లభిస్తుంది. మరోవైపు ప్రభుత్వ సంస్థలకు ఆ బాధ్యతలను అప్పగించకుండా తెలంగాణ అమరుల స్మారకజ్యోతి, మ్యూజియం నిర్వహణకు స్వతంత్రంగా పని చేసే ఒక సొసైటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు ప్రతిపాదిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అమరుల త్యాగాలను, జ్ఞాపకాలను భావితరాలకు అందజేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

# 'జ్ఞాపకం' ఉందా?

### తెలంగాణ అమరుల స్మారకం ఆవిష్కరణకు రెండేళ్లు

- ఇప్పటికీ సందర్శకులను అనుమతించని పరిస్థితి
- మ్యూజియం ఏర్పాటుకు చర్యలు శూన్యం
- పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తి చేయాలి

సాక్షి, సిటీబ్యూరో:

అది ప్రత్యేక రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్మారక జ్యోతి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చారిత్రక కట్టడాన్ని ఆవిష్కరించి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి వరకు సందర్శకులకు అనుమతి లేకుండాపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా దీనిని ప్రారంభించింది. అమరుల మ్యూజియంతో పాటు మరికొన్ని పనులు వాయిదా పడ్డాయి. అలా పెండింగ్ జాబితాలో పడిపోయిన పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఫలితంగా సందర్శకులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. సెక్రటేరియట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించారు. కానీ.. తెలంగాణ అమరుల స్మారకానికి మాత్రం ఇంకా తుది మెరుగులే దిద్దలేదు. సందర్శకులను అనుమతించడం లేదు.

**ఆ దిశగా అడుగు పడలేదు..**

ప్రతిరోజూ వేలాది మంది పర్యాటకులు నెక్లెస్ రోడ్డుకు వస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో వేలాది మంది ట్యాంక్‌బండ్, లుంబిని పార్కు, ఎన్టీఆర్ పార్కు, అంబేడ్కర్ విగ్రహం వంటి ప్రాంతాలను సందర్శిస్తాను. వీటితో పాటు అమరుల స్మారకాన్ని బయటి నుంచి వీక్షించాల్సిందే. కానీ.. ప్రాంగణంలోకి వెళ్లేందుకు అవకాశం లేదు. తొలి, మలి దశ ఉద్యమాల్లో అమరులైన వందలాది మంది జీవితాలను సమున్నతంగా ఎత్తిపట్టేలా మ్యూజియం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. తెలంగాణ ఉద్యమాలపై రూపొందించిన డాక్యుమెంటరీలను కూడా ఈ మ్యూజియంలో ప్రదర్శించేందుకు ప్రత్యేకమైన హాళ్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలపై ప్రత్యేకంగా ఒక గ్రంథాలయాన్ని సైతం ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటి వరకు ఈ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు.

**అలంకారప్రాయంగా జ్యోతి..**

- హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రపంచంలోనే అపురూపమైన కళాఖండంగా నిలిచింది. ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో దీని నిర్మాణం చేపట్టారు. దుబాయ్‌లో ఎంతో పేరొందిన ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ ఈ స్మారకానికి మాత్రం ఎలాంటి అతుకులు లేకపోవడం విశేషం. 85000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.131 కోట్లతో గత ప్రభుత్వం దీన్ని నిర్మించింది. సందర్శకులు భవనంపై ఉన్న స్మారకజ్యోతి వరకు వెళ్లేందుకు అవకాశం ఉంది. అక్కడే ఒక రెస్టరెంట్‌ను ఏర్పాటు చేయాలని భావించారు.
- ఇక భవనం రెండంతస్తుల్లో.. తెలంగాణ అమరవీరుల త్యాగాలను, వీరోచిత పోరాట గాథలను స్మరించుకునేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిత్రపటాలు, చారిత్రక చిహ్నాలను ఏర్పాటు చేయాలని భావించారు. ప్రేక్షకులు వీక్షించేందుకు లేదా విని తెలుసుకొనేందుకు వీలుగా ఆడియో, వీడియో హాళ్లు, గ్యాలరీలను కూడా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. మ్యూజియంలో అక్కడక్కడా కియోస్కులు, టచ్‌స్క్రీన్‌లను ఏర్పాటు చేసి వాటిద్వారా కూడా తెలంగాణ ఉద్యమ చరిత్రను, విశేషాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ప్రతిపాదించారు. పై అంతస్తులో కనీసం 600 మంది కూర్చొనేందుకు వీలైన కన్వెన్షన్ హాల్ కూడా ఉంది. సాహిత్య సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనువైన హాల్ ఇది. ఆర్ట్ గ్యాలరీలను కూడా ఏర్పాటు చేయవచ్చు. కాగా.. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. దీంతో స్మారక జ్యోతి అలంకారప్రాయంగానే ఉండిపోయింది.

# అనుమతి లేకుంటే సీజ్ చేయాల్సిందే..

- అక్రమ నిర్మాణాలకు అధికారులదే బాధ్యత
- సర్క్యులర్ జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్
- ఆదేశాలను పాటించకుంటే అధికారులపై కఠిన చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: షోకాజ్ నోటీసులు తదితరాల పేరిట అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ తాత్సారాన్ని తప్పుబడుతూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో.. అక్రమ నిర్మాణాలు, అనుమతుల ఉల్లంఘనలు ఉన్న భవనాలను తక్షణమే సీజ్ చేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలోని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేశారు. అక్రమ నిర్మాణాలు, అనుమతుల ఉల్లంఘనలు గుర్తించినప్పుడు వెంటనే సీజ్ చేసేందుకు చర్యలు తీసుకోని పక్షంలో ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. షోకాజ్ నోటీసుల ప్రక్రియ నడుస్తున్నప్పటికీ, వాటిని వెంటనే సీల్ చేయాలని (మూసివేయాలని) కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఓ కేసు విచారణ సందర్భంగా గత నెల 29న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కమిషనర్ ప్రస్తావించారు.

**హైకోర్టు ఏమన్నదంటే..**

జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మించే అక్రమ, అనధికార నిర్మాణాలపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. చట్టప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ జరిగే వరకు నిర్మాణాలు కొనసాగకుండా సీజ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జీహెచ్ఎంసీ శనివారం సర్క్యులర్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలను విధిగా పాటించాలని, అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సీజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. తాము ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా చర్యలు చేపట్టకపోతే కోర్టు ధిక్కారం కింద తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

- జీహెచ్ఎంసీ ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్న కారణంగానే నగరంలో వేలాదిగా అనధికార భవనాలు పుట్టుకొస్తున్నాయని పేర్కొంది. అక్రమ నిర్మాణదారులకు, కొందరు రాజకీయ నాయకులకు సహకరిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు కుమ్మక్కు కావడం నగర నాశనానికి దారితీస్తోందని అసహనం వ్యక్తం చేసింది. ఇకపై ఎలాంటి అక్రమ నిర్మాణం జరిగినా ఆయా ప్రాంతాల్లో పని చేసే అధికారే బాధ్యత వహించాల్సి వస్తుందని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాలను వెంటనే సీజ్ చేయాల్సిందిగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ 30 సర్కిళ్ల కార్యాలయాల అధికారులు, సిబ్బందికి సర్క్యులర్ జారీ చేశారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న జీహెచ్ఎంసీ ఉద్యోగులు

# రగడ.. జగడం

### టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు X జాంబాగ్ కార్పొరేటర్

- ఇంటి నిర్మాణం విషయంలో తీవ్ర వాగ్వాదం
- చినికి చినికి గాలివానలా ఘర్షణ
- జీహెచ్ఎంసీ అబిడ్స్ సర్కిల్ కార్యాలయంలో ఘటన
- దాడి చేశారంటూ పోలీసులకు జీహెచ్ఎంసీ ఉద్యోగుల ఫిర్యాదు
- అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అనుచరుల డిమాండ్

అబిడ్స్: జీహెచ్ఎంసీ అబిడ్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌ల మధ్య రగడ చోటుచేసుకుంది. వీరిరువురూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమపై దాడి చేశారని జీహెచ్ఎంసీ ఉద్యోగులు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేటర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయింది. అలాగే.. కార్పొరేటర్ అనుచరులు ఇచ్చిన ఫిర్యాదుపై న్యాయస్థానం నివేదిక ప్రకారం నడుచుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అబిడ్స్ కట్టెలమండిలోని 60 గజాల స్థలంలో ఓ బీజేపీ కార్యకర్త ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు కొందరు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇంటి నిర్మాణంపై బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, మరికొంత మంది శుక్రవారం సాయంత్రం అబిడ్స్ జీహెచ్ఎంసీ కార్యాలయానికి వచ్చి టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్‌తో వాగ్వాదానికి దిగారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులకు, రాకేష్ జైస్వాల్‌ల మధ్య రగడ చోటుచేసుకుంది. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజులా సింగ్ ముందే ఈ ఘటన జరిగింది. సెక్షన్ ఆఫీసర్ నరేష్, మున్సి ఆరీఫ్‌లతో కార్పొరేటర్ వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి చినికి చినికి గాలివానలా పరిణమించింది. ఈ క్రమంలో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌పై దాడి చేసిన మున్సిపల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ అనే వ్యక్తి శుక్రవారం రాత్రి అబిడ్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పలు విభాగాల ఉద్యోగుల ధర్నా

**కార్యాలయానికి తాళం వేసి ఉద్యోగుల ఆందోళన..**

కాగా.. శనివారం జీహెచ్ఎంసీ–14వ సర్కిల్ ఉద్యోగులంతా కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. వీరికి 15, 16 సర్కిళ్ల ఉద్యోగులు సంఘీభావం ప్రకటిస్తూ విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. సెక్షన్ ఆఫీసర్ నరేష్, మున్షీలపై దాడికి దిగిన కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మంజులా సింగ్, బీఎంఈయూ యూనియన్ నాయకులు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ తెలిపారు. మున్సిపల్ అధికారులపై రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదును న్యాయస్థానానికి పంపించినట్లు, ఆ తీర్పు ప్రకారం నడుచుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఆయన వివరించారు.

**దాడులను సహించేది లేదు**

మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎవరైనా దాడి చేస్తే సహించేది లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు, పలువురు ఉద్యోగులు కర్ణన్‌ను కలిసి పరిస్థితిని వివరించారు.

**పని చేయని సీసీ కెమెరాలు..**

జీహెచ్ఎంసీ అబిడ్స్ సర్కిల్ కార్యాలయంతో పాటు బయట ఉన్న మరో సీసీ కెమెరా పని చేయకపోవడంతో పోలీసులు విస్తుపోయారు. జరిగిన దాడి ఘటనను సీసీ కెమెరాల్లో చూద్దామంటే అవి పని చేయడం లేదని పోలీసులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయాల్లోని సీసీ కెమెరాలే పని చేయకపోతే ఎలా? అని పలువురు విస్తుపోతున్నారు.

# అదిగో హైడ్రా ఠాణా..



**తొలి ఎస్‌హెచ్‌ఓగా తిరుమలేష్ నియామకం**

- ప్రాథమికంగా 20 మంది అధికారులు, సిబ్బంది



తుది మెరుగుల్లో హైడ్రా పోలీసు స్టేషన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసు స్టేషన్ తొలి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) పి.తిరుమలేష్‌ను నియమించాలని నిర్ణయించినట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ 'సాక్షి'కి తెలిపారు. హైడ్రా ప్రధాన కార్యాలయం ఉన్న బుద్ధభవన్ పక్కనే ఏర్పాటవుతున్న ఈ ఠాణా పనులు ప్రస్తుతం తుది దశకు చేరాయి. ఈ నెల 8న (గురువారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైడ్రా పోలీసుస్టేషన్ ప్రారంభం కానుంది.

**వాటి తరహాలోనే పనితీరు..**

శాంతిభద్రతల విభాగం పోలీసుస్టేషన్ తరహాలోనే హైడ్రా ఠాణా కూడా పని చేయనుంది. అందుకు తగ్గట్టే గదులు, క్యాబిన్లు ఉండాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. అక్కడ పని చేసే అధికారులతో పాటు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికీ పూర్తి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ల తరహాలో ఈ ఠాణాకు డీఎస్పీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉండనున్నారు. తొలి ఎస్‌హెచ్‌ఓగా పి.తిరుమలేష్‌ను ఎంపిక చేశారు. కాజీపేట ఏసీపీగా పని చేసిన ఈయన ఇటీవలే హైడ్రాకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ప్రాథమికంగా డీఎస్పీ నేతృత్వంలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు సబ్–ఇన్‌స్పెక్టర్లు, 15 మంది హెడ్–కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో హైడ్రా ఠాణా పని చేయనుంది.

**ఆ కేసులన్నీ ఇక్కడికే..**

ఓఆర్ఆర్ లోపలి భాగం, దానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీల పరిధిలో హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత ఏడాది జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విభాగం చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కుల తదితరాలను కబ్జా చేయడం, పూడ్చివేయడం తదితర అంశాలపై దృష్టి పెడుతోంది. జలవనరుల్లో కట్టడాలకు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ప్రస్తుతం ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తోంది.

- కొన్ని కేసుల్లో ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. దైనందిన కార్యకలాపాల్లో ఉండే స్థానిక పోలీసులు ఈ అంశాలకు కీలక ప్రాధాన్యం ఇచ్చి దర్యాప్తు చేయలేకపోతున్నారు. ఇది కబ్జాకోరులు, అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇకపై ఇలాంటి కేసుల్ని నేరుగా హైడ్రా ఠాణాలోనే నమోదు చేసి, దర్యాప్తు చేస్తారు. గత ఏడాది జూలై నుంచి హైడ్రా ఫిర్యాదుతో వివిధ ఠాణాల్లో నమోదైన కేసుల్లో చార్జిషీట్ దాఖలు కానివీ ఈ పోలీసుస్టేషన్‌కే బదిలీ అవుతాయి.

**తనిఖీలు చేసే అధికారం ఉంటుంది..**

హైడ్రా ఠాణాకు సాధారణ పోలీసుస్టేషన్‌కు ఉండే అన్ని అధికారాలూ ఉంటాయి. నాంపల్లిలోని తొమ్మిదో అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ఈ కేసుల విచారణ జరుగుతుంది. కబ్జా కేసుల్లో నిందితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేసి, అవసరమైన పత్రాలు సమర్పించాలని కోరే అధికారం ఉంటుంది. వీటిని పట్టించుకోని వారితో పాటు తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారినీ అరెస్టు చేస్తాం. అవసరమైతే తనిఖీలు చేపట్టడానికీ హైడ్రా పోలీసులకు అధికారం ఉంది.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

# సన్నబియ్యం పథకం.. పేదలకు ఎంతో ఉపయోగం

మంత్రి పొన్నం ప్రభాకర్



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే దానం, కలెక్టర్ అనుదీప్



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హిమాయత్‌నగర్: ధనవంతుడు, పేదవాడు అనే తేడా లేకుండా సన్నబియ్యం తినాలనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నెం.14లోని చౌక ధరల దుకాణంలో లబ్ధిదారులకు మంత్రి సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం నారాయణగూడ గాంధీ కుటీర్ వద్ద సన్నబియ్యం లబ్ధిదారు ఇంటిలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, విజయారెడ్డి తదితరులతో కలసి మంత్రి సహపంక్తి భోజనం చేశారు.

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తోందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కనీసం మార్పులు కూడా చేయలేదని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.60 ఉందని, పేదలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. కార్యక్రమంలో జేసీ మాధవరెడ్డి, డిస్ట్రిక్ట్ రేషన్ ఆఫీసర్ రమేష్, టీఎన్జీఓ సిటీ ప్రెసిడెంట్, రేషన్ షాప్స్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు భారతీయ బౌద్ధ మహాసభ శాంతి ర్యాలీ


మాట్లాడుతున్న బౌద్ధ మహాసభ తెలంగాణ ప్రతినిధులు

పంజగుట్ట: బుద్ధుడు జ్ఞానోదయం పొందిన బిహార్‌లోని మహాబోధి ఆలయం, బుద్ధగయ పాలన, నిర్వహణపై సంపూర్ణ హక్కులు బౌద్ధులకు ఇవ్వాలని భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ శాఖ డిమాండ్ చేసింది. తమ డిమాండ్ సాధనకై ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇందిరాపార్కు నుండి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతి యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ శాఖ అధ్యక్షులు జి.పరంధాములు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్, సలహాదారు ప్రొఫెసర్ ధర్మపాల్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు ఎన్నో ఏళ్లు తపస్సు చేసి జ్ఞానోదయం పొంది..మనిషిని మనిషి ఎలా ప్రేమించాలి, ఎదుటివారిని దుఃఖించకుండా ఎలా జీవించాలి అని నేర్పించిన అత్యంత పవిత్రమైన ప్రదేశంగా పేరొందిన మహాబోధి ఆలయ వారసత్వం, స్వయంప్రతిపత్తిని అకారణంగా తొలగించారని, ఇది ధర్మానికి విరుద్ధమన్నారు. భారతదేశంలో అన్ని మతాలకు చెందిన ఆలయాలను వారి మత ఆచారం పాటించే వారే నిర్వహిస్తుండగా కేవలం బౌద్ధుల మహాబోధి ఆలయాన్ని మాత్రం వేరే మతానికి చెందిన వారు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

# బెట్టింగ్ భూతంపై.. ప్రహార్ సిటిజన్ సర్వే

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌పై రాష్ట్ర వ్యాప్త సిటిజన్ సర్వే ప్రారంభించామని ఢిల్లీకి చెందిన ఎన్జీవో సంస్థ ప్రహార్ ( పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌లెసనెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్ ) ప్రకటించింది. నగరంలో నిర్వహించిన ఓ సమావేశంలో సంస్థ అధ్యక్షుడు, జాతీయ కన్వీనర్ అభయ్ రాజ్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆన్ లైన్ గేమింగ్‌పై 2017 నుంచి నిషేధం ఉన్నా, విదేశీ ప్లాట్‌ఫారమ్‌లు, అనామక డిజిటల్ లావాదేవీలతో, నియంత్రణలోలేని మొబైల్ యాప్‌ల తోడ్పాటుతో మరింత ప్రమాదకరంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ పరిపాలన జాతీయ భద్రత కూడలిలో భాగస్వామ్యం కలిగిన తమ ఎన్జీవో ఆన్‌లైన్ బెట్టింగ్ జూదం/ ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణపై ప్రజలేం కోరుకుంటున్నారు, ప్రజల అంచనాలు -ప్రభుత్వ చర్యల మధ్య సమన్వయం ఎలా ఉంది? వంటివి అర్థం చేసుకోవడం లక్ష్యంగా ఈ పౌరసర్వేను ప్రారంభించిందని వివరించారు.అధ్యయనం నెల రోజులలోగా పూర్తి కావచ్చునని అంచనా వేస్తున్నామన్నారు



కాచిగూడలో కొల్లగొట్టింది

# నలుగురు!

వీరికి మరో ఇద్దరు సహకరించినట్లు అనుమానాలు


అర్పిత లోకేంద్ర దీపేంద్ర చతుర్భుజ్

సాక్షి, సిటీబ్యూరో: కాచిగూడకు చెందిన కార్డన్స్ ఫ్యాక్టరీ యజమాని హేమ్‌రాజ్ ఇంట్లో భారీ చోరీకి పాల్పడిన నేపాలీలను ఈస్ట్‌జోన్ పోలీసులు గుర్తించారు. నలుగురు ప్రత్యక్షంగా పాల్గొనగా..మరో ఇద్దరు పరోక్షంగా సహకరించినట్లు ఆధారాలు సేకరించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఈ ఆరుగురూ నేపాల్ పారిపోయే ప్రయత్నాలు చేయవచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురి ఫొటోలతో కూడిన లుక్ ఔట్ నోటీసులను శనివారం విడుదల చేశారు. వీరి ఆచూకీ తెలిస్తే తమకు తెలపాలని కోరారు. ఈ నిందితులను గాలిస్తున్న ప్రత్యేక బృందాలు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు నేపాల్ సరిహద్దులకు వెళ్లాయి. ఈ చోరీకి పథక రచన, అమలు మొత్తం నెల రోజుల్లో పూర్తియినట్లు అధికారులు గుర్తించారు.

**సూత్రధారిగా ఉన్న లోకేంద్ర బహదూర్...**

నేపాల్‌కు చెందిన లోకేంద్ర బహదూర్ ఈ భారీ నేరానికి సూత్రధారిగా పోలీసులు తేల్చారు. కాచిగూడ లింగంపల్లి అమ్మవారి దేవాలయం సమీపంలో హేమ్‌రాజ్ తన భార్య మీనా దుగ్గర్, కుమారుడు, కోడలు, మనుమళ్లతో కలిసి ఉంటున్నారు. కొన్నాళ్లు వీరి వద్ద నేపాల్‌కు చెందిన బిమ్లు పని చేసింది. ఆ ఇంటి వ్యవహారాలు పూర్తిగా తెలిసిన ఆమె విషయాన్ని లోకేంద్రకు చేరవేసింది. చోరీకి పథకం వేసిన అతడు మరికొందరు నేపాలీలను సిద్ధం చేశాడు. అతడి సూచనల మేరకు బిమ్లు త్వరలో తాను పని మానేసి తన స్వదేశానికి వెళ్లిపోతానంటూ యజమానులకు చెప్పింది. తన స్థానంలో పని చేయడానికి తమ దేశం నుంచే వచ్చిన అర్పిత సిద్ధంగా ఉందంటూ పనిలో చేర్పింది. హేమ్‌రాజ్ ఇంట్లో ప్రస్తుతం రెనోవేషన్ పని నడుస్తోంది. దీంతో ఆ పనిలో సహకరించడానికి, ఇంటిని శుభ్రం చేయడానికి మరో మనిషి కావాలంటూ హేమ్‌రాజ్ కుటుంబం అర్పితకు చెప్పింది. ఆ పని చేయడానికి తన పరిచయస్తుడు ఉన్నాడంటూ మరో నేపాలీ దీపేంద్ర అలియాజ్ గజేంద్రను ఆ ఇంటికి తీసుకువచ్చింది.

**సైదాబాద్‌లో షెల్టర్ ఏర్పాటు చేసుకుని..**

అర్పిత, దీపేంద్రలు హేమ్‌రాజ్ ఇంట్లోనే ఉంటుండగా..ఉత్తరాది నుంచి వచ్చిన లోకేంద్ర, అతడి అనుచరుడు చతుర్భుజ్ అలియాస్ ఆర్యన్ సహా మిగిలిన నేపాలీలు సైదాబాద్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో హేమ్‌రాజ్ కుమారుడి కుటుంబం గతనెల్లో విదేశాలకు వెళ్లింది. వృద్ధ దంపతులే ఇంట్లో ఉండటంతో ఆ ఇంటిని కొల్లగొట్టడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నారు. గత నెల 20 రాత్రి వృద్ధ దంపతులకు పాలల్లో మత్తుమందు కలిపారు. వీళ్లు మత్తులో ఉండగా..అల్మారాలు, లాకర్లు పగులకొట్టిన నేపాలీలు బంగారం, వజ్రాభరణాలు, నగదుతో సహా మొత్తం రూ.2 కోట్ల విలువైన సొత్తు కాజేశారు. ఇంటిని బయట నుంచి తాళం వేసి యజమాని కారులోనే సంతోష్‌నగర్ వరకు వెళ్లిన ఇరువురూ వాహనం అక్కడ వదిలేశారు. ఆపై మరో కారులో నల్లగొండ చౌరస్తా మీదుగా పరారయ్యారు.

**ఆ నేపాలీ దొంగలను గుర్తించిన దర్యాప్తు అధికారులు**

- సైదాబాద్‌లో షెల్టర్ తీసుకుని నేరం చేసినట్లు నిర్ధారణ
- ఆచూకీ తెలిస్తే తమకు తెలపాలంటూ నోటీసులు జారీ

**వివిధ రాష్ట్రాల్లో గాలిస్తున్న ప్రత్యేక బృందాలు..**

లోకేంద్ర, అర్పిత, దీపేంద్ర, ఆర్యన్‌లకు మరో ఇద్దరు సహకరించినట్లు భావిస్తున్నారు. దీనిపై కాచిగూడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అటు హేమ్‌రాజ్, ఇటు సైదాబాద్‌లో ఇంటిని అద్దెకు ఇచ్చిన వారి దగ్గర నిందితులకు సంబంధించిన ఎలాంటి వివరాలు, ఫొటోలు లేకపోవడంతో దర్యాప్తు జటిలంగా మారింది. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపిన ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టునూ అప్రమత్తం చేశారు. వీళ్లు దేశం దాటి వెళ్లే అవకాశం ఉందని భావిస్తూ శుక్రవారం లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపాలీలకు సంబంధించిన సమాచారం తెలిపిన వాళ్లు ఈస్ట్‌జోన్ డీసీపీ (8712660501), అదనపు డీసీపీ (8712660503), కాచిగూడ ఏసీపీ (8712660506, 8712660509), కాచిగూడ ఇన్‌స్పెక్టర్ (8712660540), కాచిగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌లకు (8712660541) తెలపాలని కోరుతున్నారు.

## గంజాయి తాగుతున్న ఐదుగురి రిమాండ్

సుభాష్‌నగర్: బహిరంగ ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను సూరారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సాయిబాబానగర్‌లో గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అడ్డాపై దాడులు నిర్వహించారు. మహ్మద్ ఇమామ్, మహ్మద్ అస్లాంఅలీ, మహ్మద్ సొహైల్, దీపక్, పవన్‌కుమార్‌లు గంజాయి సేవిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బీదర్ రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం వారిని రిమాండ్‌కు తరలించారు.

## యాచకులను తరలించడం లేదు: జీహెచ్‌ఎంసీ

సాక్షి,సిటీబ్యూరో: మిస్‌యూనివర్స్-2025 సందర్భంగా నగరంలోని యాచకులను షెల్టర్‌హోమ్స్‌కు తరలిస్తున్నారని జరుగుతున్న ప్రచారం నిజం కాదని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. తమ విభాగం మూడు నాలుగు నెలలకోమారు రోడ్లపై ఉండే యాచకులను షెల్టర్‌హోమ్స్‌కు తరలించడం రొటీన్ కార్యక్రమమైనా, ప్రస్తుతం మాత్రం ఎలాంటి తరలింపు పనులు చేయడం లేదని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్(యూసీడీ) చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు.

## ఫ్యాబ్‌సిటీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుక్కుగూడ: ఫ్యాబ్‌సిటీ 33కేవీ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆదివారం తుక్కుగూడ పురపాలిక పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరా యం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపా ణి తెలిపారు. ఫ్యాబ్‌సిటీలోని పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నా రు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలన్నారు.

# సాక్షి సండే క్లాసిఫైడ్స్

**Education**

■ BiPC - NEET - Longterm Coaching. Start on June 1st, Sri Chaitanya Jr. College, Hyd. Cont: K.Ashok Reddy, AO - 9441884705 [SCA25003172]

■ Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma MA, M.Com, M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783374]

**Real Estate**

■ Invest In Plot @ Rs.5 L & Flat @ Rs.31 Lac & Get Monthly Income With Weekend Home Facility. Ph: 7799195959 [SCA25003269]

**FLAT FOR SALE**

■ 2BHK Flat, 1204 sft, 53 Syd UDS, Carparking, Lift & Interiors, @ Chikkadpally, RTC X-Roads, near Metro stn, No Agents plz. 9000110839 [HA-00514]

■ Fully Furnished 1450 Sft, East Facing Flat for Sale (10 yrs Old, 62.5 UDS) at RK Puram, near Hanuman Temple. Dilsukhnagar-Kothapet. 9246199133 [HA-5268]

■ Balapur X Road 2Bhk 1150Sft, West Facing Flat for Sale, 100% Vastu, Car Parking Well Amenities Contact :- 8886111266. [SCA25003127]

**HOUSE FOR SALE**

■ Sainikpuri, Yapral Triplex Villa 3400 Sft, 1.8Cr. New Construction, Ready to occupy. All amenities. Call: 9666657878, 9849618181 [HA-15198]

**LAND FOR SALE**

■ మహేశ్వరం రియల్ ఎస్టేట్: మన్‌సాన్‌పల్లి, అమీర్‌పేట్, నాగారం, కందుకూరు, తుక్కుగూడాలో ప్లాట్లు, భూములు & రీసేల్ ప్లాట్లు అమ్మ బడును & కొనబడును. Ph: 9177887748 [SCA25003050]

■ Mumbai Highway Facing Commercial Land 200 feet Road with NA 1591 Sq.yards North West Corner For Sale Near To Woxen University, Ph: 9100203631/ 8297771369 [HA-89]

**LEASE**

■ Fully Furnished 24,000 SFT 400 Seater Office Space For Lease @ Financial District, Grade A building, Central AC, Grand Atrium. Agents Welcome Ph: 9347576914. [HA-107]

**PLOT FOR SALE**
**VIVEKANANDA NAGAR COLONY, KUKATPALLY**
Adjacent 1 Acre Vinayak park
150 Sq. YARD'S, 30x45 FEET
EAST & WEST Facing Roads
Ph: 96663 91787
TIMINGS: 10am to 7pm only

**RENT**

■ Commercial Space for Rent: 1600Sft, Semi-Furnished, with Parking @ KPHB Road 1, Above Dominos, Ph : 8885774274 [HA-9530]

**PLOT FOR SALE**

■ ఎర్రగడ్డ / సనత్‌నగర్ మెయిన్ రోడ్ కి దగ్గరలో కమర్షియల్ / ఇండస్ట్రియల్ ఏరియా 704 గ॥ప్లాటు కాంపౌండ్ వాల్ గేట్స్ & రూమ్. క్లియర్ టైటిల్, డైరెక్ట్ రిజిస్ట్రేషన్ MG రియల్ ఎస్టేట్. ఫోన్: 9908147895 [HA-1327]

■ బోడుప్పల్, నాగారం, రాంపల్లి 2 బెడ్ రూం, G+1 ఓల్డ్ or న్యూ హౌస్, ఓపెన్ ప్లాట్స్ సిటీ అవుట్స్ For Sale. సంప్ర॥ ఈశ్వర ప్రసాద్: 7036129991 [SCA25002691]

■ KAKU Infra Mega HMDA&RERA - Apprd Open Plots for Sale ECIL to Nagaram- Bandlaguda Ready to Const. Bank Loan. Ph: 9010884728 [SCA25002863]

■ 267 Sqyds East Face Plot For Sale At Brindavana Colony, Saroor Nagar, Hyd. Clear Title Ph:9246189612, 8885000456 [SCA25002613]

■ 100sqyards 1,95,000 near Siddipet 97k Registration.120 sqyad 6 lakhs near Airport shadnagar 2BHK 47 lakhs 1acar 1CR 50 lakhs 8978181683 [H-800531]

■ 267 Sq.yards, East Facing Open Plot For Sale at Kapra, Near Old Municipal Office, LRS Full Paid Contact : 98485 27624 [HA-1470]

■ 100% Bank Loan Available, Zero Down Payment: HMDA Final Approval 40 feet bus route road facing layout commercial 1275 Sq.yards Plot for sale @Rs 12000/- per Sq.yard @Shadnager, near Microsoft data Centre. Contact: 9908616936 [H-510]

**Services**

■ కోర్టుకేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరేవాదించుకోండి (Partyin person) మీకు న్యాయ సలహాలు ఇస్తాము. Gayatri Legal Services (Sinces 25 years) LBNagar, Hyd. 7893011777, 7702771626 [SCA25002994]

■ Without IT returns CIBIL issue We provide Home & Mortgage loans from Banks and NBFC. Ph: 9618515325 / 9700869086 [SCA25003206]

**CATERING**

■ Cooking & Catering. Mutton Biryani, Double Ka Meetha, Mutton Curry All types of dishes for all parties Mini. order 50 no's. Ph:9490597786 [HA-15145]

**FOR SALE**

■ స్నేహ ఫ్యాషన్ జ్యువెలరీ న్యూషాప్, ఫర్నిచర్‌తో కలిపి అమ్మకమునకు కలదు. Opp: భారత్ పెట్రోల్ బంక్, హిమాయత్ నగర్ మెయిన్ రోడ్డు, Hyd. ఫోన్: 8121883227, 7075707355 [HA-00507]

■ Goodrunning Stone Icecream & Waffle Store with Furniture & Machinery Rs.5.85L @ Vanasthali puram SBI Road 9922875525 [SCA25003145]

**BUSINESS SERVICE**

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800530]

**BUSINESS OFFER**

■ కొత్తపేటలో మంచి రన్నింగ్‌లో ఉన్న వెల్ ఎస్టాబ్లిష్ 1 గ్రాం జ్యూవెల్లరీ షాప్ అమ్మకానికి కలదు. నియర్ చెన్నై షాపింగ్ మాల్. 8886111266 [SCA25003126]

**CHITS & DEPOSITS**

■ No Sureties & Security Needed - Just Own a House Get Rs. 5 Lakhs to Rs. 1 Crore in Chits. Safe & Hassle Free. Ph: 9703167369 [HA-4071]

**PERSONAL CARE**

**CHANGE OF NAME**

■ నా పేరు వంగటి భూపాల్ రెడ్డి తండ్రి పేరు వంగటి సత్తిరెడ్డి, అడ్రస్: H.No. 2-3-92, గాంధీ నగర్ కాలనీ, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. నాపేరు భూపాల్ రెడ్డి.S తండ్రి పేరు సత్తిరెడ్డి.S నుండి వంగటి భూపాల్ రెడ్డి తండ్రి పేరు వంగటి సత్తిరెడ్డిగా మార్చబడింది. (All Purpose). [SCA25003238]

■ I, GUNDA ARUNA KUMARI W/o Gunda Srinivas R/o H.No:-19-75, Balaji Apartment, Reddy Colony, Miryalaguda, Nalgonda(D) T.S - 508207, Changed my Name as GUNDA ARUNA W/o GUNDA SRINIVAS [SCA25003218]

**OLD AGE HOME**

■ ఈశ్వర్ హోంకేర్ సర్వీస్ Hydలో వృద్ధులు, పెషేంట్స్, పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనికి స్త్రీ/పురుషులను మీ ఇంటికి పంపగలం. ఫోన్: 8374551099 [SCA25003219]

■ MMC ఓల్డ్ ఏజ్ హోమ్స్ & హోమ్ కేర్ సర్వీస్ నందు వృద్ధులకు, పేషెంట్లకి కేర్‌టేకర్స్, నర్సులు, ఆయాలు 24 గం. సర్వీస్ కలదు. మా ఓల్డ్ ఏజ్ హోమ్ మీ ఇంటి వద్ద. 9704667114, 9000638842 [HA-15190]

■ వృద్ధులు, NRI's, లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ &బీర్యాల్ X రోడ్. మీన్స్ హోమ్స్. ఫో, వ. 7981467036, 9391039990, 6281125552 [H-783373]

**Wanted**

■ టెలికాలర్స్, రిసెప్షన్, టైపింగ్, డ్రైవర్లు, వీ॥ఎడిటర్లు, గార్డెన్ వర్కర్లు, హెల్పర్స్, సూ॥వై, ఆయాలు. 10-డిగ్రీ, వ:18-72, ఫ్రీ హాస్టల్. 12-24K. ఫోన్: 7780468727 [SCA25003274]

■ పెద్దాయనను చూసుకోవడానికి మగ మనిషి కావలెను. మంచి జీతం + వసతి & హాస్టల్‌లో పనిచేయటానికి హెల్పర్స్ కావలెను. ఫోన్: 9848454499, 8367679977 [SCA25003265]

■ హైదరాబాద్, కొంపల్లి దగ్గర ఇంట్లోనే ఉండి వంట చేయుటకు అనుభవం గల 35 సం॥లోపు స్త్రీ కావలెను. జీతం 20 వేలు, భోజనం ఫ్రీ వసతి. ఫోన్: 9908820474 [HA-00506]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662 [SCA25003196]

■ డబ్బు సంపాదించాలనే కోరిక మీలో ఉందా. ఐతే 121 గజాల ప్లాటు లక్ష రూ.ల్లో అమ్మండి, నెలకి లక్షల్లో సంపాదించుకోండి. 9121599325 [SCA25002960]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15188]

■ వంట, ఇంటిపని పిల్లలను పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును. 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [SCA25002984]

■ హెల్పర్స్ ఉప్పల్ నందు పని చేయుటకు కావలెను. లేడీస్/బాయ్స్ & ITI, Diploma వారు కావలెను. ఫోన్ : 9010017543 [HA-1322]

■ గార్డెన్ సూపర్ వైజర్స్ కావలెను. జీతం: 20 వేలు Qly: ఇంటర్-డిగ్రీ, ఫ్రీ భోజనం +వసతి కలదు. డ్రీమ్స్ వ్యాలీ రిసార్ట్, బాకారం చిలుకూరు బాలాజీ టెంపుల్ Hyd (Send CV వాట్సాప్) Ph: 9666509509 [SCA25003090]

■ ప్రముఖ కం.లో పని.కు హెల్పర్స్, సెక్యూరిటీ గార్డ్, హౌస్ కీపింగ్ బాయ్స్, జీ: 16K & డ్రైవర్స్. జీ: 22K కావలెను. మౌలాలి. Ph: 8686512852, 9849415794 [SCA25003082]

■ తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలలో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్వహిస్తున్న PVR Projects సంస్థలో పనిచేయుటకు సైట్ అకౌంటెంట్స్ (B.Com), నీటిపారుదల ప్రాజెక్ట్స్‌లో అనుభవం ఉన్న సైట్ సూపర్ వైజర్స్ మరియు డ్రైవర్స్ (HMV & LMV) కావలెను. Contact No. 040 23338080, 80195 38080 Email: adm.vineela@gmail.com [H-804894]

■ MG కార్ షోరూం శంషాబాద్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, మెకానిక్‌లు కావలెను. సెల్ : 9491402020, 9492628629. [J-534]

■ లేడీస్ కావలెను. బట్టలు/కర్టెన్స్ షాపులో పనిచేయుటకు. ఏజ్: 18-30 సం. టైం : 10am-8pm సండే హాలిడే. పాన్ బజార్, సికింద్రాబాద్. Ph: 9985152179 [SCA25003137]

■ VSSA NGOలో పనిచేయుటకు కౌన్సిలర్స్ MA సోషియాలజీ/MSW/GNM 17200 & ఫీల్డ్ స్టాఫ్ టెన్త్ పాస్/ఫెయిల్ 12000 M/F కావలెను. 8978979782, 7569586509. vssahyd@gmail.com [HA-15192]

■ Wanted Meeseva & Aadhaar Operator, Experience M/F Part Time / Full Time, 6No X Road Amberpet, Hyd. Ph: 9959299009, 8074970473 [SCA25003222]

■ Required watchman couple for home at Nanal Nagar, Khader Bagh, Tolichowki. & site supervisor for site at Shamshabad. Ph: 7893758504 [HA-34395]

■ Required Lady Computer Operators at Balanagar.who Passed inter(MPC) Passed with MS office & excl.Call:9985249352 [SCA25003041]

■ Wanted Delivery Boys incharge to work in Dental lab at Sanath nagar, Salary -25k, timing -morning 9:30 am to 10 pm Ph -9989001234 [HA-4079]

■ Req. Sr. Accountant (Female), MEP supervisors. #23 Aleap industrial Nr Pragathi Nagar Kukatpally. Ph: 9247704770, 9640645015. [HA-34355]

■ Required Branch Manager, Operation Manager, Field Officer, Front Office Lady for Security Office @ Jeedimetla. Ph : 040-48445051, 9030473943, 9441950606 [SCA25003109]

**FACULTY TEACHERS**

■ Wanted Teachers for all Subjects LKG to X, Tagore's High School, Gandhi Nagar, Jagathgiri Gutta Road, opp.IDPL Colony. Ph: 9399955993,8801064571 [HA-4075]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



# పోలీసునంటూ బెదిరించి.. ఐపీఎల్ టికెట్లు లాక్కొని పరార్

సనత్‌నగర్: పోలీసునని చెప్పి బెదిరించి యువకుల నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ టికెట్లను లాక్కొని పరారైన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన వంగూరి రాకేష్ ఈ నెల 5వ తేదీన నగరంలో జరిగే ఎస్‌ఆర్‌హెచ్, డీసీ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ వీక్షించడం కోసం 16 టికెట్లను కొనుగోలు చేసేందుకు స్నేహితులైన పవన్, రామకృష్ణలతో కలిసి నగరానికి వచ్చాడు. మొదట హిమాయత్‌నగర్‌లోని టికెట్ బుకింగ్ కేంద్రానికి వెళ్లి 16 టికెట్ల కోసం ప్రయత్నించగా 8 టికెట్లు మాత్రమే దొరికాయి. మరో 8 టికెట్ల కోసం జింఖానా మైదానానికి చేరుకుని అక్కడ కష్టపడి మరో 8 టికెట్లను కొనుగోలు చేసి బయటకు వస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అడ్డగించాడు. తనకు నాలుగు టికెట్లు విక్రయించాలని, రూ.2,500ల చొప్పున విలువ చేసే టికెట్లకు రూ.5,000 చొప్పున చెల్లిస్తానన్నాడు. తొలుత నిరాకరించిన యువకులు ఆ తర్వాత టికెట్లను విక్రయించేందుకు ఒప్పుకున్నారు. మళ్లీ సదరు వ్యక్తి మరో 6 టికెట్లు కావాలని అడిగాడు. టికెట్లు ఇచ్చేందుకు యువకులు నిరాకరించడంతో వారిని బెదిరించాడు. వారికి పోలీసు గుర్తింపు కార్డు చూపించి తాను టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారినని, బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్నారని, అందరినీ జైలుకు పంపుతానని బెదిరించి వారిని బేగంపేట పోలీస్ స్టేషన్ సమీపం వరకు తీసుకువచ్చాడు. మొత్తం 16 టికెట్లతో పాటు యువకుల వద్ద ఉన్న రూ.1700 తీసుకుని వారిని తిరిగి పరేడ్‌గ్రౌండ్ వద్ద దించి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తిపై అనుమానం వచ్చిన యువకులు బేగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కారు నడుపుతుండగా ఫిట్స్.. తప్పిన ప్రమాదం



మూసాపేట: కారు నడుపుతున్న వ్యక్తికి ఫిట్స్ రాగా..పెను ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట రెయిన్ బో విస్టాస్‌లో నివాసం ఉండే డాక్టర్ రాకేష్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వండర్ లా వెళ్లి వస్తున్నాడు. హైటెక్ సిటీ మీదుగా ఖైత్లాపూర్‌లోని న్యారో రోడ్డులో వెళ్తుండగా రాకేష్‌కు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చాయి. దీంతో కారులో ఉన్న ఇతర కుటుంబ సభ్యులు కారును అదుపులోకి తీసుకురావడానికి ఎడమ వైపు స్టీరింగ్ తిప్పబోయి పొరపాటుగా కుడి వైపునకు తిప్పడంతో ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారును ఢీ కొట్టింది. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న మట్టి కుప్పలను బలంగా ఢీని కారు ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అక్కడున్నవారంతా పెను ప్రమాదం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఏడేళ్ల కల సాకారమవుతోంది..

రేపు అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను గడ్కరీ ప్రారంభిస్తారు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అంబర్‌పేట ఫ్లైఓవర్


సర్వీస్ రోడ్డును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- అంబర్‌పేట ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్డును పరిశీలించిన కేంద్ర మంత్రి
- అధికారుల తీరుపై ఆగ్రహం

నల్లకుంట: ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఎదుర్కొని, ఏడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత పూర్తయిన అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం అంబర్‌పేట ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి నితిన్ గడ్కరీ పాల్గొంటారని చెప్పారు. కొంత మంది అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులను ఆపే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి స్థలం సేకరించిన తర్వాత ఒక రాజకీయ పార్టీ అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేసిందన్నారు. గ్రేవ్‌యార్డ్ కారణంగా రోడ్డు విస్తరణ సాధ్యం కాకపోవడంతో ఫ్లై ఓవర్ నిర్మాణం మంజూరు చేయించామన్నారు. ఇంకా ఆరు చోట్ల భూ సేకరణ పూర్తి కాలేదని..దీంతో సర్వీస్ రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీకి లేఖ రాసినట్లు తెలిపారు. వెంటనే స్థలం సేకరించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతగానో ఊరట లభిస్తుందని తెలిపారు.

**ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం**

సర్వీస్ రోడ్డులో అసంపూర్తి పనులను గమనించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి ఆయన శనివారం ఫ్లై ఓవర్‌పైన రెండు కిలోమీటర్ల మేర నడిచివెళ్లి సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించారు. మట్టి కుప్పలు తొలగించకపోవడం, ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అధికారులను ఆయన మందలించారు. మంత్రి వెంట ఆర్అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ అధికారులు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతం రావు, నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీజేపీ నాయకులు కన్నె రమేష్ యాదవ్, అజయ్ కుమార్, కె.లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ సమస్యలకు చెక్**

అంబర్‌పేట ఫ్లై ఓవర్‌పై సుందరీకరణ పనులు పూర్తి చేశారు. ఫ్లై ఓవర్ కింద మాత్రం సర్వీస్ రోడ్డు, గ్రీనరీ అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి ఉన్న ట్రాఫిక్ సమస్యకు ఇది పరిష్కారం చూపుతుందని అధికారులు చెబుతున్నారు. వరంగల్ జాతీయ రహదారి నుంచి హైదరాబాద్ నగరానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ట్రాఫిక్ రద్దీ బెడదను తగ్గిస్తుంది. కాగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ ఫ్లై ఓవర్‌పై రాకపోకలు సాగుతుండగా..ఈ నెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నారు.

## పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్



సన్నబియ్యాన్ని అందిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: పేదల సంక్షేమాభివృద్ధిని కోరుతూ ప్రజల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ అని కాంగ్రెస్ గ్రేటర్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఏజీకాలనీలోని రేషన్ షాపులో ప్రభుత్వం రేషన్‌దారులకు అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని రేషన్‌ను అందజేశారు. నేతలు రమేష్‌నాయక్, అసదుద్దీన్, సలీమ్, ఇమ్రాన్, శశి, నయీమ్, గౌస్, రషీద్ పాల్గొన్నారు.

## అంతరిక్ష సైన్స్‌పై వారం రోజుల క్యాంపు

పంజగుట్ట: అంతరిక్ష సైన్స్ అంటే ఏమిటి, అంతరిక్షంలో ఏం జరుగుతుంది తెలుసుకునేందుకు స్కిల్ ఈడీయూ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రెసిడెన్షియల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు వర్సిటీ వ్యవస్థాపకులు పృథ్వీపతిరావు తెలిపారు. 5వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఈ క్యాంప్ ఉంటుందని, హైదరాబాద్‌లోని ఐఐటీలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇస్రో, నాసా, స్కైరూట్, ఐఐటీ ప్రొఫెసర్లు, భారతదేశంలోని అంతరిక్ష ప్రముఖ ఫొటోగ్రాఫర్లు ఈ క్యాంపులో పాల్గొని విద్యార్థులకు అబ్జర్వేషన్ అడ్వాన్స్ టెలిస్కోప్ ద్వారా లైవ్‌లో చూపిస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు ఫోన్: 97000 63637 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. డివిజన్‌లోని కార్మికనగర్‌లో డివిజన్‌కు చెందిన 10 మంది లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కాసాల అరుణ్‌కుమార్, కేవన్ రెడ్డి, సయ్యద్ బషీర్, లియాకత్ అలీ, వినోద్‌గౌడ్, ఫయాజ్, విజయ్‌కిరణ్, అబ్దుల్ సమద్, సురేందర్, లింగం, రాకేష్, క్రిస్టఫర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 40, పందిరి బీర 38, క్యాబేజీ 08, క్యారెట్ 21, దొండకాయ 23, గుండు బీన్నీస్ 75, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 85, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, మునగకాయ 4, మామిడికాయ 50, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 28 ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

## రోడ్డుపైనే పార్కింగ్.. అయినా పట్టదా..?



పంజగుట్ట మెరిడియన్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్

బంజారాహిల్స్: పంజగుట్ట చౌరస్తాలోని మెరిడియన్ హోటల్ వద్ద అక్రమ పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అక్రమ పార్కింగ్ తొలగించాలంటూ స్థానికులు, వాహనదారులు ఎన్నిసార్లు కోరుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ హోటల్ ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను సదరు హోటల్ యాజమాన్యం పూర్తిగా కబ్జా చేసింది. పార్కింగ్‌తో రోడ్డంతా ఇరుగ్గా మారిపోవడంతో పాటు ఫ్రీ లెఫ్ట్ వెళ్లాల్సిన వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అమీర్‌పేట వైపు నుంచి పంజగుట్ట చౌరస్తాకు వచ్చే ఈ రోడ్డులో పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఆ ప్రాంతంలో రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

# అర్హుల ఎంపికకు కసరత్తు

- ముమ్మరంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్క్రూటినీ
- వారం రోజుల్లో మొత్తం దరఖాస్తులు పరిశీలిస్తామన్న అధికారులు
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ పరిధిలో అంతంత మాత్రమే దరఖాస్తులు



రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: రాజీవ్ యువ వికాసం పథకం మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడబోత కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల రెవెన్యూ అధికారులు వారం రోజుల నుంచి దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్నారు. దరఖాస్తులకు జతపరిచిన పత్రాలను పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితా తయారు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను కార్పొరేషన్ల వారీగా విభజించారు. ఆ దరఖాస్తులను తహసీల్దార్ల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేయాల్సిందిగా జిల్లా అధికారులు ఆదేశించారు.

షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి కమిటీ మెంబర్ సెక్రటరీగా ఈ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. దరఖాస్తుదారుల్లో గతంలో ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక కొనసాగనుంది. ఆయా మండలాల నుంచి జిల్లా కమిటీకి వడబోత అనంతరం దరఖాస్తులను లబ్ధిదారుల జాబితాతో జిల్లా కమిటీకి పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందజేస్తారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధిలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుండగా, కమిటీల పర్యవేక్షణలోనే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

### ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,458 దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి..

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో దరఖాస్తుదారులు వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో ఈ పథకం కింద 6,238 మంది ఆన్‌లైన్‌లో మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 2,458 మంది మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులకు అన్ని ధ్రువపత్రాలు జతచేసి వార్డు కార్యాలయంలో అందజేశారు.

- ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం 515 మంది దరఖాస్తులు స్వీకరించగా ఇప్పటి వరకు 335 దరఖాస్తులు స్క్రూటినీ చేశారు. 327 మంది అర్హులుగా గుర్తించారు.
- ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 171 మంది దరఖాస్తు చేసుకోగా, 78 దరఖాస్తులు మాత్రమే వార్డు కార్యాలయాలకు అందాయి. ఇందులో 76 మందిని అర్హులుగా గుర్తించారు.
- బీసీ కార్పొరేషన్ ద్వారా 1,866 మంది దరఖాస్తు చేసుకోగా, 999 దరఖాస్తులు వార్డు కార్యాలయాలకు చేరాయి. ఇందులో 656 మందిని అర్హులుగా తేల్చారు.
- ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 53 దరఖాస్తులు అందగా, ఇందులో 44 మంది అర్హులుగా గుర్తించారు.
- మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 787 దరఖాస్తులకుగాను 566 మందిని అర్హులుగా గుర్తించారు.
- క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 26 దరఖాస్తులు రాగా ఇందులో 26 మందినీ అర్హులుగా గుర్తించారు.

### జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో..

- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం మొత్తం 8,848 మంది వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,086 దరఖాస్తులు ఖైరతాబాద్ మండలానికి చేరుకున్నాయి.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇప్పటివరకు 679 దరఖాస్తులు స్క్రూటినీ చేయగా ఇందులో 652 మంది అర్హులుగా తేలారు.
- ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 183 దరఖాస్తులు స్వీకరించగా ఇందులో 166 మంది అర్హులుగా తేలారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1,042 దరఖాస్తులు రాగా ఇందులో 936 దరఖాస్తులను స్క్రూటినీ చేసి 862 మందిని అర్హులుగా తేల్చారు.
- ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 90 దరఖాస్తులను స్వీకరించగా ఇందులో 52 మందిని అర్హులుగా తేల్చారు.
- మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 1,056 దరఖాస్తులు స్వీకరించగా 702 అర్హులుగా తేల్చారు.
- క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 36 దరఖాస్తులు రాగా ఇందులో 36 మంది అర్హులుగా తేలారు.

## డిజిటల్ పాథాలజీ రంగంలో పెరుగుతున్న ఏఐ పాత్ర

ఎక్సెన్ జినోమిక్స్ సీఈవో డాక్టర్ అమితవ రాయ్



బంజారాహిల్స్: రానున్న రోజుల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు వ్యాధి నిర్ధారణ పద్ధతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు జినోమిక్స్ డయాగ్నిసిస్ కీలకపాత్ర పోషించనుందని ఎక్సెన్ జినోమిక్స్ సంస్థ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ అమితవ రాయ్ అన్నారు. కేన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర అంశాలలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక చికిత్స విధానాలపై ఎక్సెన్ జినోమిక్స్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సదస్సును బంజారాహిల్స్‌లో నిర్వహించారు. 'నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ ఇన్ న్యూరో ఆంకాలజీ' అనే పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో జినోమిక్స్ డయాగ్నసిస్ ప్రాధాన్యత గురించి వివరించారు. డిజిటల్ పాథాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిజ్ఞానం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో బ్రెయిన్ కేన్సర్ చికిత్సలో సైతం జినోమిక్ డయాగ్నస్టిస్ ఎంత దోహదం చేస్తుందని ఆమె అన్నారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన న్యూరోసర్జన్లు, ఆంకాలజిస్టులు, బ్రెయిన్ ట్యూమర్ స్పెషలిస్టులు, పాథాలజిస్టులు సదస్సులో పాల్గొని పలు కీలక అంశాలపై అనుభవాలను పంచుకున్నారు.

## టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన న్యూటన్ హైస్కూల్



విద్యార్థులను అభినందిస్తున్న పీజే రెడ్డి

రహమత్‌నగర్: పదో తరగతి పరీక్షల్లో న్యూటన్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 21 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించగా, 84 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కుల సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను న్యూటన్ విద్యాసంస్థల చైర్మన్ పీజే రెడ్డి, డైరెక్టర్లు రాజేష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి శనివారం అభినందించారు.

## పేదల ముఖాల్లో సంతోషం



ఉదయ్‌నగర్‌లో రేషన్ షాపు వద్ద సన్న బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంతో పేదల ముఖాల్లో సంతోషం కనిపిస్తోందని, కార్డుదారులు సంతోషంగా సన్న బియ్యం తీసుకెళ్తున్నారని టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్ బస్తీలోని రేషన్‌షాపు వద్ద శనివారం ఆమె సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు.

## న్యాయవృత్తిలో రాణించాలంటే నైపుణ్యం తప్పనిసరి



హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్ కార్యక్రమంలో అతిథులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3లోని సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజ్ ఆఫ్ లాలో 'హార్మనీ ఇన్ డిస్ప్యూట్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగిన పోటీలు శనివారం ముగిశాయి. వర్ధమాన న్యాయ నిపుణుల్లో వివాద పరిష్కార పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవృత్తిలో రాణించాలంటే ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ విభాగ డీన్ విజయలక్ష్మీ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా, ఐపీఆర్ చైర్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జీవీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ విజేతలను అతిథులు సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ మధ్యవర్తిగా అవుటి రాగిణి(పెండేకాంతి లా కాలేజ్), రన్నరప్‌గా మహాసిన్ ఫాతిమా(ఇక్ఫాయ్ లా స్కూల్), ఉత్తమ మధ్యవర్తి జంటగా లీనాశర్మ, నౌరీన్ ఫాతిమా(ఇక్ఫాయ్ లా స్కూల్), రన్నరప్‌గా లక్కా శృతి, ట్వింకిల్ మేరీ సైమన్(కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా) నిలిచారు.

## 'డైనోసార్ల'కు మరమ్మతులు చేపట్టండి



డైనోసార్ పార్కును పరిశీలిస్తున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-92లోని జీహెచ్ఎంసీ డైనోసార్ పార్కును ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి శనివారం సంబంధిత యూబీడీ అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.కోట్లు వెచ్చించి ఇక్కడ ఏర్పాటు చేసిన డైనోసార్ల శిల్పాలు చాలావరకు దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అలాగే పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు డిజైన్లు రూపొందించి అంచనాలు తయారు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల సివిల్ వర్క్స్ పెండింగ్‌లో ఉన్నాయని, టైల్స్ వేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం ప్రశాసన్‌నగర్ పార్కును కూడా ఆయన పరిశీలించారు. పార్కులో మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డీసీ సమ్మయ్య, ఈఈ విజయ్‌కుమార్, పార్కుల విభాగం అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బస్తీ నేతలు



ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషంను కలిసిన వివిధ బస్తీల నేతలు

ఫిలింనగర్: ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంతోషంను శనివారం ఫిలింనగర్ బస్తీలకు చెందిన నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాభవానీనగర్ బస్తీ నేత ఆర్.ఎల్లయ్యతో పాటు పలువురు వివిధ బస్తీల నేతలు ఇన్‌స్పెక్టర్‌ను కలిశారు.

## ఆకట్టుకుంటున్న సమ్మర్ ఉత్సవ్ మేళా





ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా సందర్శకులకు అలరిస్తోంది. పీపుల్స్ ప్లాజాలో ల్యాండ్ అయినట్లుగా ఏర్పాటు చేసిన దుబాయి ఫ్లైట్ ఎక్కి దిగగానే అంతరిక్షంలోకి అడుగుపెట్టినట్లు అనుభూతి కలుగుతోంది. పూలవనం, బుర్జ్ ఖలీఫా భవనం ఆకట్టుకుంటోంది. శని, ఆదివారాల్లో ఇక్కడికి వస్తున్న సందర్శకులు పూలవనంలో సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఫిష్ టన్నల్‌లోకి అడుగు పెట్టగానే వావ్ అనిపిస్తోంది. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బంజారాహిల్స్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని జూబ్లీహిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ సమీపంలోని వెంకటగిరి అపోలో ఫార్మసీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జగిత్యాలకు చెందిన ఆర్.మహేష్ ఎల్లారెడ్డిగూడ హాస్టల్‌లో ఉంటూ ఐటీ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని హాస్టల్ ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







## యువతకు ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలం

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర



ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

హిమాయత్‌నగర్: యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని, మత ఛాందస విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట యువజన సంఘ జెండాను ధర్మేంద్ర ఎగురవేశారు. ఏఐవైఎఫ్ నాయకులు ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, శ్రీమాన్, షేక్ మహమూద్, మధు, శివకుమార్, మాజీద్ అలీఖాన్, కల్యాణ్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని శ్రీవెంకటేశ్వర హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆనుకుని 22 మంది ప్లాట్‌దారులు తమ ఇళ్ల వెనుక ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ఒక్కో ప్లాట్ యజమాని 500 గజాల వరకు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల వెనుక మినీ గార్డెన్‌ను నిర్మించుకున్నారు. కొందరు స్విమ్మింగ్ పూల్స్ నిర్మించుకున్నారు. మరికొందరు అక్రమ నిర్మాణాలను అద్దెకు ఇవ్వగా మరికొంతమంది శిల్పారామాన్ని తలపించే రీతిలో ఉద్యానవనాలను పెంచుకుంటున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే సర్కార్ స్థలాలను ఎమ్మెల్యే కాలనీకి చెందిన కొందరు బడాబాబులు దర్జాగా ఆక్రమించి తమ ప్లాట్లలో కలిపేసుకున్నారు. వీటిని గుర్తించిన రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా, జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన కొంతమంది ప్లాట్‌దారులు అడ్డదారుల్లో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రికార్డులను షేక్‌పేట రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

## మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలి



మాట్లాడుతున్న డీఎంసీ

వెంగళరావునగర్: మహిళలు పొదుపు సంఘాల్లో చేరి తమ కుటుంబాలకు భరోసాగా నిలవాలని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. అనేక బ్యాంకులు ముందుకు వచ్చి రుణ సౌకర్యం కల్పిస్తున్నాయని, వాటిని తీసుకుని ఆర్థికంగా ఉన్నతంగా ఎదగాలని కోరారు. జీహెచ్ఎంసీ యూడీసీ అధికారులు ప్రతి నిరుపేద మహిళను కలిసి వారికి పొదుపు సంఘాలపై అవగాహన కల్పించడమే కాకుండా పొదుపు సంఘాల్లో కలిసే విధంగా సూచనలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసు

రహమత్‌నగర్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన ఇద్దరు వ్యక్తులపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ మండల పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్‌లో 126, 127 సర్వే నంబరులో 9 ఎకరాల 2 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. అది జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉంది. ప్రభుత్వ స్థలంలో వాసు 50 గజాలు, సురేష్‌కుమార్ 80 గజాలు ఆక్రమించారని ఖైరతాబాద్ తహసీల్దార్ నయిముద్దీన్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన విజ్ఞానాన్ని రైతులకు అందించాలి



మాట్లాడుతున్న అధికారులు

ఏజీవర్సిటీ: కృషి విజ్ఞాన కేంద్రాలు వ్యవసాయ రంగంలోని నూతన మార్పులు, అధునాతన విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించేందుకు కృషి చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా అన్నారు. వ్యవసాయ అనుబంధ విశ్వవిద్యాలయాల విస్తరణ వార్షిక సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షేక్ మీరా మాట్లాడుతూ విడుదలైన నూతన వంగడాలు, పరిశోధనలను రైతులకు చేరవేయాలని, విస్తరణ గురించి అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ కృషి విజ్ఞాన కేంద్రాలు గత సంవత్సరం చేపట్టిన విస్తరణ పనులు, రాబోవు సంవత్సరానికి ప్రణాళికలపై సదస్సులో చర్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు ఎం.కిషన్ కుమార్, ఉద్యాన విశ్వవిద్యాయలం విస్తరణ సంచాలకుడు డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు, సహాయ పరిశోధన సంచాకులు అధికారులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ టాలెంట్ పూల్



ఫుట్‌బాల్ టాలెంట్ పూల్‌లో పాల్గొన్న క్రీడాకారులు

గచ్చిబౌలి: ఫుట్‌బాల్ సంస్కృతిని పునరుద్ధరించేందుకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టాలెంట్ పూల్‌కు మంచి స్పందన లభించింది. శనివారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్, ఫిఫాలు సంయుక్తంగా ఫుట్‌బాల్ టాలెంట్ పూల్ నిర్వహించాయి. అండర్–15 బాలుర విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 11 మంది క్రీడాకారుల చొప్పున 30 జట్లుగా నిర్వాహకులు విభజించారు. ఆ క్రీడాకారులు ప్రదర్శించిన ఫుట్‌బాల్ టెక్నిక్స్‌ను రికార్డ్ చేశారు. మే 5, 6 తేదీల్లో అండర్–15 బాలికల విభాగంలో ఫుట్‌బాల్ టాలెంట్ పూల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, సాంకేతిక అధికారులకు ప్రతిభ గుర్తింపు, ప్రోత్సాహంపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఓయూలో రీసెర్చ్ ఎక్స్‌పోకు అనూహ్య స్పందన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన రీసెర్చ్ ఎక్స్‌పో అనూహ్య స్పందన లభించింది. కాలేజీలోని కెమికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని సీఎస్ఐఆర్–ఐఐసీటీ పరిశోధన సంస్థల్లో చీఫ్ సైంటిస్ట్‌గా పనిచేసిన డాక్టర్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు ప్రాజెక్టులను, పోస్టర్లను ప్రదర్శించారు. పలు సంస్థల నిర్వాహకులతోపాటు పూర్వవిద్యార్థులు సైతం రీసెర్చ్ ఎక్స్‌పోను సమీక్షించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.రమేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనునాయక్, కన్వీనర్ డా.సాదం ఐలయ్య, ప్రొ.హయవదన, ప్రొ.రాజం తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్–2025 ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ(జీఐఎల్‌టీ)లో పాలీసెట్–20225పై రాయదుర్గంలోని క్యాంపస్‌లో ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక శిక్షణ ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

# గోల్డ్ సిక్కా.. మరో ముందడుగు!

- మానవ జోక్యం లేకుండానే బంగారానికి సంబంధించి మల్టీపుల్ సేవలన్నీ యంత్రంతోనే..
- అమ్మడం, కొనడం, లీజు, డిజిటైజ్, మానిటైజ్, జ్యువెలరీ వంటి సేవలు అందుబాటులోకి..
- బంగారం డిపాజిట్ చేస్తే ఆ విలువకు సరిసమానమైన మార్పిడి
- వివరాలు వెల్లడించిన గోల్డ్ సిక్కా సీఈఓ ఎస్‌వై తరుజ్

ఏఐ ఆధారిత గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం మెషీన్ ప్రారంభానికి ఏర్పాట్లు




గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం మెషీన్ వివరాలను వెల్లడిస్తూ పోస్టర్ విడుదల చేస్తున్న గోల్డ్ సిక్కా సీఈఓ ఎస్‌వై తరుజ్ తదితరులు

సనత్‌నగర్: గోల్డ్ సిక్కా మరో ముందడుగు వేసింది. బంగారానికి సంబంధించిన మానవ రహిత ఏటీఎం ద్వారా అనేక సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. గోల్డ్ సిక్కా మొట్టమొదటిసారిగా 2022లో గోల్డ్ ఏటీఎంను ప్రవేశపెట్టింది. ప్రపంచంలోనే మొదటిసారిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం మిషన్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీని వివరాలను శనివారం బేగంపేటలోని అశోకా రఘుపతి చాంబర్‌లో గల గోల్డ్ సిక్కా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ సీఈఓ ఎస్‌వై తరుజ్ వెల్లడించారు. బంగారం కొనడం, అమ్మడం, మార్చడం (ఎక్స్ఛేంజ్), లీజుకు ఇవ్వడం, డిజిటైజ్ చేయడం, మోనిటైజ్, జ్యువెలరీ వంటి సేవలను మానవ జోక్యం లేకుండానే ఈ మెషీన్ ద్వారా చేసుకోవచ్చన్నారు. బంగారు రుణాలు మినహా అన్ని సేవలను ఇది అందిస్తుందని, ఇది పూర్తిగా ఆటోమేటెడ్ టెల్లర్ మిషన్ వివరించారు. నెలన్నర రోజుల్లో ఈ ఏటీఎం సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు గోల్డ్ రియల్ టైమ్ ఏటీఎం ఎంతో ఆదరణ పొందిందన్నారు. దుబాయ్, కైరో, రష్యా, టాంజానియా వంటి దేశాల్లో అవి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బంగారం కేవలం ఆభరణంగా కాకుండా అసెట్‌గా మారుతోందని, భవిష్యత్తులో దానిని కరెన్సీగా పరిగణించే అవకాశం కూడా ఉందన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు, యూపీఐ ద్వారా బంగారం కొనుగోలు చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. దేశంలో 14, అంతర్జాతీయంగా 3 ఏటీఎంలు ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాదిలో దేశవ్యాప్తంగా 100 గోల్డ్ ఏటీఎంలు, ప్రపంచ వ్యాప్తంగా మరో 100 గోల్డ్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. ఈ ఏటీఎంలకు భిన్నంగా బంగారానికి సంబంధించి అన్ని సేవలు ఒకేచోట ఎవరి అవసరం లేకుండా అందించాలనే ఉద్దేశంతో గోల్డ్ మెల్టింగ్ ఏటీఎంను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు.

### గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం ప్రత్యేకతలు ఏమిటంటే..

- ఇంట్లో ఉన్న పాత బంగారం అమ్మాలన్నా, మార్చుకోవాలన్నా, ఇన్వెస్ట్ చేసుకోవాలన్నా ఎవరి ప్రమేయం లేకుండా మిషన్ ద్వారా సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది.
- ఒకవేళ బంగారాన్ని విక్రయించాలనుకుంటే ఏటీఎంలో ఉంచిన బంగారాన్ని దానికదే కరిగించుకుంటుంది. అందుకోసం 30 నిమిషాల సమయం పడుతోంది. కరిగించిన తర్వాత బంగారం స్వచ్ఛత(ప్యూరిటీ)ను, అప్పటి తాజా రేటును మిషన్ స్క్రీన్‌పై సూచిస్తుంది. ఒకవేళ ఆ రేటు నచ్చకుంటే మళ్లీ బంగారాన్ని తిరిగి తీసేసుకోవచ్చు.
- పాత బంగారాన్ని విక్రయించి, కొత్త జ్యువెలరీ ఆభరణాలు తీసుకునే ఆలోచన ఉంటే ఈ మిషన్ ద్వారా వినియోగదారులు ఆభరణాలను వర్చువల్‌గా ధరించే వెసులుబాటు ఉంది. ప్రత్యేకంగా ఈ ఏటీఎంలో ఆగ్యుమెంటెడ్ రియాల్టీ(ఏఆర్) అనుభూతి లభిస్తుంది. ఒకవేళ ఆ ఆభరణాలు నచ్చితే కొనుగోలు చేసుకోవచ్చు.
- బంగారం అమ్మితే ఆటోమేటిక్‌గా బంగారం స్వచ్ఛతను బట్టి విలువ కట్టి ఆ మొత్తం డబ్బులను వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. బంగారం డిపాజిట్ చేసిన తర్వాత డబ్బు ఖాతాలోకి రావడానికి సుమారు 30 నిమిషాల సమయం పడుతుంది.
- బంగారం అమ్మే వ్యక్తి నిజంగా వాటికి యజమానా..? లేక దొంగిలించిన సొత్తు తీసుకువచ్చాడా? అన్న విషయాన్ని కూడా పసిగట్టే టెక్నాలజీ ఈ మిషన్ సొంతం. బంగారం డిపాజిట్ చేసిన తర్వాత మెషీన్ డిపాజిటర్ ఫొటోలను తీస్తుంది. ఆధార్‌కార్డు, ఐడీ ప్రూఫ్‌ను వెరిఫై చేస్తోంది. ఒకవేళ మోసపూరిత కార్యకలాపాలను అది గమనిస్తే వెంటనే బంగారాన్ని ఆపి పోలీసులకు సమాచారం చేరవేస్తుంది.
- ఈ మెషీన్ ద్వారా ఈటీఎఫ్(ఎక్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్) కొనుగోలు చేయవచ్చు. ఇందుకోసం సెబీ, ఇతర నియంత్రణ సంస్థలతో కలిసి సిక్కా సంస్థ పనిచేస్తోంది.
- ఈ గోల్డ్ ఏటీఎం ఫిజికల్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ హ్యాకథాన్‌లు పూర్తికాగా ఇప్పటివరకు ఈ మెషీన్‌ను హ్యాక్ చేయగలిగిన వారు ఎవరూ లేరన్నారు.
- ఈ మెషీన్‌ను ఈజీగా తీసుకువెళ్లేందుకు అవకాశం లేదు. దాదాపు 1,500 కేజీల బరువు ఉంటుంది.
- ఒక్కో ఏటీఎం మెషీన్ ఖర్చు రూ.40 లక్షలు కాగా, ఇందులో రూ.3 కోట్లు– 4 కోట్ల విలువైన బంగారం డిపాజిట్ చేసే సామర్థ్యం ఉంటంది.
- దీని ద్వారా బంగారం కొనుగోలు, అమ్మకం విషయంలో ఎవరైనా మోసం చేస్తారేమోనన్న భయం గానీ, మధ్యవర్తుల హిడెన్ చార్జీలు గానీ ఉండవని, ఈ ఏటీఎం 24/7 అందుబాటులో ఉంటుందని గోల్డ్ సిక్కా సీఈఓ స్పష్టం చేశారు.

## మాతృభాషతోనే సమస్యలపై అవగాహన



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- మొదటిసారిగా బుద్ధుడే సంస్కృతాన్ని వ్యతిరేకించాడు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతృభాషతోనే అన్ని సమస్యలపై అవగాహన పెరుగుతుందని, తెలుగుభాష దెబ్బతినడాన్ని తెలుగు సమాజం సహించబోదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు భాషాభిమానులు తెలంగాణ ఆధ్వర్యంలో సమాలోచన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృతం బాగా ప్రాచుర్యంలోకి రావడం సాధారణ విషయంగా భావించవద్దన్నారు. మాతృభాషను సమాజం నుంచి దూరం చేస్తే ఆ సమాజం ఆలోచించే శక్తిని కోల్పోతుందన్నారు. ఒక తెలుగు సమాజంలో తప్ప ఏ రాష్ట్రంలోనూ మాతృభాషకు హాని జరిగే విధానం లేదని పేర్కొన్నారు. భారతదేశంలో మొదటిసారిగా బుద్ధుడు సంస్కృతాన్ని వ్యతిరేకించారని అన్నారు. ఆనాటి ప్రజల భాష అయినా పాళీలో తన బోధనలను సాగించారని చెప్పారు. ఇంగ్లీష ప్రపంచ భాష ఎలా అయిందని ప్రశ్నించారు. యూఎస్ఏ, ఇంగ్లాండ్, ఇండియాలో తప్ప ఏ దేశంలోనూ ఇంగ్లిష్‌ను ఎక్కువగా వాడరన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలు కష్టాన్ని తమ మాతృభాషలోనే చెప్పుకుంటారని అన్నారు. భాష అంటే ఒక చరిత్ర, సంస్కృతి, అనుభవం, జ్ఞానం అని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ లాంటి దేశాలు కూడా మాతృభాషతోనే అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.

**తగ్గుతున్న తెలుగు ప్రాధాన్యం**

ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషకు అవమానం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరుగుతున్న కొద్దీ విద్యలో తెలుగు ప్రాధాన్యం తగ్గిపోతోందన్నారు. తెలుగు మాట్లాడే వారి పట్ల అవమానంగా ప్రవర్తించడం సరైనది కాదన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, తెలంగాణలోని పాత ఓరియంటల్(తెలుగు) కళాశాలలను పునరుద్ధరించాలని, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తెలుగు కళాశాలను ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ప్రభుత్వ పండిత శిక్షణ కళాశాలలను ఏర్పాటు చేయాలని, ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో తెలుగును తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలనే డిమాండ్లతో తీర్మానం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న , మోతుకూరు నరహరి, డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, అల్లం నారాయణ, పిల్లలమర్రి రాములు, కె. శ్రీనివాస్, కవి యాకుబ్, ఎం.రాఘవాచారి, డాక్టర్ సిల్మానాయక్, వెల్దండి శ్రీధర్, ప్రొఫెసర్ కమలాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

ఆదివాసీ హక్కుల పోరాట సమితి డిమాండ్

పంజగుట్ట: ఆదివాసీలకు మృత్యుపాశంలా మారిన ఛత్తీస్‌గఢ్ కర్రిగుట్టలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికే కర్రిగుట్టలో రక్తం ఏరులై పారుతోందని, ఎంతోమంది అమాయక గిరిజనులు ఆపరేషన్ కగార్‌లో చనిపోయారని, చాలామంది చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సిద్ధబోయిన లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడుతూ కేంద్రం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అడవుల నుంచి అమాయక ఆదివాసీలను వెళ్లగొట్టి అడవులను స్వాధీనం చేసుకుని, అందులో ఉన్న నిక్షేపాలు బహుళజాతి, కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నంలో భాగమే ఆపరేషన్ కగార్ అని ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, మానవహక్కుల సంఘాలు జోక్యం చేసుకుని ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి అక్కడ నుంచి పోలీస్ బలగాలను బయటకు పంపాలని డిమాండ్ చేశారు. 1976 నుండి విద్యా, ఉద్యోగా, రాజకీయాల్లో లంబాడీ కులస్థులతో పోటీ పడలేకపోతున్నామని పేర్కొన్నారు. వెంటనే లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకే ఇవ్వాలని, ఐటీడీఏ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘా నాయకులు సాగబోయిన పాపారావు, తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గోడెం గణేష్, నాయకులు మెస్రం మోతీరం, రాజేందర్, పొదెం బాబు, దార్లబోయిన రమేష్ చందా రఘుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆదివాసీ నాయకులు

## అనారోగ్యంతో విదేశీ మహిళ మృతి

నిజాంపేట్: బ్రెజిల్‌కు చెందిన ఓ విదేశీ మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందింది. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒలివెరా దోస్ సాంటోస్ లూసియా గ్లెడ్ అలియాస్ లూసియా గాడ్స్ చౌబే(57) నిజాంపేట్‌లోని గ్రీన్ అవెన్యూలో నివసించేవారు. 2012లో ఒడిశాకు చెందిన సునీల్ చౌబేతో ఆమెకు వివాహమైంది. అయితే 2015లో వారు విడిపోయారు. ఆ తరువాత ఆమె పాస్టర్ ప్రభుదాస్ సహాయంతో జీవనం కొనసాగించారు. ఆమె డయాబెటిస్, కేన్సర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండేవారు. శుక్రవారం పాస్టర్ ఆమెను పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా, ఆమె తిరస్కరించింది. శనివారం ఉదయం పాస్టర్ ప్రభుదాస్ ఆదేశం మేరకు కిషోర్ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుతో కలిసి ఆమె ఇంటికి వెళ్లగా మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే వారు 108కు సమాచారం అందించారు. డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఆమె మరణానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

## రైల్వేస్టేషన్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శనివారంరాత్రి పోలీసు బలగాలు కవాతు (ఫ్లాగ్ మార్చ్) చేశాయి. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసుల నేతృత్వంలో నిర్వహించిన తనిఖీల్లో బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ తదితర బృందాలు స్టేషన్ ఆసాంతం తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లతోపాటు వెయిటింగ్ హాళ్లు, రైలు బోగీల్లో తనిఖీలు నిర్వహించారు. అధునాతన పాపిల్లాన్ పరికరాలు వినియోగించిన పోలీసులు అనుమానిత వ్యక్తులు, లగేజీలను సోదాలు చేశారు. ఇన్‌స్పెక్టర్లు బీఎస్ సారస్వత్, బి.సాయీశ్వర్‌గౌడ్, ఎస్ఐ వెంకటరెడ్డి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీలుగానే పోలీసులు చెబుతున్నా పహల్గాం ఘటన అనంతరం ప్రత్యేక బలగాలు రైల్వేస్టేషన్‌లో మోహరించడం, కవాతులు చేస్తుండటం, స్టేషన్ పరిసరాలను జల్లెడ పడుతుండటంతో తనిఖీలకు ప్రాధాన్యత సంతరించుకుంది.



## 12 ఎకరాల స్థలం ప్రజోపయోగార్థమే: పొన్నం



కబ్జా బారి నుంచి కాపాడిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ప్రభాకర్, మేయర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయం ముందు కబ్జా చెర నుంచి విడిపించి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజోపయోగార్థం వినియోగించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు 102/1 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జాకు గురికావడంతో రికార్డుల ఆధారంగా రెవెన్యూ అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిలతో కలిసి శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. రూ.1,200 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వస్థలాలు కబ్జాకు గురైతే ప్రజలు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న భూమిని ప్రజలకు ఉపయోగపడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ధరణి తర్వాత భూభారతి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైనట్లయితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సినిమాలకే గద్దర్ అవార్డులు ఇవ్వాలి



తెలంగాణ సినిమా వేదిక(టీసీవీ) డిమాండ్

హిమాయత్‌నగర్: తెలంగాణ సినిమాలకే గద్దర్ అవార్డులు ఇవ్వాలని తెలంగాణ సినిమా వేదిక( టీసీవీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆంధ్ర సినిమాలకు గద్దరన్న అవార్డులు ప్రకటిస్తే అడ్డుకుంటామని హెచ్చరించింది. తెలంగాణ సినిమా అభివృద్ధే లక్ష్యంగా టీఎస్‌వీ ఆవిర్భావ సభ శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా టీసీవీ గౌరవ సలహాదారు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డితో కలిసి కన్వీనర్ లారా, కో–కన్వీనర్ మోహన్ బైరాగి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలని కోరారు. ఫిలిం చాంబర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తామే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం చిన్న సినిమాలను ఆదుకోవాలని, తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సినిమా రంగంలో ఆంధ్ర ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. సినిమా, జానపద అనేక కళా రంగాల్లో తెలంగాణ వెనుకబడి ఉందని వివరించారు. కడుపు మాడ్చుకొని కళానైపుణ్యంతో నటనను నమ్ముకుని ఫిలింనగర్‌లో వీధుల వెంట తిరుగుతున్న తెలంగాణ యువతకు సినిమా అవకాశాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా కళాకారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం



తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: మేడ్చల్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2025 పోటీలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. శనివారం భాగ్యశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీలను ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, నాగేష్ ముదిరాజు, మట్టి శ్రీను, పిట్ల రాజు, పోచయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ప్రక్షాళన!

- కమిషనరేట్‌లో వెలుగుచూస్తున్న కేసులపై సీపీ దృష్టి
- అవినీతి ఆరోపణలొచ్చిన పోలీసులు ఔట్
- నిజాయితీ, క్రమశిక్షణ ఉన్న అధికారులకే అందలం
- అంతర్గత విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ప్రక్షాళనకు సీపీ అవినాష్ మహంతి నడుం బిగించారు. ఇటీవల సైబరాబాద్ పోలీసు సిబ్బందిపై వరుస అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సీపీ అప్రమత్తమయ్యారు. బాలానగర్, షామీర్‌పేట, మొయినాబాద్ ఠాణాలలో పనిచేస్తున్న పలువురు సిబ్బందిపై బాధితుల నుంచి డబ్బుల డిమాండ్, స్టేషన్ బెయిల్ కోసం లంచం , భూమి సెటిల్మెంట్లు వంటి పలు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో సైబరాబాద్ కమిషనర్ సీరియస్ తీసుకున్నారు. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారులపై అంతర్గత విచారణకు ఆదేశిస్తున్నారు. నిజానిజాలు నిగ్గు తేల్చి అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. నిజాయితీ, క్రమశిక్షణ గల అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తున్నారు.

**సెటిల్మెంట్స్..**

ఎలాంటి వివాదమైనా బాధితులు ఆశ్రయించేది పోలీసులనే. దీన్ని కొందరు పోలీసులు ఆసరాగా తీసుకుంటున్నారు. సైబరాబాద్‌లో రియల్ ఎస్టేట్ శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో భూతగాదాలు సహజమే. కబ్జాదారులతో కొందరు పోలీసులు చేతులు కలిపి రివర్స్ కేసులు బనాయిస్తున్నారు. ముఖ్యంగా నగర శివారుల్లోని పోలీసు స్టేషన్ల పరిధిలోని సివిల్ తగాదాలలో తలదూర్చడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం కొందరు ఖాకీలకు వ్యసనంగా మారింది. ఎక్కడికి బదిలీ చేసినా తమకున్న పరపతితో వీటిని చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇంకొందరు సిబ్బంది ఏకంగా ప్రైవేట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని మరీ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకుంటున్నా..**

అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకున్నప్పటికీ కొందరు అధికారులు ప్రవర్తన మార్చుకోవడం లేదు. గాడ్ ఫాదర్ ఉన్నాడులే అనే ధైర్యంతో అక్రమాలను అలాగే కొనసాగిస్తున్నారు. కొన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు సెటిల్మెంట్ హెడ్‌లుగా మారుతున్నారనే ఆరోపణలున్నాయి. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులను హెచ్చరించిండమే కాకుండా కేసులు నమోదు చేస్తామని వారినే బెదిరిస్తున్నారు. కొంత మంది ఏజెంట్లు పోలీసు అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ దందాలకు పాల్పడుతున్నారు. వచ్చిన సొమ్ములో పోలీసులకు వాటాలు ముట్టజెబుతూ కాలం వెల్లదీస్తున్నారు.

## ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు

సంగీత, నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి

హిమాయత్‌నగర్: శ్రీ త్యాగరాజ స్వామి 258వ జయంతి వేడుకలు నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కర్ణాటక సంగీత కచేరి, పంచరత్న కృతుల ఆరాధన కార్యక్రమం కన్నుల విందుగా జరిగింది. విద్యార్థుల కర్ణాటక సంగీత గాత్ర కచేరి, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ జస్టిస్ నరసింహారెడ్డి, మృదంగ కళాకారుడు ఎల్లా వెంకటేశ్వర రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నృత్యం చేసిన కళాకారులను, గాత్రం చేసిన విద్యార్థినీ విద్యార్థులను అతిథులు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఇలాంటి ఆహ్లాదం ఆనందాన్ని అందజేసే సాంస్కృతిక రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆనంద అనే త్యాగరాజ కీర్తనల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ జె.నర్సింహారావు, ఎ.వి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎల్.ప్రభాకర్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేదుల శాంతి, డైరెక్టర్ నారాయణరావు, లా కాలేజ్ ప్రిన్సిపాల్ వాణి, హైస్కూల్ ప్రిన్సిపాల్ వాణి, అన్ని విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మర్‌లో హిల్ స్టేషన్స్‌కి పెరిగిన టూర్లు





వేసవి తాపానికి నగరవాసులు విలవిల్లాడుతున్నారు. సూర్యుని భగభగలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు ఎండలు, మరోవైపు బంధించిన ఏసీ గదుల్లోని చల్లదనానికి, పని ఒత్తిడికి విసిగిపోయి ప్రకృతి సిద్ధమైన చల్లని ప్రదేశాల కోసం ఆరాటపడుతున్నారు. దూరప్రాంతాలకు రోజుల తరబడి టూర్లు చుట్టే అవకాశం లేనివాళ్లు.. వారాంతాల్లో హిల్ స్టేషన్స్‌కి సై అంటున్నారు. సొంత వాహనాలున్న నగరవాసులు అత్యధికంగా ఎంచుకుంటున్న 600కి.మీ పరిధిలోని హిల్ స్టేషన్స్ విశేషాలివే.. - సాక్షి, సిటీబ్యూరో

- సమ్మర్‌లో హిల్ స్టేషన్స్‌కి పెరిగిన టూర్లు
- కూల్ వెదర్ కోసం సిటిజనుల ఆరాటం
- నగరం నుంచి కొన్ని ప్లేసెస్‌కు ఫుల్ డిమాండ్
- వారాంతాల్లో షార్ట్ విజిట్స్‌కు సిటీ కూల్ లిస్టులు

# హిల్.. టు చిల్..

చల్లని ప్రాంతాలకు చలో అంటున్న నగరవాసులు



## ఫ్యామిలీతో అలా.. చ'లోనావాలా'..

మహారాష్ట్రలోని పూణే జిల్లాలోని అందమైన హిల్ స్టేషన్ లోనావాలా? పచ్చని లోయలతో నిండిన ఈ ప్రదేశం కుటుంబ విహారయాత్రలకు అనువైనది. విభిన్న రకాల చిక్కీ (పప్పులతో చేసే బెల్లం మిఠాయి)లకు పేరొందింది. అందమైన పురాతన బౌద్ధ దేవాలయాలను, కార్లా గుహలు భాజా గుహలు చూడవచ్చు. నగరం నుంచి సుమారు 600కి.మీ దూరంలో ఉంది. ఇవి కాక పుణ్యక్షేత్రం, భూషి ఆనకట్ట, డ్యూక్స్ నోస్ పీక్, వాల్వాన్ ఆనకట్ట, విసాపూర్ కోట, ఏక్వీరా దేవి ఆలయాలు సందర్శనకు అనువైనవి.

పశ్చిమ కనుమల్లో ఉన్న దండేలి, నగరానికి సమీపంలోని బెస్ట్ హిల్ స్టేషన్లలో ఒకటి. పచ్చని ప్రకృతి, చల్లదనంతో ఏడాది పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. ముఖ్యంగా వైట్ వాటర్ రాఫ్టింగ్, రివర్ రాఫ్టింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, వన్యప్రాణుల సఫారీలు వంటి కార్యకలాపాల్లో పాల్గొనే సాహస ప్రియులు దీనిని ఎంచుకుంటున్నారు. ఇది నగరం నుంచి సుమారు 550కి.మీ దూరంలో కర్ణాటక రాష్ట్రంలో ఉంది. దీనికి దగ్గరలోనే మురుడేశ్వర్, గోకర్ణ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి.

## పొల్యూషన్ నిల్.. ప్రకృతి ఫుల్..

బహుశా దేశంలోనే అత్యంత కాలుష్యరహిత హిల్‌స్టేషన్ మహారాష్ట్రలో ఉన్న మాథెరన్. సముద్రమట్టం నుంచి 2,625 అడుగుల ఎత్తులో ఉన్న మాథెరన్ లోకి అత్యవసర వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. ప్రధాన రవాణాగా చేతితో లాగే రిక్షాలు, గుర్రపు బగ్గీలు ఉంటాయి. ఈ హిల్ స్టేషన్‌లో బ్రిటిష్ తరహా వాస్తుశిల్పం కనిపిస్తుంది. ఈ ప్రాంతాన్ని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పర్యావరణ–సున్నిత ప్రాంతంగా ప్రకటించింది. ఇది విభిన్న వృక్ష, జంతుజాలానికి నిలయం. నీలగిరి వుడ్ పీజియన్, వైట్–రంప్డ్ షామా, బ్రౌన్ వుడ్ గుడ్లగూబ, సౌత్ ఇండియన్ ట్రీ ష్రూ ది జెయింట్ స్క్విరెల్ వంటి అనేక అరుదైన జాతులు కనిపిస్తాయి. ఇది నగరం నుంచి 650కి.మీ దూరంలో ఉంది.

## చలో చిక్‌మంగళూరు..

మరో చల్లని హిల్ స్టేషన్ కర్ణాటకలోని చిక్‌మంగళూరు. ఇది దేశంలోనే అతిపెద్ద కాఫీ ఉత్పత్తి జరిగే ప్రాంతం. తాజా కాఫీ పరిమళాలను ఆస్వాదిస్తూ ఈ కొండ ప్రాంతంలో షికారు చేయవచ్చు. ఇక్కడ ఉన్నప్పుడు ఈ భూమిలోని కాఫీ తోటల మధ్య ఓదార్పునిచ్చే నడకను ఖచ్చితంగా ఎంచుకోవచ్చు. కొన్ని కాఫీ ఎస్టేట్‌లు గైడెడ్ టూర్‌లను అనుమతించనప్పటికీ, గెస్ట్ హౌస్ ఉన్నవి మాత్రం రాత్రి బస చేయడానికి మనల్ని అనుమతిస్తాయి. మన ఉదయాలను కాఫీ సువాసనతో నింపుతాయి. ఇది నగరం నుంచి 650కి.మీ దూరంలో ఉంది.


## ప్రకృతి సంపదకు.. పంచ'గని'..

మహారాష్ట్రలో ఉన్న పంచగని, అందమైన సూర్యాస్తమయం/సూర్యోదయ ప్రదేశాలకు ప్రసిద్ధి చెందింది. సుందరమైన ప్రకృతిని కోరుకునే నగరవాసులు విశ్రాంతి కోసం దీనిని ఎంచుకుంటున్నారు. ఈ హిల్‌స్టేషన్ నగరం నుంచి 570 కి.మీ దూరంలో ఉంది. సాహస క్రీడల్లో పాల్గొనే అవకాశంతో పాటు స్థానికంగా పండే స్ట్రాబెర్రీలను ఆస్వాదించవచ్చు. పార్సీ పాయింట్, టేబుల్ ల్యాండ్ వంటి సందర్శనీయ స్థలాలున్నాయి.



## సెల్ఫ్ డ్రైవింగ్‌తో జాగ్రత్త..

పర్వత ప్రాంతాల్లో డ్రైవింగ్ అంటే అనుకున్నంత సులభం కాదు. సాధారణ రోడ్లపై డ్రైవింగ్‌కు, పర్వత ప్రాంతాల్లో డ్రైవింగ్‌కు వ్యత్యాసముంటుంది. పర్వత ప్రాంతాల్లో డ్రైవింగ్ అంటే థ్రిల్లింగ్, అయితే అనుభవం ఉండాలి. పర్వత ప్రాంతాల్లో ఘాట్ రోడ్లు ఇరుగ్గా, మలుపులతో ఉంటాయి. సాధ్యమైనంతవరకూ నెమ్మదిగా డ్రైవ్ చేయాలి. రోడ్డుని బట్టి కారు స్పీడ్ ఉండాలి. గరిష్ఠంగా 40 కిలోమీటర్ల వేగం ఉండటం మంచిది. లేకపోతే నియంత్రణ కోల్పోయే ప్రమాదముంది. అలసటగా ఉన్నప్పుడు సుదూర ప్రయాణాలు చేయకూడదు. ఏమాత్రం అలసినట్టు అనిపించినా ఆగి విశ్రాంతి తీసుకోవాలి. మరీ ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో డ్రైవింగ్ చేసేటప్పుడు ఓవర్‌టేక్ చాలా ప్రమాదకరం. దీంతో పాటు కండీషన్‌లో ఉన్న వాహనాన్ని మాత్రమే ఎంచుకోవాలి.





# 'ఇనార్బిట్'లో వింధ్య గోల్డ్ బార్ చాలెంజ్

## సినీనటి అనన్య నాగళ్ల సందడి



**మాదాపూర్ :** మాదాపూర్ ఇనార్బిట్ మాల్‌లో వింధ్యగోల్డ్ బార్ చాలెంజ్ కార్యక్రమం శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ టాలీవుడ్ నటి అనన్య నాగళ్ల హాజరై సందడి చేశారు. గోల్డ్‌బార్ ఛాలెంజ్ బలం, నైపుణ్యాన్ని పరీక్షించే ఒక ఆట. ఇందులో పాల్గొనే వారు నిర్ణీత సమయంలో ఒక చేతిలో లాక్ చేయబడిన బాక్స్ నుంచి బంగారు బార్‌ను బయటకు తియ్యాలి. విజేతలుగా నిలిచిన వారికి ఆకర్షణీయమైన బహుమతులను అందజేశారు.

# హైదరాబాద్ చేరుకున్న మిస్ కెనడా

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో భాగస్వాములయ్యేందుకు వివిధ దేశాల నుంచి ప్రతినిధులు నగరానికి చేరుకుంటున్నారు. ఇందులో భాగంగా మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ విమానాశ్రయానికి శనివారం చేరుకున్నారు. ఆమెకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అధికారులు స్వాగతం పలికారు. పోటీలో పాల్గొనేవారు ఈ నెల 6 నుంచి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.



## ఎపిథెలియా క్లినిక్‌లో

# రెజీనా సందడి



**రాయదుర్గం:** నానక్‌రాంగూడలో ఎపిథెలియా క్లినిక్ ప్రారంభ కార్యక్రమంలో టాలీవుడ్ తారలు మెరిశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో టాలీవుడ్ నటి రెజీనా కసాండ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. తనదైన శైలిలో ఆమె అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎపిథెలియా క్లినిక్ అంటే అందం కాదని, ఇది ఆత్మవిశ్వాసం, శాస్త్రం, స్వీయ సంరక్షణను కలగలిపినదన్నారు. ప్రపంచ స్థాయి టెక్నాలజీని హైదరాబాద్‌కు తీసుకొచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. డెర్మటాలజీ, ట్రైకాలజీ సేవలను అందిస్తున్నట్లు వివరించారు.అనంతరం పలువురు వైద్యులు, వెల్‌నెస్ నిపుణులు, హైనెట్ వర్త్ వ్యక్తులు పాల్గొని నిపుణుల బృందంతో ముఖాముఖి నిర్వహించారు. ప్రపంచస్థాయి చర్మ, జుట్టు సంరక్షణ కోసం నగరవాసుల మొట్టమొదటి ఎంపికగా మారుతుందన్నారు.

## పారిస్ ఫ్యాషన్ వీక్‌లో

# నగర ప్రతిభ

ప్రదర్శనలో హామ్స్ టెక్ కళాశాల విద్యార్థుల కలెక్షన్

**సాక్షి, సిటీబ్యూరో:** నగరానికి చెందిన ప్రముఖ హామ్స్ టెక్ కాలేజ్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించారు. హామ్స్ టెక్ ప్రాంగణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అజితారెడ్డి ఈ విషయాన్ని వెల్లడిస్తూ తమ విద్యార్థులను అభినందించారు. ఇటీవల ముగిసిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో కలెక్షన్లను ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వేదికపై తమ విద్యార్థులు తమదైన ముద్ర వేశారని, ఫ్యాషన్ శైలికి రాజధాని లాంటి పారిస్‌లో తమ డిజైన్ వర్క్‌ను ప్రదర్శించే అవకాశం విద్యార్థి దశలోనే దక్కడం అరుదైన విశేషమన్నారు. ప్రతిష్టాత్మక రన్ వే దగ్గర గడిపిన ప్రతి క్షణం విద్యార్థులకు ఒక మాస్టర్ క్లాస్‌గా ఆమె పేర్కొన్నారు. ఈ ఫ్యాషన్ వీక్ లో విద్యార్థులు ప్రొఫెషనల్ మోడల్స్ స్టైలిస్ట్‌లతో కలిపి పనిచేశారని, తద్వారా ప్రపంచ మార్కెట్‌కు సంబంధించిన ప్రాక్టికల్ అనుభవాన్ని పొందారన్నారు. ఈ పారిస్ షో.. విద్యార్థులకు ఒక అద్భుత అవకాశమన్నారు.





# నగరంలో టమాటా ఫెస్టివల్

- స్పెయిన్‌లోని లా టమాటినా స్ఫూర్తి
- 11న ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో

**లక్డీకాపూల్ :** వేసవి వినోదం పంచేందుకు నగరం అరుదైన వేడుకకు ఆతిథ్యమిస్తోంది. స్పెయిన్‌లో ప్రసిద్ధిగాంచిన 'లా టమాటినా' స్ఫూర్తితో మన దగ్గరఅదే తరహా ఫెస్టివల్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యమివ్వడం ద్వారా ప్రపంచం దృష్టికి చేరిన హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయ లా టమాటినా పోటీలతో మరింత మారుమోగనుంది. ఈ నెల 7 నుంచి మే 31 వరకూ హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రదేశాల్లో ఈ అంతర్జాతీయ అందాల పోటీలు జరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల నుండి అందాల భామలు ఈ పోటీలో తలపడనున్నారు. ఈ నేపథ్యంలోనే నగరవాసులను మరింత ఉల్లాసపరిచే దిశగా అంతర్జాతీయ ప్రమాణాలతో టమాటా ఫెస్ట్ జరగనుంది. ఈ నెల 11న టమాటా ఉత్సవాన్ని నగర శివారు ప్రాంతంలోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా లైవ్ డిజే సంగీతం, నృత్య ప్రదర్శనలు, ఫన్ జోన్స్ వంటి వినోదాన్ని పంచేందుకు నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. మొత్తానికి ఈ ఫెస్టివల్ ఎండలతో అల్లాడుతున్న హైదరాబాదీలకు సరికొత్త అనుభవాన్ని అందించనుంది. కాగా ఫెస్టివల్‌లో ఉపయోగించే టమాటాలను వృథా కాకుండా ఎరువుగా రీసైకిల్ చేసి రైతులకు అందించనున్నారు.

# నృత్యవైభవం

నాలుగు నాట్య రూపాల్లో 150 మందికి పైగా కళాకారుల ప్రదర్శన

## ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రతిధ్వనించిన మువ్వల సవ్వడి

**సనత్‌నగర్/అమీర్‌పేట :** ఒకవైపు కూచిపూడి, కథక్.. మరోవైపు భరతనాట్యం, ఆంధ్రనాట్యం.. ఇలా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాశస్త్యం పొందిన నృత్యరూపాలన్నీ ఒక్కచోట చేరి అహూతులను అలరించాయి. బేగంపేటలోని సెస్ ఆడిటోరియం వేదికగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మువ్వల సవ్వడి ప్రతిధ్వనించింది. దాదాపు 20 అకాడమీలకు చెందిన 150 మందికి పైగా నృత్య కళాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. భారతీయ సంప్రదాయ నృత్యానికి, సాంస్కృతిక కళా రూపాలకు పెద్ద పీట వేసే లక్ష్యంతో అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినోద్ అగర్వాల్, కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత, ఆంధ్ర నాట్య గురువు కళాకృష్ణ అతిథులుగా హాజరయ్యారు. ఇంతమంది కళాకారులను ఒక్కచోటకు తీసుకురావడం, ఇన్ని రకాల కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శించడం నాట్య కళకు తిరిగి ప్రాణం పోయడమేనన్నారు. అమృత కల్చరల్ ట్రస్టు నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. న్యాయ నిర్ణేతలు శిరూషా అమర్, పద్మ దెందలూరి, వనశ్రీ పొద్దుటూరు, వీణా గణేష్, సునీలా గొల్లపూడి, సుష్మా ఉదయ్ మహంతి, చైతన్య కుసుమప్రియలు వివిధ అంశాలను బేరీజు వేసి విజేతలను ఎంపిక చేశారు. ముద్ర, అభినయం, బృంద స్ఫూర్తి, ప్రేక్షకుల నుంచి స్పందన, వస్త్రాలంకరణ, డిజిటల్ స్పాట్‌లైట్ లాంటి విభాగాల్లో పలువురికి అవార్డులు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజేష్ పగడాల, భార్గవి పగడాల పాల్గొన్నారు.



## క్లుప్తంగా...

### సీడబ్ల్యూసీ తీర్మానం గర్వకారణం

- ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనను అభినందిస్తూ.. జాతీయస్థాయిలో రాష్ట్ర మోడల్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించడం ఎంతో గర్వకారణమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన కులగణన ప్రక్రియలో భాగస్వాములైన మంత్రివర్గం, అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఆయన శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని రద్దు చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనారిటీలకు రిజర్వేషన్ల కోసం ఆర్టికల్ 15(5)ని తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ఐఎస్ఐ తీవ్రవాదుల అడ్డాగా నల్లగొండ

- ఎంపీ రఘునందన్‌రావు ఆరోపణ



నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ఐఎస్ఐ తీవ్రవాదులకు నల్లగొండ అడ్డాగా మారిందని, దేశంలో ఎక్కడేం జరిగినా నల్లగొండలోనే షెల్టర్ ఉంటుందనే ప్రచారం ఉందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. ఆయన శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విదేశీయులను గుర్తించి పంపించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను ఆదేశించారని ఆయన గుర్తు చేశారు. మెదక్ మదర్సాలో జరిగిన సంఘటనను అధికార యంత్రాంగం పట్టించుకోదన్నారు. రాష్ట్రంలో ఏ మసీదుకి, చర్చికి మతిస్థిమితంలేని వ్యక్తులు వెళ్లరని, కేవలం హిందూ దేవాలయాలకు వెళ్తున్నారని పోలీసులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్.. పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేయడం మంచిదేనని, మదర్సాల ను కూడా సందర్శించి అక్కడ ఎవరున్నారు..? ఏం జరుగుతుంది..? అక్కడ ఏం చెబుతున్నారో విచారించాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో ఐఎస్ఐ తీవ్రవాదులు ఎంతమంది ఉన్నారో జిల్లా ఎస్పీ ప్రకటించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులున్నా.. రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, రఘునందన్ విమర్శించారు.

### కులగణనను తప్పుబడితే ప్రజలను అవమానించినట్లే

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను బీజేపీ నేతలు తప్పుపట్టడం.. రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నిస్సందేహంగా.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదైనా.. రాష్ట్రంలో చేపట్టిన కుల సర్వేలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు. ఇంటింటికి వెళ్లి.. ఏ కులానికి చెందినవారు ఎంత మంది ఉన్నారు? వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ పరిస్థితులు తదితర అంశాలను సమగ్రంగా తెలుసుకున్నట్లు వివరించారు. ఎంతో పకడ్బందీగా చేసిన సర్వేను తప్పుల తడకని బీజేపీ నేతలు విమర్శించడం .. తెలంగాణ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు.

### పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: బీఆర్ఎస్ డిమాండ్


సాక్షి, హైదరాబాద్: పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగిందని, ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, తుంగబాలు, వై.సతీశ్‌రెడ్డి, రాఘవేంద్రయాదవ్ కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దీపావళి సందర్భంగా హైదరాబాద్‌లో ఓ ఫైవ్ స్టార్ హోటల్లో సీసీఐ అధికారులు, ప్రముఖ ట్రేడర్స్ మధ్య జరిగిన రహస్య సమావేశంలో కుంభకోణానికి బీజం పడిందని ఆరోపించారు. 2024–25లో 49 లక్షల బేల్స్ పత్తి పంట పండితే...సీసీఐ కొన్నది మాత్రం 41 లక్షల బేల్స్ మాత్రమేనని వారు ధ్వజమెత్తారు. 80 శాతం పంటను సీసీఐ కొనుగోలు చేసిందని రికార్డుల్లో ఉంటే.. రైతుల నుంచి కొన్నది 20 శాతమేనని, మిగతాది అంతా సిండికేట్‌గా ఏర్పడి సీసీఐకి అమ్ముకున్నారని విమర్శించారు. పౌర సరఫరాల శాఖలో టెండర్ల కుంభకోణంలో సీఎం, మంత్రి ఉత్తమ్ హస్తం ఉందని వారు ఆరోపించారు.

### ఇబ్బంది రాకుండా కులగణన

- ప్రధానికి 'వకుళాభరణం' విన్నపం

సాక్షి, హైదరాబాద్: న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా కులగణన నిర్వహించాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన లేఖ రాశారు. ఇతర కులాల గణనకు చట్టంలో స్పష్టత ఇవ్వాలని, గోప్యత హక్కు ప్రకారం సమాచారం రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# విదేశీ విద్యలో బీసీలకు కత్తెర




**ఫూలే విద్యానిధి కోటా పెంపుపై చేతులెత్తేసిన బీసీ సంక్షేమ శాఖ**

- అర్హుల పరిమితి పెంచుతామంటూ ఏడాదిన్నరగా ఎంపిక జాబితాలు నిలుపుదల
- తాజాగా పాత కోటా ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ
- పథకం కింద అర్హత సాధిస్తామనుకున్న అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన
- అప్పులు చేసి ఫీజులు చెల్లించిన వారి పరిస్థితి అగమ్యగోచరం

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా ఫూలే విదేశీ విద్యానిధి పథకం కోటా పెంపుపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ చేతులెత్తేసింది. ఈ పథకం కింద వెయ్యి మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తామంటూ ఏడాదిన్నరగా చెప్పుకొచ్చిన బీసీ సంక్షేమ శాఖ.. తాజాగా పరిమిత కోటాతోనే పథకానికి ఎంపికైన అర్హుల జాబితా విడుదల చేసింది. ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో కేవలం 300 మంది మాత్రమే అర్హత సాధించారు. దీంతో పథకం కింద లబ్ధి కలుగుతుందని ఎన్నో ఆశలతో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను తాజా అర్హుల జాబితా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మహాత్మా జ్యోతిబా ఫూలే విదేశీ విద్యానిధి పథకం కింద ఏటా 300 మందిని బీసీ సంక్షేమ శాఖ ఎంపిక చేస్తుంది. ఎంపికైన ఒక్కో లబ్ధిదారుకు రూ.20 లక్షల వరకు గరిష్ఠంగా ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ మొత్తాన్ని లబ్ధిదారు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర శాఖలతో పోలిస్తే కోటా తక్కువగా ఉండటంతో కనీసం వెయ్యి మందికి అవకాశం కల్పించాలని బీసీ సంఘాలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులు వెల్లువెత్తడంతో బీసీ సంక్షేమ శాఖ ఈ పథకం కింద కోటాను పెంపు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ క్రమంలో 2023, ఆగస్టు నుంచి దరఖాస్తుల స్వీకరణ తప్ప ఎంపిక ప్రక్రియ పూర్తిచేయకుండా నిలిపివేసింది.

**ముగింపు దశలో కోర్సు..**

విద్యానిధి పథకం కింద సంక్షేమ శాఖలు ప్రతి విద్యా సంవత్సరం రెండుసార్లు దరఖాస్తులు స్వీకరిస్తాయి. ఫాల్ సీజన్‌లో భాగంగా ఆగస్టు–సెప్టెంబర్‌లో, స్ప్రింగ్ సీజన్‌లో భాగంగా జనవరి–ఫిబ్రవరిలో దరఖాస్తులు స్వీకరించి వాటిని నెలరోజుల్లో పరిశీలన చేసి అర్హతలు నిర్ధారిస్తాయి. అర్హత సాధించిన విద్యార్థులకు ప్రయాణ ఖర్చుల కింద రూ.50 వేలు కూడా ప్రభుత్వం అదనంగా చెల్లిస్తుంది. ఈ క్రమంలో 2023 ఫాల్ సీజన్‌లో, 2024 స్ప్రింగ్ సీజన్‌లో 6 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల అనంతరం మెరిట్ జాబితాలను ప్రకటించిన బీసీ సంక్షేమశాఖ.. తుది జాబితాను విడుదల చేయలేదు. పథకం కింద వెయ్యి మందికి అవకాశం కల్పిస్తామని అధికారులు పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. కోటా పెంపు ప్రతిపాదనలు సీఎం వద్దకు చేరాయని, ఆదేశాలు వచ్చిన తర్వాత తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. కానీ తుది జాబితా విడుదల ఏడాదిన్నర ఆలస్యమైంది. ఇంతలో మెరిట్ జాబితాను పరిశీలించుకుని అంచనాకు వచ్చిన పలువురు విదేశాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. వీరిలో 2023 ఫాల్ సీజన్‌లో దరఖాస్తు చేసుకున్న పలువురు విద్యార్థులు ఒకట్రెండు నెలల్లో కోర్సు కూడా పూర్తి చేసుకోనున్నారు. మరి కొందరు కోర్సు చివరి దశకు చేరుకున్నారు. అయితే ఇంత కాలం తుది జాబితా విడుదలను నాన్చిన బీసీ సంక్షేమ శాఖ.. తాజాగా గతంలో నిర్దేశించిన కోటా ఆధారంగా 300 మంది విద్యార్థులనే ఎంపిక చేస్తూ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

**ఆశలపై నీళ్లు..**

బీసీ ఓవర్సీస్‌విద్యానిధి పథకం కింద కోటా పెరుగుతుందనే ప్రచారంతో ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ప్రక్రియ తర్వాత మెరిట్ జాబితాను విడుదల చేయగా.. చాలామంది మెరిట్‌లో ముందున్నామన్న భావనతో విదేశాల్లో పీజీ కోర్సులో చేరారు. కొంతమంది విద్యార్థుల ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగానే ఉన్నా.. అర్హత సాధిస్తామన్న నమ్మకంతో అప్పులు చేసి విదేశాలకు వెళ్లిపోయారు. కోటా పెంపు చేయకపోవడంతో మెరిట్‌లో ఉన్న వారికి అవకాశం దక్కకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. విదేశాల్లో పీజీ కోర్సు కోసం ఒక్కో విద్యార్థికి సగటున రూ.30 లక్షలకు పైబడి ఖర్చు చేశామని, ప్రభుత్వ సహకారం అందుతుందని కోర్సులో చేర్చామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటా పెంపు చేసే పరిస్థితి లేదని తెలిస్తే విదేశాలకు పంపించేవారమే కాదంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

## కాంగ్రెస్ కుల సర్వేతో బీసీలకు అన్యాయం

- రేవంత్ సర్కారు చేసింది కులాల సర్వే మాత్రమే
- బీఆర్ఎస్ నేతలు ఒకరు రిటైర్, మరొకరు లీవ్, ఇంకొకరు రెస్టులో..
- 5న రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల రోడ్ల పనులకు శ్రీకారం
- ప్రారంభించనున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ కులాల సర్వేతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి.. బీసీలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చట్టం ఆధారంగా జనాభా లెక్కలతోపాటు పక్కాగా కులగణనను చేపట్టనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. 'బీఆర్ఎస్ నేతల్లో ఒకరు రిటైర్మెంట్‌లో ఉన్నారు. ఒకరు లీవ్‌లో ఉన్నారు. ఒకరు నడుము విరగ్గొట్టుకొని రెస్టులో ఉన్నారు (కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఉద్దేశించి)'అని ఎద్దేవా చేశారు.

**5న రూ.5 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు**

ఈ నెల 5న ఆదిలాబాద్, హైదరాబాద్‌లో రూ.5,416 కోట్లతో చేపట్టిన 26 ప్రాజెక్టుల పనులకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. తెలంగాణతో ముడిపడి ఉన్న 5 కారిడార్ల నిర్మాణానికి కేంద్రం లక్ష కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. 2014 వరకు తెలంగాణలో 2,500 కి.మీ జాతీయ రహదారులుంటే, ప్రస్తుతం 5,200 కి.మీలకు పెంచామని వెల్లడించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత త్వరగా భూములను అప్పగిస్తే.. అంత వేగంగా రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారులు వెళ్తున్నాయని చెప్పారు.

గడ్కరీ పర్యటన షెడ్యూల్ ఇదీ..
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

## టైంపాస్ మీటింగ్‌లతో అలసిపోయాం

- కొత్త అధ్యక్షుడిని నియమించండి
- అధిష్టానంపై మరోమారు రాజాసింగ్ ధిక్కార స్వరం



సాక్షి, హైదరాబాద్: 'టైంపాస్ మీటింగ్‌లతో అలసిపోయాం.. కేంద్రానికి నా నివేదన ఏంటంటే.. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిని త్వరగా ప్రకటించాలి. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో మరో టైంపాస్ మీటింగ్ అంట. ఇవన్నీ వేస్ట్..'అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఆయన సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. కొంత కాలంగా రాష్ట్ర పార్టీ నాయకత్వంపై బహిరంగంగానే రాజాసింగ్ విమర్శలు చేస్తున్నారు. కేంద్రం జోక్యం చేసుకుని రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాలని, గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాలని వివిధ సందర్భాల్లో గళం వినిపిస్తున్నారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం మారుతుందంటూ కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. కొత్త అధ్యక్షునిగా 'ఈటల'పేరు వినిపిస్తోంది. కాగా, పేరును ప్రకటించడంలో అధిష్టానం తాత్సారం చేస్తోందని నాయకులు పేర్కొంటున్నారు. కిషన్‌రెడ్డి నాయకత్వంపై ఆదినుంచి రాజాసింగ్ వ్యతిరేకంగా ఉండటం తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త అధ్యక్షుడిని ప్రకటించండంటూ.. సామాజిక మాధ్యమాల్లో రాజాసింగ్ పెడుతున్న పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

## ప్రకృతి అసలైన సంరక్షకులు ఆదివాసీలే

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


ఆదివాసీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి అసలైన సంరక్షకులు ఆదివాసీలేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్పష్టం చేశారు. ఆదివాసీ తెగల జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా పర్యావరణ హిత పేపర్ ప్లేట్లు, కప్పులు తయారు చేసే యంత్రాలను ఆదివాసీ గ్రామాలకు పంపించారు. ఈ యంత్రాలను సరఫరా చేసే వాహనాలను శనివారం రాజ్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. గవర్నర్ డిస్క్రిషనరీ గ్రాంట్స్ నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన 32 మంది చెంచు యువత జీవనోపాధిలో భాగంగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయా తెగకు చెందిన యువతతో ముచ్చటించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డులు

- మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ తదితరులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామని, సర్వే ద్వారా కొత్త లబ్ధిదారులను ఎంపిక చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సన్న బియ్యం పంపిణీపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. జిల్లాలోని 653 రేషన్ దుకాణాల్లో తెల్ల రేషన్ కార్డున్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందాలని స్పష్టం చేశారు. జిల్లాలో 14,500 మెట్రిక్ టన్నులకు పైగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా.. ఇప్పటివరకు 2 రోజుల్లోనే 30 శాతానికి పైగా పంపిణీ చేశామన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియలో పౌర సరఫరాల శాఖకు జీహెచ్ఎంసీ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లా 6.39 లక్షల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో అదనపు రెవెన్యూ కలెక్టర్ ముకుంద రెడ్డి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రమేశ్, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా ఈ–సిటీ


శనివారం సచివాలయంలో వివిధ కంపెనీల ప్రతినిధులతో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి
- రూ.300 కోట్లతో సిరా నెట్‌వర్క్స్, 'ఎల్‌సీజీసీ' గ్రూప్ ఆధ్వర్యంలో పరిశ్రమ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో అంతర్భాగంగా ప్రత్యేకంగా 'ఎలక్ట్రానిక్ సిటీ'(ఈ–సిటీ)ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. టెలికాం ఉత్పత్తుల సంస్థలైన సిరా నెట్‌వర్క్స్ (తైవాన్), ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ (తెలంగాణ) ప్రతినిధులతో శనివారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో సంయుక్తంగా రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రెండు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. సుమారు 10 ఎకరాల్లో ఈ సంస్థలు ఏర్పాటు చేయబోయే పరిశ్రమ ద్వారా 2,500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని మంత్రి వెల్లడించారు. 5జీ నెట్‌వర్క్స్, మల్టీ లేయర్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను ఈ పరిశ్రమ తయారు చేస్తుందన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని మంత్రి శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వారికి వివరించారు. ఈ తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీజీఐసీసీ సీఈవో మధుసూదన్, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డొగియాస్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

**త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ**

రాష్ట్రంలో త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడమీలు నెలకొల్పుతామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ యువత శిక్షణకు ప్రాధాన్యమిచ్చేలా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. శనివారం మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కో–ఆర్డినేటర్ వెంకట రమణారెడ్డి.. మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు.


## పూర్తి నివేదిక దాఖలు చేయండి

**సాక్షి కథనంపై జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశం**

సాక్షి ఎఫెక్ట్

సిటీ కోర్టులు: జగిత్యాల జిల్లాలో 80 ఏళ్ల వృద్ధురాలిని కాళ్లు, చేతులు కట్టేసి అడవిలో వదిలేశారు. దీనిపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'అవ్వను అడవిలో వదిలేశారు'అనే శీర్షికతో వచ్చిన కథనంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ అంశంపై పూర్తి నివేదిక సమర్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ విచారణను జూన్ 4వ తేదీకి వాయిదా వేసింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన భూదవ్వ భర్త చాలాకాలం కిందట మరణించాడు. వీరికి ఒక కూతురు ఈశ్వరి ఉండగా ఆమెను నర్సింగాపూర్‌కు చెందిన రాజయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అయితే భూదవ్వ పేరిట జగిత్యాలలో ఉన్న ఎకరం భూమి, ఇంటిని కూతురు ఈశ్వరి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తర్వాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయేమో గానీ.. బుధవారం రాత్రి భూదవ్వ కాళ్లు, చేతులు కట్టేసి గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి వద్ద అడవిలో వదిలేశారు. గమనించిన స్థానికులు ఆమెను జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. అనంతరం సంబంధిత అధికారులు భూదవ్వ కూతురు అయిన ఈశ్వరికి ఫోన్ చేయగా తమకేం తెలియదని చెప్పడంతో అధికారులు షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారని శుక్రవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మానవ హక్కుల కమిషన్ వృద్ధురాలిపై మానసిక, ఆస్తికి సంబంధించిన వేధింపులకు పాల్పడినట్లు అనుమానించింది. దీంతో పూర్తి నివేదికను కమిషన్‌కు జూన్‌లో అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## రైతు బీమా ప్రీమియం ఆపడం అన్యాయం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రైతు కుటుంబాలను ఆదుకునేందుకు ఉద్దేశించిన రైతు బీమా పథకాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఫిబ్రవరిలో జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి చెల్లించాల్సిన రూ.775 కోట్ల ప్రీమియాన్ని నేటికీ చెల్లించలేదన్నారు. రైతుబంధు ఇప్పటికే ఎగవేసిన రాష్ట్ర ప్రభుత్వం, రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్నదీ లేనిదీ చెప్పాలని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పాలన గాలికి వదిలి గాలి మోటార్లలో చక్కర్లుకొట్టే ముఖ్యమంత్రి, మంత్రులకు రైతు కుటుంబాల కన్నీళ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వివిధ కారణాలతో గడిచిన మూడు నెలల్లో సుమారు వంద మందికిపైగా రైతులు చనిపోయినా బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో వారికి రైతు బీమా సాయం అందలేదన్నారు. బాధిత రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం వెంటనే చెల్లించి, రైతుబీమా పథకం ప్రీమియంను చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్రానికి మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం పని దినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గిస్తూ కోత విధించడం శోచనీయమని విమర్శించారు. 2024–25లో 12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, 2025–26 సంవత్సరంలో పనిదినాలను కేవలం 6.5 కోట్లకే పరిమితం చేయడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## గ్రామీణ రోడ్లకు 'హామ్'

- రోడ్ల సౌకర్యం లేని జీపీలు, అక్కడి నుంచి మండలాలు, జిల్లా కేంద్రాలకు రహదారులు
- ప్రతిపాదిత రోడ్లకు సంబంధించి ఉమ్మడి 9 జిల్లాల్లో 4 వేల కి.మీ. సర్వే పూర్తి



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు వాటి ఆధునీకరణకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హామ్) విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికీ రోడ్ల సౌకర్యం లేని గ్రామ పంచాయతీలకు రహదారి నిర్మాణం చేపట్టడంతోపాటు, జీపీల నుంచి మండల కేంద్రాలను కలుపుతూ జిల్లా కేంద్రాలకు అనుసంధానించే రహదారుల నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం కర్ణాటక, రాజస్తాన్ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఈ విధానం అమలవుతోంది. దీనిని అమలు చేయడం ద్వారా త్వరితగతిన గ్రామీణ రహదారుల నిర్మాణం పూర్తి చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టు కింద 17,300 కి.మీ. పొడవు గల పంచాయతీరాజ్ రోడ్లు 12 వేల కి.మీ. పొడవు గల ఆర్అండ్‌బీ రోడ్లను చేపట్టాలని నిర్ణయించారు. దీనిని చేపట్టేందుకు పీఆర్ ఇంజనీరింగ్ విభాగాన్ని నోడల్ విభాగంగా, కన్వీనర్‌గా ఈఎన్సీ పంచాయతీరాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రోడ్ల నిర్మాణానికి సంబంధించి కొంత వాటాను ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన వాటాను టెండర్ దక్కించుకునే కంపెనీలే భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి గ్యారంటీ ఉండదు. పదిహేనేళ్లపాటు సదరు కంపెనీ నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రణాళిక, సాంకేతిక, ఆర్థిక, న్యాయపరమైన అంశాల అధ్యయనానికి... ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు కన్సల్టెంట్లుగా ఆర్వీ అసోసియేట్స్, ఎల్ఈఏ అసోసియేట్స్‌ను టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసింది.

**సిద్ధమవుతున్న డీపీఆర్‌లు**

హామ్ ప్రాజెక్ట్ కోసం డీపీఆర్‌లను కన్సల్టెంట్లు సిద్ధం చేస్తున్నారు. దానికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించి కేబినెట్ ఆమోదం తీసుకుంటారు. దీనిపై కేబినెట్‌లో చర్చించాక ఈ ప్రాజెక్టు విధివిధానాల ఖరారు కానున్నట్లు పీఆర్ అధికారుల సమాచారం. అయితే సమయం వృథా కాకుండా సమాంతరంగా సర్వే కొనసాగుతోందని, ప్రతిపాదిత రోడ్లకు సంబంధించి ఉమ్మడి 9 జిల్లాల్లో ఇప్పటికే నాలుగు వేల కి.మీ. మేర సర్వే పూర్తయినట్టు వారు వెల్లడించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆమోదం పొందాక రహదారుల ప్రతిపాదనలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఖరారు చేస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను మూడుదశల్లో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2026 జనవరిలో మొదటి దశ పనులు, 2026 మార్చిలో రెండవదశ, 2026 జూన్‌లో మూడవ దశ నిర్మాణ పనులు ప్రారంభించాలని అనుకుంటున్నారు. తదనుగుణంగా కన్సల్టెంట్‌లు, అధికారులు అంచనాలు తయారు చేసి టెండర్లు, ఒప్పందాలు వివిధ పనులను త్వరితగతిన చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆయా అంశాలను పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా ఖరారైన రహదారుల నిర్మాణ పనులను జనవరి 2026న ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత టెండర్ ప్రక్రియను పంచాయతీరాజ్ శాఖ మొదలుపెట్టనుంది. ఇందుకు అనుగుణంగా నిర్దేశిత గడువులోపు హామ్ పనులు చేపట్టి పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. హామ్ పనుల పర్యవేక్షణకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫీస్‌లో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్టు సమాచారం.

## ప్రతిరోజూ 10 లక్షల మందికి 'ఉపాధి' పనులు

- డీఆర్డీవోలకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రతీరోజు పదిలక్షల మంది కూలీలకు పనికల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 9.45 లక్షల మందికి ప్రతీరోజు ఉపాధి కల్పిస్తున్నట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతీ గ్రామపంచాయతీ నుంచి రోజూ సగటున 75 మంది ఉపాధి కూలీలకు పని కల్పిస్తుండగా, ఆ సంఖ్యను వందకు పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను పీఆర్ఆర్డీ ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతీరోజు వందమంది కూలీలకు పని కల్పనతో పాటు అన్ని జీపీల్లో విధిగా ఉపాధి హామీ పనులు చేపట్టేలా సంబంధిత డీఆర్డీవోలు చర్యలు చేపట్టాలని శనివారం పీఆర్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. కాగా, వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని డీఆర్డీవోలకు పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన ఆదేశాలు జారీ చేసారు. కూలీలు సేదతీరేందుకు వీలుగా ఎండ తగలకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, తాగు నీటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మధ్యాహ్నం పనులు చేయించ రాదని, ఉదయం పూట, సాయంత్రం 4 తర్వాతే పనులు చేయించాలని ఆదేశించారు.

'నాలుగు పదుల వయసు దాటిన మహిళల్లో హార్మోన్లలో మార్పులు సహజం. అందుకే పోషకాహారాన్ని ప్లాన్ చేసుకోవడమే కాదు ఆరోగ్యానికి కొన్ని సప్లిమెంట్స్ వాడకం కూడా అవసరమే' అంటూ తన డైట్‌ప్లాన్‌ను వివరించారు బుల్లితెర నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అస్మిత కర్ణని. 'ఇరవై ఏళ్లుగా హెల్తీ డైట్ ప్లాన్ చేసుకున్నందుకే ఈ రోజుకీ హెల్తీగా ఉన్నాను' అని చెబుతున్నారు.

# ఫైబర్ ముందు... ప్రొటీన్లు తర్వాత


అస్మిత కర్ణని

'మైండ్ ప్రశాంతంగా ఉండాలంటే బాడీ కూల్‌గా ఉండాలి. నా శరీరానికి ఎలాంటి పోషకాలు అవసరమో తెలుసుకుంటూ, 20 ఏళ్లుగా డైట్ ప్లాన్ చేస్తున్నాను. రోజూ ఉదయం నట్స్, డ్రై ఫ్రూట్స్‌తో రోజును స్టార్ట్ చేస్తాను. వర్కౌట్స్ తర్వాత సలాడ్స్, ఫుడ్ సంప్లిమెంట్స్ తీసుకుంటాను. ఒక పూట భోజనానికే ప్రాముఖ్యత. 40 ఏళ్ల తర్వాత హార్మోన్లలో చాలా వేగంగా మార్పులు వస్తుంటాయి. మన ఆరోగ్యం హార్మోన్ల మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ రోజుల్లో ఆహారపదార్థాల్లో పోషకాలు బాగా తగ్గిపోయాయి. అందుకే నిపుణులు సూచించిన మెడికల్ న్యూట్రిషన్ సప్లిమెంట్స్ తీసుకుంటాను.

**బయటి ఫుడ్ తీసుకోను...**

లంచ్ టైమ్‌లో ఒక వరస క్రమాన్ని పాటిస్తాను. మొదట కడుపులోకి వెళ్లాల్సింది పీచుపదార్థాలు. అందుకని కూరగాయలతో చేసిన సలాడ్ ముందుగా తీసుకుంటాను. తర్వాత ప్రొటీన్ డైట్, ఆ తర్వాత కార్బోహైడ్రేట్స్ ఉన్న డైట్ తీసుకుంటాను. బయటి ఫుడ్ దాదాపు తీసుకోను.

**ఉప్పు... చక్కెర తక్కువ**

మన శక్తి స్థాయులు పెరగాలంటే ఉప్పు, పంచదార వాడకం బాగా తగ్గించేయాలి. అలా చేయడం వల్ల ఎనర్జీ ఏ మాత్రం తగ్గదు. సీజనల్ ఫ్రూట్స్‌ని ఎప్పుడూ వదులుకోను. వీటిని అరగంటసేపు నీటిలో నానబెట్టి, తీసుకుంటే రసాయనాల ప్రభావం తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్ సాయంత్రం 4:30 కి తీసుకుంటాను. తర్వాత బ్లాక్ కాఫీ. కాఫీ లేదా టీ పాలతో తీసుకుంటే బరువు పెరుగుతారు. అందుకని బ్లాక్ కాఫీ తీసుకుంటాను. సాయంకాలం ప్రొటీన్లు ఉండే ఆహారం తీసుకుంటాను. దీని వల్ల బరువు 70 కేజీలు ఉన్నా, సన్నగా కనిపిస్తాను. ప్రొటీన్ పౌడర్‌కి, యోగర్ట్, కొన్ని ఫ్రూట్స్ కూడా కలిపి తీసుకుంటాను. సూర్యాస్తమయం తర్వాత ఏదీ తినను. ఏడాది మొత్తం నా డైట్ చార్ట్ ఇలాగే ఉంటుంది.




**కండరాల బలానికి...**

వేసవిలో డీ హైడ్రేట్ అవకుండా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటాను. ఎప్పుడైనా లో ఎనర్జీ అనిపిస్తే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన చల్లని నీళ్లు తీసుకుంటాను. రోజులో 3–4 లీటర్ల నీళ్లు తాగుతాను. జనరల్ ఫిట్‌నెస్ కోసం వారంలో 2–3 సార్లు వర్కౌట్స్ చేస్తాను. దీనివల్ల బరువు కూడా మెయింటెన్ అవుతుంది. వృద్ధాప్యంలో కండరాల బలం కోల్పోకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే వాటికి పని పెట్టాలి. అందుకని వ్యాయామం తప్పనిసరి. అందం గురించి కాదు. ఆరోగ్యంగా ఉండాలనుకోవడం జీవితాంతం చేసే ప్రయాణం. అందుకు నా జీవనశైలిని కూడా ఫిక్స్ చేసుకున్నాను'' అని వివరించారు అస్మిత.

నిర్వహణ:
**నిర్మలారెడ్డి**



# బరువును తగ్గించే సీజన్

**వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతలు శరీరంలోని నీటిని ఆవిరి చేస్తుంటాయి. ఎన్నిసార్లు నీళ్లు తాగినా దాహం తీరదు. ఆకలిగానూ అనిపించదు. అలసట, నీరసంతో రోజంతా చికాకు. ఈ సమస్యలకు పరిష్కారం మన చేతిలోనే ఉందంటున్నారు పోషకాహార నిపుణులు సుజాతా స్టీఫెన్.**

'శరీరం త్వరగా డీ–హైడ్రేట్ అయ్యే కాలం ఇది. తినే పదార్థాల ఎంపిక సరిగా లేకపోతే జీర్ణవ్యవస్థ గాడి తప్పుతుంది. ఇలాంటప్పుడు...

- కూరగాయలతో చేసిన సలాడ్స్, సాంబార్, రసం.. వంటివి రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవాలి.
- రెండు గంటలకు ఒకసారి గ్లాసుడు నీళ్లు, వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అరగంటకు ఒకసారి నీళ్లు తాగాలి.
- అకస్మాత్తుగా తలనొప్పి, భావోద్వేగాలలో మార్పు, నీరసం, ఇరిటేషన్.. వంటివీ తలెత్తుతుంటాయి. దీనిని సైలెంట్ డీ–హైడ్రేషన్ సమస్యగా గుర్తించి నీళ్లు తాగి, కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి.
- నిమ్మరసం, సబ్జా గింజలతో తయారు చేసుకున్న లస్సీ ఒంటికి మేలు చేస్తుంది. నిమ్మరసంలో షుగర్‌కు బదులు కొద్దిగా ఉప్పు, సోడా కలుపుకొని తాగచ్చు.
- మధుమేహులు ఒకేసారి ఎక్కువ మొత్తం తింటే, శరీరంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. అందుకని టైమ్ ప్రకారం ఏదో ఒకటి మితంగా తినాలి.

**గర్భిణులకు ప్రత్యేకం**

ఈ కాలం గర్భిణులు ఏ కొంచెం తిన్నా ఆయాసం వస్తుంటుంది. ఇలాంటప్పుడు మసాలా ఉన్న ఆహారం కాకుండా పండ్లు, జ్యూసులు, సలాడ్స్ పైన దృష్టి పెట్టాలి. దీని వల్ల కడుపులో హెవీగా ఉన్నట్టు అనిపించదు. ఆయాసం సమస్య తలెత్తదు.

**వయసు పైబడిన వాళ్లు**

పగటివేళ ఎండగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిది. తప్పనిసరి అయితే వెంట నీళ్లు, పండ్లు తీసుకెళ్లాలి. డీ హైడ్రేట్ అయితే బీపీ డౌన్ అయ్యి కళ్లు తిరిగి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని వారి వెంట మరొకరు తోడుండాలి.

**రీ హైడ్రేషన్**

వేసవిలో యూరిన్ పసుపు రంగులో వస్తుందంటే శరీరంలో నీటిశాతం తగ్గిందని అర్థం. రీ హైడ్రేషన్ కోసం నీళ్లు, నిమ్మరసం సరైన ఎంపిక. ఫ్లేవర్డ్, షుగర్ లెస్ మెడికేటెడ్ ఓఆర్‌ఎస్‌లను ఎంచుకోవచ్చు.

**ఇది మంచి సీజన్**

- బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి సీజన్. వేడికి ఎక్కువ ఆహారం తినబుద్ధి కాదు.. పండ్లు, కూరగాయలు, జ్యూస్, నీళ్లు ఎక్కువ తీసుకుంటాం. ఇదంతా లో క్యాలరీ ఫుడ్. దీనివల్ల బరువు సులువుగా తగ్గచ్చు.
- వాకింగ్, జాగింగ్, వ్యాయామాలకు ఉదయం వేళ ఎంచుకోవడమే మంచిది.
- వేసవిలో పార్టీలకు వెళ్లినప్పుడు తినే మసాలా ఫుడ్స్ మరుసటి రోజు కూడా ప్రభావం చూపుతుంది. పడుకునేటప్పుడు మజ్జిగ తాగితే అసౌకర్యం తగ్గుతుంది.

**కూల్ సలాడ్**

- కీరా, దోస, పుదీనా, కొత్తిమీర, ఉల్లిపాయ, క్యాప్సికమ్ వంటివి సన్నని ముక్కలుగా తరిగి, నిమ్మరసం, ఉప్పు, మిరియాలపొడి కలిపి సలాడ్ తయారు చేసుకోవాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టి, రోజులో రెండు మూడుసార్లు తింటే, తేలికగా అనిపిస్తుంది.
- సొరకాయ జ్యూస్, పుదీనా, కొత్తిమీర షర్బత్‌లు, చట్నీలు, రాగి జావ వంటివి.. ఒంటికి మేలు చేస్తాయి.
- మాంసాహారులు తాజాగా తయారు చేసుకున్నవి, నూనె తక్కువగా ఉపయోగించినవి తీసుకోవాలి.



– సుజాతా స్టీఫెన్,
న్యూట్రిషనిస్ట్

---

'డాబా', 'మిద్దె', 'మేడ'... ఈ మాటలు పిల్లలకు తెలుసో లేదోగానీ వేసవి వస్తే ఊళ్ల నుంచి వచ్చిన కజిన్స్‌తో డాబా మీద చాపలు పరుచుకుని ఆకాశాన్ని చూస్తూ చల్లటి గాలిలో కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం పెద్ద లగ్జరీ. అనుబంధాలకు బేస్‌మెంట్. నగరాల్లో సరే... ఊళ్లల్లో కూడా పిల్లలకు ఈ భాగ్యం ఉండటం లేదు. ఒకప్పటి ఈ దేశీయ ఆనవాయితీ కాలక్రమంలో 'స్లీపోవర్'గా మారింది. కాని సిసలైన స్లీపోవర్స్‌ను ఈ వేసవిలో పెద్దలే కలిగించాలి.




# డాబా నిద్రలూ కజిన్స్‌తో కబుర్లూ



చుక్కల ఆకాశం. ఆగి ఆగి రివ్వున వీచే గాలి. సాయంత్రం నీళ్లు చల్లి డాబా నేల మీదున్న ఉడుకంతా కడిగిస్తే రాత్రికి వేడి కాస్త నిమ్మళించి ఉంటుంది. ఇంట్లోని ఎక్కడెక్కడివో చాపలు, బొంతలు, దుప్పట్లు, పరుపులు, దిండ్లు పైకి వస్తాయి. పక్కలు ఏర్పాటవుతాయి. టేబుల్ ఫ్యాన్ ఉంటే అది కూడా తోడు నిద్ర పోవడానికి వస్తుంది. చెంబులు, వాటర్ బాటిల్స్‌లో నీళ్లు ఒక పక్కగా సిద్ధమవుతాయి. పెద్దవాళ్లు వాళ్ల పాతకబుర్లు చెప్పుకోవడం మొదలుపెడతారు. పిల్లల కోసం వేసిన వరుసలో పిల్లలు ఊరికూరికే నవ్వుతుంటారు. ఏమిటేమిటో మాట్లాడుతుంటారు. 'ఏరా... నిద్రపోరా?' అని పెద్దలు గదిమితే నిద్రపోతారా? వారికి నిద్రే రాదు. ఎందుకంటే అది వేసవి కాలం. అది డాబా మీద పక్క. తోడు ఉన్నది ఇష్టమైన బంధువులు. అన్నయ్యలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్లు, కజిన్స్... రాక రాక వచ్చారు. రాత్రిని నిద్రలో వృథా చేయరు పిల్లలు. కబుర్లే కబుర్లు చెప్పుకుంటారు.

మూసి ఉన్న ఇళ్ల నుంచి, మూసి ఉన్న తరగతి గదుల నుంచి ఆరు బయలుకు వచ్చి స్వేచ్ఛాకాశం కింద నిద్ర పోవడం వేసవిలో పిల్లలకు కొత్త అనుభూతిని ఇచ్చి అందాకా అనుభవించిన బోర్‌డమ్‌ను తొలగిస్తుంది. అందుకే నగరాల్లో బాలల సైకియాట్రిస్టులు స్లీపోవర్లను ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు బంధువుల పిల్లలతో వేసవిలో సాగిన సామూహిక నిద్రలు ఇప్పుడు కరువవడంతో కనీసం ఏదో ఒక ఫ్రెండ్ ఇంట్లో పిల్లలంతా ఒక రాత్రి నిద్రపోవడానికి చేరి కబుర్లు చెప్పుకుని వొత్తిడి దూరం చేసుకోమంటున్నారు.

పాతకాలం దాటి వచ్చిన పెద్దవారిని వేసవి కాలం గురించి అడిగితే వారు ఇష్టంగా చెప్పుకునే జ్ఞాపకం మేడ మీది నిద్రలే. ఎండవల్ల ఇంట్లో ఉబ్బరింత భరించలేక డాబా మీద, బయటి అరుగుల మీద, పెరట్లో, ఆఖరుకు వీధిలో కూడా మంచాలు వేసుకుని వరుసగా కొలువు తీరి పొద్దు పోయేంత వరకూ వేసే బాతాఖానీ తలుచుకుంటారు. పిల్లలుగా ఉండగా ఏం మాట్లాడుకున్నారో గుర్తు ఉండదుగాని అలా నిద్రపోవడంలోని ఆనందం గుర్తు ఉంటుంది.

పుణ్యక్షేత్రాలలో, జాతరలలో, తిరునాళ్లల్లో గుంపుగా నిద్ర పోయినప్పుడు ఉత్సాహం వస్తుంది మనిషికి. పిల్లలకైనా అంతే. గుంపుగా కలిసి ఆరుబయలులో పడుకోవడం హుషారు. బంధువుల పిల్లలు వస్తే 'వీళ్లు మనవారు' అనే భావనతో విపరీతమైన దగ్గరితనం ఏర్పడుతుంది ఆ సమయాన. లోలోపల ఉన్న మొహమాటాలు పోయి ఓపెన్ అవుతారు. స్కూలు, పుస్తకాలు, సినిమాలు, ఆటలు, స్నేహితుల పేచీలు, టీచర్లు... ప్రతి విషయం గురించి మాట్లాడుకుంటారు. వయసులో పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు అనేక విషయాలు చెబుతారు. చిన్న పిల్లలు కుతూహలంగా విని తెలుసుకుంటారు. ఈ 'చెప్పడం వినడం' అనేది వేసవి సెలవుల డాబా నిద్రల్లో అద్భుతంగా సాగుతుంది.

చదవక ముందు పెసలు, చదివాక పిసలు అయినట్టుగా మన దగ్గర వందల సంవత్సరాలుగా ఉన్న పద్ధతి ఇప్పుడు శాస్త్రంగా వినాల్సి వస్తోంది. పిల్లలు ఎన్ని జోకులు వేయగలరో, ఎన్ని మిమిక్రీలు చేయగలరో, ఎన్ని వెక్కిరింతలు లోపల దాచుకుని ఉంటారో, ఎంత అబ్జర్వ్ చేసి ఉంటారో ఇవన్నీ తమ మనుషులతో తమకంటూ సమయం దొరికినప్పుడు బయటకు వెల్లడి చేస్తారు. కజిన్స్‌తో వేసవి నిద్రల్లో ఏముంది అనుకోవచ్చు నేడు. అదొక కౌన్సెలింగ్. అదొక వైద్యం. అదొక డీటాక్సినేషన్. వెన్నెలా చంద్రుడూ అందించే 'ఎస్' విటమిన్. ఎస్ అంటే సంతోషం. వేసవి సంబరం.

---

## హెల్త్

# బెడ్ వెట్టింగ్ కట్టడి..!



**సాధారణంగా చిన్నారులు నిద్రలో పక్కతడుపుతుంటారు. మూత్రవిసర్జన వ్యవస్థపై అదుపు చేకూరక అలా జరుగుతుంది. అయితే పిల్లలు క్రమంగా మూత్రవిసర్జనపై అదుపు సాధించడం మొదలయ్యాక ఈ సమస్య తగ్గుతుంది. సాధారణంగా ఏడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చేనాటికి పిల్లలు తమ మూత్ర విసర్జన కండరాలూ, వ్యవస్థపై అదుపు సాధించాక ఈ సమస్య పూర్తిగా తగ్గుతుంది. ఇలా పక్కతడిపే ఈ సమస్యను వైద్యపరిభాషలో 'నాక్టర్నల్ ఎన్యురిసిస్' అంటారు. అయితే కాస్త అరుదుగానైనా పెద్దపిల్లలతో పాటు కొందరు పెద్దల్లో కూడా ఈ సమస్య ఉండవచ్చు. ఈ సమస్య ఎందుకు వస్తుంది, దాన్ని అధిగమించడమెలా అనే అంశాలను తెలిపేదే ఈ కథనం.**

ఒక నిర్వచనాన్ని బట్టి చెప్పాలంటే... ఐదేళ్లకు పైబడిన పిల్లలు వారంలో రెండుసార్లు పక్కతడుపుతుంటే దాన్ని బెడ్ వెట్టింగ్‌గా చెప్పవచ్చు.

**ఇదీ విస్తృతి...**

బెడ్ వెట్టింగ్ సమస్య వేర్వేరు వయసుల వాళ్లలో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు...

- **చిన్నపిల్లల్లో:** ఐదేళ్ల పిల్లల్లో దాదాపు సుమారు 15–20% మందిలో నాక్టర్నల్ ఎన్యూరిసిస్ కనిపిస్తుంది. అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిల్లో ఈ సమస్య కాస్త ఎక్కువ.
- **కాస్తంత పెద్ద పిల్లల్లో:** పిల్లలకు ఏడేళ్లు వచ్చే నాటికి 15% – 20% ఉన్న దీని విస్తృతి దాదాపు 10 శాతానికి తగ్గుతుంది.
- **కౌమార బాలల్లో (అడాలసెంట్ పిల్లల్లో):** 13–18 ఏళ్ల పిల్లల్లో ఇది 1 – 3 శాతం వరకు ఉంటుంది.
- **పెద్దలలో:** కొందరు పెద్ద వయసువారిలోనూ ఈ సమస్య కనిపించవచ్చు. అయితే వాళ్లలో ఇది పిల్లల్లో కంటే కాస్త భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు పిల్లల్లో కనిపించే పక్క తడిపే సమస్యను ప్రైమరీ అన్యురిసిస్ అంటారు. అయితే పెద్దల్లో ఇదే సమస్య కనిపించే దాన్ని సెకండరీ నాక్టర్నల్ ఎన్యురిసిస్‌గా చెబుతారు. పెద్దవయసు వాళ్లలోని కనీసం 1 – 2 శాతం వ్యక్తుల్లో ఈ నాక్టర్నల్ ఎన్యురిసిస్ కనిపిస్తుందని అంచనా. ఇలా పెద్దల్లో ఈ సమస్య రావడానికి ఇతరత్రా కారణాలు ఉండవచ్చు. కాబట్టి దీన్ని సెకండరీ అన్యురిసిస్‌గా చెబుతారు.

**తల్లిదండ్రులకు సూచన...**

ఇది చాలా సాధారణమైన పిల్లల్లో సహజంగా కనిపించే అలవాటు. ఇలా చేసినప్పుడు పిల్లలను కోప్పడటం లేదా వారిని శిక్షించడం సరికాదు. దీనివల్ల మరింత ఒత్తిడి పెరగడం, సమస్య ఇంకాస్త తీవ్రం కావడం జరుగుతుంది. ఇది చాలా తాత్కాలికమైన సమస్య అనీ, దీని గురించి ఆందోళన అవసరం లేదంటూ పిల్లల్లో మానసిక స్థైర్యం కలిగించడం వల్ల ఈ సమస్య వీలైనంత త్వరగా తగ్గుతుంది.

**కారణాలు...**

- **ప్రైమరీ ఎన్యురిసిస్‌లో:** పిల్లలకు నిద్రలో తమ మూత్ర విసర్జన వ్యవస్థపై నియంత్రణ లేకపోవడమన్నది మామూలు కారణం. దీనికి ఇతరత్రా ఏవైద్య కారణాలూ ఉండవు.
- **జన్యుపరమైనవి:** కుటుంబాల్లోని వారికి తమ బాల్యంలో ఈ సమస్య ఉంటే పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తుంది.
- **గాఢనిద్ర కారణంగా:** బ్లాడర్ నిండినట్లుగా అందే సూచనలను తమ గాఢనిద్ర కారణంగా వాళ్లు స్వీకరించలేకపోవడం.
- మూత్రాశయం చిన్నగా ఉండటంతో నిల్వ సామర్థ్యం తగ్గడం.
- **సెకండరీ ఎన్యురిసిస్:** చిన్నారుల్లోగానీ, అలాగే పెద్దవాళ్లలోనూ ముందుగా కొంతకాలంపాటు పక్క తడిపే అలవాటు లేకుండా... అకస్మాత్తుగా కనిపించడం. ఉదాహరణకు పక్కతడిపే అలవాటు మానేశాక కనీసం ఆర్నెల్ల పాటు పక్కలో మూత్రవిసర్జన చేయకుండా... ఆ తర్వాత ఆ ధోరణి కనిపించడాన్ని 'సెకండరీ అన్యురిసిస్'గా చెప్పవచ్చు. ఇందుకు అనేక అంశాలు కారణం కావచ్చు. అవి...
- **ఒత్తిడి లేదా భావోద్వేగ సమస్యలు:** పిల్లల్లో ఆందోళన, బడిలో ఏవైనా తీవ్రమైన ఒత్తిళ్లు ఉండటం. మూత్ర వ్యవస్థలో ఎక్కడైనా ఇన్ఫెక్షన్లు (యూరినరీ ఇన్ఫెక్షన్స్)
- మలబద్ధకం లేదా పేగు సమస్యలు.
- స్లీప్ అప్నియా (గురక రావడం) లేదా ఇతరత్రా నిద్ర సంబంధ ఆరోగ్య సమస్యలు.
- డయాబెటిస్ లేదా ఇతరత్రా హార్మోన్ల అసమతౌల్యతల (ఉదా... యాంటీ డై–యూరెటిక్ హార్మోన్ లోపం).

**సమస్య నిర్ధారణ ఇలా...**

- రాత్రివేళల్లో మూత్రవిసర్జన వల్ల సమస్య స్పష్టంగా తెలుస్తుంది.
- బాధిత చిన్నారులను శారీరకంగా పరిశీలించడం. మెడికల్ హిస్టరీని డాక్టరుకు వివరించడంతో కొన్ని రకాల మూత్ర పరీక్షలు అవసరమవుతాయి.
- **మూత్ర విసర్జన వివరాలతో డైరీ:** పిల్లలు నీళ్లు ఏయే వేళల్లో తాగుతున్నారు, మూత్రవిసర్జన ఎప్పుడెప్పుడు చేస్తున్నారు వంటి విషయాలను నమోదు చేస్తూ ఓ డైరీ రాయడం.
- **శారీరక పరీక్ష:** మూత్ర నాళం, వెన్నెముక, నాడీ వ్యవస్థలో ఏవైనా లోపాలున్నాయా అని పరీక్షించడం.
- **యూరిన్ అనాలసిస్:** మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లుగానీ, డయాబెటిస్ లేదా కిడ్నీ సమస్యలేమైనా ఉన్నాయా అని పరీక్షించడం. అవి లేనప్పుడు వాటిని రూల్ అవుట్ చేసుకోవడం.
- **అల్ట్రాసౌండ్ పరీక్ష:** మూత్ర వ్యవస్థ, యూరినరీ బ్లాడర్, మూత్రపిండాల వివరాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే పరీక్ష ఇది.
- **అదనపు పరీక్షలు:** ప్రైమరీ అన్యురిసిస్ కాకుండా ఇతరత్రా ఏవైనా కారణలు ఉండవచ్చునని అనుమానించినప్పుడు హార్మోన్ల మోతాదులు, స్లీప్ అప్నియా వంటి అంశాల నిర్ధారణ కోసం చేయాల్సిన స్లీప్ స్టడీస్ వంటి పరీక్షలు.

**నివారణ ఇలా...**

ప్రాథమిక కారణాలు తెలిసినప్పుడు వాటిని నివారించడానికి ప్రయత్నించడం. ఉదాహరణకు పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఇలా జరుగుతుందని తెలిసినప్పుడు తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ద్వారా ఆ ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడం.

- **మూత్ర విసర్జన శిక్షణ (టాయిలెట్ ట్రైనింగ్):** పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందర ఒకసారి మూత్రవిసర్జన చేయించి, మళ్లీ రెండు గంటల తర్వాత నిద్రలేపి మరో మారు మూత్రవిసర్జన చేయించడం లాంటి చర్యల ద్వారా. అలాగే పిల్లల్లో మూత్రాశయ సామర్థ్యాన్ని పెంచడం కోసం రోజూ ఓ నిర్ణీతమైన వేళల్లో మూత్ర విసర్జన చేసేలా శిక్షణ ఇవ్వడం.
- **ఒత్తిడి దూరం చేయడం:** రాత్రి వేళ పిల్లలు ప్రశాంతంగా నిద్రపోయేలా వారికి ధైర్యం చెప్పడం.
- **ఎన్యూరిసిస్ అలారం ఉపకరణాలతో:** పిల్లలు కొద్దిగా పక్కతడుపడం మొదలుపెట్టగానే వాటిని గుర్తించి నిద్రలేపే అలారం ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సహాయంతో పిల్లవాడు నిద్రమేల్కొనేలా శిక్షణ ఇవ్వడం.
- **జీవనశైలి మార్పులు:** సాయంత్రాలు లేదా రాత్రివేళల్లో ద్రవాహారాలు తీసుకోకుండా జాగ్రత్త పడటం. అలాగే నిద్రకు ముందు కాఫీ లేదా కోలా డ్రింక్స్ వంటి పానీయాలు తీసుకోకుండా చూడటం.

**మరేవైనా కారణాలతో ఇలా జరుగుతుంటే...**

సాధారణ కారణాలు కాకుండా... ఇతర ఆరోగ్యపరమైన అంశాలేవైనా పక్క తడిపేందుకు కారణమవుతుంటే వాటిని గుర్తించి, ఆ సమస్యలకు చికిత్స అందిస్తే పక్కతడిపే అలవాటూ తగ్గుతుంది. ఉదాహరణకు నిద్ర రుగ్మతల కారణంగానో లేదా మానసిక సమస్యల వల్లనో ఇలా జరుగుతుంటే వాటిని గుర్తించి, తగిన చికిత్స అందించడం వల్ల సెకండరీ అన్యురిసిస్ అదుపులోకి వస్తుంది.

ఇక సమస్య పెద్దవాళ్లలో అయితే అది సెకండరీ అన్యురిసిస్ కారణంగా జరుగుతుంది కాబట్టి తగిన పరీక్షల తర్వాత సమస్యను బట్టి వారికి అందించాల్సిన చికిత్స ఉంటుంది.

**మందులతో నియంత్రణ ఇలా...**

డెస్మోప్రెసిన్: రాత్రివేళ మూత్రం ఉత్పత్తిని తగ్గించే మందులివి. (వీటిని కృత్రిమంగా ఉత్పత్తి చేసే యాంటీ డై యూరెటిక్ హార్మోన్‌లుగా చెప్పవచ్చు).
ఇమిప్రమైన్ (టోఫ్రానిల్): పిల్లల్లో ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగించే యాంటీ డిప్రెసెంట్ ఔషధాలివి.
ఆక్సిబ్యూటినిన్: మూత్రాశయం ఉండాల్సిన దానికంటే అతి చురుగ్గా ఉన్నప్పుడు దాన్ని నియంత్రించే మందు ఇది.



డా. మధు మోహన్ రెడ్డి,
సీనియర్ కన్సల్టెంట్
పీడియాట్రిక్ సర్జన్

---

# నోటి క్యాన్సర్ నిర్ధారణ ఇలా!





నోటి పరిశుభ్రత పెద్దగా పాటించకుండా గుట్కా, ఖైనీల రూపంలో పొగాకు నమలడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి అంశాలు నోటి క్యాన్సర్‌ను ప్రేరేపిస్తాయి. ఇలాంటివారిలో చెంపలు, నాలుక, పంటి చిగుర్ల... వంటి భాగాలను పరీక్షించి ఏ భాగంలో క్యాన్సర్ వచ్చిందో క్యాన్సర్ స్పెషలిస్టు పరీక్షించి చూస్తారు. వీళ్లలోని కొందరిలో నోటిలో వాపు కూడా రావచ్చు. అప్పుడు కూడా దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాల్సి ఉంటుంది.

మొదట సమస్య ఉన్నచోట, మెడ భాగంలోనూ సీటీ, ఎమ్మారై స్కానింగ్ వంటి పరీక్షలు చేయించి, క్యాన్సర్ వ్యాధి తీవ్రతను అంచనా వేస్తారు. ఈ పరీక్షల వల్ల పుండు పడిన చోటు నుంచి అది ఏ మేరకు వ్యాపించి ఉందో తెలుస్తుంది. అది దవడ ఎముకను చేరిందా, లేక ఎముకను దాటి మెడలోని లింఫ్ గ్రంథులకూ వ్యాపించిందా అన్న విషయాన్ని కూడా డాక్టర్లు తెలుసుకుంటారు. పేషెంట్ నోటిని మామూలుగానే తెరవగలుగుతున్నాడంటే, క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపించి ఉండకపోవచ్చు. ఎందుకంటే క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపిస్తే నోరు తెరవడం కష్టమవుతుంది.

నోటిలోని క్యాన్సర్ ఇతరచోట్లకు వ్యాపించకపోతే మొదట క్యాన్సర్ వచ్చిన మేరకు ఆ భాగాన్ని శస్త్రచికిత్సతో తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత... ప్లాస్టిక్ సర్జరీ లేదా రీ–కన్‌స్ట్రక్టివ్ సర్జరీ ద్వారా తొలగించిన భాగాన్ని పునర్నిర్మించవచ్చు. ఒకవేళ మెడలోని లింఫ్ గ్రంథుల్లోకి కూడా క్యాన్సర్ వ్యాపించి ఉంటే, వాటన్నింటినీ నెక్ డిసెక్షన్ ద్వారా తొలగించాల్సి ఉంటుంది. బయాప్సీ రిపోర్టు ఆధారంగా శస్త్రచికిత్స తాలూకు గాయాలు మానాక, రేడియోథెరపీ ప్లాన్ చేస్తారు.

నోటి క్యాన్సర్ అన్నది చాలా బాధాకరమైనది కావడం వల్ల గుట్కా/పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే దాన్ని మానేయాలి. ఈ అలవాటు కేవలం నోట్లోని భాగాలకే కాకుండా మెడ, ఆహారనాళం లేదా కడుపులోని ఏ భాగానికైనా క్యాన్సర్ వచ్చేలా చేయగలదన్న విషయం గుర్తుంచుకుని జాగ్రత్త పడాలి.

# రబడపై సస్పెన్షన్ వేటు

## డోపింగ్ పరీక్షల్లో దొరికిన పేసర్




జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ఫాస్ట్ పేసర్ కగిసో రబడ తాజా ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడాడు. ఆ తర్వాత అనూహ్యంగా అతను 'వ్యక్తిగత కారణాలతో' దక్షిణాఫ్రికాకు వెళ్లిపోయాడు. అతని సమస్య ఏమిటనేది ఐపీఎల్ యాజమాన్యం బయటకు వెల్లడించలేదు. రబడ త్వరలో మళ్లీ జట్టుతో చేరతాడని కూడా టైటాన్స్ కెప్టెన్ గిల్ టోర్నీ మధ్యలో ప్రకటించాడు. అయితే ఇప్పుడు అసలు వాస్తవం బయటకు వచ్చింది. డోపింగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా దొరికిపోవడంతో రబడపై సస్పెన్షన్ వేటు పడింది. సరదా కోసం తీసుకునే (రిక్రియేషనల్) డ్రగ్‌ను రబడ వాడినట్లు తేలడంతో ప్రపంచ డోపింగ్ వ్యతిరేక సంస్థ (వాడా) అతనిపై తాత్కాలిక నిషేధం విధించింది. పూర్తి స్థాయిలో ఇంకా ఎంత కాలం సస్పెన్షన్ వేటు పడుతుందనేదానిపై ఇంకా స్పష్టత లేదు. క్రీడల్లో మెరుగైన ప్రదర్శనకు ఉపయోగపడే డ్రగ్స్ తరహాలో కాకుండా కొకైన్, హెరాయిన్, గంజాయివంటివాటిని రిక్రియేషనల్ డ్రగ్స్‌గా వ్యవహరిస్తారు. పోటీలు లేని సమయంలో ఆటగాళ్లు వీటిని వాడుతుంటారు. సాధారణంగా ఇలాంటి డ్రగ్స్ వాడితే నిబంధనల ప్రకారం గరిష్టంగా నాలుగేళ్ల వరకు నిషేధం పడుతుంది. అయితే తాను సరదా కోసమే వాటిని వాడానని, ఆ సమయంలో ఎలాంటి మ్యాచ్‌లు జరగడం లేదని సదరు ప్లేయర్ నిరూపించగలిగితే కేవలం 3 నెలల నిషేధం విధిస్తారు. సొంతగడ్డపై జరిగిన ఎస్‌ఏ20 టోర్నీ సమయంలో రబడ ఈ డ్రగ్ తీసుకున్నట్లుగా సమాచారం. అతని నిషేధంపై తుది నిర్ణయం వస్తేనే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో అతను పాల్గొనే విషయం తేలుతుంది.

# భారత మహిళలకు మరో ఓటమి


నవ్‌నీత్ కౌర్

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 2–3 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. అయితే గత మ్యాచ్‌లో కంగారూల జోరు ముందు ఎదురు నిలవలేకపోయిన మన అమ్మాయిలు... ఈసారి కాస్త పోరాడారు. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (35వ నిమిషంలో), లాల్‌రేమ్‌సియామి (59వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఆస్ట్రేలియా తరఫున గ్రేస్ స్టెవార్ట్ (2వ నిమిషంలో), జెడ్ స్మిత్ (36వ నిమిషంలో), గ్రెటా హయెస్ (42వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభమైన రెండో నిమిషంలోనే గోల్ చేసిన ఆస్ట్రేలియా జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లగా... టీమిండియా ఆత్మరక్షణలో పడింది. స్కోరు సమం చేసేందుకు మన ప్లేయర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రెండో క్వార్టర్ లో ఆస్ట్రేలియా దాడులను మన రక్షణ పంక్తి సమర్థవంతంగా అడ్డుకోవడంతో ఆసీస్ ఆధిక్యం మరింత పెరగలేదు. మూడో క్వార్టర్‌లో నవనీత్ గోల్ కొట్టడంతో స్కోరు సమమైనా... ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. మరుసటి నిమషంలోనే స్మిత్ గోల్‌తో ఆసీస్ తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి క్వార్టర్‌లో ఆసీస్ ప్లేయర్ హయెస్ మరో గోల్ కొట్టగా... ఆట ఆఖరి నిమిషంలో లాల్‌రెమ్‌సియామి గోల్ చేసి ఓటమి అంతరాన్ని తగ్గించింది. ఈ పర్యటనలో భాగంగా తొలుత ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత అమ్మాయిల జట్టు... సీనియర్ జట్టుతో గురువారం జరిగిన పోరులో 0–2తో పరాజయం పాలైంది. ఇప్పుడు రెండో మ్యాచ్‌లోనూ ఓటమి ఎదురవగా... సిరీస్‌లో భాగంగా చివరి మ్యాచ్ ఆదివారం జరగనుంది.

# బెంగళూరు బ్రహ్మాండంగా...

## 2 పరుగులతో ఆర్‌సీబీ విజయం

- దంచేసిన కోహ్లి, బెథెల్
- షెఫర్డ్ సునామీ ఇన్నింగ్స్
- పోరాడి ఓడిన చెన్నై


షెఫర్డ్

బెంగళూరు: కోహ్లి ఉన్న బెంగళూరు, ధోని ఆడుతున్న చెన్నై మధ్య మ్యాచ్ ఎలా జరిగితే బాగుంటుందో అలా జరిగిందీ మ్యాచ్. పెద్ద స్కోర్లు... మెరుపు ఇన్నింగ్స్‌లు, ఆఖరి ఓవర్ ఉత్కంఠ ఇవన్నీ కలగలిపి ప్రేక్షకులకు క్రికెట్ విందు ఇచ్చిన ఐపీఎల్ పోరులో యశ్ దయాళ్ ఆఖరి 3 బంతులే చెన్నై సూపర్‌కింగ్స్‌ను ఓడించాయి. 3 బంతుల్లో 6 పరుగులు చేయాల్సిన చెన్నైకి యశ్ చెక్ పెట్టి 3 సింగిల్సే ఇవ్వడం విశేషం. ఒత్తిడిని జయించిన అతని బౌలింగే చివరకు బెంగళూరును 2 పరుగుల తేడాతో గెలిపించింది. ముందుగా ఆర్‌సీబీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (14 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఉప్పెనల్లే ఉరిమాడు. ఓపెనర్లు కోహ్లి (33 బంతుల్లో 62; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), జాకబ్ బెథెల్ (33 బంతుల్లో 55; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. తర్వాత చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసి ఓడింది. ఆయుశ్ మాత్రే (48 బంతుల్లో 94; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), జడేజా (45 బంతుల్లో 77 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు.

### బెథెల్, కోహ్లిల 'పవర్' ప్లే

బెంగళూరు ఓపెనర్లు బెథెల్, కోహ్లి మెరుపులు మెరిపించడంతో 'పవర్ ప్లే' పరుగెత్తిపోయింది. ఇద్దరి జోరుకు 4.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 50 దాటింది. 6 ఓవర్లలో 73/0 స్కోరు చేసింది. బెథెల్ 28 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఓపెనర్లు తొలి వికెట్‌కు 97 పరుగులు జతచేశారు. ఆ తర్వాత కోహ్లి 29 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు.

### ఒకే ఓవర్లో 33 పరుగులు...

18 ఓవర్లలో స్కోరు 159/5. ఆ తర్వాత ఒకే ఒక్కడి వీరబాదుడుతో స్టేడియమంతా ఊగిపోయింది. ఖలీల్ వేసిన 19వ ఓవర్లో ప్రతీ బంతిని దంచికొట్టిన షెఫర్డ్ 4 సిక్స్‌లు, 2 బౌండరీలతో 32 పరుగులు (6, 6, 4, 6, 6 నోబాల్, 0, 4) బాదేశాడు. నోబాల్‌తో కలిపి మొత్తం 33 పరుగులు వచ్చాయి. పతిరణ వేసిన ఆఖరి ఓవర్లో కూడా షెఫర్డ్ దంచుడుకు 4, 0, 4, 6, 6లతో 21 పరుగులు వచ్చాయి. ఈ రెండు ఓవర్లలోనే 54 పరుగులు వచ్చాయి.

### చెన్నై శరవేగంగా...

సూపర్‌కింగ్స్ పరుగుల వేట మూడో ఓవర్ నుంచి ఊపందుకుంది. భువనేశ్వర్ నాలుగో ఓవర్లో ఆయుశ్ 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 26 పరుగులు వచ్చాయి. 4.1 ఓవర్లలో జట్టు స్కోరు 50 దాటింది. స్వల్ప వ్యవధిలో షేక్ రషీద్ (14), స్యామ్ కరన్ (5) అవుటైనా... ఆయుశ్‌కు జడేజా జతయ్యాక చెన్నై శరవేగంగా లక్ష్యం వైపు సాగిపోయింది. 25 బంతుల్లోనే ఆయుశ్ ఫిఫ్టీ పూర్తయ్యింది. 29 బంతుల్లో అతని అర్ధసెంచరీ సాధించాడు. ఆయుశ్ జోరుకు ఇన్‌గిడి కళ్లెం వేయగా, మరుసటి బంతికి బ్రెవిస్ (0) ఎల్బీ అయ్యాడు. అక్కడినుంచి ఫలితం ఇరు జట్లతో దోబూచులాడింది. యశ్ దయాళ్ 2 సింగిల్స్ ఇచ్చి ధోని (12)ని అవుట్ చేశాడు. శివమ్ దూబే (8 నాటౌట్) వచ్చీ రాగానే సిక్సర్ బాదాడు. నోబాల్ కావడంతో అదనంగా మరో పరుగు, ఓ బంతి కలిసొచ్చినా...దయాళ్ ఆఖరి 3 బంతుల్ని అద్భుతంగా వేయడంతో దూబే, జడేజాలు సింగిల్స్ మాత్రమే తీయగలిగారు.

### స్కోరు వివరాలు

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** బెథెల్ (సి) బ్రెవిస్ (బి) పతిరణ 55; కోహ్లి (సి) అహ్మద్ (బి) స్యామ్ కరన్ 62; పడిక్కల్ (సి) జడేజా (బి) పతిరణ 17; పటిదార్ (సి) స్యామ్ కరన్ (బి) పతిరణ 11; జితేశ్ (సి) బ్రెవిస్ (బి) నూర్ అహ్మద్ 7; టిమ్ డేవిడ్ నాటౌట్ 2; షెఫర్డ్ నాటౌట్ 53; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 213.**
**వికెట్ల పతనం:** 1–97, 2–121, 3–144, 4–154, 5–157. **బౌలింగ్:** ఖలీల్ 3–0–65–0, అన్షుల్ 3–0–25–0, నూర్ 4–0–26–1, జడేజా 3–0–26–0, కరన్ 3–0–34–1, పతిరణ 4–0–36–3.

**చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్:** ఆయుశ్ (సి) కృనాల్ (బి) ఇన్‌గిడి 94; రషీద్ (సి) షెఫర్డ్ (బి) కృనాల్ 14; కరన్ (సి) జితేశ్ (బి) ఇన్‌గిడి 5; జడేజా నాటౌట్ 77; బ్రెవిస్ (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 0; ధోని (ఎల్బీ) (బి) దయాళ్ 12; దూబే నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 211. వికెట్ల పతనం** : 1–51, 2–58, 3–172, 4–172, 5–201 **బౌలింగ్:** కృనాల్ 3–0–24–1, భువనేశ్వర్ 4–0–55–0, దయాళ్ 4–0–41–1, ఇన్‌గిడి 4–0–30–3, సుయశ్ 4–0–43–0, షెఫర్డ్ 1–0–18–0.

### ఆలస్యంగా అప్పీల్ చేసి...

అద్భుతంగా ఆడుతున్న ఆయుశ్ వెనుదిరిగిన తర్వాత డెవాల్డ్ బ్రెవిస్ క్రీజ్‌లోకి వచ్చాడు. విజయానికి 22 బంతుల్లో 42 పరుగులు కావాలి. దూకుడుకు మారుపేరైన బ్రెవిస్ చెలరేగితే చెన్నై గెలిచేందుకు మంచి అవకాశాలున్నాయి. ఇన్‌గిడి వేసిన బంతి అతని ప్యాడ్స్‌కు తాకడంతో అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. సందేహంగా ఉండటంతో వెంటనే అతను 'రివ్యూ' కోరాల్సింది. కానీ సింగిల్ కూడా పూర్తి చేసిన అతను ఆ తర్వాత కాస్త ఆలోచించి 'రివ్యూ' కోసం సైగ చేశాడు. కానీ అప్పటికే నిర్ణీత 15 సెకన్లు పూర్తి అయిపోయాయి. దాంతో అంపైర్ నితిన్ మేనన్ ఆ రివ్యూను తిరస్కరించాడు. అయితే తర్వాతి రీప్లేలో అది 'అంపైర్స్ కాల్'గా చూపించింది. అంటే రివ్యూ తీసుకున్నా బ్రెవిస్ అవుటయ్యేవాడే!

**14** అర్ధ సెంచరీకి షెఫర్డ్ తీసుకున్న బంతులు. ఐపీఎల్‌లో ఇది రెండో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. గతంలో యశస్వి జైస్వాల్ 13 బంతుల్లో అర్ధసెంచరీ చేయగా... కేఎల్ రాహుల్, ప్యాట్ కమిన్స్ కూడా 14 బంతుల్లోనే ఈ మార్క్‌ను అందుకున్నారు.

**62** ఐపీఎల్‌లో కోహ్లి అర్ధ సెంచరీల సంఖ్య. వార్నర్ (62)తో సమంగా అగ్రస్థానానికి చేరాడు.



### ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.482 |
| ముంబై | 11 | 7 | 4 | 0 | 14 | 1.274 |
| గుజరాత్ | 10 | 7 | 3 | 0 | 14 | 0.867 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 1 | 13 | 0.199 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 0 | 12 | 0.362 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.325 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 1 | 9 | 0.271 |
| రాజస్తాన్ | 11 | 3 | 8 | 0 | 6 | -0.780 |
| హైదరాబాద్ | 10 | 3 | 7 | 0 | 6 | -1.192 |
| చెన్నై | 11 | 2 | 9 | 0 | 4 | -1.117 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు


కోల్‌కతా X రాజస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 3:30 గంటల నుంచి

పంజాబ్ X లక్నో
వేదిక: ధర్మశాల
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో




ఆమిర్ ఖాన్


సైఫ్ అలీ ఖాన్

# సంకెళ్ళ నుంచి స్వేచ్ఛ వచ్చింది!

## 'వేవ్స్'లో నటుడు సైఫ్ అలీ ఖాన్

ఓటీటీ వేదికలు వచ్చాక వినోద రంగంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. నటుడు సైఫ్ అలీ ఖాన్ ఆ మాటే అంగీకరించారు. ముంబైలో జరుగుతున్న 'వరల్డ్ ఆడియో – విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్)లో మూడో రోజైన శనివారం సైఫ్ మెరిశారు. స్ట్రీమింగ్ వేదికలతో ఆవిర్భవించిన నవభారతం గురించి జరిగిన చర్చావేదికలో ఆయన పాల్గొన్నారు. ''సినీ రంగానికి చెందిన మేము గతంలో గిరి గీసుకొని నిర్ణీత విధానాలకే కట్టుబడాల్సి వచ్చేది. కానీ, స్ట్రీమింగ్ వేదికలు అందుబాటులోకి వచ్చాక నటీనటులకూ, సినీ రూపకర్తలకూ మునుపటి సంకెళ్ళ నుంచి స్వేచ్ఛ లభించింది. మా కథలను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జనం చూసే వీలు చిక్కింది. సాంప్రదాయిక సినిమా మీడియమ్‌లో అయితే ఆ వీలుండేది కాదు'' అని సైఫ్ అభిప్రాయపడ్డారు. నెట్‌ఫ్లిక్స్ కో–సీఈఓ టెడ్ సరండోస్ సైతం, ''స్ట్రీమింగ్ వేదికల వల్ల భారత్‌లో సినీ రూపకల్పనలో ప్రజాస్వామ్యం సాధ్యమైంది'' అన్నారు.

డిజిటల్ యుగంలో కథాకథనంలో వస్తున్న మార్పులు, సృజనాత్మక స్వేచ్ఛపై స్ట్రీమింగ్ ప్రభావం, ప్రపంచ వినోదపటంలో పెరుగుతున్న భారత్ స్థానం లాంటి పలు అంశాలపై ఈ గోష్ఠిలో దృష్టి సారించారు. ''ఇప్పుడు ప్రేక్షకులు చూసేందుకు విభిన్నమైన కథలు అనేకం ఏకకాలంలో అందుబాటులో ఉన్నాయి. అంతటి వైవిధ్యమైన కథలను తెరపై చెప్పే స్వేచ్ఛ సృజనశీలురకు దక్కింది. సినిమా రూపకల్పనలో ప్రజాస్వామ్యమంటే ఇదే'' అని సైఫ్ అన్నారు. ''ఎన్ని మార్పులు వచ్చినా, సినిమాలకు కాలం చెల్లదు. ఇంకా చెప్పాలంటే, స్ట్రీమింగ్, థియేటర్లు... రెండూ పరస్పరం పోటీదారులు కావు. ముందున్న మార్కెట్ పెద్దది గనక, రెండూ ఏకకాలంలో కొనసాగుతాయి'' అని టెడ్ విశ్లేషించారు. కోవిడ్ అనంతరం భారతదేశ వ్యాప్తంగా వందకుపైగా పట్టణాలు, నగరాల్లో, దాదాపు పాతిక వేల మంది స్థానిక నటీనటులు, సాంకేతిక వర్గంతో నెట్‌ఫ్లిక్స్ చిత్రీకరణ సాగించిందనీ, తద్వారా ఎందరికో ఉపాధి కల్పించిందనీ ఆయన వివరించారు.

### నటించే ముందు ఊహించుకోవాలి!

– హీరో ఆమిర్ ఖాన్

''పాత్రను పూర్తిగా అవగాహన చేసుకొని, దానిలోకి పరకాయ ప్రవేశం చేయాలి. నా వరకు నేను స్క్రిప్టుతో చాలా సమయం గడుపుతాను. పదే పదే స్క్రిప్టు చదువుతాను. స్క్రిప్టు బాగుంటే, ఆ పాత్ర, దాని రూపురేఖలు, మానసిక వైఖరి అన్నీ దాని నుంచే అర్థమైపోతాయి. పాత్ర, కథ గురించి దర్శకుడితో చర్చల వల్ల కూడా ఓ అవగాహన వస్తుంది'' అన్నారు ఆమిర్ ఖాన్. 'వేవ్స్'లో భాగంగా శనివారం ఆయన తన సుదీర్ఘ నటనా జీవితం నుంచి కొత్తవాళ్ళకు పనికొచ్చే పలు సూచనలు చెప్పారు.

''నాకు జ్ఞాపకశక్తి తక్కువ. అందుకే, చేతితో డైలాగులు రాసుకుంటా. కష్టమైన సీన్లు ముందుగా చేస్తా. డైలాగులు కంఠస్థం చేస్తా. డైలాగులు నోటికి వచ్చాక, వాటిని నాదైన పద్ధతిలో సొంతం చేసుకుంటా. అదే డైలాగును వల్లె వేస్తున్నప్పుడు దాన్ని అనేక విధాలుగా ఎలా చేయవచ్చో మనకే అర్థమవుతుంది'' అని ఆమిర్ వివరించారు. ''చేస్తున్న పనిలో ఎంత నిజాయతీగా ఉంటే, అంత బాగా నటించగలుగుతాం. సీన్లు ప్రాక్టీస్ చేసేటప్పుడు నేను అద్దంలో చూస్తూ చేయను. నటించే ముందు ఆ సన్నివేశాన్ని మనసులో ఊహించుకుంటా'' అని చెప్పారు. ''సన్నివేశం డిమాండ్ చేసింది చేయాలే తప్ప, అందులో నా వంతు ఏమిటి, నాకెంత పేరొస్తుందని చూస్తే దెబ్బతింటాం'' అని విశ్లేషించారు.

### 70 కోట్ల మంది చూస్తున్నారు!

గత పాతిక ఏళ్ళ పైచిలుకు కాలంలో భారత మీడియా సాధించిన పురోగతి, మరీ ముఖ్యంగా వీడియో కంటెంట్ సృష్టి, ఆ కంటెంట్‌ను జనం చూడడం పెరిగిన తీరు అనూహ్యమని మీడియా నిపుణుడు, జియో స్టార్ వైస్‌చైర్మన్ ఉదయ్ శంకర్ విశ్లేషించారు. ఒకప్పుడు టీవీకే పరిమితమైతే... ఇప్పుడు 4జీ విప్లవం, హాట్‌స్టార్ సహా వివిధ వేదికల ఆవిర్భావంతో దాదాపు 70 కోట్ల మంది స్ట్రీమింగ్ కంటెంట్ చూస్తున్నారని అంచనా వేశారు. 'వేవ్స్'లో ఆయన మాట్లాడుతూ, ''హిందీ సినిమా ఇప్పటికీ పాతకాలంలోనే ఆగిపోవడం వల్ల థియేటర్లలో వసూళ్ళు తగ్గాయనీ, తమిళ – తెలుగు సహా దక్షిణాది సినీ పరిశ్రమల్లో సృజనాత్మక ప్రయోగాలు, వాటితో పాటు వసూళ్ళు పెరిగాయనీ గుర్తు చేశారు. ''అన్ని తెరలూ ఒకటే కావు. వెండితెర, బుల్లితెర, డిజిటల్ ... దేనికవే భిన్నమైనవి. ఒక్కోటీ ఒక్కో పరిణామ దశలో ఉన్నాయి. దేని ప్రయోజనం దానిదే. అది తెలుసుకోకుండా అన్నిటితో ఒకేలా వ్యవహరిస్తే వ్యాపారంలో దెబ్బ తింటాం'' అని ఆయన వివరించారు.


ఉదయ్ శంకర్, వివేక్ కౌటు

### నాగపూర్‌లో ప్రపంచపు అతి పెద్ద స్క్రీన్

''ఇండియన్ ఎంటర్‌టైన్మెంట్‌ని ప్రపంచ స్థాయిలోకి తీసుకెళ్లాలన్నది ప్రధాని మోదీగారి లక్ష్యం. ఈ దిశలో వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ నిర్మించే అవకాశం మాకు దక్కడం గర్వకారణం. మా విజన్‌ని అర్థం చేసుకుని, నమ్మిన ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌గారికి కృతజ్ఞతలు'' అని అభిషేక్ అగర్వాల్ అన్నారు. నాగపూర్‌లో వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ ప్రాజెక్ట్‌ను రూపకల్పన చేయనున్నట్లు 'వేవ్స్–2025' వేదికగా నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ''గొప్ప సినిమాలు తీయడమే కాదు, అద్భుతమైన థియేటర్లు నిర్మించాలన్నది మా ధ్యేయం. సినిమాను మరింత గొప్పగా మార్చడమే మా యూవీ క్రియేషన్స్ లక్ష్యం. ప్రపంచపు అతిపెద్ద స్క్రీన్‌ని నాగపూర్‌లో నిర్మించనున్నాం. మా సామర్థ్యాలపై నమ్మకం ఉంచిన మోదీగారికి కృతజ్ఞతలు'' అన్నారు విక్రమ్ రెడ్డి.


అభిషేక్ అగర్వాల్, ఫడ్నవీస్, విక్రమ్ రెడ్డి

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి


సుకుమార్, వైష్ణ, 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి, అల్లు అరవింద్


మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

# టెక్నాలజీతో కొత్త అవకాశాలు వస్తాయి – మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

''ఏఐ (కృత్రిమ మేధ) ఆధారంగా చాలా సినిమాలు వస్తున్నాయి. క్రియేటివిటీని డూప్లికేట్ చేయలేం గానీ, క్రియేటివిటీని టెక్నాలజీతో మెరుగుపరచవచ్చు. టెక్నాలజీ వల్ల కొత్త కొత్త అవకాశాలు, ఉద్యోగాలు వస్తాయి. ప్రతి రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అడాప్ట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది'' అని తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. నిర్మాత 'దిల్' రాజు నెలకొల్పిన 'లోర్వెన్ ఏఐ' స్టూడియో లాంచ్ ఈవెంట్‌ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ– ''మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని సినీ రంగానికి పరిచయం చేయాలనే సంకల్పంతో 'దిల్' రాజుగారు 'లోర్వెన్ ఏఐ' స్టూడియోని లాంచ్ చేయడం అభినందనీయం. ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్‌ని ఈ స్టూడియో నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను. 'క్వాంటం నెక్ట్స్ లెవెల్ ఆఫ్ టెక్నాలజీ' వారు 'లోర్వెన్ ఏఐ' స్టూడియోలో భాగస్వామ్యం కావడం అభినందనీయం. హాలీవుడ్‌కి దీటుగా హైదరాబాద్ ఎదుగుతోంది. ఈరోజు జరిగిన నాలుగు ప్రొడక్ట్స్ లాంచ్ ఎంటర్‌టైన్మెంట్‌లో గేమ్ చేంజర్స్ అనిపిస్తున్నాయి'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఏఐ గురించి రెండేళ్లుగా చర్చలు ప్రారంభించాం. మా కంపెనీ నుంచి స్టార్ట్ అయిన టీం, క్వాంటంతో కలసి సినిమా గురించి డెవలప్ చేయాలని నిర్ణయించుకున్నాం. 360 డిగ్రీస్ సినిమాని ఎలా చేయొచ్చు అనేది క్రియేటివ్‌గా డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్ట్ ఐడియా, ప్రీ ప్రొడక్షన్, షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్స్... ఇలా స్టెప్ బై స్టెప్‌గా డెవలప్ చేశాం. టైమ్ సేవ్ అవ్వడం వల్ల దర్శకులు ఎక్కువ సినిమాలు తీస్తారు, ప్రొడ్యూసర్స్‌కి డబ్బులు ఆదా అవుతాయి. 'లోర్వెన్ ఏఐ' అనేది ఎమోషన్ లేని ఒక ఫస్ట్ ఏడీగా భావించవచ్చు. మా బ్యానర్‌లో విజయ్ దేవరకొండ హీరోగా 'రౌడీ జనార్ధన' సినిమా తీస్తున్న డైరెక్టర్ రవికిరణ్ ఇందులో వర్క్ చేస్తున్నారు. తన స్క్రిప్టు ప్రీ ప్రొడక్షన్ 'లోర్వెన్ ఏఐ'లోనే జరుగుతోంది. మిగతా ప్రొడ్యూసర్స్, ప్రొడక్షన్ హౌసెస్ 'లోర్వెన్ ఏఐ' కావాలనుకుంటే సంప్రదించవచ్చు'' అన్నారు.

''దిల్' రాజు ప్రతిదాంట్లో ముందు వరుసలో ఉంటారు. ఇప్పుడు అదే క్రమంలో ఎంటర్‌టైన్మెంట్ ఇండస్ట్రీలోకి ఏఐని ప్రవేశపెట్టడంలోనూ ముందడుగు వేశారు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ఈ వేడుకలో పలువురు దర్శక–నిర్మాతలు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# కుటుంబ ప్రేక్షకులు రావడం మాకు ఆశ్చర్యం – శైలేష్ కొలను



''హిట్: ది థర్డ్ కేస్' సినిమాకి ఒక వర్గం ప్రేక్షకులే వస్తారనుకున్నాం. గత రెండు రోజులుగా థియేటర్స్ విజిట్ చేస్తున్నాం. చాలామంది మహిళలు రావడం గమనించాం. నానీగారిని అర్జున్ సర్కార్ లాంటి వైవిధ్యమైన పాత్రలో చూడటానికి ఎగ్జైట్‌మెంట్‌తో వస్తున్నారనిపించింది. మా అంచనాలను దాటి కుటుంబ ప్రేక్షకులు రావడం, వారి స్పందన సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది" అని శైలేష్ కొలను చెప్పారు. నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 1న విడుదలైంది. ఈ సందర్భంగా శైలేష్ కొలను చెప్పిన విశేషాలు...

- 'హిట్: ది థర్డ్ కేస్'లో అర్జున్ సర్కార్‌గా నాని పాత్ర ఎలా ఉంటుందో 'హిట్ 2' చివర్లో గ్లింప్స్‌లా చూపించా. అప్పుడే ఆడియన్స్‌కి ఓ అవగాహన వచ్చింది. అర్జున్ సర్కార్ పాత్రపై నాకు, నానీగారికి మొదటినుంచీ నమ్మకం ఉంది. ఇక మా మూవీ ఐడియాని చాగంటి కోటేశ్వరరావుగారికి చెబితే నచ్చి, వాయిస్ ఓవర్ ఇచ్చారు. డార్క్ వెబ్ అనేది ప్రస్తుతం ఇండియాలో పెద్ద సమస్య. ఎన్నో చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సైబర్ డిపార్ట్‌మెంట్ దీని మీద వర్క్ చేస్తోంది. తెలంగాణ, ఏపీ పోలీసులు డార్క్ వెబ్ గురించి మాకు చాలా సమాచారం ఇచ్చారు.
- 'హిట్ 3' క్లైమాక్స్‌లో అడివి శేష్ కనిపిస్తారు. విశ్వక్ సేన్‌ని ఇంకా బిగ్గర్ కాన్వాస్‌లో చూపించాలనే ఈ మూవీలో చేయించలేదు. 'హిట్ 6' లేదా 'హిట్ 7'లో అందరి హీరోల్ని ఒక ఫ్రేమ్‌లోకి తీసుకురావాలని ఉంది.
- 'హిట్ 4'లో హీరో కార్తీగారు నటిస్తారు. ఆ పాత్ర రూడ్‌గా, ఫన్‌గా ఉంటుంది. ఇక నాలో ఉన్న వినోదాన్ని పూర్తిగా బయటికి తీసుకొచ్చేలా ఓ రొమాంటిక్ కామెడీ స్టోరీ రాయాలని ఉంది.

# నా మాటల్లో బాధ పెట్టాలనే ఉద్దేశం లేదు – విజయ్ దేవరకొండ



''రెట్రో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నేను మాట్లాడిన మాటలు కొందరిని ఇబ్బంది పెట్టాయనే విషయం నా దృష్టికి వచ్చింది. కానీ, నా మాటల్లో ఎవరినీ బాధ పెట్టాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు'' అన్నారు హీరో విజయ్ దేవరకొండ. సూర్య హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'రెట్రో'. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... 'ట్రైబ్' అనే పదం వాడారు. దీనిపై దుమారం రేగడంతో... విజయ్ దేవరకొండ స్పందించి, తన మాటలపై స్పష్టత ఇచ్చారు. ''ట్రైబ్' పదం వెనక ఉద్దేశం భూమ్మీద తొలినాళ్లలో మనమంతా తెగలుగా, జాతులుగా ఉన్నామని చెప్పడమే కానీ, షెడ్యూల్ ట్రైబ్స్ గురించి కాదు. షెడ్యూల్ ట్రైబ్స్‌ని నేను ఎంతగానో గౌరవిస్తాను... ప్రేమిస్తాను.. వారు కూడా సమాజంలో ఒక ముఖ్య భాగమని భావిస్తాను. మన సమాజంలో ఐక్యత ఉండాలి, మనమంతా ఒక్కటిగా ముందుకెళ్లాలనే చెప్పాను. దేశమంతా ఒక్కటిగా నిలబడాలని మాత్రమే మాట్లాడాను. 'ట్రైబ్' అనే మాటకు ఎవరైనా హర్ట్ అయితే చింతిస్తున్నాను. నా సినిమా మీడియమ్‌ను శాంతి, పురోభివృద్ధి, ఐక్యత కోసం ఉపయోగిస్తాను'' అని విజయ్ దేవరకొండ తెలిపారు.

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



కుల ప్రసక్తి లేదు, 33 సం॥లు ప్రాపర్టీ వరునికి వధువు కావలెను. అన్ని కులాల, వయస్సుల, ఇల్లరికం, విడో, విడోయర్, డైవర్స్, 1, 2వ సంబంధాలు కలవు. KANE Matrimony. 6281147818 [HA-15060]

మాదిగ/ M.Tech IIT/C.Govt. AE/ రైల్వే / 98000/-PM / 5'10"ఎత్తు /28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15057]

SC హిందూ మాల/ కట్న ప్రసక్తి లేదు / B.Tech/C.Govt.SSA/EPFO/80,000/-PM /5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15056]

బెస్త, గంగపుత్ర/M.Tech/C.Govt. Asst మేనేజర్/కెనరా బ్యాంక్/65000/-PM/ 5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-15056]

SC హిందూ మాదిగ / M.Tech, IIT / C. Govt. టెక్నికల్ ఇంజనీర్/DRDO/1 Lakh. PM/6'ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15056]

యాదవ/ M.Tech / Govt. Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో /85000/-PM / 6' ఎత్తు /30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15056]

విశ్వబ్రాహ్మణ: కట్నప్రసక్తి లేదు/గుడ్ లుకింగ్/ 29/5'10"/B.Tech/ సాఫ్ట్ వేర్/ 2 lakh.pm/ కోట్ల ఆస్తి గుడ్ ఫ్యామిలీ గల వరుడికి వధువు కావలెను. ఫోన్: 8367619529 [HA-15061]

ముదిరాజ్: గుడ్ లుకింగ్/కట్నప్రసక్తి లేదు/ 30/5'10" / B.Tech, MS / సాఫ్ట్ వేర్ /గుడ్ జాబ్/కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. ఫోన్: 8367619529 [HA-15061]

హిందూ మాల: కట్నప్రసక్తి లేదు/గుడ్ లుకింగ్ 29/5'9"/B.Tech, సాఫ్ట్ వేర్/ 1Lakh PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరునికి వధువు కావలెను. ఫోన్: 8367619529 [HA-15061]

కుల పట్టింపు లేదు: 35y/5'5"/Pvt Job, సొంత ఇల్లు స్థిరాస్తిగల వరునికి తగిన 1వ, 2వ (పిల్లలున్న ఓకె) సాంప్రదాయ పేద కుటుంబం వధువు కావలెను. ఫోన్: 9952882957 [HA-15060]

హిందూ కుల, కట్న ప్రసక్తి లేని 34/5'7"/ 9L PA SWE / బిజినెస్ Hyd లో సొంత ఇల్లు వున్న అందమైన వరునికి, 1వ, 2 వ సంప్రదాయ పేద కుటుంబం వధువు కావలెను. 83329 96699 [B-755611]

SC - Mala - Hindu - 2nd Marriage/ PG/ 5'10"/ 40/ SWE/ 1,60,000/- pm/ Wants Good Hindu Bride Only. Cont: 8187861989, No Brokers [HA-15061]

★

బి.సి. కుల పట్టింపు లేదు: విడోయర్, వయస్సు 50సం॥లు పెన్షనర్ వరునకు OC/BC వధువు కావలెను. డైరెక్ట్ (నో బ్రోకర్స్). సంప్ర: 8309158580 [HA-15069]

★★

వాసవి ఆర్యవైశ్య వరులకు సాంప్రదాయమైన ఆర్యవైశ్య వధువులు లేదా సరి సమానమైన వధువులు వెంటనే కావలెను (కట్నం లేదు). సంప్ర: 8667325268 [IA-9935]

## వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు. మా వద్ద 1కోటి నుండి 50 కోట్లపైన ప్రాపర్టీ గల 1వ, 2వ వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా వేసుకునే వారికోసం మాత్రమే. Ph: 9676096314 [HA-15061]

రెడ్డి విడో: 32Y/B.PHARM/ సొంత బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకె) కుల, ఆస్తి, ప్రసక్తి లేదు. అన్నీ వయస్సుల వారికి 1st/2nd సంబంధాలు కలవు. Ph: 9515673252 [HA-15060]

రెడ్డి: 2nd మ్యారేజ్/Age:31/B.Com సొంత వ్యాపారం, ప్రాపర్టీస్ గల వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. కుల, ఆస్తి, పట్టింపు లేదు (ఇల్లరికం ఓకె) అన్నీ వయస్సుల వారికి 1వ, 2వ సంబంధాలకై Ph: 9059507176 [HA-15060]

వైశ్య/50y/ విడో Govt.Job / Bombay Deing Showroom/10 Lac Income/70 Acres Land/18 Cru ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 9966787546 [H-783535]

## K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

### వధువు కావలెను

Reddy/ B.Tech / MS / Job India / Handsome Boy/1996/6'/1 Cr/yr/500Cr * Cont: K.C. Reddy Mar-Bureau-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech / MS/Business/Hyd / Handsome Boy/1998/6'/450 Cr * Cont: K.C. Reddy Mar-Bureau- Hyd- Ph: 9347807015/9849321309

Reddy/BBA / LLB / Advocate Practicing - 1997 / 5'11"/ 50Cr * Cont. K.C. Reddy- Mar-Bureau- Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech / MBA/Business/ 1995 / 6' / 150Cr * Cont : K.C. Reddy-Mar-Bureau-Pvt. Ltd-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/BBA/Business /Hyd/ 1995/ 5'9"/250Cr * Cont: K.C. Reddy - Mar- Bureau - Pvt. Ltd-Hyd-Ph: 9347807015/9849321309

Reddy / B.Tech/MS/Business-Hyd/ V. Handsome Boy/1991/5'11"/ 300Cr/ 18L/ M-Rental income- * Cont : K.C. Reddy - Hyd. Ph : 9347807015/9849321309

Reddy/B.Tech / MS/H1/USA/1998/ 5'11"/ 230K/30Cr * Cont : K.C. Reddy - Mar-Bureau-Pvt-Ltd-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech /MS/H1/USA/1993/ 5'11"/ 240K / 25Cr * Cont: K.C. Reddy -Mar-Bureau-Pvt. Ltd-Hyd. Ph: 9347807015 / 9849321309

Reddy/B.Tech/MS/USA/1994/5'11"/ 400K / 30Cr * Cont: K.C. Reddy- Mar- Bureau- Pvt. Ltd - Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/ Divorcee / B.Tech/MS/Job- Hyd/1989/5'11"/60L/yr/30Cr. * Cont: K.C. Reddy-Mar-Buareau-Pvt.Ltd- Hyd. Ph: 9347807015/ 9849321309 [D-568]

### వరుడు కావలెను

Reddy/ M.Sc / Only Dauthter/ Most Beautiful/1994/5'4½"/90Cr * Cont: K.C. Reddy - Hyd - Ph: 9347807015 /9849321309

Reddy/ B.Com /1994 / 5'7"/ 50 Cr. * Cont: K.C. Reddy -Mar- Bureau-Pvt. Ltd- Hyd - Ph: 9347807015

Reddy/Most Beautiful/BBA/MBA/ 1997 / 5'4" / 100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt.Ltd-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS/1997/5'6'/500Cr/Needs any good Business Boy * Cont: K.C. Reddy - Mar-Bureau-Pvt. Ltd-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS / MD / Gen. Med- 1998 /5'5"/ 50Cr * Cont : K.C. Reddy- Mar- Bureau- Pvt. Ltd- Hyd Ph: 9347807015/ 9849321309

Reddy/MBBS/MD/1998/5'7"/70Cr/ * Cont. K.C. Reddy-Mar- Bureau-Pvt- Ltd- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/ IIT / B.Tech / M.Tech/Most Beautiful/2000/5'7"/45L/yr/10Cr * Cont : K.C. Reddy -Mar-Bureau-Pvt.Ltd- Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech / MS/ USA/100K/ 15Cr./1999/ 5'2"/ *Cont: K.C. Reddy-Mar-Buareau-Pvt. Ltd- Hyd-Ph: 9347807015/9849321309

Reddy/BBA/MS /USA-Citizen/Most Beautiful /1996 / 5'3"/115K / 30Cr * Cont: K.C. Reddy-Mar-BureauHyd. Ph: 9347807015/9849321309

Reddy/Divorcee /MBBS /MD/Most Beautiful/1994 /5'5"/50Cr * Cont : K.C. Reddy-Mar-Bureau- Hyd-Ph: 9347807015/9849321309

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No:3, Banjara Hills (TV-9, Opp: Colony) ( Near The Leela Hotel ) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings : 10 AM - 5 PM. www.avinashreddy.com +91 9848011818 / +91 9393311818

### వధువు కావలెను

రెడ్డి NewJersey, BS, 27, 6' 2", SWE, 120 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA (ISB), 32, 5' 11", Manager, 36 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 30, 5' 11", SWE, 160 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.




రెడ్డి Seattle, BE, MS, 28, 5' 8", Amazon, 200 K, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 10", Technical Specialist, 14 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 27, 5' 6", Manager, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 31, 6' 1", PG Doctor, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 7", Data Analyst, 120 K, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, B Pharm (BITS), MBA, 25, 5' 4", Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 8", SWE, 22 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Houston, BE, MS, 25, 5' 6", SWE, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 7", 1 Crore, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 3", PG Doctor, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", Consultant, 16 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

SC మాల హిందూ/B.Tech/25y/5'4"/ సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్ (Hyd) / 60K Pm చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9705960270 [H-783535]

కాపు/విడో/50y/Hydలో Own Hostels & Rents / సొంత ఫ్లాట్ షో రూం మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను (మనీ సపోర్ట్) (నో బ్రోకర్స్) Ph: 7799083500, 7386660643 [H-783535]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/Fair/ కరీంనగర్ Govt. Job/Own House (Rents) పిల్లలులేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-783535]

రజక/B.Tech/C.Govt.Asst.మేనేజర్/ కెనరా బ్యాంక్/55000/-PM/5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15057]

మాదిగ/ B.Tech / C.Govt. బ్యాంక్ PO/ SBI / 48000/-PM / 5'4"ఎత్తు /24 సం॥ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7780299703 [HA-15057]

మాల/B.Tech /C.Govt.Jr.Asst/ BSNL / 42000/-PM / 5'4"ఎత్తు /24 సం॥ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7416584304 [HA-15057]

OC/CNB, 35, 5'5", MBA, మేనేజర్, మంచి అందము గల వధువుకి 1st/2nd/ ఓపెన్ మైండ్ గల వరుడు కావలెను. వెరి అర్జెంట్. వాట్సాప్:8187053655, 6303293337 [HA-15057]

క్రిస్టియన్ మాల/ BE(CBIT) / C.Govt. Jr. ఇంజనీర్/రైల్వే/70,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15056]

రజక/M.Com / Govt. స్టాటిస్టికల్ ఆఫీసర్ / MRO /62000/-PM / 5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550166072 [HA-15056]

క్రిస్టియన్ మాదిగ/B.Tech / C.Govt. PO/ SBI బ్యాంక్ /50,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15056]

పద్మశాలి/M.Sc / Agri / Govt. గెజిటెడ్ ఆఫీసర్ / అగ్రికల్చర్ Dept/80,000/-PM/ 5'5"ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15056]

వడ్డెర/M.Sc /Govt.Jr.Asst / రెవెన్యూ Dept / 52000/-PM / 5'5"ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15056]

కుమ్మరి/C.A / చార్టెడ్ అకౌంటెంట్/ 5 Lakhs. PA/5'4"ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15056]

రెండోపెళ్ళి: 24y&25y&26y&27y&28y&29y&30y & 31y & 33y&34y&35y&36y&37y&39y&40y & 41y&42y&43y&44y&45y & 47y&48y&49y&50y/ "మా సేవ" (Since 1998): Ph: 9291503949 [HA-15061]

ఆస్తి కుల పట్టింపు లేదు: కమ్మ 25y B.Tech పెద్ద స్థిరాస్తి కలిగి యాక్సిడెంట్‌లో పేరెంట్స్‌ను కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. మీ ఫోటో డీటెయిల్స్ వాట్సాప్‌లో పంపించండి. Ph: 8142060040 [HA-15061]

కుల పట్టింపు లేదు: 48/C.Govt job/70 వేల p.m/1 గ్రా. గోల్డ్ బిజినెస్/6 లక్షల రెంట్స్/ పొలాలు 30ఎ./తోటలు/30కోట్ల ప్రాపర్టీ పుత్ర ఫ్యామిలీని యాక్సిడెంట్‌లో కోల్పోయిన వధువుకి వరుడు కావలెను పిల్లలు ఓకా/ ఇల్లరికం ఓకే. Ph: 8790130957 [HA-15061]

రెడ్డి: చాలా అందమైన/2వ పెళ్లి/పిల్లలు లేరు/29/5'5"/B.Tech/ సాఫ్ట్ వేర్/కోట్ల ఆస్తి/గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [HA-15061]

హిందూ మాల: గుడ్ లుకింగ్/27/5'4"/ PG/ గుడ్ జాబ్/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [HA-15061]

రెడ్డి విడో: Age:35/ Degree. PVT Job గల అందమైన వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు ఇల్లరికం అయిన ఓకె అన్నీ కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 9603747809 [HA-15060]

## వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, కటిక, రెడ్డి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-783535]

Personal Service: సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్, VIP వారికి అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోని,తిరుపతి, 70937 22724. [T-3262]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15064]

Arya Vysya పెళ్ళి సంబం ధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15064]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15064]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15064]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15064]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-1423]



## తలుపుతట్టి.. ప్రోత్సహించి

నిరుపేద విద్యార్థి భరత్‌చంద్రచారి ఇంటికి కలెక్టర్ హనుమంతరావు



భరత్‌చంద్రచారికి మిఠాయి తినిపిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం: చదువులో లక్ష్యం సాధించే వరకు అండగా ఉంటానని పదో తరగతి విద్యార్థికి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భరోసా ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం దేశ్యాతండాలోని పదోతరగతి విద్యార్థి దేవరకొండ భరత్ చంద్రచారి ఇంటిని శనివారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. టెన్త్‌లో 73 శాతం మార్కులు రావడంతో మిఠాయిలు తినిపించి, శాలువాతో సన్మానించారు. పాలిటెక్నిక్ మెటీరియల్‌ను అందజేశారు. హామీ ఇచ్చినట్లుగానే నెల కు రూ.5 వేలు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. అనంతరం విద్యార్థి తల్లి విజయలక్ష్మిని కూడా సన్మానించారు. 'విద్యార్థుల ఇంటి తలుపు తట్టి' కార్యక్రమంలో భాగంగా సంస్థాన్‌నారాయణపురం పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. చదువులో వెనకబడి, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న భరత్‌చంద్రచారి గురించి తెలుసుకుని అతన్ని దత్తత తీసుకున్నారు. ఉదయం 5.30 గంటలకు భరత్‌చంద్రచారి ఇంటికి వెళ్లి స్టడీ చైర్, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. హామీ ఇచ్చిన మేరకు రూ.5 వేలు, నిత్యావసరకులు అందజేశారు. ఈ మేరకు తన ప్రోత్సాహంతో ఉత్తమ మార్కులు సాధించిన భరత్‌చంద్రచారి ఇంటిని కలెక్టర్ శనివారం సందర్శించారు.

# కుట్టు స్కీమ్.. రూ.146 కోట్ల స్కామ్

## ఏపీలో రూ.257 కోట్ల పథకంలో దోపిడీకి ముఖ్య నేత పన్నాగం

- మహిళలకు టైలరింగ్ శిక్షణలో స్కామ్
- స్కీం అంచనాలు అమాంతం పెంపు
- టెండర్ల దశ నుంచే పలు అక్రమాలు
- తక్కువ కోట్ చేసిన సంస్థను కాదనిమిగతా రెండు సంస్థలకు కాంట్రాక్టు

కంకిపాడు నుంచి సాక్షి ప్రతినిధి: చంద్రబాబు ప్రభుత్వం తన అవినీతికి కాదేదీ అనర్హం అన్నట్టు వ్యవహరిస్తోంది. బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యూఎస్), కాపు మహిళలకు ఇచ్చే కుట్టు శిక్షణలోనూ రూ.వంద కోట్లకు పైగా కొల్లగొట్టడానికి స్కెచ్ వేసింది. రాష్ట్రంలో 1,02,832 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందించే పేరుతో చేపట్టిన స్కీమ్‌లో దోపిడీకి తెగబడుతోంది. ముఖ్య నేత సమక్షంలో జరిగిన ముందస్తు ఒప్పందాలతోనే ఈ స్కీమ్‌ను తెరమీదకు తెచ్చారని తెలుస్తోంది. ఇందులో ముఖ్య నేత నుంచి సంబంధిత శాఖ మంత్రి, అధికారుల వరకు ఎవరి వాటా ఎంత అనేది ఒప్పందాలు కుదుర్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు కుట్టు శిక్షణ పథకానికి సంబంధించి 'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశోధనలో విస్మయకర అంశాలు వెలుగుచూశాయి. -అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న రాష్ట్రంలో లక్ష మందికి పైగా మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. 175 నియోజకవర్గాల్లోనూ మూడు నుంచి ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎంపిక చేసిన మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. ఇది జరిగి 45 రోజులు దాటినా 50 నియోజకవర్గాల్లో కూడా శిక్షణ మొదలుకాలేదు.



కృష్ణా జిల్లా కంకిపాడులోని శిక్షణా కేంద్రంలో తుప్పపట్టి.. పెడల్ విరిగిపోయి ఉన్న కుట్టు మిషన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### టెండర్ల దశ నుంచే మాయాజాలం

టెండర్లలో తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థకు కాంట్రాక్టును ఖరారు చేస్తారని తెలిసిందే. కానీ, అందుకు విరుద్ధంగా.. తక్కువ కోట్ చేసినవారితో పాటు అంతకంటే ఎక్కువకు కోట్ చేసిన మరో రెండు సంస్థలను కలిపి రంగంలోకి దించారు. ప్రీ బిడ్‌లో మొత్తం 65 కంపెనీలు పాల్గొంటే 56 సంస్థలను ముందే తిరస్కరించారు. విచిత్రం ఏమంటే.. కుట్టు శిక్షణలో విశేష అనుభవంతో పాన్ ఇండియా కంపెనీగా గుర్తింపున్న ఐసీపీ కూడా ఇందులో ఉండడం. మిగిలిన 9 కంపెనీల్లో ఆరు సంస్థల టెండర్లను తెరవకముందే తమదైన శైలిలో పక్కకు తప్పించేశారు. అంటే.. మొత్తం 65 కంపెనీల్లో 62ను తొలగించేశారు.

### ఎల్1కు 5 శాతమే పని..

చంద్రబాబు ప్రభుత్వం తమవారికి శిక్షణ కాంట్రాక్టు అప్పగించడానికి ఇన్ని అడ్డంకులు పెట్టినా తట్టుకుని.. శ్రీ టెక్నాలజీ తక్కువ మొత్తానికి కోట్ చేసి ఎల్1గా నిలిచింది. కానీ, దానిని బెదిరించి 5 శాతం పని మాత్రమే అప్పగించారు. కీలక నేత ప్రమేయంతో.. ఎల్2, ఎల్3గా నిలిచిన సంస్థలకు మాత్రం 95 శాతం పని ఇచ్చారు. ఈ రెండు సంస్థలు (ఎల్2, ఎల్3) సిండికేట్ కావడం మరో ట్విస్ట్.

### రూ.257 కోట్లు స్కీ (స్కా)మ్ ఇలా..

- మొదట యూనిట్‌కు రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.257 కోట్లు ప్రతిపాదించారు
- టెండర్‌లో యూనిట్‌కు రూ.21,500 వంతున 1,02,832 మంది మహిళలకు మొత్తం రూ.221,08,88,000
- ఇందులో ఒక్కో కుట్టు మిషన్ రూ.4,300 లెక్కన: రూ.44,21,77,600
- ఒక్కొక్కరికి శిక్షణ కోసం రూ.3 వేలు చొప్పున: రూ.30,84,96,000
- ఒక్కొక్కరికి కుట్టు మిషన్, శిక్షణ కలిపి: రూ.7,300. ఈ ప్రకారం మొత్తం అయ్యేది 75,06,73,600.
- రూ.221,08,88,000 కోట్లలో రూ.75,06,73,600 కోట్లు పోగా 146,02,14,400 స్కామ్

### ఒక్క కుట్టు మిషన్‌కు ఏ సంస్థ ఎంతకు కోట్ చేసిందంటే..?

| శ్రీ టెక్నాలజీ ఇండియా (ఎల్ఎల్‌పీ)–హైదరాబాద్ | సోషల్ ఏజెన్సీ ఫర్ పీపుల్స్ ఎంపవర్‌మెంట్–హైదరాబాద్ |
|---|---|
| రూ.21,798 | రూ.23,400 |

సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్–హైదరాబాద్ రూ.23,500

## తిరుమల భక్తులకు పోలీస్ సేవలు



భక్తులకు సమాచారాన్ని అందిస్తున్న పోలీసులు

తిరుమల: తిరుమలలో శ్రీవారి ఆలయం సమీపంలో 'మే ఐ హెల్ప్ యు'అనే సరికొత్త సేవలను తిరుమల పోలీసులు శనివారం ప్రారంభించారు. తిరుమలలో ప్రధాన ప్రాంతాలైన లడ్డు కౌంటర్, ఆలయం నుంచి బయటకు వచ్చే మార్గం, అఖిలాండం, రాంబగీచా, బస్టాండ్, సీఆర్‌వో, అన్నదానం, లగేజీ కౌంటర్, వరాహస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో 'మే ఐ హెల్ప్ యు'అనే జాకెట్లు ధరించి పోలీసులు తిరుగుతూ ఉంటారు. వీరు నిరంతరం భక్తులతో మాట్లాడుతూ వారడిగే సమాచారం ఇస్తుంటారు. తిరుమల శ్రీవారి భక్తులకు భద్రతతో పాటు సమాచారం అందించేందుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ జానయ్య వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, రసాయన మందులను తగ్గించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందుకొచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'అనే కార్యక్రమాన్ని సోమవారం నుంచి రాష్ట్రంలో ప్రారంభించాలని నిర్ణయించింది. జూన్ 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 1,200 రెవెన్యూ గ్రామాల్లో 200 శాస్త్రవేత్తల బృందాలు పర్యటించి రైతులకు ప్రధానంగా ఆరు అంశాలపై అవగాహన కల్పిస్తాయని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య తెలిపారు. శనివారం సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రతి ఏటా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమం జరిగేదని , 2006 నుంచి ఆ కార్యక్రమం నిలిచిపోయిందని చెప్పారు. సంక్షోభంలో ఉన్న రైతును ఆదుకునేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం తీసుకుందని అన్నారు. దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, ఉపాధ్యాయులు, అభ్యుదయ రైతులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొంటారు. అదేవిధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయనున్నట్లు ఆయన వివరించారు. ఉపాధ్యాయులు తమ ప్రాంతాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్‌రెడ్డి కోరారు. వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవుతుందని వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమం నోడల్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి ఉపాధ్యాయ సంఘం నాయకులు గుండా లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి మాట్లాడారు.

# అంచనాకు మించి కరెంటు డిమాండ్

- 2026లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 19,500 మెగావాట్లు ఉండొచ్చు
- ఆ మేరకు విద్యుత్ వ్యవస్థలను పటిష్ట పరచాలి
- 2030 నాటికి రాష్ట్రంలో 6,000 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు
- సమీక్షల్లో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



సమీక్షిస్తున్న జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ పంపిణీ వ్యవస్థల సామర్థ్యం పెంచాలని రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ అంచనాలకు మించి పెరుగుతోందని తెలిపారు. ఈ ఏడాది 16,877 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేయగా, వాస్తవ గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లకు పెరిగిపోయిందని గుర్తుచేశారు. 2026లో 18,138 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉంటుందని సీఈఏ అంచనా వేయగా, వాస్తవ డిమాండ్ 19,000–19,500 మెగావాట్ల మధ్య ఉండొచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశించారు. విద్యుత్‌సౌధలో శనివారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి విద్యుత్ పంపిణీ వ్యవస్థ భవిష్యత్తు ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, పఠాన్‌చెరు, కందుకూరు, మేడ్చల్ డివిజన్ పరిధిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 20 శాతం వరకు పెరగనుందని అంచనాలున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు 40 శాతం సామర్థ్యం పెంచుకోవాల్సి ఉంటుందని అన్నారు.

### 6,000 ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు..

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో 2030 నాటికి 6,000 ఎలక్ట్రిక్ వెహికల్ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. ఛార్జింగ్ పాయింట్ల ఆపరేటర్లతో శనివారం విద్యుత్ సౌధలో ఆయన సమావేశమయ్యారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేయాలని కోరారు. వీటి ఏర్పాటులో ఆపరేటర్లకు సహకరించడానికి డిస్కం, రెడ్కోలు చర్యలు తీసుకున్నాయని తెలిపారు. ఎల్టీ–9 కేటగిరీ కింద ఛార్జింగ్ స్టేషన్ల లోడ్ సామర్థ్యాన్ని 56 కేడబ్ల్యూ/75 హెచ్‌పీ నుంచి 150 కేడబ్ల్యూ/201 హెచ్‌పీకి పెంచడంతో విద్యుత్ ఛార్జీల విషయంలో రాయితీ లభిస్తుందని చెప్పారు. సమావేశంలో ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సీతా దయాకర్‌రెడ్డి నియామకంపై వివరణ ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతా దయాకర్‌రెడ్డి నియామకంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 17కు వాయిదా వేసింది. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం గత నెల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నియామకాన్ని సవాల్ చేస్తూ నల్లగొండకు చెందిన చింతా కృష్ణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2015 కేంద్ర చట్టం నిబంధనల ప్రకారం ఆ రంగంలో కనీసం 10 ఏళ్ల అనుభవం ఉన్న వారినే బాల కార్మికుల కమిషన్ చైర్మన్‌గా నియమించాలన్నారు. ఈ నిబంధనలకు విరుద్ధంగా సీతా దయాకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించిందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నియామకంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

## పిల్లలతోపాటు తల్లిదండ్రులూ కోర్టుకు!

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి వివరాలను ఆర్టీఏ అధికారులు పంపిస్తున్నారు. వీటి ఆధారంగా ఆ విభాగం వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తోంది. సాధారణంగా 18 ఏళ్లు నిండిన వ్యక్తి మొదట లెర్నింగ్ లైసెన్స్, ఆపై శాశ్వత లైసెన్స్ తీసుకోవచ్చు. అయితే ఇలా డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మైనర్‌కు మాత్రం 25 ఏళ్లు నిండేవరకు ఈ రెండింటిలో ఏదీ తీసుకోవడానికి అవకాశం లేకుండా ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎవ్వరూ మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని జోయల్ డెవిస్ కోరుతున్నారు.

## క్లుప్తంగా...

### చర్లపల్లి టెర్మినల్‌లో ఊడిపడిన సీలింగ్



కుషాయిగూడ (హైదరాబాద్): మూడు నెలల క్రితమే ప్రారంభమైన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో శనివారం ఈదురు గాలులు, వడగండ్ల వాన కారణంగా సీలింగ్ ఊడి పడింది. ఆ సమయంలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వర్షంతోపాటు ఈదురు గాలులు బలంగా వీచడంతో చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రధాన ద్వారం ముందుభాగం సీలింగ్ ఊడి కింద పడిపోయింది. కాగా టెర్మినల్ నిర్మించిన మూడు నెలలకే ఈ ఘటన జరగడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

### సాహసక్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలి

బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు సాహసక్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సూచించారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులకు సెయిలింగ్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని గమనించి క్రీడలు, ఆర్ట్స్, మ్యూజిక్, క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు సెయిలింగ్ క్రీడలో శాస్త్రీయ శిక్షణతో పాటు నీటిలో నైపుణ్యం, సహనం, చురుకుదనం వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన వారిని జూన్ నెలలో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ సెయిలింగ్ పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.

### ఈ వాహనాలు ఎవరివి?

సాక్షి, హైదరాబాద్: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న 1750 వాహనాల యజమానులు తమను సంప్రదించాలని కొత్వాల్ సీపీ ఆనంద్ శనివారం కోరారు. అంబర్‌పేటలోని ఎస్ఏఆర్ సీపీఎల్ మైదానంలోని ఈ వాహనాల వివరాలు సిటీ పోలీసు అధికారిక వెబ్‌సైట్‌లో (www.hyderabadpolice.gov.in) ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని సరిచూసుకుని, యజమానులు ఎవరైనా ఉంటే బంజారాహిల్స్ ఐసీసీసీలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఎవరూ క్లెయిమ్ చేసుకోని వాహనాలను వేలంలో విక్రయించాలని నిర్ణయించినట్లు సీపీ ఆనంద్ స్పష్టం చేశారు.

### పూర్తిగా మహిళలతో గనుల నిర్వహణ

- మహిళా ఉద్యోగులు పెరగడంతో సింగరేణి సీఎండీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో మహిళా ఉద్యోగులు పెరిగిన నేపథ్యంలో పూర్తిగా వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్, మరో భూగర్భ గనిని ఎంపిక చేయాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళలతోనే నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కొత్త ఉద్యోగులకు భూగర్భ గనుల్లో పోస్టింగులు ఇవ్వాలన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం ఏరియాల జీఎంలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే తొలి త్రైమాసికాన్ని సద్వినియోగం చేసుకుని 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు 1,200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. గతేడాది ఏప్రిల్ నెలతో పోల్చితే ఈ ఏడాది ఏప్రిల్‌లో బొగ్గు రవాణాను 2.7 శాతం వృద్ధితో 5.66 మిలియన్ టన్నుల నుంచి 5.81 మిలియన్ టన్నులకు, ఓవర్ బర్డెన్ తొలగింపును 10.6 శాతం వృద్ధితో 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల నుంచి 40 మిలియన్ క్యూబిక్ మీటర్లకి పెంచినట్టు వెల్లడించారు. ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సిబ్బందిని ఎంపిక చేసి నెలలోగా పంపించాలని ఆదేశించారు. బొగ్గు నాణ్యతపై కింది నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మీరు తినే పనీర్.. సహజమైనదేనా?

**హోటళ్లలో పెరిగిన ప్రత్యామ్నాయ పనీర్ వాడకం**

| దీనివల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు | మెనూలో పనీర్ వివరాలు పెట్టాల్సిందే | హోటళ్లకు ఇకపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు |
|---|---|---|

పనీర్... శాకాహారుల హై ప్రొటీన్‌ఫుడ్!
పాలక్ పనీర్.. పనీర్ టిక్కా.. పనీర్ 65..
చిల్లీ పనీర్.. పనీర్ బటర్ మసాలా..
ఇలా రకరకాల వెరైటీలతో రెస్టారెంట్లలో చవులూరిస్తూ ఉంటుంది పనీర్! చాలామంది బయట షాపుల్లో దొరికే పనీర్ తెచ్చుకుని ఇంట్లోనూ ఎన్నో రకాల వెరైటీలు ట్రై చేస్తుంటారు.
మీకు తెలుసా.. లీటరు తాజా పాల (గేదె) నుంచి ఎంత పనీర్ తయారుచేయవచ్చో?
గరిష్ఠంగా 150 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు, అంతే!
మరి ఇన్ని వందల వేల రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లలో అంతంత పనీర్ ఎలా దొరుకుతోంది?
అది ఆర్గానిక్ పనీర్ అంటే తాజా పాలతో తయారైనది కాదన్నట్టే కదా!
అన్నట్టే ఏంటీ.. ఉన్న మాటే!



(సాక్షి, స్పెషల్ డెస్క్)

మనందరికీ పాల ఉత్పత్తులైన పెరుగు, పనీర్ తెలుసు. కానీ, ప్రత్యామ్నాయ డైరీ ఉత్పత్తుల గురించి మీరు విన్నారా? ఇవి పాలతో కాకుండా సింథటిక్ పదార్థాలతో తయారవుతాయి. అనేక హోటళ్లు, సూపర్ మార్కెట్లలో వీటి తాకిడి ఇప్పుడు ఎక్కువైపోయింది. అందుకే, పనీర్ సహా ప్రత్యామ్నాయ డైరీ ఉత్పత్తులు అన్నిటి అమ్మకాల మీద ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కొన్ని నిబంధనలను విధించనుంది.

**ఇది సహజ పనీర్...**

సాధారణంగా పనీర్‌ను.. పాలను కాచి అందులో నిమ్మరసమో లేదా వెనిగరో లేదా సిట్రిక్ ఆసిడో వేసి విరగ్గొడతారు. అలా వచ్చిన దాన్ని ఒక గుడ్డలో వేసి.. అందులోని నీరంతా పోయేవరకు వడకడతారు. తర్వాత దాన్ని చల్లటి నీటిలో ఓ రెండు మూడు గంటల పాటు వేసి ఉంచుతారు. దాంతో అది మృదువుగా తయారువుతుంది. ఇది పాల నుంచి పనీరు తయారయ్యే ప్రక్రియ.

**ప్రత్యామ్నాయ పనీర్ ఇలా..**

ఈ ప్రత్యామ్నాయ పనీర్‌ను పామాయిల్ లాంటి వెజిటబుల్ ఆయిల్స్, స్టార్చ్‌లు లాంటి వాటితో తయారుచేస్తారు. ఇది చూడటానికి అచ్చంగా సహజమైన పనీర్ లాగే కనపడుతుంది. కానీ రుచిలో కొంత తేడా ఉంటుంది. కృత్రిమంగా తయారైన ఈ పనీర్ ఆరోగ్యం మీద దుష్ప్రభావాలను చూపిస్తుంది. హోటళ్లలో ఇలాంటి ప్రత్యామ్నాయ పనీర్‌నే వండి వడ్డిస్తున్నారని.. ఇటీవల చాలా పేరున్న హోటళ్లలో జరిగిన ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ రైడ్స్‌లో తేలింది. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి.

**వినియోగదారుడికి తెలియాల్సిందే**

ఇటీవల ప్రత్యామ్నాయ పనీర్ అమ్మకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇక నుంచి ప్రతి రెస్టారెంట్.. తమ దగ్గరున్న పనీర్ ఎలాంటిదో మెనూలో స్పష్టంగా తెలియజేయాలనే నిబంధన పెట్టబోతోంది. తాను ఎలాంటి పనీర్‌ను ఆర్డర్ చేస్తున్నాడో వినియోగదారుడికి కచ్చితంగా తెలియాలని.. ఆ చాయిస్ వాళ్లకుండాలని చెబుతోంది.అంతేకాదు అమ్మకందారులు కూడా ఈ కృత్రిమ డెయిరీ ఉత్పత్తుల మీద.. పాల ఉత్పత్తుల కేటగరీలో ఈ కృత్రిమ లేదా ప్రత్యామ్నాయ పాల ఉత్పత్తులను పరిగణించరాదని స్పష్టం చేయనుంది. అంతేకాదు, వాటి మీద డెయిరీ ప్రోడక్ట్స్ అనే లేబుల్ వేయకూడదనే కఠిన నిబంధనను కూడా అమలుచేయనుంది. నిజానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ 2011 నిబంధనల ప్రకారం.. ఈ కృత్రిమ పాల ఉత్పత్తులను డెయిరీ ప్రోడక్ట్స్‌గా, మిశ్రమ పాల ఉత్పత్తులుగా పరిగణించరు. అందుకే వీటి మీద పాల ఉత్పత్తులు అని లేబుల్ వేయకూడదు. కృత్రిమ పాల ఉత్పత్తుల మీద 'పాల ఉత్పత్తులు' అని లేబుల్ అతికించడం.. కొనుకోలుదారులను తప్పుదోవ పట్టించడమే కాదు, ఒకరకంగా మోసం చేయడం కూడా అని చెబుతున్నారు నిపుణులు. దీనికి సంబంధించి వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ త్వరలోనే కొన్ని మార్గదర్శకాలను వెలువరించనుంది.

**ఇలా ఫిర్యాదు చేయవచ్చు**

ఒకవేళ ఎవరైనా కృత్రిమ పాల ఉత్పత్తులను సహజమైనవిగా లేబుల్ వేసి అమ్మడం కొనుగోలుదారుల దృష్టికి వస్తే ఎఫ్ఎస్ఎస్ఏఐ యాప్‌లో గానీ, వెబ్‌సైట్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని చెబుతున్నారు ఎఫ్ఎస్ఎస్ఏఐ సిబ్బంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇకనుంచి ప్రతి కొనుగోలుదారుడు సూపర్ మార్కెట్లలో, డెయిరీ ఫామ్స్‌లో, రెస్టరెంట్లలో.. ఇలా ఎక్కడైనా తాము కొనబోయే / ఆర్డర్ చేయబోయే డెయిరీ ప్రోడక్ట్ సహజమైనదా లేదా కృత్రిమంగా తయారైనదా అనే వివరాలు చూసుకోవచ్చు. ఆ వివరాలు లేకపోతే అడిగి మరీ ఆ వివరాలను లేబుల్ మీద.. రెస్టరెంట్లలో అయితే మెనూలో పొందుపరచాలని డిమాండ్ చేయవచ్చు. ఒకవేళ వివరాలు ఉన్నా అవి అస్పష్టంగా ఉంటే ఫిర్యాదూ చేయవచ్చు.

# రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లు

**జీహెచ్ఎంసీ మినహా ఇతర పురపాలికల్లో ఎర్లీబర్డ్ కింద రూ. 400.36 కోట్లు వసూలు**

**కరీంనగర్ జిల్లా జమ్మికుంట, హుజూరాబాద్‌లలో 50 శాతం కన్నా ఎక్కువ వసూళ్లు**



సాక్షి, హైదరాబాద్: ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుల కోసం పురపాలక శాఖ ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ పథకానికి మంచి స్పందన లభించింది. కొత్త ఆర్థిక సంవత్సరానికి ఏడాది కాలంలో చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఏప్రిల్ నెలలోనే చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించే ప్రక్రియ గత కొన్నేళ్లుగా పురపాలక శాఖ అమలు చేస్తుంది. అందులో భాగంగా 2025–26 సంవత్సరానికి 5 శాతం రాయితీని ఉపయోగించుకొన్న ప్రజలు గత నెలలోనే రూ. 400.36 కోట్లు చెల్లించారు. మొత్తం ఆస్తిపన్ను డిమాండ్ రూ. 2,264.84 కోట్లు ఉండగా, ఒక్క నెలలోనే ముందస్తుగా 17.68 శాతం చెల్లించడం గమనార్హం. ఇది పురపాలక శాఖలో ఒక రికార్డుగా సీడీఎంఏ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో రూ. 900.9 కోట్లు ఎర్లీబర్డ్ కింద వసూలు కాగా, జీహెచ్ఎంసీ మినహా మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో రూ. 400.36 కోట్లు వసూలు కావడం పట్ల పురపాలక శాఖలో హర్షం వ్యక్తమవుతోంది. గత సంవత్సరం ఎర్లీబర్డ్ కింద రూ. 317.84 కోట్లు (14.80 శాతం) వసూలు కాగా, ఈ సంవత్సరం మరో 3 శాతం పెరిగింది. మొత్తం సంవత్సరానికి వసూలు చేసే పన్నుల్లో జమ్మికుంట మునిసిపాలిటీలో ఎర్లీబర్డ్ కింద 54.78% , హుజూరాబాద్ 51.85% వసూళ్లుచేసి 50 శాతం కన్నాఎక్కువగా వసూలు చేసిన జాబితాలో అగ్రగామిగా నిలిచాయి.

**అధికారులను అభినందించిన సీడీఎంఏ**

కాగా బొల్లారం, రామగుండం కార్పొరేషన్, గుమ్మడిదల, పీర్జాదిగూడ కార్పొరేషన్, తూముకుంట, మద్దూర్, గుండ్లపోచంపల్లి, నిజాంపేట కార్పొరేషన్, చౌటుప్పల్, నాగారం, నార్సింగి, సిద్దిపేట, నారాయణఖేడ్, రాయికల్, కోదాడలలో 30 శాతం కన్నా ఎక్కువగా వసూళ్లు చేసినట్లు సీడీఎంఏ శ్రీదేవి తెలిపారు. కొత్తగా ఏర్పాటైన పురపాలక సంఘాలు గుమ్మడిదల (42%), మద్దూర్ (34.2%), గడ్డపోతారాం (26.24%), మొయినాబాద్ (21.41%), చేవెళ్ల (21.26%) ఎర్లీబర్డ్ వసూళ్లలో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తగిన సమయంలో స్పందించి ముందస్తు పన్ను వసూళ్లు చేసిన కమిషనర్లను, ఇతర అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు. కాగా 10 శాతం కన్నా తక్కువ వసూళ్లు సాధించిన పురపాలికల్లో వరంగల్ కార్పొరేషన్, మెదక్, వర్ధన్నపేట, చేర్యాల, వైరా, పోచంపల్లి, భైంసా, ఇంబ్రహీంపట్నం, జలపల్లి, సదాశివపేట, వనపర్తి, ఆదిలాబాద్, దేవరకొండ, బోధన్, అశ్వారావుపేట, స్టేషన్ ఘనపూర్, ఎదుల్లపురం, భూపాలపల్లి, ఆసిఫాబాద్ ఉన్నాయి.

# పోలీసులు ప్రజల అభిమానం పొందాలి



**డీజీపీ జితేందర్**

- అమెరికా మాదిరి ప్రజలకు చేరువ కావాలి

సాక్షి, హైదరాబాద్ : అమెరికాతో పాటు కొన్ని దేశాల్లోని ప్రజలు పోలీసులను మిత్రులుగా భావిస్తారని, ఆ స్థాయిలో తెలంగాణ పోలీసులు సైతం ప్రజల అభిమానం పొందాలని డీజీపీ జితేందర్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్‌తో కలసి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్‌హెచ్ఓల)తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, తద్వారా వారికి చేరువ కావాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులకు మంచి పేరు రావడంతోపాటు వారి హృదయాల్లో నిలిచిపోతారని, అది సర్వీస్‌లో ఎప్పటికీ గుర్తుంటుందని అభిప్రాయపడ్డారు. పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే పోలీసులకు చెడ్డ పేరు వస్తుందని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పాత్ర కీలకమని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, తప్పులు చేస్తే ఎంతోమందికి సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుందని, ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు చెప్పారు. డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలకు గట్టి భద్రత కల్పించడం ప్రధానమన్నారు. కొన్ని మహిళా సంస్థలు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నాయని, వాటిని గమనించి పోటీల్లో పాల్గొనే వారికి తగిన భద్రత కల్పించాలని సూచించారు. అదేవిధంగా నకిలీ విత్తనాలను అరికట్టడంలో అప్రమత్తతతో ఉండాలన్నారు.

# ఎస్సీ గురుకులంలో మళ్లీ బదిలీలు

- బాలికల విద్యాసంస్థల్లోని పురుష ఉద్యోగులను బదిలీ చేస్తున్న సొసైటీ
- దాదాపు 500 మందికి స్థానచలనం కలిగించిన ఎస్సీ గురుకుల సొసైటీ
- ఏకపక్షంగా బదిలీ చేస్తున్నారని పురుష ఉద్యోగుల నిరసన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)లో బదిలీల లొల్లి మొదలైంది. గత ఏడాది సాధారణ బదిలీల సమయంలోనే అర్హత ఉన్న పలువురు బోధన, బోధనేతర సిబ్బందిని బదిలీ చేయగా.. తాజాగా బాలికల విద్యా సంస్థల నిబంధనలకు లోబడి గురుకుల సొసైటీ అధికారులు మరోమారు బదిలీలకు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 1274 ఉత్తర్వులను అనుసరించి బాలికల విద్యాసంస్థల్లో పూర్తి స్థాయిలో మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులే ఉండాలని నిర్ణయించిన సొసైటీ అధికారులు, ఈ నిబంధనను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు జనరల్ విద్యా సంస్థలు, బాలికల విద్యా సంస్థలకు ప్రత్యేక రోస్టర్‌ను అనుసరిస్తున్నారు. ఇప్పటికే బాలికల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పురుష ఉద్యోగులను గుర్తించిన సొసైటీ అధికారులు.. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి జనరల్ పాఠశాలల్లో పని చేసే విధంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు.

**ఖాళీలున్నచోట పోస్టింగ్**

ప్రస్తుతం ఎస్సీ బాలికల విద్యా సంస్థల్లో దాదాపు 500 పైబడి బోధన, బోధనేతర పురుష సిబ్బంది ఉన్నట్లు అంచనా. వీరికి జనరల్ విద్యా సంస్థల్లో ఖాళీలకు అనుగుణంగా పోస్టింగ్ ఇవ్వాలని గురుకుల సొసైటీ కార్యదర్శి జోనల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జోనల్ అధికారులు పలువురు జూనియర్ లెక్చరర్లు, పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ ఏకపక్ష బదిలీలపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. గతేడాది సాధారణ బదిలీల్లో స్థానచలనం కలిగిన వారిని ప్రస్తుతం ఏకపక్షంగా బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. జీఓ 1274 నిబంధనలను గత సాధారణ బదిలీల సమయంలోనే అమలు చేస్తే సరిపోయేదని, ఇప్పుడు ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో ఖాళీలు లేకుండా పోయాయని ఉద్యోగులు మండిపడుతున్నారు. కోరుకున్న చోట బదిలీ అయ్యేందుకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా, అధికారులు వారికి నచ్చిన చోట ఏకపక్షంగా పోస్టింగ్ ఇవ్వడాన్ని తప్పుబడుతున్నారు. ఈ అంశంపై పలువురు ఉద్యోగులు న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# హెచ్ఎండీఏకి 5 లక్షల జరిమానా

**సైబరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వేకు చెల్లించాలన్న హైకోర్టు**

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్‌తో వివాదంలో.. ఆర్బిట్రేషన్ అవార్డు షరతులను పాటించనందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)కు హైకోర్టు రూ.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తం చెల్లించేందుకు రెండు వారాల గడువిచ్చింది. 2019 నుంచి ఎక్స్‌ప్రెస్‌వేకు ఆర్బిట్రేషన్ అవార్డు ఫలాలు అందకుండా పోయాయని.. ఆరేళ్లకు పైగా కోర్టుల్లో విచారణ ఎదుర్కొనాల్సి వచ్చిందని అభిప్రాయపడింది. హెచ్ఎండీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో భాగంగా కొల్లూరు నుంచి పటాన్‌చెరు వరకు 8 లైన్ల ఎక్స్‌ప్రెస్‌వే రూపకల్పన, నిర్మాణం, నిర్వహణకు హెచ్ఎండీఏతో సైబరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వేకు 2007, ఆగస్టు 17న ఒప్పందం కుదిరింది. దీనిపై వివాదం తలెత్తడంతో ఇరుపక్షాలు మధ్యవర్తిత్వానికి వెళ్లగా.. 2019, ఫిబ్రవరి 27న తీర్పు వెలువడింది. ఈ మేరకు రూ.140,89,01,800తో పాటు రూ.39,50,00,000లను 12 శాతం వడ్డీతో ఎక్స్‌ప్రెస్‌వేకు చెల్లించాల్సి ఉంది. అవార్డు వెలువడిన తర్వాత హెచ్ఎండీఏ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రతివాది సైబర్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్‌కు రూ.5 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

# ఆ ఆస్తులు ఎలా కొన్నారు?



- రెండో రోజూ హరిరామ్‌ను ప్రశ్నించిన ఏసీబీ
- సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న ఆస్తులపై అధికారుల ఆరా

సాక్షి, హైదరాబాద్ : 'ఆ ఆస్తులు ఎలా కొనుగోలు చేశారు? ఇందుకు మీకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? మీ కుటుంబ సభ్యుల వేతనాలు కాకుండా మీకు ఇతర ఆదాయ మార్గాలు ఉన్నాయా? ఉంటే వాటి ద్వారా ఎంత వార్షిక ఆదాయం వస్తుంది? మీ పేరిట, ఇతర కుటుంబ సభ్యుల పేరిట ఉన్న స్థిర, చరాస్తులు ఎప్పుడెప్పుడు కొనుగోలు చేశారు?'ఇలా పలు అంశాలపై ఏసీబీ అధికారులు ఈఎన్సీ హరిరామ్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. కస్టడీలో భాగంగా ఏసీబీ అధికారులు శనివారం రెండో రోజూ హరిరామ్‌ను ప్రశ్నించారు. ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ కేంద్ర కార్యాలయానికి హరిరామ్‌ను తరలించిన ఏసీబీ అధికారులు, పలు అంశాలపై ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఏసీబీ అధికారుల ప్రశ్నలకు హరిరామ్ ముక్తసరి సమాధానాలతోనే సరిపెట్టినట్టు సమాచారం. గతనెల 26న హరిరామ్ ఇల్లు, బంధువుల ఇళ్లలో సోదాల సందర్భంగా సేకరించిన పలు ఆస్తుల పత్రాలను ఆయన ముందుంచి అధికారులు వివరాలు సేకరించినట్టు తెలిసింది. సోదాల సందర్భంగా దాదాపు రూ.9 కోట్ల మేర ఆదాయానికి మించిన ఆస్తులను ఏసీబీ గుర్తించిన విషయం తెలిసిందే. హరిరామ్ 1989లో ఉద్యోగంలో చేరిన నాటి నుంచి 2025 ఏప్రిల్ 25 వరకు వివిధ మార్గాల్లో ఆర్జించిన ఆదాయం సుమారు రూ.6.74 కోట్లు ఉంటుందని, అందులో ఆయన కుటుంబ జీవన శైలి మేరకు లెక్కకడితే కుటుంబ ఖర్చులకే ఇన్నేళ్లలో రూ.3.05 కోట్ల మేర ఖర్చవుతుందని ఏసీబీ అధికారులు లెక్కకట్టారు. దీని ప్రకారం చూస్తే.. రూ.9 కోట్ల ఆస్తులు ఎలా కూడబెట్టగలిగారు, ఇందుకు ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందన్న కోణంలో శనివారం జరిగిన విచారణలో హరిరామ్‌ను ఏసీబీ అధికారులు ప్రధానంగా ప్రశ్నించినట్టు తెలిసింది. కాగా, ఆదివారం కూడా ఏసీబీ అధికారులు హరిరామ్‌ను ప్రశ్నించనున్నారు.

# అన్‌'లిమిట్' దోపిడీ

**క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు పేరుతో సైబర్ మోసాలు**

- ఫోన్‌కాల్స్, ఈ మెయిల్స్ ద్వారా వివరాలు అడిగి దోపిడీ
- కార్డు నంబర్, సీవీవీ వివరాలు అడిగితే ఇవ్వద్దు
- వినియోగదారులకు పోలీసుల సూచన



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలు, డబ్బు సర్దుబాటు కోసం ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు వాడకం సర్వసాధారణంగా మారింది. అయితే, క్రెడిట్ కార్డుల వాడకంలో వినియోగదారుల్లో ఉన్న అవగాహన లేమిని 'సొమ్ము'చేసుకుంటున్నారు సైబర్ కేటుగాళ్లు. మీ క్రెడిట్‌కార్డు లిమిట్‌ను పెంచుతామని, మీ పేరిట ఫలానా ఆఫర్లు వచ్చాయని, మీ క్రెడిట్‌కార్డు ప్రొటెక్షన్‌ను ఎనేబుల్ చేసుకునేందుకు వివరాలు ఇవ్వాలని, కేవైసీ అప్‌డేట్ చేసుకోకపోతే క్రెడిట్‌కార్డు పనిచేయదని.. ఇలా ఎన్నో రకాలుగా వినియోగదారులను ఫోన్‌కాల్స్‌లో బెదిరించే ఘటనలు పెరుగుతున్నాయి. ఇవన్నీ సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్ అని, కస్టమర్ కేర్ నుంచి క్రెడిట్‌కార్డు కంపెనీ చేసే నిజమైన కాల్స్ కాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. క్రెడిట్‌కార్డు లిమిట్ పెంచుతామని వచ్చే ఫోన్‌కాల్స్ నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు. ఇలాంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తే వెంటనే మీ బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

**ఈ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలి?**

- ఫోన్‌కాల్స్ ద్వారా లేదంటే ఈమెయిల్స్ ద్వారా వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని అడిగితే అది సైబర్ మోసగాళ్ల పనే అని అనుమానించి జాగ్రత్తపడాలి.
- మీ క్రెడిట్ కార్డు వివరాలు, పిన్ నంబర్, సీవీవీ లేదా ఓటీపీని ఎవరికీ చెప్పవద్దు.
- ఈ వివరాలు బ్యాంకు ప్రతినిధుల పేరిట కాల్ చేసి అడిగితే అస్సలే ఇవ్వవద్దు.
- మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలి.
- ఈ-మెయిల్‌లు లేదా ఎస్ఎంఎస్‌లలో అనుమానాస్పద లింక్‌లు లేదా అటాచ్‌మెంట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వాటిపై క్లిక్ చేయవద్దు.
- మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోవాలి.

# అవినీతి ఉద్యోగుల చిట్టా లేదు..

- ఎవరెవరు చిక్కారో మా దగ్గర సమాచారం లేదు
- ఆర్టీఐ దరఖాస్తుకు ఏసీబీ కేంద్ర కార్యాలయం సమాధానం

సాక్షి, హైదరాబాద్: 'అవినీతి కేసులలో ఏయే ప్రభుత్వ శాఖల అధికారులు ఏసీబీకి చిక్కారనే సమాచారం మా దగ్గర లేదు. ఆ విషయం తెలుసుకొనేందుకు డేటాను విశ్లేషించి పరిశోధించాల్సి ఉంటుంది. అందుకే సమాచారం ఇవ్వలేం'అని ఏసీబీ కేంద్ర కార్యాలయం ఒక ఆర్టీఐ దరఖాస్తునకు సమాధానమిచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 10 వరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఎంతమంది అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కారు? వారి వద్ద లభించిన మొత్తం అవినీతి డబ్బు ఎంత? ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ అధికారుల పేర్లతో సహా శాఖలవారీగా వివరాలు తెలపండి అని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఏసీబీని సమాచార హక్కు చట్టం కింద ఏప్రిల్ 9న కోరింది. దీనికి సమాధానంగా ఏసీబీ కేంద్ర కార్యాలయ పరిపాలనాధికారి పి.రాఘవరావు లిఖితపూర్వక సమా ధానం ఇచ్చారు. దరఖాస్తుదారులు అడిగిన సమాచారం ఇవ్వలేమని, సమాచారంపై అప్పీల్ ఉంటే, ఏసీబీ సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ (వెస్ట్‌జోన్) డి.కమలాకర్‌రెడ్డికి అప్పీల్ చేయాలని సూచించారు.

**సమాచారం లేదనడం సరికాదు**

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పనితీరు గురించి ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వం సమాచారహక్కు చట్టాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ ఏసీబీ కార్యాలయం ఇటీవల పెద్ద ఎత్తున ఏసీబీ దాడులు చేస్తోంది. సంవత్సర కాలంలో ఎంతమంది అధికారులను పట్టుకున్నారు? ఎంత డబ్బు దొరికింది? అని సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే సమాచారం ఇవ్వలేమని కరాఖండిగా చెపుతున్నారు. వారి కార్యాలయంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. కానీ, ఏసీబీ వారు ఇచ్చిన సమాధానం సరిగ్గా లేదు.

–రాజేంద్ర పల్నాటి, యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపకుడు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

# బోర్డ్‌తోనే భరోసా

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై వినతులు

- ప్రత్యేక బోర్డ్ ఏర్పాటుతో మెరుగైన వేతనాలు, సౌకర్యాలు
- కాంట్రాక్టర్ల అక్రమాలకు తెర - కార్మికులు, కాంట్రాక్ట్ కార్మిక జేఏసీ వినతి

**సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డ్ ఏర్పాటు చేయాలని కార్మికులు, కాంట్రాక్ట్ కార్మిక జేఏసీ నాయకులు కోరుతున్నారు.** కాంట్రాక్టర్లతో సంబంధం లేకుండా సంస్థ నుంచే నేరుగా వేతనాలు చెల్లించడంతో పాటు సౌకర్యాల కల్పనకు బోర్డు ఉపయోగపడుతుందని స్పష్టం చేస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ, పని ఆధారంగా వేతనాలు, జీతభత్యాల చెల్లింపు, సీఎంపీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్యబీమా, ప్రసూతి సెలవులు, ప్రమాద బీమా, పింఛను అందేందుకు ఈ బోర్డు తప్పనిసరని అభిప్రాయపడుతున్నారు.

### కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సింగరేణిలో కొన్నేళ్ల క్రితం వరకు మూడు, నాలుగు విభాగాల్లోనే కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసేవారు. అయితే ప్రస్తుతం ఆ సంఖ్య 50 విభాగాలకు చేరింది. ఇది కాంట్రాక్టర్లకు కలిసొస్తోంది. యాజమాన్యం కూడా ఒక పర్మినెంట్ కార్మికుడికి ఇచ్చే వేతనంతో 8మంది కాంట్రాక్టు కార్మికులను నియమించవచ్చనే భావనతో ఈ విధానాన్ని క్రమంగా విస్తరిస్తోంది. అయితే, కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం 20 మందిని తీసుకోవలసిన చోట.. అదనంగా మరో ఐదుగురిని నియమించి నెలకు 25 బదులు 15 మస్టర్లే ఇస్తుండటం వల్ల తక్కువ జీతాలతో కార్మికులు నష్టపోతున్నారు. ఇలాంటి అంశాలను ప్రశ్నించే నాథులే లేకపోవడం కాంట్రాక్టర్లకు కలిసి వస్తుండగా.. కార్మికులు అరకొర వేతనాలతో దుర్భర జీవనం సాగిస్తున్నారు.

### బోర్డ్ ఏర్పాటుతో ప్రయోజనాలివి

కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి ప్రత్యేక బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే నియామకాల్లో పారదర్శకత ఉంటుందని, ప్రతిభ ఆధారంగా నియామకాలు జరుగుతాయి. ప్రతి నెల 5వ తేదీలోగా నేరుగా ఉద్యోగి ఖాతాల్లోనే జీతం జమవుతుంది. సీఎంపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు వర్తించడమే కాక లాభాల్లోనూ వాటా అందుతుంది. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, ప్రసూతి ప్రయోజనాలు, ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం వర్తిస్తుంది. కాగా, బోర్డు ఏర్పాటుకు ఇటీవల ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది.



విధుల్లో నిమగ్నమైన కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

**సీఎంతో మాట్లాడతాం..**



బోర్డు ఏర్పాటైతే యాజమాన్యం - కాంట్రాక్ట్ కార్మికుల మధ్య కాంట్రాక్టర్ ఉండరు. వేతనం, సౌకర్యాలపై నేరుగా మాట్లాడుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లో అమలవుతున్న ఈ విధానాన్ని ఇక్కడ అమలు చేసేలా సీఎంతో త్వరలోనే మాట్లాడతాం.

– జనక్ ప్రసాద్, చైర్మన్, కనీస వేతన సలహా మండలి

**కార్మికులందరికీ వర్తింపజేయాలి**



బోర్డ్ ఏర్పాటుచేసి అన్ని విభాగాల కార్మికులకు వర్తింపజేయాలి. ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన హక్కులు కల్పించి ఆరునెలలకోసారి వేతనాలు పెంచాలి. పింఛను అమలు, సీఎంపీఎఫ్ జమ, క్వార్టర్ల సౌకర్యం కల్పించాలి.

– సతీశ్, సెక్రటరీ, టీయూసీఐ రీజియన్

**ఓటుహక్కు కూడా కల్పించాలి**



సింగరేణిలో దాదాపు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరి సంక్షేమ బోర్డ్ ఏర్పాటు తప్పనిసరి. కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తే.. అందరూ వీరి సంక్షేమాన్ని పట్టించుకుంటారు.

– గౌని నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు

# గడ్కరీ పర్యటన షెడ్యూల్ ఇదీ..

## హైదరాబాద్ - శ్రీశైలం మధ్య 4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్



- హైదరాబాద్–శ్రీశైలం మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు జాతీయ రహదారి–765పై మన్ననూరు నుంచి తెలంగాణ– ఏపీ సరిహద్దు వరకు 4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.
- హైదరాబాద్–విజయవాడ మధ్య జాతీయ రహదారి–65ను 6 లేన్లకు విస్తరించేలా చర్యలు తీసుకువచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేల పేరుతో రవాణా వ్యవస్థను సరళతరం చేసేలా దేశవ్యాప్తంగా రూ.4.5 లక్షల కోట్ల ఖర్చుతో 10 వేల కిలో మీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది.
- రాష్ట్ర పరిధిలో దాదాపు రూ.4,500 కోట్లతో 136 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి.
- రూ.40,615 కోట్లతో సూరత్–సోలాపూర్–చెన్నై కారిడార్ –1,056 కి.మీ రహదారి పనులు సాగుతున్నాయి.
- హైదరాబాద్–విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా తెలంగాణలో 164 కి.మీ. మేర రూ.6 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి.
- నాగపూర్–విజయవాడ కారిడార్‌లో భాగంగా తెలంగాణలో 401 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి.
- హైదరాబాద్–గోవా కారిడార్‌లో భాగంగా తెలంగాణ పరిధిలో 90 కి.మీ. మేర రూ.3,170 కోట్లతో పనులు ప్రారంభం కానున్నాయి.
- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు, ఇక్రిశాట్ వద్ద జరిగే కార్యక్రమాల్లో ఆయన రూ.3,694 కోట్లతో చేపట్టిన 5 ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.
- నిర్మల్–ఖానాపూర్ మధ్య 17.79 కి.మీ. దూరం విస్తరించిన రోడ్డును, మంచిర్యాల్–రేపల్లెవాడ మధ్య 42 కి.మీ. నిడివితో నిర్మించిన నాలుగు లేన్ల రహదారిని, రేపల్లె నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు 52.6 కి.మీ మేర రూ.1,525 కోట్లతో పూర్తిచేసిన నాలుగు వరసల రోడ్డును ప్రారంభిస్తారు.
- నాగపూర్–హైదరాబాద్ సెక్షన్‌లో కడ్తాల్ వద్ద రూ.23.54 కోట్లతో నిర్మించిన 6 లేన్ల అండర్ పాస్‌ను, 44వ నంబర్ జాతీయ రహదారిపై నాగ్‌పూర్–హైదరాబాద్ సెక్షన్‌లో సర్వీస్ రోడ్లు, జంక్షన్ల మార్పుల పనులు ప్రారంభిస్తారు.
- ఆరాంఘర్–శంషాబాద్ మధ్య 10 కి.మీ. మేర ఆరు వరుసల రోడ్డు విస్తరణ, అంబర్‌పేటలో 1.47 కిలోమీటర్ల మేర రూ.415 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను, బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద రూ.172.56 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను, నాగపూర్ – హైదరాబాద్ సెక్షన్‌లో మెదక్ జిల్లా రెడ్డిపల్లి జంక్షన్ వద్ద 6 లేన్ల అండర్ పాస్, సర్వీస్ రోడ్లను ప్రారంభిస్తారు.
- మెదక్ జిల్లా జాప్తిశివనూర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్, సర్వీస్ రోడ్డు, గోల్డెన్ దాబా వై జంక్షన్ వద్ద 6 లేన్ల అండర్ పాస్, కామారెడ్డి జిల్లా టెక్రియాల్, పొందుర్తి ఎక్స్ రోడ్ వద్ద అండర్ పాస్‌ను ప్రారంభిస్తారు.
- కామారెడ్డి జిల్లా పద్మాజివాడ జంక్షన్ వద్ద అండర్ పాస్, స్లిప్ రోడ్డు, హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి మీద ఆలేరు–జీడికల్ ఎక్స్ రోడ్ వద్ద 6 లేన్ల అండర్ పాస్‌లను అంబర్‌పేట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.
- హైదరాబాద్–విజయవాడ సెక్షన్ టేకుమట్ల సమీపంలో రూ.10.69 కి.మీ. మేర రూ.422.12 కోట్లతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తారు.
- ధర్మోజిగూడ వద్ద రూ.37.68 కోట్లతో 6 లేన్ల అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు పనులను, హైదరాబాద్ - బెంగళూరు హైవేపై బాలానగర్ వద్ద రూ.31.56 కోట్లతో నిర్మించే 6 లేన్ల అండర్ పాస్ పనులకు, అంకుశాపూర్ వద్ద 6 లేన్ల అండర్‌పాస్, ఘట్‌కేసర్ జంక్షన్ వద్ద రూ.68 కోట్లతో చేపట్టే 6 లేన్ల ఫ్లై ఓవర్, నాగపూర్– హైదరాబాద్ సెక్షన్‌లో కోమటిపల్లి జంక్షన్, వల్లూరు జంక్షన్ల విస్తరణ, 6 లేన్ల అండర్‌పాస్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.

# కవ్వాల్ నేపథ్యం ఇదీ...

**2012లో** స్థాపితమైన కవ్వాల్ పులుల అభయారణ్యం (కేటీఆర్) నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 893 చ.కి.మీ విస్తరించి ఉంది. ప్రాజెక్ట్ టైగర్ కింద జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ) మానవ–వన్యప్రాణి సంఘర్షణను తగ్గించి, పులులకు అనుకూల వాతావరణం సృష్టించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో... కేటీఆర్‌లోని కోర్ ఏరియాలో 39 గిరిజన గ్రామాల ఉనికి పులుల సంరక్షణకు అడ్డంకిగా ఉండటంతో, మైసంపేట, రాంపూర్ గ్రామాలను తొలి దశలో తరలించాలని నిర్ణయించారు . 2024 ఏప్రిల్ 15న మైసంపేట, రాంపూర్ గ్రామాల్లోని 142 కుటుంబాలను ఎన్‌టీసీఏ స్వచ్ఛంద తరలింపు ప్యాకేజీ కింద కడెం మండలంలోని ధర్మాజీపేట, మద్దిపడగ గ్రామాలకు తరలించారు. ఈ ప్యాకేజీ రెండు ఎంపికలను అందించింది. ఎంపిక 1: ఆర్థిక పరిహారం – కుటుంబానికి రూ.15 లక్షల నగదు. ఎంపిక 2: భూమి ఆధారిత పునరావాసం – వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలు, మౌలిక సదుపాయాలు. 48 కుటుంబాలు (మైసంపేట నుంచి 32, రాంపూర్ నుంచి 16) ఆర్థిక పరిహారాన్ని ఎంచుకుని, మొత్తం రూ.7.2 కోట్లు పొందాయి. 94 కుటుంబాలు (మైసంపేట నుంచి 73, రాంపూర్ నుంచి 21) భూమి ఆధారిత పునరావాసాన్ని ఎంచుకున్నాయి, దీనికి ప్రాజెక్ట్ టైగర్ కింద రూ. 14.2 కోట్లు కేటాయించారు.

### తరలింపు, పునరావాసం ఇలా...

**జి**ల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ కె.రామకిషన్ నేతృత్వంలో... హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సహకారంతో ఈ తరలింపు విజయవంతమైంది. విద్య, వైద్యం, రోడ్లు వంటి సౌకర్యాల కోసం గిరిజనులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. భూమి కేటాయింపు, రెవెన్యూ పట్టాలు, జీవో 43 కింద, 94 కుటుంబాలకు కడెం మండలంలోని నచెన్‌యెల్లాపూర్, మద్దిపడగ గ్రామాల్లో 276.03 ఎకరాల భూమి కేటాయించారు.

నచెన్‌యెల్లాపూర్: 87 కుటుంబాలకు 243.24 ఎకరాలు, కుటుంబానికి 2.80 ఎకరాల వ్యవసాయ భూమి.మద్దిపడగ: 7 కుటుంబాలకు వ్యవసాయ భూమి, 94 కుటుంబాలకు ఇంటి స్థలాలు. ఖానాపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 112 హెక్టార్ల భూమి డీనోటిఫై చేసి, 5 హెక్టార్లు ఇంటి స్థలాలకు, 107 హెక్టార్లు వ్యవసాయానికి (కుటుంబానికి సుమారు 2 ఎకరాలు 30 గుంటలు) కేటాయించారు. ఈ భూములు పూర్తి అలీనబుల్ హక్కులతో రెవెన్యూ భూములుగా గుర్తించారు. దీనివల్ల లబ్ధిదారులు వ్యవసాయం, గృహ నిర్మాణం కోసం భూమిని ఉపయోగించవచ్చు. భూమిని విక్రయించవచ్చు, తాకట్టు పెట్టవచ్చు, వారసత్వంగా ఇవ్వవచ్చు. వ్యవసాయం, వ్యాపారం కోసం రుణాలు కూడా పొందవచ్చు.



శనివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన కొత్త సీఎస్ రామకృష్ణారావు. ఈ సందర్భంగా సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. ప్రభుత్వ ప్రాధమ్యాలకు అనుగుణంగా పనిచేసేలా రాష్ట్ర యంత్రాంగాన్ని ముందుకు నడిపించాలని కోరారు





శనివారం హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్‌లో శిక్షణ పొందుతున్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు



రేగళ్ల అటవీ ప్రాంతంలో నీటికుంట వద్ద అడవి దున్నల మంద

# వన్య ప్రాణుల అడ్డా కిన్నెరసాని

- సంరక్షణ చర్యలతో పెరిగిన జంతు వైవిధ్యం
- 33 ట్రాప్ కెమెరాల ఏర్పాటు

**పాల్వంచ రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని అభయారణ్యం వన్యప్రాణుల అడ్డాగా నిలుస్తోంది. ఇక్కడి అధికారులు తీసుకుంటున్న రక్షణ చర్యలతో వన్యప్రాణుల సంతతి ఏటా పెరుగుతోంది. ఇటీవల అడవి దున్నలు, జింకలు, ముళ్లపందులు, దుప్పులు, పక్షులు తదితర రకాల వన్యప్రాణుల సంతతి గణనీయంగా పెరిగిందని.. స్వేచ్ఛగా సంచరిస్తున్నాయని గుర్తించారు. అభయారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో వైల్డ్ లైఫ్ శాఖ అధికారులు 33 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో నమోదైన దృశ్యాలను రెండు, మూడు నెలలకోసారి విడుదల చేస్తుండగా, తాజాగా శనివారం విడుదల చేసిన దృశ్యాల్లో వన్యప్రాణుల కదలికలు నమోదయ్యాయి. జీవవైవిధ్యం అన్ని విధాలా అనుకూలంగా ఉండడం, నీరు తదితర సౌకర్యాలు మెరుగుపడడంతో కిన్నెరసాని వన్యప్రాణుల నిలయంగా నిలుస్తోందని చెబుతున్నారు. ఈ విషయమై పాల్వంచ డివిజన్ వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీవో బి.బాబు మాట్లాడుతూ.. కిన్నెరసాని అభయారణ్యంలో మూడు, నాలుగేళ్లుగా తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయని తెలిపారు. చెక్‌పోస్టు ఏర్పాటు చేయడమే కాక 360 డిగ్రీల్లో నమోదు చేయగలిగే 33 ట్రాప్ కెమెరాలు బిగించామని వివరించారు. వీటిని ఎఫ్‌డీవో కార్యాలయానికి అనుసంధానించి నిత్యం పర్యవేక్షిస్తుండడం వల్ల.. వేటకు అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. 55 హెక్టార్లలో గడ్డి పెంపకం, 22 సౌర విద్యుత్ పంపుసెట్లు, 110 నీటి కుంటలు, 42 చెక్‌డ్యామ్‌ల ఏర్పాటుతో వన్యప్రాణులకు ఆహారం, నీటి ఇక్కట్లు తీరాయని వెల్లడించారు.




అభయారణ్యంలో అడవి పందుల సంచారం



ట్రాప్ కెమెరాలో నమోదైన చుక్కల దుప్పులు



అభయారణ్యంలో ఎలుగుబంటి



## చిత్తరువు కాదిది.. జీవన చిత్రం

చేయితిరిగిన చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్తరువులా కనిపిస్తున్న ఈ చిత్రం ఓ చేదు వాస్తవం. నిలువ నీడలేని ఓ అభాగ్యుడు విజయవాడ బందరు రోడ్డులో ఫుట్ పాత్‌పై నిద్రిస్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



## మబ్బుల చాటున మహానగరం

విశాఖ మహానగరంలో గత కొద్ది రోజులుగా విచిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. మధ్యాహ్నం వరకు ఎండ చుర్రుమనిపిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోతోంది. శనివారం సాయంత్రం కూడా ఆకాశంలో మబ్బులు దట్టంగా అలముకుని చిరుజల్లులు కురిశాయి. వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు ఎండవేడి నుంచి ఉపశమనం పొందారు – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



## మండే ఎండ నుంచి దోమ తెరే రక్ష

ఎండలు మండిపోతున్నాయి. అరకొర నీటి వసతి ఉండే ప్రాంతాల్లో ఎండ బారి నుంచి మొక్కలను రక్షించుకోవడం తలకు మించిన భారంగా తయారైంది. దీంతో వినూత్నంగా ఆలోచించిన అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, నారాయణపురం గ్రామాల రైతులు తమ టమాటా పంటను కాపాడుకునేందుకు మొక్కలకు నీడగా ఇలా దోమతెరలు ఏర్పాటు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పాడి పంటలు..వ్యవసాయ కుటుంబాలకు రెండు కళ్లు. పంట సాగులో నష్టమొస్తే కర్షకులను పాడి పశువులు కామధేనువుల్లా ఆదుకుంటున్నాయి. అలాంటి పాడి సంపద ఉత్తమంగా ఉంటే రైతులు ఆర్థికాభివృద్ధికి మరింత చేయూత నిస్తాయి. ఇందుకు ఉత్తమ విత్తన కోడెల ఎంపికే లక్ష్యంగా చిత్తూరు కేంద్రంగా పశు సంతతి పరిశీలన కేంద్రం ఏర్పాటు అయ్యింది. ఈ కేంద్రం ఉత్తమ కోడెల ఎంపికలో లక్ష్యం దిశగా పరుగులు తీస్తోంది. అత్యుత్తమ విత్తన కోడెలు, ఆవులను వృద్ధి చేసి, పాడి సమృద్ధికి పాటు పడుతోంది. అన్నదాతలకు అండగా నిలుస్తోంది.

# కోడె వృద్ధి.. పాడి సమృద్ధి



**ఉత్తమ ఆవుల వృద్ధికి పశుసంతతి పరిశీలన పథక కేంద్రం విశేష కృషి**

**జన్యు సామర్థ్యపు విత్తన కోడెల ఉత్పత్తిలో ముందడుగు**

**సంకరజాతి పశువుల అభివృద్ధే లక్ష్యంగా పరిశీలన పథక కేంద్రం శాస్త్రవేత్తల కార్యాచరణ**

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** పాల దిగుబడి పెంపే లక్ష్యంగా ఆరోగ్యకరమైన, దృఢమైన సంకరజాతి పశు సంపదను ఉత్పత్తిలో చిత్తూరు జిల్లాలోని పశు సంతతి పరిశీల న పథక కేంద్రం ప్రధాన భూమిక పోషిస్తోంది. వీర్య కేంద్రాల్లోని విత్తన కోడెలను పరిశీలించి, తద్వారా అ త్యధిక జన్యుసామర్థ్యం కలిగిన విత్తనపు కోడెలను ఉ త్పత్తి చేయడంలో ఈ కేంద్రం ముందు వరుసలో నిలిచింది. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్ర మలో మేలు జాతి సంతతిని పెంచుతూ పాడి పరిశ్రమాభివృద్ధికి కృషిలో గుర్తింపు పొందింది. విత్తన కోడెలను ఉత్పత్తి చేయడంలో లక్ష్యాన్ని అధిగమిస్తోంది.

**లక్ష్య సాధన దిశగా కేంద్రం**

జిల్లాలో 2013–14 కేంద్రం ప్రారంభం నుంచి ఈ పథకం లక్ష్యం కోసం అధికారులు కృషి చేస్తున్నారు. మంచి పాడి వృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇ ప్పటివరకు 305 విత్తనపు కోడెలను పరీక్షకు పెట్టా రు. అలాగే పాల దిగుబడికి 38,807 ఆవులను న మోదు చేశారు. 420 హెచ్‌జీఎం కోడె దూడలను ఉత్పత్తి చేశారు.

**ఉత్తమ కోడెల ఎంపిక ఇలా..**


రాష్ట్రంలోని నంద్యాల, బనవాసి, విశాఖపట్నంలోని వీ ర్య కేంద్రాలతోపాటు దేశంలోని పలు వీర్యకేంద్రాల్లోని విత్తనపు కోడెల నుంచి వీర్యాన్ని సేకరించి, ఆ వీర్య నాళికలను చిత్తూరులోని పశు సంతతి పరిశీలన పథక కేంద్రానికి పంపుతారు. ఈ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల పశువులకు ఆ వీర్యనాళికలను కృత్రిమ గర్భధారణ చేస్తారు. ఆ పశువు ఈ నిన దూడలను పర్యవేక్షిస్తారు. ఆ పేయదూడలు పెద్ద వై ఈనిన తరువాత పాలిచ్చే సమయంలో వాటి పాల దిగుబడిని కొలిచి, విత్తనపు కోడెల సామర్థ్యాన్ని లెక్కి స్తారు. వీటిలో మంచి పాల దిగుబడి వచ్చిన పశుసంపద జననానికి కారణమైన కోడెను నిరూపితమైన కో డె(ప్రూవింగ్ బుల్)గా గుర్తిస్తారు. ఈ కోడెకు పుట్టిన పేయదూడలను ఉత్తమ ఆవులు(ఎలైట్ డాటర్) అంటారు. ఇలా ఈ కేంద్రంలో ఏటా సుమారు 20 విత్తన కోడెల వీర్యాన్ని పరీక్షిస్తారు. ఇందులో మంచి ధృఢమై న 2–4 కోడెలను ఎంపిక చేస్తారు. అలాగే పాల దిగుబడిని కొలవడం ద్వారా అత్యధిక పాల దిగుబడి ని చ్చే ఆవులను గుర్తించడంతోపాటు ప్రూవింగ్ బుల్‌కు పుట్టిన కోడె వీర్యాన్ని, పేయ దూడలకు గర్భధారణ చేయించి, వాటికి పుట్టిన పశుసంపదను అత్యుత్తమ పశుసంపదగా పరిగణిస్తారు. మగ దూడలైతే హెచ్‌జీఎం(హైజెనిటిక్ మెరిట్) విత్తన కోడెలుగా పరిగణిస్తా రు. ఈ హెచ్‌జీఎం విత్తను కోడెలను ప్రభుత్వం రైతు లకు మంచి ధర చెల్లించి, కొనుగోలు చేసి, దేశంలోని వీర్య కేంద్రాలకు సరఫరా చేస్తుంది.



**ఇదీ ఉద్దేశం..**

జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ద్వారా సంకరజాతి జెర్సీ ఆవుల్లో ఎన్‌డీపీ–1 స్కీం కింద పశుసంతతి పరిశీలన పథకాన్ని 2013–14 సంవత్సరంలో ప్రారంభించారు. ఇది 2018–19 వరకు కొనసాగింది. తరువాత 2019–20 నుంచి ఈ పథకాన్ని రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) కింద అమలు చేస్తున్నారు. సంకర జాతి జెర్సీ ఆ వుల్లో జన్యుపర్యంగా పాడి ఉత్పాదక శక్తిని పెంపొందించడం, వీర్య కేంద్రంలో ఉన్న విత్తనపు కోడెలను (బ్రీడింగ్ బుల్స్) పరిశీలించి, వాటి ద్వారా అత్యధిక జన్యు సామర్థ్యం కలిగిన విత్తనపు కోడెలను ఉత్పత్తి చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

**చిత్తూరు కేంద్రంగా...**



పశుసంతతి పరిశీలన పథక కార్యాలయం

చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తోంది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఇందులో భాగంగా ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జెర్సీ–సహివాల్ జాతి సంకర ఆవులు ఎక్కువగా ఉన్నాయి. ఈ సంకర ఆవులు మంచి రోగ నిరోధక శక్తి, ప్రతికూల పరిస్థితుల్లో కూడా మంచి పాల దిగుబడికి పేరు గాంచాయి. అందుకే రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో మాత్రమే ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

**కేంద్రంలోని హెచ్‌జీఎం విత్తన కోడె**

| సంవత్సరం | పరీక్షకు పెట్టిన విత్తన కోడెల సంఖ్య | పాలదిగుబడి నమోదు చేసిన ఆవులు | ఉత్పత్తి చేసిన హెచ్‌జీఎం కోడె దూడల సంఖ్య |
|---|---|---|---|
| 2013-14 | 20 | 567 | 0 |
| 2014-15 | 25 | 3129 | 9 |
| 2015-16 | 30 | 925 | 25 |
| 2016-17 | 30 | 1255 | 49 |
| 2017-18 | 30 | 4130 | 55 |
| 2018-19 | 18 | 2431 | 36 |
| 2019-20 | 18 | 2034 | 0 |
| 2020-21 | 20 | 3635 | 10 |
| 2021-22 | 22 | 6555 | 31 |
| 2022-23 | 23 | 6041 | 108 |
| 2023-24 | 23 | 3584 | 79 |
| 2024-25 | 23 | 4518 | 49 |

**భవిష్యత్ దృష్ట్యా...**



పాల నమోదు కార్యక్రమం ద్వారా అధిక పాల దిగుబడినిచ్చే ఉత్తమ ఆవులను గుర్తిస్తున్నాం. దేశంలోని అన్ని వీర్య కేంద్రాల్లోని సంకర జాతి జెర్సీ–సహివాల్ జాతి విత్తనపు కోడెలను పరీక్షిస్తున్నాం. అత్యధిక జన్యుసామర్థ్యం కలిగిన కోడె దూడలను ఉత్పత్తి చేస్తున్నాం. రాబోవు తరాల్లో సంకరజాతి జెర్సీ ఆవుల పాడి ఉత్పాదక జన్యు సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– వాసు, జిల్లా పశుసంతతి పరిశీలన కేంద్ర డీడీ, ప్రాజెక్టు కోఆర్డినేటర్, చిత్తూరు



# పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

**ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల • 10వ తరగతి అర్హతతో ప్రవేశాలు**

**వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువు**

**రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమవుతుంది. ఇదే ఉద్దేశంతో సాంకేతిక విద్యాశాఖ, పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లు ఏర్పాటయ్యాయి. ఐటీఐ కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు అప్రెంటిస్ చేస్తున్నారు. ప్రతిభతో అవకాశాలు దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువుగా నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఐటీఐలు, వాటిలో ఉన్న సీట్లు, ట్రేడ్స్ తదితర విషయాలతో 'సాక్షి' కథనం.

**అధిక శాతం ఇంటర్‌లో..**

పదో తరగతి పూర్తి కాగానే విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అంటూ ఆలోచన చేస్తారు. అధిక శాతం మంది ఇంటర్మీడియెట్‌లో చేరుతారు. సాంకేతిక విద్య ద్వారా త్వరగా జీవితంలో సెటిల్ అవ్వాలనుకునే వారు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐలు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు.

**18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్ల దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది.

**ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు**

ఐటీల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఇనుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు.

**రెండేళ్ల కాల పరిమితి కోర్సులు**

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, ఆర్ అండ్స్ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, టర్నర్

**ఏడాది కాల పరిమితి కోర్సులు**

మెకానిక్ డీజిల్, సీఓపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో

**డ్రోన్ టెక్నాలజీపై స్వల్పకాలిక కోర్సు**

గతేడాది కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశ పెట్టారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ప్రారంభించారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్ డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టారు. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**పరిస్థితి ఇదీ..**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు లేవు. కాకినాడ జిల్లాలో మాత్రమే రెండు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలో 15 ఐటీఐలు ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో 2,564 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 12 ప్రైవేట్ యాజమాన్యంలో 1,704 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 4,998 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన**

ఐటీఐల్లో ప్రవేశాలకు నిర్దిత గడువులోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కోర్సును పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు ఉంటున్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను దరఖాస్తుదారుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

–ఎంవీజీ వర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, కాకినాడ



## 6న ఖేలో ఇండియా బీచ్ గేమ్స్ పోటీలకు ఎంపిక

**సాక్షి, అమరావతి:** ఖేలో ఇండియా ఫస్ట్ ఎడిషన్ బీచ్ గేమ్స్–2025కు రాష్ట్ర జట్లను ఈ నెల 6న ఎంపిక చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. సెపక్‌తక్రా (బాలురు, బాలికలు), బీచ్ కబడ్డీ (బాలురు), బీచ్ వాలీబాల్ (బాలికలు), బీచ్ ఫుట్‌బాల్ (బాలికలు) జట్లకు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరు కావాలని కోరింది. మే 19 నుంచి 24 వరకు దాద్రానగర్ హవేలీ, డామన్–డయ్యులో ఖేలో ఇండియా పోటీలు జరగనున్న నేపథ్యంలో ఏపీ జట్లను ఎంపిక చేస్తున్నట్లు తెలిపింది. క్రీడాకారులు ఆధార్, టెన్త్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరింది.

**సెలక్షన్ ట్రయల్స్ ఇలా..**

బీచ్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ మహిళలకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, బీచ్ కబడ్డీ బాలురకు సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు విజయవాడలోని పున్నమి ఘాట్‌లో సెలక్షన్స్ నిర్వహిస్తారు. సెపక్‌తక్రా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కర్నూలులోని తుంగభద్ర నదీ తీరంలో ఎంపికలు చేస్తారు. వివరాలకు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీఓ అజీజ్ (93944 94645), ఎన్టీఆర్ జిల్లా వాటర్ స్పోర్ట్స్ కోచ్ ఎం.శ్రీను(98482 98179), కర్నూలు జిల్లా డీఎస్‌డీఓ భూపతిరావు (98663 17318) సంప్రదించాలి.

## 117 జీవో రద్దు హామీ నెరవేర్చాలి

**సాక్షి, అమరావతి:** విద్యా శాఖకు సంబంధించిన 117 జీవో రద్దు హామీని ప్రభుత్వం నెరవేర్చాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉత్తర్వులు ఇవ్వకుండానే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.




## శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం రద్దీ అధికంగా ఉంది. సర్వ దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,344 మంది స్వామివారిని దర్శించుకోగా 32,169 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

## కల్యాణం.. కమనీయం



**రాపూరు:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. రాత్రి 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

## అంజన్నకు అభిషేక సేవ



**జంగారెడ్డిగూడెం:** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది క్షేత్రంలో ఆంజనేయ స్వామి వారికి శనివారం అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై స్వామి వారి ఉత్సవ మూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.




## బీఈడీకి బీటెక్ విద్యార్థులు అర్హులే

తిరుపతి సిటీ: ఏపీలో ఈ ఏడాది నుంచి బీటెక్ పూర్తి చేసిన వారు సైతం బీఈడీ చేసే అవకాశం లభించింది. ఈ ఏడాది నాగార్జున వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎడ్‌సెట్-2025 ప్రవేశ పరీక్షకు బీటెక్ చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఉపాధ్యాయులుగా రాణించాలనే యువ ఇంజినీర్లు ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్ విద్యార్థులు గణితం, ఫిజికల్ సైన్స్, మెథడాలజీ విభాగాలలో బీఈడీ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 14వ తేదీ చివరి గడువు. ప్రవేశ పరీక్ష జూన్ 5వ తేదీ నిర్వహించనున్నారు.

## 6న ఎస్వీయూలో జాబ్‌మేళా

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు తెలిపారు. చెన్నై, బెంగళూరు, తిరుపతికి చెందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలు సుమారు 130 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఎస్వీయూలో కొత్త కోర్సులు షురూ

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ, యూఎస్ఏకి చెందిన ఎక్స్‌ప్లొయెన్స్ ఇంక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది నూతన కోర్సులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు శనివారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ నరసయ్య కోర్సులకు సంబంధించిన ప్రత్యేక బ్రౌచర్‌ను విడుదల చేశారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్టు వీసీ తెలిపారు.



# ఇద్దరమ్మాయిలతో..!

● ఇద్దరు కథానాయికలు ఉన్న కథలు చేస్తున్న తెలుగు హీరోలు

**వెండితెరపై హీరోలు ప్రేమ కోసం యుద్ధాలు చేస్తారు... త్యాగాలు చేస్తారు. అవసరమైతే ప్రాణాలు తీసుకుంటారు. అలాంటిది ఓ హీరోను ఇద్దరు అమ్మాయిలు ప్రేమిస్తే ఏం చేస్తారు? ఏ అమ్మాయి ప్రేమకు 'యస్' చెబుతారు? అనేది పెద్ద సమస్య. ఇలాంటి సమస్యతో... 'ఇద్దరమ్మాయిలతో' అంటూ 'డ్యూయెల్ లవ్' ప్రాబ్లమ్‌ను ఫేస్ చేస్తున్న కొందరు హీరోలపై ఓ లుక్ వేయండి.**



## దొరబాబు లవ్వు

చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. ఈ సినిమాలో నలుగురుకిపైగా హీరోయిన్స్ నటిస్తున్నారని తెలిసింది. అయితే ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథన్ మాత్రం మెయిన్ హీరోయిన్లుగా నటిస్తున్నారని సమాచారం. ఇంకా ఈ సినిమాలో ఇషా చావ్లా, రమ్య పసుపులేటి వంటి హీరోయిన్లు ఉన్నప్పటికీ, వీరివి చిరంజీవి సిస్టర్స్ పాత్రలుగా ఉంటాయట. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తున్నారని తెలిసింది. మరి... దొరబాబు ప్రేమను గెలిచేది ఎవరు? దొరబాబు ఇష్టపడేది ఎవర్ని? అనేది చూడాలి. 'విశ్వంభర'లో సెంటిమెంట్‌తో పాటుగా ఉన్న లవ్ ట్రాక్ కూడా ఆడియన్స్‌ను అలరిస్తుందని సమాచారం. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందున్న ఈ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్ రెడ్డి, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

## రాజాసాబ్ ఎవరి సొంతం?

'రాజాసాబ్'తో ఇద్దరు హీరోయిన్స్ లవ్‌లో పడ్డారట. మరి... 'రాజా సాబ్' మనసులో ఎవరు ఉన్నారనేది? తెలియాలంటే మరికొంత సమయం వేచి ఉండాలి. ప్రభాస్ టైటిల్ రోల్ చేస్తున్న ఇంటెన్స్ హారర్ అండ్ కామెడీ ఫిల్మ్ 'రాజా సాబ్'. మూడు తరాలు, ఆత్మలు వంటి అంశాల మేళవింపుతో ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరో నటి రిద్ధీ కుమార్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే ఈ సినిమాలోని హీరోయిన్స్ నిధీ–మాళవికా మోహనన్‌లతో హీరో ప్రభాస్‌కు లవ్ ట్రాక్స్ కూడా ఉంటాయని తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ నెలలో టీజర్ రిలీజ్ అవుతుందని, ఈ ఏడాది చివర్లో సినిమా విడుదలవుతుందని సమాచారం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## ట్రిపుల్ లవ్

పన్నెండేళ్ల క్రితం అల్లు అర్జున్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇద్దరమ్మాయిలతో..' సినిమా వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాలో ఇద్దరమ్మాయిలుగా అమలాపాల్, కేథరిన్ నటించారు. అయితే ఇప్పుడు ముగ్గురు అమ్మాయిలతో సినిమా చేయనున్నారు అల్లు అర్జున్. కానీ... ముగ్గురు అమ్మాయిలతో అనేది సినిమా పేరు కాదు. అల్లు అర్జున్ హీరోగా నటించనున్న నెక్ట్స్ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్ నటించనున్నారట. అల్లు అర్జున్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా రానుంది. ఈ మూవీలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నారని, ముగ్గురు హీరోయిన్స్ ఉంటారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు వినిపిస్తున్నాయి. దీపికా పదుకోన్, అనన్యా పాండే, శ్రద్ధా కపూర్ వంటి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ఏ ముగ్గురు హీరోయిన్స్ ఫిక్స్ అవుతారో చూడాలి. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాదే ప్రారంభించి, 2027లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని, మేజర్ షూటింగ్ విదేశాల్లో జరుగుతుందని సమాచారం.

## బెగ్గర్ లవర్ ఎవరు?

హీరో విజయ్ సేతుపతి, దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'బెగ్గర్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో టబు నటించనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కాగా ఇదే చిత్రంలో రాధికా ఆప్టే, నివేదా థామస్ కూడా నటించనున్నారనే టాక్ తాజాగా తెరపైకి వచ్చింది. కథ రీత్యా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉంటారట. మరి... బెగ్గర్ లవర్ ఎవరు? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌ను అరవైరోజుల్లోనే పూర్తి చేసి, ఈ ఏడాదే రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారనే వార్తలు తెరపైకి వచ్చాయి.

## రెండు సినిమాలు... నలుగురు హీరోయిన్స్

హీరో శర్వానంద్ ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నారు. శర్వానంద్ చేస్తున్న మూడు సినిమాల్లో... రెండు చిత్రాల్లో ఇద్దరు హీరోయిన్స్ నటిస్తున్నారు. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో 'నారీ నారీ నడుమ మురారి' అనే రొమాంటిక్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లు. ఇద్దరు అమ్మాయిల ప్రేమ మధ్య నలిగిపోయే యువకుడి పాత్రలో శర్వానంద్ నటిస్తున్నారని తెలుస్తోంది. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

అలాగే సంపత్ నంది దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా 'భోగి' అనే పీరియాడికల్ యాక్షన్ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా చేస్తున్నారు. 'శతమానం భవతి' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో శర్వానందన్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ మళ్లీ 'భోగి' సినిమాలో కలిసి నటిస్తున్నారు. అలాగే ఈ 'భోగి' చిత్రంలోనే మరో హీరోయిన్ డింపుల్ హయతి ఓ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. 1960 నేపథ్యంలో సాగే ఈ సినిమాను కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇంకా శర్వానంద్ హీరోగా అభిలాష్ కంకర దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా మూవీ 'రేస్ రాజా' (వర్కింగ్ టైటిల్) ఉన్న సంగతి తెలిసిందే.

## ట్రయాంగిల్ లవ్‌స్టోరీ

ఇద్దరు అమ్మాయిల ప్రేమలో ఇరుక్కున్న ఓ అబ్బాయి కథ ఏంటో తెలియాలంటే ఈ నెల 9న విడుదలవుతున్న 'సింగిల్' సినిమా చూడాలి. ఈ చిత్రంలో శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ–ఇవానా హీరోయిన్లుగా నటించారు. పూర్వ పాత్రలో కేతికా శర్మ, హరిణి పాత్రలో ఇవానా కనిపిస్తారు. హీరో ఫ్రెండ్ పాత్రను 'వెన్నెల' కిశోర్ చేశారు. విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. కథ రీత్యా... హీరో ఓ అమ్మాయిని ప్రేమిస్తాడు, మరో అమ్మాయి హీరోని ప్రేమిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? ఫైనల్‌గా హీరో ఏ అమ్మాయిని వివాహం చేసుకుంటాడు? అనే అంశాలతో ఈ సినిమా ఉంటుందట.

## యుద్ధం... ప్రేమ!

నిఖిల్ హీరోగా చేస్తున్న చారిత్రాత్మక చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఈ సినిమాను భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ యాక్షన్ సినిమాలో సంయుక్త, నభా నటేశ్‌లు హీరోయిన్లుగా చేస్తున్నారు. ఈ ఇద్దరిలో సంయుక్త పాత్రకు యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయని తెలిసింది. అలాగే ఈ మూవీలో మంచి లవ్ ఎపిసోడ్స్ ఉన్నాయని సమాచారం. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని తెలిసింది. షూటింగ్ ఆల్మోస్ట్ పూర్తయింది. తొలి భాగం ఈ ఏడాది చివర్లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.

ఇలా ఇద్దరు హీరోయిన్స్ ప్రేమలో పడ్డ మరికొంత మంది హీరోల సినిమాలు ఉన్నాయి.

**- ముసిమి శివాంజనేయులు**

# ట్రైనింగ్ షురూ

క్యారెక్టర్ ఎలా డిమాండ్ చేస్తే అలా మారిపోవడానికి అల్లు అర్జున్ ఏ మాత్రం వెనకాడరు. కెరీర్ తొలి నాళ్లల్లో 'దేశ ముదురు' (2007) కోసం సిక్స్ ప్యాక్ చేశారు అల్లు అర్జున్. ఆ తర్వాత క్యారెక్టర్లకు తగ్గట్టుగా తనని తాను మలచుకుంటూ వచ్చారు. తాజాగా తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో చేయనున్న సినిమా కోసం ట్రాన్స్‌ఫార్మ్ అవుతున్నారు. ఈ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఫిట్‌నెస్ ట్రైనర్ లాయిడ్స్ స్టీవెన్‌ని నియమించుకున్నారు. ఈ విషయాన్ని లాయిడ్స్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించి, అల్లు అర్జున్, తానూ ఉన్న ఫొటోని షేర్ చేశారు. లాయిడ్స్ మామూలు ట్రైనర్ కాదు. ఇప్పటికే మహేశ్ బాబు, ఎన్టీఆర్ వంటి స్టార్స్‌కి ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చారు. ఇప్పుడు అల్లు అర్జున్ కోసం రంగంలోకి దిగారు. సో.. అట్లీ సినిమాలో అల్లు అర్జున్ కొత్తగా కనిపిస్తారని ఊహించవచ్చు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు.



● ట్రైనర్ లాయిడ్స్ స్టీవెన్‌తో అల్లు అర్జున్

# మైత్రీతో మళ్లీ..?

హిట్ పెయిర్ విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే వార్త వైరల్‌గా మారింది. ఈ కాంబినేషన్‌ని మళ్లీ మైత్రీ కలుపుతోందని టాక్. మైత్రీ అంటే మైత్రీ మూవీ మేకర్స్. విజయ్–రష్మిక జంటగా మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి, యశ్ రంగినేని 'డియర్ కామ్రేడ్' చిత్రం నిర్మించిన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ చిత్రం నిర్మించనుంది ఈ సంస్థ. ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ షూటింగ్ వచ్చే నెల ఆరంభం అవుతుందట. ఈ నేపథ్యంలో 'వేచి చూద్దాం' అంటూ మైత్రీ సంస్థ రష్మికను ట్యాగ్ చేసి, పెట్టిన పోస్ట్‌కి ఈ బ్యూటీ 'ఓకే' అని స్పందించారు. దీంతో విజయ్ దేవరకొండ హీరోగా మైత్రీ సంస్థ నిర్మించనున్న చిత్రంలో రష్మిక కథానాయికగా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇదే నిజమైతే 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్–రష్మిక నటించే మూడో చిత్రం ఇదే అవుతుంది. అలాగే మైత్రీ మూవీ మేకర్స్‌లో 'పుష్ప 1, 2' తర్వాత రష్మికకు ఆ సంస్థలో ఇది మరో ప్రాజెక్ట్ అవుతుంది. మరి... మైత్రీ మళ్లీ విజయ్–రష్మికల కాంబినేషన్‌ని కలుపుతుందా? వేచి చూద్దాం.



● విజయ్ దేవరకొండ, రష్మికా మందన్న

# జన్మ జన్మల బంధం

హీరోయిన్‌గా ప్రేక్షకుల మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సొంతం చేసుకున్నారు సమంత. ఆమె నిర్మాతగా మారి రూపొందించిన తొలి చిత్రం 'శుభం'. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ముఖ్య తారలుగా నటించారు. ఈ చిత్రంలో సమంత కూడా నటించారు. 'సినిమా బండి' మూవీ ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించిన 'శుభం' ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మొదటి సింగిల్ 'జన్మ జన్మల బంధం...' అనే పాటని శనివారం విడుదల చేశారు. ''ఇది ప్రమోషనల్ వైబ్ కోసం రూపొందించిన ఓ ఎనర్జిటిక్ రీమిక్స్ పాట. ఈ సాంగ్‌లో సమంతతో పాటు ప్రధాన తారాగణం కనిపిస్తారు. ఈ ప్రమోషనల్ సాంగ్ బీట్ చాలా హుషారుగా ఉంటుంది. నవ్వు, భయం.. ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌తో 'శుభం' రూపొందింది. ఈ వేసవికి ప్రేక్షకులను పూర్తిగా సంతృప్తిపరిచే చిత్రం అవుతుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: వివేక్ సాగర్, సంగీతం: క్లింటన్ సెరెజో.



● 'శుభం' ప్రమోషనల్ సాంగ్‌లో సమంత, నటీనటులు

## బిజినెస్ రీల్

### ఎన్‌పీఎస్‌లో కొత్తగా 12 లక్షల మంది సభ్యులు



న్యూఢిల్లీ: నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో (ఎన్‌పీఎస్) గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) కొత్తగా 12 లక్షల మంది ప్రైవేటు రంగం నుంచి సభ్యులుగా చేరారు. దీంతో మొత్తం ప్రైవేటు రంగ సభ్యులు 2025 మార్చి నాటికి 165 లక్షలకు చేరారు. చిన్నారుల పేరిట ప్రారంభించేందుకు ఉద్దేశించిన ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం గేతడాది సెప్టెంబర్ నుంచి అందుబాటులోకి రాగా, ఇందులో సభ్యులు లక్ష దాటారు. ఈ వివరాలను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) వెల్లడించింది. పీఎఫ్ఆర్‌డీఏ పర్యవేక్షణలోని ఎన్‌పీఎస్, అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) నిర్వహణలోని ఆస్తులు 2024–25లో 23 శాతం పెరిగి రూ.14.43 లక్షల కోట్లకు చేరాయి.

### నెక్స్‌జెన్ ఎనర్జియాకు నిధులు
**క్యాపిటల్ ఎడ్జ్ భారీ పెట్టుబడులు**



న్యూఢిల్లీ: పెట్టుబడుల కువైట్ సంస్థ క్యాపిటల్ ఎడ్జ్ బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,515 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు గ్రీన్ ఎనర్జీ కంపెనీ నెక్స్‌జెన్ ఎనర్జియా తాజాగా వెల్లడించింది. ఈక్విటీ ఆధారిత పెట్టుబడుల ద్వారా నిధులు అందించనున్నట్లు పేర్కొంది. వీటితో దేశీయంగా మౌలికసదుపాయాలను విస్తరించనున్నట్లు తెలియజేసింది.

### రెమీడియం లైఫ్‌కేర్ రైట్స్ ఇష్యూ

ముంబై: ఫార్మా సంస్థ రెమీడియం లైఫ్ తాజాగా రైట్స్ ఇష్యూ ప్రకటించింది. ఇది మే 14తో ముగుస్తుంది. నిర్వహణ మూలధనం, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలు, అధిక విలువ గల ఫార్మా ఇంటర్మీడియరీల ఉత్పత్తి సామరాధ్యలను మెరుగుపర్చుకోవడం తదితర అవసరాల కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. ఇష్యూ పరిమాణం రూ. 49.19 కోట్లుగా ఉంటుందని కంపెనీ తెలిపింది.

### సెకీతో రిలయన్స్ న్యూ సన్ టెక్ ఒప్పందం



ముంబై: రిలయన్స్ పవర్ అనుబంధ సంస్థ రిలయన్స్ న్యూ సన్‌టెక్ తాజాగా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో పాతికేళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుంది. దీని ప్రకారం వచ్చే 24 నెలల్లో సమీకృత సోలార్ అలాగే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బీఈఎస్ఎస్) ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై రూ. 10,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కేడబ్ల్యూహెచ్‌కి రూ. 3.53 ఫిక్స్‌డ్ రేటు చొప్పున విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది.

### కరోనా రెమిడీస్ ఐపీవో బాట
**సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు**




న్యూఢిల్లీ: ఫార్మా రంగ కంపెనీ కరోనా రెమిడీస్ ఐపీవో బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం కంపెనీ రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 800 కోట్లు సమీకరించనున్నప్పటికీ నిధులు కంపెనీకి లభించబోవు. మహిళా ఆరోగ్య పరిరక్షణ, కార్డియో– డయాబెటో, పెయిన్ మేనేజ్‌మెంట్, యూరాలజీ తదితర విభాగాలలో కంపెనీ ప్రొడక్టులు రూపొందిస్తోంది.

### ఎన్ఎస్ఈ ఐపీవోపై సెబీతో చర్చలు
**కీలక అంశాల పరిష్కారంపై దృష్టి**

ముంబై: పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతున్న స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో చర్చలు నిర్వహిస్తోంది. కొన్ని కీలక అంశాల పరిష్కారం కోసం ఎన్ఎస్ఈ, సెబీ మధ్య చర్చలు కొనసాగుతున్నట్లు సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే తాజాగా వెల్లడించారు. కీలక యాజమాన్య వ్యక్తులకు చెల్లింపులు, టెక్నాలజీ, క్లియరింగ్ కార్పొరేషన్‌లో మెజారిటీ ఓనర్‌షిప్ తదితర అంశాలపై సెబీ ఎన్ఎస్ఈతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఈ ఐపీవో చేపట్టేందుకు వీలుగా ఎన్‌వోసీ కోసం సెబీకి దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-5-2025

| | |
|---|---|
| విశాఖ | 465–00 |
| చిత్తూరు | 533–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 460–00 |
| విజయవాడ | 480–00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 455–00 |
| వరంగల్ | 457–00 |
| రిటైల్ ధర | 5.15 |

# ఎస్‌బీఐ లాభం రూ. 19,600 కోట్లు

- క్యూ4లో 8 శాతం డౌన్
- తగ్గిన నికర వడ్డీ మార్జిన్లు
- ఆదాయం రూ. 1,79,562 కోట్లు
- రూ. 15.90 డివిడెండు




న్యూఢిల్లీ: నికర వడ్డీ మార్జిన్లు క్షీణించిన ప్రభావంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సుమారు 8 శాతం క్షీణించింది. రూ. 19,600 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 21,384 కోట్లు. మొత్తం ఆదాయం రూ. 1,64,914 కోట్ల నుంచి రూ. 1,79,562 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 32 బేసిస్ పాయింట్లు తగ్గి 3.15 శాతానికి పరిమితమైంది. స్టాండెలోన్ ప్రాతిపదికన చూస్తే లాభం వార్షికంగా రూ. 20,698 కోట్ల నుంచి సుమారు 10 శాతం తగ్గి రూ. 18,642 కోట్లకు చేరింది. మార్చి క్వార్టర్‌లో మొత్తం ఆదాయం రూ. 1,28,412 కోట్ల నుంచి రూ. 1,43,876 కోట్లకు ఎగిసింది. 2024–25కి గాను బ్యాంకు ఒక్కో షేరుపై రూ. 15.90 మేర డివిడెండును ప్రకటించింది.

**పెట్టుబడులపై టారిఫ్‌ల అనిశ్చితి ప్రభావం..**
'భారత ఎకానమీపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండనప్పటికీ, సుంకాలపై అనిశ్చితి కారణంగా ఎకానమీ, అలాగే పెట్టుబడులపై మాత్రం ప్రభావం పడొచ్చు' అని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండటంతో తదుపరి మరింతగా రేట్ల కోత ఉండొచ్చని భావిస్తున్నట్లు శెట్టి వివరించారు. తమ రుణాల్లో 27 శాతం భాగం రెపో రేటుతో అనుసంధానమై ఉండటం, ఆర్‌బీఐ రేట్లను తగ్గించే అవకాశాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ఐఎంలపై ఒత్తిడి కొనసాగవచ్చని శెట్టి చెప్పారు. నిర్దిష్ట అంశం వల్ల క్రితం ఆర్థిక సంవత్సరం బ్యాంకు లాభం అధికంగా నమోదైందని, దానితో పోల్చి చూస్తే ప్రస్తుతం తగ్గిందని పేర్కొన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో 12–13 శాతం రుణ వృద్ధిని అంచనా వేస్తున్నామన్నారు. టారిఫ్ యుద్ధాల ప్రభావం రుణ వృద్ధిపై కూడా పడే అవకాశం ఉందని శెట్టి వివరించారు. వాణిజ్య విధానాల్లో మార్పులతో అంతర్జాతీయ ఎకానమీలో అనిశ్చితి నెలకొన్నందున కంపెనీలు తమ పెట్టుబడుల ప్రణాళికలను నెమ్మదిగా అమలు చేసే అవకాశం ఉందన్నారు. దీనితో బ్యాంకులపరంగా రుణ వృద్ధిపైనా ప్రభావం పడుతుందని శెట్టి చెప్పారు. అసెట్ క్వాలిటీ మరింత కాలం మెరుగ్గానే కొనసాగవచ్చన్నారు.

**18వేల కొలువులు..**
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఏకంగా 18,000 నియామకాలు చేపట్టనున్నట్లు శెట్టి తెలిపారు. దశాబ్దకాలంలోనే ఇది అత్యధికమని ఆయన పేర్కొన్నారు. ఇందులో 13,400 మంది క్లర్కులు, 3,000 ప్రొబేషనరీ ఆఫీసర్లు, 1,600 మంది స్పెషలిస్టు ఆఫీసర్లు (టెక్నాలజీ తదితర విభాగాల్లో) ఉంటారని వివరించారు.

**మరిన్ని విశేషాలు..**
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2024–25) గాను స్టాండెలోన్ చూస్తే ఎస్‌బీఐ నికర లాభం 16 శాతం పెరిగి రూ. 61,077 కోట్ల నుంచి రూ. 70,901 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ. 1,11,043 కోట్ల నుంచి రూ. 1,19,666 కోట్లకు పెరిగింది. అసెట్ క్వాలిటీ కూడా మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) పరిమాణం 2024 మార్చి ఆఖరు నాటికి 2.24 శాతంగా ఉండగా తాజాగా 1.82 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పీఏలు సైతం 0.57 శాతం నుంచి 0.47 శాతానికి తగ్గాయి.
- 2025–26లో క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్విప్)/ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) లేదా ఇతరత్రా మార్గాల్లో ఏకమొత్తంగా లేదా విడతలవారీగా రూ. 25,000 కోట్ల వరకు మూలధనం సమకూర్చుకునే ప్రతిపాదనకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదముద్ర వేసింది.
- ప్రస్తుతం ఎస్‌బీఐ కార్పొరేట్ రుణాల పైప్‌లైన్ (ఇప్పటికే మంజూరైనా ఇంకా విడుదల చేయాల్సినవి, భవిష్యత్ అవసరాల కోసం సంప్రదింపుల దశలో జరుపుతున్నవి) రూ. 3.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. మౌలిక రంగం, రెన్యువబుల్ ఎనర్జీ, డేటా సెంటర్లు, కమర్షియల్ రియల్టీ సెగ్మెంట్ల నుంచి రుణాలకు డిమాండ్ నెలకొంది. మార్చి త్రైమాసికంలో కార్పొరేట్ రుణాల వృద్ధి 9 శాతానికి పరిమితం కాగా, రిటైల్ వ్యక్తిగత రుణాలు 11 శాతం పెరిగాయి. ఇందులో గృహ రుణాల వృద్ధి 14 శాతంగా ఉంది.
- అన్‌సెక్యూర్డ్ పర్సనల్ రుణాల విభాగంలో పెద్దగా సవాళ్లేమీ లేనందున దీనిపై బ్యాంకుపై మరింతగా దృష్టి పెట్టనుంది. భారీ కార్పొరేట్ లోన్ల విషయంలోనూ సమస్యేమీ లేకపోవడంతో మరికొన్నాళ్ల పాటు అసెట్ క్వాలిటీ మెరుగ్గానే కొనసాగవచ్చు. మొండి పద్దుల నిష్పత్తి రెండు శాతం లోపే కొనసాగవచ్చు.

# ఇండియన్ బ్యాంక్ జోరు..

- క్యూ4లో లాభం 32 శాతం అప్
- రూ. 2,956 కోట్లుగా నమోదు
- తగ్గిన మొండిబాకీలు, పెరిగిన ఆదాయం

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రోత్సాహకరమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండిబాకీలు తగ్గడం, ఆదాయం పెంరగడంతో రూ. 2,956 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి త్రైమాసికంలో నమోదైన రూ. 2,247 కోట్లతో పోలిస్తే ఇది 32 శాతం అధికం. ఇక బ్యాంకు మొత్తం ఆదాయం రూ. 16,887 కోట్ల నుంచి రూ. 18,599 కోట్లకు ఎగిసింది. నికర వడ్డీ ఆదాయం రూ. 6,015 కోట్ల నుంచి రూ. 6,389 కోట్లకు చేరింది. అసెట్ క్వాలిటీపరంగా చూస్తే స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.95 శాతం నుంచి 3.09 శాతానికి దిగి వచ్చాయి. అలాగే, నికర ఎన్‌పీఏలు కూడా 0.43 శాతం నుంచి 0.19 శాతానికి తగ్గాయి.

**రూ. 16.25 డివిడెండ్..**
పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10 ముఖ విలువ చేస ఒక్కో షేరుపై బ్యాంకు రూ. 16.25 చొప్పున డివిడెండు ప్రకటించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నికర లాభం 35 శాతం వృద్ధి చెంది రూ. 8,063 కోట్ల నుంచి రూ. 10,918 కోట్లకు పెరిగింది. ఆదాయం రూ. 63,482 కోట్ల నుంచి రూ. 71,226 కోట్లకు ఎగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ, బాండ్ల జారీ ద్వారా రూ. 7,000 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బ్యాంకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందులో రూ. రూ. 5,000 కోట్ల మొత్తాన్ని క్విప్ లేదా రైట్స్ ఇష్యూ లేదా రెండింటి మేళవింపుతో బ్యాంకు సమీకరించుకోనుంది. మరో 2,000 కోట్లను బాండ్ల ద్వారా సమకూర్చుకోనుంది.

### మరిన్ని కంపెనీలు కొంటాం: యూనికామర్స్

న్యూఢిల్లీ: వేల్యుయేషన్ సముచితంగా ఉంటే మరిన్ని కంపెనీలను కొనుగోలు చేస్తామని 'యూనికామర్స్ ఈసొల్యూషన్స్' సీఈవో కపిల్ మఖీజా తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ–కామర్స్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకున్నాయని, ఆమ్నిచానల్ లాంటి కొత్త మోడల్స్ తెరపైకి వచ్చాయని ఆయన చెప్పారు. కంపెనీ ఇటీవలే లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫాం షిప్‌వేను కొనుగోలు చేసిన నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూనికామర్స్ ప్రస్తుతం 7,000 పైచిలుకు వ్యాపారాలకు సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఈ–కామర్స్ వ్యవస్థలో కస్టమర్లతో సంప్రదింపుల దశ, లావాదేవీలను ప్రాసెస్ చేసే దశ, ఆర్డరును పూర్తి చేసే దశ అని మూడు దశలు ఉంటాయని, తమ సంస్థ ఈ మూడు అంశాల్లోనూ సర్వీసులు అందిస్తోందని కపిల్ వివరించారు. తాము ఇప్పటికే భారత్ కాకుండా ఆరు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, మరింతగా విస్తరించే యోచనలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# ఒప్పందానికి ముందు అవకాశాల అన్వేషణ

- అమెరికా– భారత్ మధ్య రంగాలవారీ చర్చలు
- మే చివరి నుంచి విస్తృత సంప్రదింపులు
- కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: మధ్యంతర వాణిజ్య ఒప్పందం కోసం సంప్రదింపులు కొనసాగిస్తున్న భారత్–అమెరికా, దీనికంటే ముందు పరస్పర ప్రయోజనాన్నిచ్చే అవకాశాలను గుర్తించే పనిలో పడ్డాయి. వచ్చే సెప్టెంబర్–అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని కేంద్ర సర్కారు ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. రెండు దేశాలూ రంగాల వారీ చర్చలు మొదలు పెట్టాయని, మే చివరి నుంచి మరింత విస్తృత సంప్రదింపుల ప్రణాళికతో ఉన్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. భారత్ తరఫున కేంద్ర వాణిజ్య శాఖ అదనపు సెక్రటరీ రాజేష్ అగర్వాల్, అసిస్టెంట్ యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (దక్షిణాసియా) బ్రెండన్ లించ్ వాషింగ్టన్‌లో గత వారం మూడు రోజుల పాటు చర్చలు నిర్వహించారు. "మొదటి దశ పరస్పర ప్రయోజనకర, బహుళ రంగాల వాణిజ్య ఒప్పందాన్ని (బీటీఏ) 2025 చివరికి (సెప్టెంబర్–అక్టోబర్) ముగించే దిశగా మార్గసూచీపై బృందం చర్చించింది. తొలి దశలో పరస్పర విజయావకాశాలపైనా దృష్టి పెట్టింది" అని వాణిజ్య శాఖ తెలిపింది. భారత్‌పై విధించిన అదనపు సుంకాలను 90 రోజుల పాటు (జూలై 9 వరకు) అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే మొదటి దేశం భారత్ అవుతుందంటూ యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

**పరస్పర డిమాండ్లు..**
కార్మికుల ప్రాధాన్యం కలిగిన టెక్స్‌టైల్స్, జెమ్స్ అండ్ జ్యుయలరీ, తోలు ఉత్పత్తులు, గార్మెంట్స్, ప్లాస్టిక్, కెమికల్స్, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటి ఎగుమతులపై సుంకాల రాయితీలను భారత్ కోరుతోంది. అమెరికా తన వైపు నుంచి ఇండస్ట్రియల్ గూడ్స్, ఆటోమొబైల్స్, వైన్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, డైరీ, యాపిల్, నట్స్ తదితర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాలు తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. ద్వైపాక్షిక ఒప్పందానికి సంబంధించి నియమ, నిబంధనలను రెండు దేశాలూ ఇప్పటికే ఖరారు చేసుకోవడం తెలిసిందే. అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు ఏటేటా పెరుగుతుండడం గమనార్హం. 2024–25లో ఇది 41.18బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరాల్లో ఇది 35.32 బిలియన్ డాలర్లు (2023–24), 27.7 బిలియన్ డాలర్లు (2022–23) చొప్పున ఉంది. దీన్ని సాధ్యమైన మేర తగ్గించుకునేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నిస్తోంది.

# కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం 8% డౌన్

- మార్చి త్రైమాసికంలో రూ. 4,933 కోట్లు
- రూ. 2.50 డివిడెండు




న్యూఢిల్లీ: సూక్ష్మ రుణాల విభాగంలో ఒత్తిళ్ల కారణంగా గత ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం 8 శాతం (కన్సాలిడేటెడ్) క్షీణించింది. రూ. 5,337 కోట్ల నుంచి తగ్గి రూ. 4,933 కోట్లకు పరిమితమైంది. స్టాండెలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ. 4,133 కోట్ల నుంచి 14 శాతం క్షీణించి రూ. 3,552 కోట్లకు తగ్గింది. సమీక్షాకాలంలో నికర వడ్డీ ఆదాయం 5 శాతం పెరిగి రూ. 7,284 కోట్లకు చేరగా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 5.28 శాతం నుంచి 4.97 శాతానికి క్షీణించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ. 5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై బ్యాంకు రూ. 2.50 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

**మార్జిన్ల ఎఫెక్ట్..**
పాలసీ రేట్ల కోతతో పాటు సూక్ష్మ రుణాల విభాగానికి సంబంధించిన సవాళ్ల వల్ల బ్యాంకు ఎన్ఐఎంలపై ప్రతికూల ప్రభావం పడింది. మైక్రోఫైనాన్స్ విభాగంలో సవాళ్లు మరో త్రైమాసికంపాటు కొనసాగవచ్చని, ఆ తర్వాత సాధారణ స్థాయికి రావచ్చని బ్యాంక్ సీఈవో అశోక్ వాస్వానీ తెలిపారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల సెగ్మెంట్లలో తీవ్ర ఒత్తిళ్లేమీ ప్రస్తుతం లేవని ఆయన పేర్కొన్నారు. నామినల్ జీడీపీ వృద్ధికి 1.5 నుంచి 2 రెట్లు రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వాస్వానీ చెప్పారు. పోటీ బ్యాంకుల తరహాలోనే స్వల్పకాలికంగా తమ ఎన్ఐఎంపైనా ఒత్తిళ్లు కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏ అనుబంధ సంస్థలోనూ వాటాలను విక్రయించే యోచనేదీ లేదని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆంక్షల నుంచి బైటపడటంతో వచ్చే ఆరు నెలల్లో, పూర్వ స్థాయికి నెలవారీ క్రెడిట్ కార్డుల జారీని పెంచుకోనున్నట్లు వాస్వానీ చెప్పారు. రుణాల పోర్ట్‌ఫోలియోలో అన్‌సెక్యూర్డ్ లోన్స్ (క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు మొదలైనవి) వాటా 10.5 శాతానికి తగ్గిందని, దీన్ని 15 శాతానికి పెంచుకోవడంపై దృష్టి పెడతామని వివరించారు.

**మరిన్ని కీలకాంశాలు..**
- మార్చి క్వార్టర్‌లో స్టాండెలోన్ ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ. 15,285 కోట్ల నుంచి రూ. 16,712 కోట్లకు పెరిగింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 27,907 కోట్ల నుంచి రు. 27,174 కోట్లకు తగ్గింది.
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం (స్టాండెలోన్) రూ. 13,782 కోట్ల నుంచి రూ. 16,450 కోట్లకు (కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌ను విక్రయించడం ద్వారా వచ్చిన రూ. 2,730 కోట్లతో పాటు) చేరింది. వార్షికంగా చూస్తే ఇది 19 శాతం అధికం. కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ విక్రయ మొత్తాన్ని మినహాయిస్తే నికర లాభం రూ. 13,720 కోట్లు వచ్చింది.
- మొండిబాకీల విషయానికొస్తే.. స్థూల ఎన్‌పీఏలు 1.39 శాతం నుంచి స్వల్పంగా పెరిగి 1.42 శాతానికి చేరాయి. అయితే, నికర ఎన్‌పీఏలు మాత్రం 0.34 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గాయి.
- గ్రూప్ లాభాల్లో అనుబంధ సంస్థల వాటా 29 శాతం పెరగడంతో, సూక్ష్మ రుణాలు..ఆర్‌బీఐ ఆంక్షల వల్ల తలెత్తిన సవాళ్లను బ్యాంకు కొంత అధిగమించగలిగింది.

## మార్చి త్రైమాసిక ఫలితాలు

### షాపర్స్‌స్టాప్ లాభం పతనం

- క్యూ4లో రూ. 2 కోట్లకు పరిమితం




న్యూఢిల్లీ: రిటైల్ స్టోర్ల దిగ్గజం షాపర్స్‌స్టాప్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 91 శాతంపైగా పడిపోయి రూ. 2 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 23 కోట్లుపైగా ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 2 శాతం పుంజుకుని రూ. 1,064 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,046 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 4 శాతం పెరిగి రూ. 1,090 కోట్లకు చేరాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 86 శాతం క్షీణించి రూ. 11 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 77 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 7 శాతం వృద్ధితో రూ. 4,628 కోట్లకు చేరింది.

### పంజాబ్ సింధ్ నికరలాభం రెట్టింపు

- కలిసొచ్చిన ఎన్‌పీఏల తగ్గుదల
- ప్రధాన ఆదాయంలో పెరుగుదల

న్యూఢిల్లీ: మొండిబకాయిలు తగ్గడం, ప్రధాన ఆదాయం పెరగడంతో ప్రభుత్వ రంగ పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.313 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే క్యూ4లో ఆర్జించిన లాభం రూ.139 కోట్లతో పోలిస్తే ఇది 125% అధికం. ఇదే మార్చి త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.2,894 కోట్ల నుంచి రూ.3,836 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.2,481 కోట్ల నుంచి రూ.3,159 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) రూ.689 కోట్ల నుంచి రూ.1,122 కోట్లకు బలపడింది. ఆస్తుల నాణ్యత పరిశీలిస్తే.. స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 5.43% నుంచి 3.38 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.63% నుంచి 0.96 శాతానికి పరిమితమయ్యాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 88.69% నుంచి 91.38 శాతానికి పెరిగింది. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.16% నుంచి 17.41 శాతానికి పెరిగింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ.0.07 పైసల డివిడెండ్ ప్రకటించింది.

- పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ నికరలాభం 71% వృద్ధి చెంది రూ.1,016 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.10,915 కోట్ల నుంచి రూ.13,049 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.2,841 కోట్ల నుంచి రూ.3,784 కోట్లకు, నికర వడ్డీ మార్జిన్ 2.45% నుంచి 2.85 శాతానికి చేరుకున్నాయి.

### ఈక్విటాస్ లాభం పతనం
**క్యూ4లో రూ. 42 కోట్లు**

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(ఎస్ఎఫ్‌బీ) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 80 శాతం క్షీణించి రూ. 42 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 208 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,685 కోట్ల నుంచి రూ. 1,869 కోట్లకు ఎగసింది. ప్రొవిజన్లు రూ. 107 కోట్ల నుంచి రూ. 258 కోట్లకు భారీగా పెరిగాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.61 శాతం నుంచి 2.89 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 1.17 శాతం నుంచి 0.98 శాతానికి తగ్గాయి.

### లాటెంట్ వ్యూ అనలిటిక్స్ నికరలాభం రూ.51 కోట్లు




చెన్నై: డిజిటల్ అనలిటిక్స్ కన్సల్టింగ్ అండ్ సొల్యూషన్స్ ప్రొవైడర్ లాటెంట్ వ్యూ అనలిటిక్స్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.51.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు 2023–24 ఇదే క్వార్టర్‌లో నికర లాభం రూ.45.23 కోట్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ.187.45 కోట్ల నుంచి రూ.253.29 కోట్లకు పెరిగింది. "త్రైమాసిక ప్రాతిపదికన 1.9%, వార్షిక ప్రాతిపదికన 35.3 శాతం పెరుగుదలతో వరుసగా తొమ్మిదోసారి ఆదాయం వృద్ధి సాధించడం సంతోషంగా ఉంది. బలమైన వ్యాపార మూలాలు, క్లయింట్లతో సత్సంబంధాలు మా స్థిరమైన పనితీరుకు నిదర్శనం" అని కంపెనీ సీఈవో రాజన్ సేతురామన్ తెలిపారు. 2025 మార్చి 31తో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం రూ.173.49 కోట్లు, మొత్తం ఆదాయం రూ. 916.78 కోట్లుగా ప్రకటించింది.

# జీడీపీ వృద్ధి 6.5-6.7 శాతం

**2025–26పై డెలాయిట్ అంచనా**




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.5–6.7 శాతం మేర వృద్ధిని నమోదు చేస్తుందని డెలాయిట్ అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్నప్పటికీ బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను మినహాయింపు చర్యలు దేశీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తాయని తెలిపింది. అంతర్జాతీయంగా వాణిజ్య సంబంధాల్లో వస్తున్న మార్పులు, దేశీ వినియోగ డిమాండ్ పెంపు మధ్య ప్రభుత్వం ఎలా సమతూకాన్ని తీసుకొస్తుందన్న దానిపైనే 2025–26 వృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొంది. రెండు వ్యతిరేక శక్తుల మధ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపింది. అంతర్జాతీయ అనిశ్చితులు మన ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు ప్రభావం చూపిస్తాయి.. అదే సమయంలో పన్ను రాయితీలు దేశీ వినియోగాన్ని ఏ మేరకు పెంచుతాయో చూడాల్సి ఉందని పేర్కొంది. వీటి ఆధారంగా జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 6.7 శాతం మధ్య ఉండొచ్చని తెలిపింది. 2025–26 బడ్జెట్‌లో కేంద్రం రూ.లక్ష కోట్ల మేర పన్ను రాయితీలను ప్రకటించడం తెలిసిందే. మధ్యతరగతి కుటుంబాలకు దీంతో ప్రయోజనం చేకూరనుంది. పన్ను రాయితీలతో యువత చేతుల్లో ఖర్చు చేసే మిగులు ఆదాయం పెరుగుతుందని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి ముజుందార్ తెలిపారు. అమెరికా ప్రతీకార సుంకాలను భారత్ ఎలా ఎదుర్కొంటుంది? ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఏ మేరకు పురోగతి సాధిస్తుందన్నది కీలకమన్నారు. ప్రతీకార సుంకాలతో భారత జీడీపీ 0.1–0.3 శాతం తగ్గిపోవచ్చని ముజుందార్ అభిప్రాయపడ్డారు. వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్ కొత్త అవకాశాలను సొంతం చేసుకోగలదన్నారు.

### ఐపీవోకు ప్రయారిటీ జ్యువెల్స్
**సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు**




న్యూఢిల్లీ: ఆభరణాల రిటైల్ కంపెనీ ప్రయారిటీ జ్యువెల్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 54 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 75 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2007లో ఏర్పాటైన కంపెనీ బంగారం, ప్లాటినం, వెండిసహా వజ్రాలతోకూడిన ఆభరణాలను తయారు చేసి విక్రయిస్తోంది. క్యారట్‌లేన్, కళ్యాణ్ జ్యువెలర్స్, మలబార్ గోల్డ్, రిలయన్స్ రిటైల్, టీబీజెడ్, సెన్కో గోల్డ్ తదితర జ్యువెలరీ రిటైల్ స్టోర్లకు సైతం ప్రొడక్టులు సరఫరా చేస్తోంది.




# మా ప్రయాణం అద్భుతం ఒలింపిక్ పతకమే లక్ష్యం

**భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ మనోగతం**

భారత బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ రాటుదేలుతూ వస్తోంది. గతేడాది పారిస్ ఒలింపిక్స్ అవకాశం తృటిలో కోల్పోయినా... ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి దూసుకొచ్చింది. 9వ ర్యాంకుతో ఈ ఘనతకెక్కిన తొలి భారత మహిళల జంటగా నిలిచింది. బిజీగా గడిచిన గత సీజన్‌లో విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచితే... వరల్డ్ టూర్ ఫైనల్స్ లాంటి మేజర్ టోర్నీలు పాఠాలు నేర్పాయని ఇద్దరు చెప్పుకొచ్చారు. ఓ ఇంటర్వ్యూలో ఇద్దరు తాము జోడీకట్టిన తీరు నుంచి విజయాలు, సాఫల్యాల దాకా తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు.

**➡ 2021లో మొదలైన మీ ప్రయాణం ఎలా సాగుతోంది?**

**గాయత్రి:** మొదట్లో నేను సింగిల్స్ ఆడేదాన్ని. కానీ డబుల్స్ అయితే ఇంకా బాగా ఆడతాననిపించింది. దీంతో ట్రెసాతో జోడీ కట్టాను. నేను అనుకున్నట్లుగానే కొన్ని టోర్నీల్లోనే డబుల్స్‌లో రాణించగలగడం మరింత ఆనందాన్నిచ్చింది. తర్వాత ఏడాదే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ (2022) ఆడి సెమీస్ చేరాం. అలాంటి ప్రతిష్టాత్మక టోర్నీల్లో ఇంత త్వరగా ఆడతామనుకోలేదు. అక్కడి నుంచే మా జోడీ మరింత బలపడింది. మా పయనం అద్భుతంగా సాగుతోంది. మేటి ప్రత్యర్థులతో ఎన్నో మ్యాచ్‌లు గెలిచాం. ఎంతో నేర్చుకున్నాం.

**ట్రెసా:** 2021లో మేమిద్దరం కలిసి ఆడటం మొదలు పెట్టాం. అప్పటినుంచే గాయత్రి గురించి తెలుసుకున్నాను. కోర్టులో జోడీగా, కోర్టు బయట స్నేహితులుగా మా బంధం పటిష్టమైంది. ఆటలోనే కాదు... అవసరమైన ప్రతీసారి నాకు చాలా మద్దతుగా నిలుస్తుంది. నాకు ఏదైనా సాయం అవసరమైనా గాయత్రి ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది.

**➡ గతేడాది సాధించిన సయ్యద్ మోడి టైటిల్ ఎలాంటి సంతృప్తినిచ్చింది?**

**గాయత్రి:** బీడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లో భాగమైన సయ్యద్ మోడి టైటిల్‌ను సాధించేవరకు తెలియదు... మేమే ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళల జోడీ అని! అందుకే ఆ విజయం ఎప్పటికీ ప్రత్యేకమైంది. దేశానికి ట్రోఫీ తెచ్చిపెట్టడం గొప్ప అనుభూతినిచ్చింది. ఆ విజయానందంలో మేమిద్దరం భావోద్వేగానికి గురయ్యాం. అది ఇప్పటికీ గుర్తుంది.

**ట్రెసా:** ఇలాంటి మేజర్ టోర్నీ టైటిల్స్ గెలుపొందాలన్నదే మా ఉమ్మడి కల. ఫైనల్లో గెలిచి... పోడియంపై నిలిచి... గర్వంగా బంగారు పతకాల్ని అందుకోవడం మంచి అనుభూతినిచ్చింది. ఇలాంటి సంతోషాన్ని మాటల్లో చెప్పలేం.

**➡ పారిస్ ఒలింపిక్స్ అవకాశాన్ని కోల్పోయిన మీరు లాస్ ఏంజెలిస్ లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారు?**

**గాయత్రి:** పారిస్ ఛాన్స్ చేజార్చుకోవడంతోనే మా ఒలింపిక్స్ కల అంతమవలేదు. మా మనోధైర్యం కోల్పోలేదు. తదుపరి లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ రూపంలో మరో అవకాశముంది. మరింత కష్టపడతాం. ప్రతి టోర్నీని అనుకూలంగా మలచుకుంటాం. ఒక్క ఒలింపిక్సే టోర్నమెంట్ కాదు. ఎన్నో ముఖ్యమైన టోర్నీలూ ఉన్నాయి. అన్నింటా సత్తా చాటడమే మా లక్ష్యం.

**ట్రెసా:** అవును... ఆ ఒలింపిక్స్‌కు దూరమయ్యాం. మేం అర్హత సాధించలేకపోవడం మమ్మల్ని నిరాశపరిచింది. కానీ వచ్చే ఒలింపిక్స్ కోసం ఇప్పటినుంచే శ్రమిస్తాం. ప్రతి క్యాలెండర్ ఇయర్‌లోని టోర్నీలన్నీ ఆడటం ద్వారా ర్యాంకింగ్‌కు మెరుగుపర్చుకొని అర్హత సాధిస్తాం.

**➡ గతేడాది బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ అనుభవం గురించి చెబుతారా?**

**గాయత్రి:** హాంగ్జౌలో జరిగిన ఈ టోర్నీలో తొలి పోరులో చైనాకు చెందిన లియు-తన్ జంటను ఎదుర్కొన్న మాకు పరాజయం తప్పలేదు. అయితే రెండో మ్యాచ్‌లో మలేసియన్ జోడీ పిర్లి తన్-తినాలపై గెలుపొందడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. కానీ మూడో మ్యాచ్‌లో నమీ మత్సుయమ-చిహరు షిదా (జపాన్) జోడీ చేతిలో ఓడటంతో ముందుకెళ్లే అవకాశాల్ని కోల్పోయాం. అయితే అనుభవ పాఠాలైతే నేర్చుకోగలిగాం.

**ట్రెసా:** సీజన్ ముగింపు టోర్నీలో అంతా మేటి ప్రత్యర్థులే ఎదురవుతారు. రెడ్ మ్యాట్‌పై ఆడే మ్యాచ్‌ల్ని టీవీల్లో చూశాను. గతేడాది ప్రత్యక్షంగా




ఆడాను. చైనాలోని స్టేడియాలు, మ్యాచ్‌లపై ఉండే అంచనాలు నిజంగా గొప్పగా ఉంటాయి. అక్కడ మేం ఆడిన మ్యాచ్‌లు, అనుభవం చాలా దోహదపడుతుందని అనుకుంటున్నా.

**➡ గుత్తా జోడీ ర్యాంకింగ్‌ను అధిగమించడం ఎలా అనిపిస్తోంది?**

**గాయత్రి:** గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్పల 10వ ర్యాంకును అధిగమించిన భారత మహిళల ద్వయంగా నిలువడం చాలా ఆనందాన్నిచ్చింది. మొదట ఈ ర్యాంకు ఘనత తెలియదు. నిజానికి మా లక్ష్యం గుత్తా జోడీ ర్యాంకింగ్‌ను చెరిపేయడం కాదు. మేం టాప్-10లోకి దూసుకెళ్లడం. మొత్తానికి భారత మహిళల డబుల్స్‌లో ఇలా మెరుగైన ర్యాంకింగ్ సాధించడం మా శ్రమకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాం.

**ట్రెసా:** నిజానికి గత క్యాలెండర్ ఇయర్ చాలా బిజీగా గడిచింది. అందుకే కఠినమైన టోర్నీలను ఎంపిక చేసుకొని ఆడటం. విజయాలు సాధించడం వల్లే మా ర్యాంకుల్లో మెరుగుదల కనిపించింది. ఇలాంటి మైలురాళ్లు ఎవరికైనా ఆనందాన్నే ఇస్తాయి.

## తెలంగాణకు ఏఐఎఫ్ఎఫ్ పురస్కారం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఫుట్‌బాల్ విస్తృతికి కృషి చేస్తున్న తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్)కు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) సముచితంగా గౌరవించింది. భువనేశ్వర్ వేదికగా జరిగిన ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవి ఈ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ పురోభివృద్ధికి కృషి చేసినందుకు ఈ అవార్డును ఇచ్చినట్లు ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోనిబాలా దేవి మాట్లాడుతూ... 'తెలంగాణ ఫుట్‌బాల్‌కు దక్కిన గౌరవం ఇది. రాష్ట్రంలో క్రీడా సంస్కృతి మరింత పెరిగేందుకు ఈ పురస్కారం దోహద పడుతుంది' అని వ్యాఖ్యానించారు.




## ఫైనల్లో రష్మిక జోడీ




**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 50 టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఫైనల్లోకి దూసుకెళ్లింది. జార్జియాలోని లొపాటా నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీ ఫైనల్లో రష్మిక (భారత్)-అలెగ్జాండ్రా షబ్లేడ్జ్ (రష్యా) ద్వయం 6-2, 6-4తో పారిస్ కోర్లీ (అమెరికా)-టిఫానియె లెమైట్రె (ఫ్రాన్స్) జంటపై విజయం సాధించింది. 1 గంట 24 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరస సెట్‌లలో విజయం సాధించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన రష్మిక... డబుల్స్‌లో మాత్రం చక్కటి ఆటతీరు కనబరుస్తూ తుదిపోరుకు అర్హత సాధించింది.

## అవినాశ్ సాబ్లేకు 8వ స్థానం

**కెకియావో డైమండ్ లీగ్**

**కెకియావో (చైనా):** భారత స్టార్ స్టీపుల్‌చేజర్ అవినాశ్ సాబ్లే... డైమండ్ లీగ్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. చైనా వేదికగా శనివారం జరిగిన పోటీల పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ విభాగంలో అవినాశ్ 8 నిమిషాల 23.85 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. 30 ఏళ్ల సాబ్లేకు ఈ సీజన్‌లో ఇది రెండో రేసు... కాగా భారత అథ్లెట్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. గత వారం జియామెన్ డైమండ్ లీగ్‌లో అవినాశ్ దీనికంటే మెరుగైన ప్రదర్శన (8 నిమిషాల 22.59 సెకన్లు) కనబర్చాడు. ఇథియోపియాకు చెందిన అబ్రహం సైమ్ 8 నిమిషాల 7.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలవగా... ఎడ్‌మండ్ సెరెమ్ (8 నిమిషాల 8.68 సెకన్లు; కెన్యా), సిమన్ కిప్‌రోప్ కొయిచ్ (8 నిమిషాల 9.05 సెకన్లు; కెన్యా) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ చాంపియన్ సౌఫియాన్ ఎల్ బక్కాలీ (మొరాకో) రేసును పూర్తి చేయలేకపోయాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 8 నిమిషాల 14.18 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 11వ స్థానంలో నిలిచిన సాబ్లే... ఈ టైమింగ్‌తోనే ఈ ఏడాది సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ జాతీయ రికార్డు (8 నిమిషాల 9.91 సెకన్లు) అవినాశ్ పేరిటే ఉంది.




## 'హ్యాట్రిక్'పై భారత్ గురి

- నేడు శ్రీలంకతో మహిళల పోరు
- జోరుమీదున్న హర్మన్ సేన




**కొలంబో:** ముక్కోణపు వన్డే సిరీస్‌లో వరుస విజయాల ఆధిపత్యాన్ని కొనసాగించాలని భారత మహిళల జట్టు పట్టుదలతో ఉంది. ఇప్పటికే ఆతిథ్య శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లను ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన ఇప్పుడు 'హ్యాట్రిక్' విజయంపై కన్నేసింది. టోర్నీలో భాగంగా ఆదివారం భారత అమ్మాయిల జట్టు... లంకతో తలపడనుంది. వన్డే క్రికెట్‌లో వరుసగా 8 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన టీమిండియాను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓడించడమంటే లంకకు శక్తికి మించిని పనే అవుతుంది. ఈ నేపథ్యంలో భారత్‌కు 'హ్యాట్రిక్' కష్టం కాకపోవచ్చు.

**అన్ని రంగాల్లో ఆధిపత్యం**

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని రంగాల్లోను భారత్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తోంది. బ్యాటింగ్‌లో ఓపెనర్లు ప్రతీక, స్మృతి మంధాన ఫామ్‌లో ఉన్నారు. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ నిలకడగా రాణిస్తుండగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్‌లతో కూడిన మిడిలార్డర్ దీటుగా ఉంది. బౌలింగ్ విభాగంలో ప్రత్యేకించి ఈ సిరీస్‌లో మాత్రం స్పిన్ విభాగం ప్రత్యర్థుల గుండెల్లో గుబులు రేపుతోంది. దీప్తిశర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణిల ఉచ్చులో బ్యాటర్లు చిత్తవుతున్నారు. పేసర్లు కాశ్వీ గౌతమ్, అరుంధతీ పరుగుల పరంగా కట్టడి చేస్తున్నారు. ఇక ఈ టోర్నీలో సఫారీలాంటి గట్టి ప్రత్యర్థి జట్టు ఫీల్డర్ల కంటే కూడా మన ఫీల్డింగే ఎంతో మెరుగ్గా ఉంది. దీంతో భారత్ ఎదురు లేని విజయాలతో దూసుకెళుతోంది.

**సఫారీపై గెలిచిన ఉత్సాహంతో...**

మరోవైపు ఆతిథ్య లంక జట్టు గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచిన ఉత్సాహంతో ఉంది. హాసిని పెరీరా, హర్షిత, కవిశా దిల్హరి అర్ధసెంచరీలతో లక్ష్యాన్ని ఛేదించి విజయాన్నందుకున్న శ్రీలంక... ఇదే పట్టుదలను భారత్‌పై కనబరచాలని భావిస్తోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు, విష్మి గుణరత్నేలు టాపార్డర్‌లో రాణిస్తే కాస్త మెరుగైన స్కోరు చేయగలుగుతుంది. బౌలింగ్ దళంలో మాల్కి మదర, సుగంధిక కుమారి, దేవ్మి విహంగ, ఐనొక రణవీర నిలకడగా వికెట్లను పడగొడుతున్నారు. అయితే వీరంతా భారత్‌లాంటి మేటి ప్రత్యర్థిపై ఏమేరకు రాణిస్తారనే దానిపై ఆతిథ్య జట్టు విజయావకాశాలు ఆధారపడివున్నాయి.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** ప్రతీక, స్మృతి, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్, జెమీమా, రిచా ఘోష్, దీప్తి శర్మ, కాశ్వీ గౌతమ్, అరుంధతి, స్నేహ్ రాణా, శ్రీచరణి.

**శ్రీలంక:** చమరి ఆటపట్టు (కెప్టెన్), హాసిని, విష్మీ, హర్షిత, కవీశ, నీలాక్షిక సిల్వా, అనుష్క సంజీవని, దేవ్మి, మాల్కి మదర, సుగంధిక, ఐనొక రణవీర.




## నిష్క ట్రిపుల్ ధమాకా

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ జూనియర్, సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ మూడు పతకాలతో సత్తాచాటింది. పుణే వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ సీనియర్ మహిళల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో నిష్క పసిడి పతకం ఖాతాలో వేసుకుంది. ఫైనల్లో నిష్క 11.433 పాయింట్లు చేసి అగ్రస్థానం దక్కించుకోగా... స్నేహ (10.967; ఢిల్లీ), సమంత (10.667 పాయింట్లు; రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు) వరుసగా రజత కాంస్యాలు దక్కించుకున్నారు. సీనియర్ మహిళల వాల్టింగ్ టేబుల్‌లోనూ నిష్క పసిడి గెలిచింది. తుదిపోరులో 12.883 పాయింట్లతో సత్తాచాటింది. సమంత (12.867 పాయింట్లు; రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు), స్వస్తిక (12.333 పాయింట్లు; రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు) రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. బ్యాలెన్సింగ్ బీమ్ విభాగంలో నిష్క అగర్వాల్ 10.967 పాయింట్లతో రజతం గెలుచుకుంది. రితు దాస్ (11.400 పాయింట్లు), వర్ష (10.533 పాయింట్లు) వరుసగా స్వర్ణ, కాంస్యాలు చేజిక్కించుకున్నారు. అన్ ఈవెన్ బార్స్‌లోనూ పోటీపడిన నిష్క నాలుగో స్థానంలో నిలిచింది.

## ఆంటోనెలి అదుర్స్

- 'పోల్ పొజిషన్' సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు
- మియామి గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ రేసు




**మియామి గార్డెన్స్ (ఫ్లోరిడా):** మెర్సిడెస్ డ్రైవర్ కిమీ ఆంటోనెలి... ఫార్ములావన్ చరిత్రలో పోల్ పొజిషన్ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇటలీకి చెందిన ఆంటోనెలి 18 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించి ఔరా అనిపించాడు. ఫార్ములావన్ సీజన్‌లో భాగంగా ఆరో రేసు మియామి గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మెర్సిడెస్ డ్రైవర్ ఈ ఘనత సాధించాడు. ఆంటోనెలికి ఇదే తొలి ఫార్ములా వన్ సీజన్ కాగా... ఏడు సార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ స్థానంలో మెర్సిడెస్ జట్టులో అతడు స్థానం దక్కించుకున్నాడు. మియామి క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అంచనాలకు మించి రాణించిన ఆంటోనెలి... అతడిపై మెర్సిడెస్ పెట్టుకున్న ఆశలను నిజం చేశాడు. శనివారం జరిగిన స్ప్రింట్ రేసులో ఈ ఇటాలియన్ డ్రైవర్ 1 నిమిషం 26.482 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచాడు. మెక్‌లారెన్ డ్రైవర్లు ఆస్కార్ పియాస్ట్రి 1 నిమిషం 26.527 సెకన్లలో, లాండో నోరిస్ 1 నిమిషం 26.582 సెకన్లలో గమ్యాన్ని చేరి వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. రెండో స్థానంలో నిలిచిన పియస్ట్రి కంటే 0.045 సెకన్లు ముందుగా ఆంటోనెలి లక్ష్యాన్ని చేరాడు. నాలుగుసార్లు ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్; 1 నిమిషం 26.737 సెకన్లు) నాలుగో స్థానంతో క్వాలిఫయింగ్ రేసును ముగించాడు. తండ్రి అయిన తర్వాత బరిలోకి దిగిన తొలి రేసులో వెర్‌స్టాపెన్ మంచి ప్రదర్శన కనబర్చాడు. మెర్సిడెస్‌కే చెందిన రసెల్ 1 నిమిషంలో 26.791 సెకన్ల టైమింగ్‌తో ఐదో 'ప్లేస్' దక్కించుకున్నాడు. ఏడు సార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 27.030 సెకన్లు) ఏడో స్థానంలో నిలిచాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును ఆంటోనెలి 'పోల్ పొజిషన్' నుంచి ప్రారంభించనున్నాడు. ఫార్ములావన్ రేసుల్లో ఓ ఇటాలి డ్రైవర్ 'పోల్ పొజిషన్' సాధించడం 2009 తర్వాత ఇదే తొలిసారి. 'ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. ఆకాశంలో తేలుతున్న భావన కలుగుతోంది. పోల్ పొజిషన్ సాధిస్తానని ఏమాత్రం ఊహించలేదు. రేసు ఆరంభానికి ముందు మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నా. ట్రాక్‌పై దాన్నే కొనసాగించా. కెరీర్‌లో తొలి 'పోల్ పొజిషన్' సాధించడం చాలా గొప్పగా అనిపిస్తోంది. ప్రధాన రేసును అగ్రస్థానం నుంచి ప్రారంభించడం చాలా బాగుంటుంది. ఇదే జోరు కొనసాగించేందుకు ప్రయత్నిస్తా' అని రేసు అనంతరం ఆంటోనెలి పేర్కొన్నాడు. 24 రేసుల ఈ సీజన్‌లో మియామి గ్రాండ్ ప్రి ఆరోది కాగా... ఐదు రేసుల్లో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ పియాస్ట్రి 99 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో, నోరిస్ 89 పాయింట్లతో రెండో స్థానంలో, వెర్‌స్టాపెన్ 87 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు.




**మియామీ గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ టోర్నీ**

| స్థానం | డ్రైవర్ | జట్టు | టైమింగ్ |
| --- | --- | --- | --- |
| 1 | ఆంటోనెలి | మెర్సిడెస్ | 1:26.482 సెకన్లు |
| 2 | పియాస్ట్రి | మెక్‌లారెన్ | 1:26.527 సెకన్లు |
| 3 | నోరిస్ | మెక్‌లారెన్ | 1:26.582 సెకన్లు |
| 4 | వెర్‌స్టాపెన్ | రెడ్‌బుల్ | 1:26.737 సెకన్లు |
| 5 | రసెల్ | మెర్సిడెస్ | 1:26.791 సెకన్లు |
| 6 | లెక్‌లెర్క్ | ఫెరారీ | 1:26.808 సెకన్లు |
| 7 | హామిల్టన్ | ఫెరారీ | 1:27.030 సెకన్లు |
| 8 | అల్బన్ | విలియమ్స్ | 1:27.193 సెకన్లు |
| 9 | హాడ్జర్ | రేసింగ్ బుల్స్ | 1:27.790 సెకన్లు |
| 10. | అలోన్సో | ఆస్టన్ మార్టిన్ | 1:27.790 సెకన్లు |

# గాజాలో ఆకలి కేకలు



శనివారం గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఓ కమ్యూనిటీ కిచెన్ వద్ద ఆహారం దొరుకుతుందో లేదో అన్న ఆందోళనలో పాలస్తీనావాసులు

## మరణం అంచున 3.35 లక్షల మంది చిన్నారులు

### అడుగంటిన సరుకు నిల్వలు • రెండువారాల్లో కమ్యూనిటీ కిచెన్‌కు సైతం మూత

**గాజా:** ఇజ్రాయెల్ ఆర్మీ రెండు నెలలుగా కొనసాగిస్తున్న దిగ్బంధం గాజాలోని పాలస్తీనియన్లను ఆకలి చావుల ప్రమాదపు టంచుకు చేర్చింది. ఆహారం, నీరు, మందులు, ఇంధనం వంటి అత్యవసరాలను సైతం సైన్యం అడ్డుకోవడంతో సరఫరాలతో వస్తున్న ట్రక్కులు వందలాదిగా సరిహద్దుల్లోనే నిలిచిపోయాయి. తమ వద్ద ఉన్న సరుకుల నిల్వలు మరో రెండు వారాలకు మాత్రమే సరిపోతాయని గాజా ప్రజలకు ఆహారం అందిస్తున్న సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ లోగా ఇజ్రాయెల్ నిర్ణయం మార్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అలాకాని పరిస్థితుల్లో ఇప్పటికే అర్ధాకలితో అలమటిస్తున్న లక్షలాది మంది పాలస్తీనియన్లకు ఆకలి చావు లు తప్పవని హెచ్చరిస్తున్నాయి. తమ వద్ద ఉన్న నిత్యావసర సరుకుల నిల్వలు పూర్తిగా అడుగంటాయని ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం(యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) తెలిపింది. మానవతా సాయం, పౌరుల ప్రాణాల విషయంలో బేరమాడటం సరైన విధానం కాదని ఐరాస మానవతా విభాగం చీఫ్ టామ్ ఫ్లెచర్ ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. తీవ్రమైన పోషకాహార లోపం కారణంగా ఐదేళ్లలోపు వయస్సున్న 3.35 లక్షల మంది చిన్నారులు మరణం అంచున ఉన్నారని యునిసెఫ్ ఇప్పటికే హెచ్చరించింది. ఇది యుద్ధ నేరమేనని, ఇంతటితో ఆపాలని అంతర్జాతీయంగా ఎన్ని ఒత్తిడులు వస్తున్నటికీ ఇజ్రాయెల్ లక్ష్యపెట్టడం లేదు. బందీలందరినీ హమాస్ విడిచిపెట్టేదాకా దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టం చేస్తోంది. ఇజ్రాయెల్ బలగాలు గాజా నుంచి పూర్తిగా వైదొలిగేదాకా వెనక్కి తగ్గేది లేదని హమాస్ సైతం భీష్మించుకుంది.

**మటన్ బదులు కొషారి**

అమెరికన్ నియర్ ఈస్ట్ రెఫ్యూజీ ఎయిడ్(అనెరా) గాజాలో రెండు సామాజిక వంటశాలలను నడుపుతోంది. ఖాన్‌యూనిస్‌లోని కమ్యూనిటీ కిచెన్ రోజుకు 6 వేల మందికి సరిపడా ఆహారం వండుతోంది. ప్రస్తుతం ఆకుకూరలు, బియ్యం, టమాటా సాస్‌లతో కూడిన కొషారి అనే వంటకాన్ని వండి వడ్డిస్తున్నామని నిర్వాహకుడు సమీ మతార్ చెప్పారు. ఆహార నాణ్యతను పరీక్షించాకే పార్శిల్ చేస్తామని, ఒక్కో పార్శిల్‌లోని ఆహారం నలుగురికి సరిపోతుందని వివరించారు. మిగిలిన ఆహారాన్ని శరణార్థి శిబిరాలున్న అల్ మవాసీకి తరలించి, డజన్ల సంఖ్యలో ఉన్న సూపర్‌వైజర్ల సాయంతో పంపిణీ చేస్తున్నామన్నారు. 'గతంలో వారానికి వంద చొప్పున ట్రక్కుల్లో ఆహారం, మందులు ఇక్కడికి చేరేవి. ఈ ఏడాది ఆరంభంలో కాల్పుల విరమణ సమయంలో వచ్చిన ఆహార పదార్థాలు, నిత్యావసరాలను నిల్వ ఉంచాం. దిగ్బంధనం కారణంగా ఆ నిల్వలు కరిగిపోయాయి. సరఫరా నిలిచిపోవడంతో స్థానిక దుకాణాలు మూతబడ్డాయి. దీంతో, ఎలాంటి ఆదాయ వనరులు లేని వారు మేమందించే ఆహారంపైనే పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నారు. వీరి కోసం గతంలో అన్నం, మాంసం వండేవాళ్లం. మాంసం దుకాణాలు మూతబడ్డాయి. బియ్యం, ఆకు కూరలు, పాస్తా, వంటనూనె, ఉప్పు వంటివి సైతం దొరకడం కనాకష్టంగా మారింది. గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వంట కోసం 700 కిలోల కట్టెలు కొంటున్నాం. వంట చెరుకు ధర సైతం పెరిగిపోయింది. సరుకుల కొరత కారణంగా వచ్చే రెండు వారాల్లోపే ప్రజలకు ఏకైక ప్రాణాధారమైన ఇక్కడి కిచెన్లన్నీ మూతబడే ప్రమాదముంది' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న సరుకులు కూడా ఖర్చయిపోతే ఆ తర్వాత ఏం చేయాలో తెలియడం లేదని మతార్ నిర్వేదంతో అన్నారు. మానవతా సాయం నిల్వలను హమాస్ శ్రేణులు దోచుకుంటున్నాయంటూ ఇజ్రాయెల్ చేస్తున్న ఆరోపణలను మతార్ కొట్టిపారేశారు. ఇక్కడ ప్రతిదీ పారదర్శకంగా క్రమపద్ధతిలో జరుగుతోందని, బయటి వ్యక్తుల ప్రమేయం ఉండదని పేర్కొన్నారు.

**చిన్నారి ఆకలి చావు**

గాజా సిటీలోని రంటిసి హాస్పిటల్‌లో శనివారం జనన్ సలెహ్ అల్-సకఫీ అనే చిన్నారి కన్నుమూసింది. పోషకాహార లోపం, డీహైడ్రేషన్ ఆమె ఉసురు తీశాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇదంతా ఇజ్రాయెల్ చేసిన పాపమేనని కుటుంబసభ్యులు దుమ్మెత్తి పోశారు. 63 రోజులుగా సాగుతున్న ఇజ్రాయెల్ దిగ్బంధనం ఫలితంగా కనీసం 57 మంది పాలస్తీనా బాలలు ఆకలి చావులకు గురయ్యారని గాజా ప్రభుత్వం తెలిపింది. రఫా సహా అన్ని సరిహద్దులను తెరిచి, గాజాలోని 24 లక్షల మంది పాలస్తీనవాసులకు మానవీయ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది.



ఖాన్ యూనిస్‌లో మరో వితరణ కేంద్రం వద్ద ఆహార కోసం పోటీపడుతున్న బాలలు

---

# చైనా అధికారులకు అమెరికా వల

### తమతో కలిసి రావాలంటూ సీఐఏ వీడియోలు

**వాషింగ్టన్:** చైనా అధికారులను బుట్టలో వేసుకునేందుకు అమెరికా గూఢచార సంస్థ సీఐఏ ఎప్పటికప్పుడు కొత్త దారులు వెదుకుతోంది. అధ్యక్షుడు జిన్‌పింగ్ పాలనలో తమ భద్రత గురించి ఆందోళన చెందే చైనా అధికారులు తమతో కలిసి పనిచేయాలంటూ అమెరికా గూఢచార విభాగం సీఐఏ తాజాగా పిలుపునిచ్చింది. అలాంటి వారు తమను సంప్రదించాలని కోరింది. ఇందుకు సంబంధించి చైనా అధికార భాష మాండరిన్‌లో రూపొందించిన వీడియోలను తాజాగా యూట్యూబ్, ఎక్స్‌లలో విడుదల చేసింది. ఈ రిక్రూట్‌మెంట్ వీడియోలకు విడుదలైన మొదటి రోజే 50 లక్షల వ్యూస్ రావడం గమనార్హం. ఒక వీడియోలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వంలో ఎంతో నిజాయతీతో పనిచేస్తున్న ఓ వ్యక్తి.. 'పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, వాటి వల్ల తన కుటుంబ భద్రత ప్రమాదంలో పడిందని ఆందోళన చెందుతుంటాడు. వీడియోలో నేపథ్య సంగీత తీవ్రత పెరుగుతుండగా అతడు..'నేను ఏ తప్పూ చేయలేదు. నేను భయంతో జీవించలేను..!'అంటూ తన స్మార్ట్‌ఫోన్‌తో సీఐఏను సంప్రదించే ప్రయత్నం చేస్తుంటాడు. సీఐఏ చిహ్నం కనిపించడంతో రెండు నిమిషాల నిడివిగల ఈ వీడియో ముగుస్తుంది. వీడియో కింద ఉన్న లింక్‌లో సీఐఏ అంటూ నకిలీ ఖాతాలుంటాయనే హెచ్చరికతోపాటు, సురక్షితంగా సంప్రదించడంపై సూచనలుంటాయి. ఈ వీడియోలపై సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ స్పందించారు. కొత్తగా కొన్ని దేశాల్లో ముఖ్యంగా చైనాలో మనుషులను నియమించుకుని గూఢచర్య కార్యకలాపాలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. గూఢచర్యం కోసం అమెరికా అధికారులను చైనా వాడుకుంటున్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఆర్థికంగా, సైనికంగా, సాంకేతికత పరంగా ప్రపంచంపై ఆధిపత్యం చలాయించాలని చైనా కుట్రలు పన్నుతోందని తెలిపారు. ఇటువంటి బెడదపై తగురీతిలో స్పందిస్తామన్నారు. అందులో భాగంగానే ఈ వీడియోలను విడుదల చేశామని చెప్పారు. ఇటీవలే సీఐఏ కొరియన్, మాండరిన్, ఫార్సి భాషల్లో సీఐఏను సంప్రదించడమెలాగో వివరిస్తూ వీడియోలు విడుదల చేసింది. మూడేళ్ల క్రితం రష్యన్ భాషలోనూ ఇలాంటి వీడియోనే సీఐఏ విడుదల చేయడం గమనార్హం.

# రాజధర్మాన్ని కాపాడడంలో మోదీ విఫలం

- మణిపూర్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలి
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించినప్పటికీ పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో హింస మొదలైన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కసారి కూడా పర్యటించలేదని, అక్కడ రాజధర్మాన్ని కాపాడడంలో ఆయన దారుణంగా విఫలమయ్యారని ఆరోపించారు. హింసాకాండ ఎప్పటిలాగే కొనగుతున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలని నిలదీశారు. మణిపూర్‌లో సాధ్యమైనంత త్వరగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖర్గే శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. మణిపూర్‌లో రెండేళ్లుగా హింస జరుగుతోందని తెలిపారు. రెండు రోజుల క్రితం తమెంగ్‌లాంగ్ జిల్లాలో జరిగిన ఘర్షణలో 25 మంది గాయపడ్డారని పేర్కొన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 260 మందికిపైగా మరణించారని, 68 వేల మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. అయినప్పటికీ ప్రధాని మోదీ నోరువిప్పడం లేదని ధ్వజమెత్తారు. 2022 జనవరి తర్వాత మోదీ 44 సార్లు విదేశీ పర్యటనలు, 250 సార్లు దేశీయ పర్యటనలు చేశారని ఖర్గే వెల్లడించారు. కానీ, మణిపూర్‌లో ఒక్క సెకండ్ సమయం పర్యటించలేదని విమర్శించారు. మణిపూర్ ప్రజల పట్ల ఎందుకింత నిర్దయ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తించడంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఎందుకు విఫలమైందో చెప్పాలన్నారు. కేంద్ర హోం మంత్రి ప్రకటించిన శాంతి కమిటీ ఎక్కడుందని ప్రశ్నించారు. మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు.

# పాక్ విఫలదేశం.. మనల్ని ప్రశాంతంగా ఉండనివ్వదు: ఒవైసీ

**కిషన్‌గంజ్(బిహార్):** ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్తాన్‌పై మండిపడ్డారు. 'అదొక విఫల దేశం. భారత్‌ను ఎప్పటికీ ప్రశాంతంగా ఉండనివ్వదు'అంటూ వ్యాఖ్యానించారు. బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో ఒవైసీ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పొరుగుదేశం పాకిస్తాన్‌పై ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే జాబితాలో చేర్పించడం వంటి గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'భారత్ ఎప్పటికీ బలమైన దేశమే కాగా, పాకిస్తాన్ విఫల దేశంగానే ఉండిపోతుంది. వివిధ జాతులతో కూడిన పాకిస్తాన్‌లో శాంతిస్థాపన కల్ల. ఇరాన్, అఫ్గానిస్తాన్ వంటి పొరుగు దేశాలతో సైతం పాక్‌కు సత్సంబంధాలు లేవు. ఆ దేశానికి చెందిన ఓడలు, విమానాల కదలికలపై ఆంక్షలు విధించి మోదీ ప్రభుత్వం మంచి పనిచేసింది. ఇంతకుమించిన కఠిన చర్యలు తీసుకోవాలి'అని ఆయన కోరారు. భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పైన ఒవైసీ ధ్వజమెత్తారు. '1947లో జిన్నాను వ్యతిరేకించిన ముస్లింలు భారత్‌లో నివసిస్తున్న విషయం మునీర్ గుర్తుంచుకోవాలి. ఈ నేలను మేం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వెళ్లబోం'అన్నారు. చైనాతో కలిసి ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమించుకుంటామంటూ వ్యాఖ్యానించిన బంగ్లాదేశ్ మాజీ సైనికాధికారిపై నిప్పులు చెరిగారు. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా మనుగడ సాగించడానికి భారత్ పెట్టిన భిక్షే కారణమని గుర్తుంచుకోవాలన్నారు.

# పుచ్చముక్కలు తిని డబ్బులివ్వని కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

**హర్దోయి(యూపీ):** వీధిలోని తోపుడు వద్ద రూ.20 విలువ చేసే పుచ్చముక్కలు తిని డబ్బులడిగిన వ్యాపారిని బెదిరింపులకు గురి చేసిన ఇద్దరు కానిస్టేబుళ్లపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి జిల్లా పిహాని పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన చోటుచేసుకుంది. పిహానికి చెందిన లఖ్‌పత్ తోపుడు బండిపై పుచ్చకాయలు విక్రయిస్తున్నాడు. శుక్రవారం అతడి బండి వద్దకు అంకిత్ కుమార్, అనుజ్ కుమార్ అనే పోలీస్ కానిస్టేబుళ్లు వచ్చి 20 రూపాయల పుచ్చ ముక్కలు తిన్నారు. డబ్బులగిడిన పాపానికి లఖ్‌పత్‌ని తిట్టిపోశారు. చంపుతామంటూ బెదిరించారు. వీరి నిర్వాకంపై లఖ్‌పత్ ఏకంగా జిల్లా ఎస్పీ నీరజ్ కుమార్ జదౌన్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడం, ఆయన వెంటనే సీఐను దర్యాప్తు చేయాలని ఆదేశించడం జరిగిపోయాయి. పిహాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సర్కిల్ అధికారి, సంబంధిత కానిస్టేబుళ్లను, లఖ్‌పత్‌ను పిలిపించి ఆరా తీశారు. ఫిర్యాదు వాస్తమేనని తేలిందని విచారణాధికారి ఎస్పీకి నివేదించారు. కానిస్టేబుళ్ల అంకిత్, అనుజ్‌లను వెంటనే సస్పెండ్ చేయడంతోపాటు, లఖ్‌పత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని శనివారం ఎస్పీ జదౌన్ ఆదేశించారు.

# తమిళ మత్స్యకారులపై సముద్రపు దొంగల దాడి

**చెన్నై:** కోరమాండల్ తీరంలో చేపల వేటకు వెళ్లిన తమిళనాడు మత్స్యకారులపై శ్రీలంకకు చెందిన సముద్ర దొంగల ముఠా దాడికి పాల్పడింది. శుక్రవారం తామంతా కొడియక్కారై సమీపంలో ఉండగా స్పీడ్ బోట్లపై వచ్చిన ఆరుగురు దొంగలు పదునైన ఆయుధాలతో దాడికి దిగారని బాధితులు తెలిపారు. చేపల వలలు, జీపీఎస్ పరికరాలు కలిపి సుమారు రూ.10 లక్షల సామగ్రిని వారు ఎత్తుకుపోయారని తెలిపారు. భారత ప్రాదేశిక జలాల్లో ఉండగానే ఈ దాడి జరిగిందని బాధితులు వివరించారు. 17 మందికి గాయాలయ్యాలయ్యాన్నారు. బాధితులంతా నాగపట్నం జిల్లాకు చెందిన వారు. గతేడాది డిసెంబర్‌లోనూ శ్రీలంక పైరేట్లు ముగ్గురు తమిళ జాలర్లపై దాడి చేసి, దోచుకున్నారు. ఈ దాడులను ఆపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుంటే తాము వేటకు వెళ్లబోమని మత్స్యకారులు అంటున్నారు.

## అధికార పార్టీ అభ్యర్థిగా కిమ్ మూన్

**సియోల్:** దక్షిణ కొరియా అధ్యక్ష పదవికి జూన్ 3వ తేదీన జరిగే ఎన్నికకు అధికార పీపుల్ పవర్ పార్టీ తరఫున మాజీ మంత్రి కిమ్ మూన్ సూ(73) బరిలో నిలవనున్నారు. శనివారం జరిగిన పార్టీ ప్రైమరీలో కిమ్‌తో మరో నేత హన్ డాంగ్ హూన్ మాత్రమే తలపడ్డారు. అయితే, కిమ్‌కు 56.5 శాతం ఓట్లు పడ్డాయి. కిమ్ పార్టీని విజయపథాన నడిపించాలంటే మాజీ ప్రధానమంత్రి హన్ డక్ సూ వంటి నేతలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధాన ప్రతిపక్ష లేబర్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిగా లీ జే మ్యుంగ్ ఇప్పటికే ఖరారయ్యారు. గతేడాది డిసెంబర్ దేశంలో ఆకస్మికంగా సైనిక పాలన విధించి, అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ పదవి కోల్పోవడం తెల్సిందే.

---

# పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తా..

### కర్ణాటక మంత్రి జమీర్ ఆవేశం

**హొసపేట:** 'పాకిస్తాన్‌తో యుద్ధం జరిగే అవకాశం ఉంది. నాకో అవకాశం ఇవ్వండి. యుద్ధంలో నేనూ పోరాడుతా'అని కర్ణాటక వక్ఫ్, గృహ నిర్మాణ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ముందుకు వచ్చారు. ఆయన శనివారం విజయనగరం జిల్లా హోస్పేటలో మీడియాతో మాట్లాడారు. 'సరిహద్దుల్లో సమరానికి నేను సిద్ధం. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాను డిమాండ్ చేస్తున్నా. నాకొక ఆత్మాహుతి బాంబ్ ఇవ్వండి. నేనేమీ జోక్ చేయడం లేదు. దేవుని మీద, అల్లా మీద ప్రమాణం చేసి చెబుతున్నా. యుద్ధానికి వెళ్తా. పాకిస్తాన్ ఎప్పుడూ మాకు శత్రుదేశమే. పాకిస్తాన్‌పై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించనివ్వండి. సరిహద్దు వద్ద నిలబడి భారతదేశం కోసం పోరాడుతాం. భారతదేశం ఎల్లప్పుడూ హిందుస్థాన్‌గానే ఉంటుంది'అని ఆవేశంతో ఊగిపోయారు. కాగా, బెంగళూరుకు చెందిన ఈ కాంగ్రెస్ నేత వివాదాస్పద ప్రకటనలతో తరచూ వార్తల్లోకి వస్తుంటారు.

## సోనూ నిగమ్‌పై కేసు

**బెంగళూరు:** కన్నడిగుల మనోభావాలను దెబ్బతీశారంటూ సినీ నేపథ్య గాయకుడు సోనూ నిగమ్‌పై బెంగళూరులో కేసు నమోదైంది. బెంగళూరులోని ఓ కాలేజీలో ఏప్రిల్ 25న జరిగిన సంగీత కార్యక్రమంలో కన్నడ పాట పాడమని ప్రేక్షకుడొకరు కోరగా 'కన్నడ. కన్నడ. పహల్గాం ఘటనకు ఇదే కారణం' అంటూ సోనూ నిగమ్ అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేశారని కన్నడ అనుకూల కర్ణాటక రక్షణ వేదికె (కేఆర్‌వీ) ఆరోపిస్తోంది. 'నా అనుభవమంత వయస్సు కూడా లేని ఓ యువకుడు పదే పదే కన్నడ కన్నడ అంటూ పరుషంగా నన్ను ఉద్దేశించి కేకలు వేయడం అవమానకరం అనిపించింది. అతిథులతో మాట్లాడే పద్ధతి ఇది కాదు'అని సోనూ నిగమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# పాము విషానికి.. తిరుగులేని విరుగుడు!

- మనిషి రక్తం నుంచి తయారీ
- పాముకాటు చికిత్సలో మైలురాయి
- ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ దశలో
- అందుబాటులోకి వస్తే అద్భుతమే



పాముతో చేతిపై కరిపించుకుంటున్న తిమోతీ

హీరోకు వాళ్ల నాన్నో, తాతయ్యో చిన్నప్పటి నుంచే కొద్దిపాటి మోతాదులో విషం తినిపిస్తారు. దాంతో పెరిగి పెద్దయ్యాక ఎలాంటి పాము కరిచినా మనవాడికి ఏమీ కాదు. ఈ ఫార్ములాతో సూపర్‌డూపర్ హిట్టైన సినిమాలు అన్నీ ఇన్నీ కావు. అమెరికాలోనూ కాలిఫోర్నియాలో ఉండే తిమోతీ ఫ్రైడ్ అనే వ్యక్తి అచ్చం అలాగే చేశాడు. ఒకటీ రెండూ సార్లు కాదు, 18 ఏళ్ల వ్యవధిలో ఏకంగా 200 సార్లకు పైగా పాములతో కరిపించుకున్నాడు. 700 సార్లకు పైగా పాము విషాన్ని ఒంట్లోకి ఎక్కించుకున్నాడు! గుర్రం వంటి బలిష్టమైన జంతువులను కూడా ఒకే కాటుకు బలి తీసుకునే 16 ప్రాణాంతక పాము జాతుల విషాలూ వాటిలో ఉన్నాయి. ఫలితంగా తిమోతీ ఎలాంటి పాము కరిచినా ఏమీ కాని స్థితికి చేరుకున్నాడు! మనవాడి రక్తం నుంచి సైంటిస్టులు తాజాగా పాము విషానికి విరుగుడు తయారు చేశారు. ఇప్పటిదాకా తయారైన వాటిల్లోకెల్లా అత్యంత ప్రభావవంతమైన యాంటీ వెనమ్ ఇదేనని చెబుతుండటం విశేషం! దీన్ని పాము కాటు చికిత్సలోనే అత్యంత విప్లవాత్మక మలుపుగా చెబుతున్నారు!!

**ఇలా చేశారు...**

బ్లాక్‌మాంబా. ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైన పాముల్లో ఒకటి. రాచనాగు, టైగర్ స్నేక్, రాటిల్ స్నేక్ వంటివీ ఈ కోవలోకే వస్తాయి. ఇలాంటి విషపూరిత పాములతో పదేపదే కరిపించుకున్న తిమోతీ గురించి అమెరికాకు చెందిన వ్యాక్సీన్ కంపెనీ సెంటివాక్స్ సీఈఓ జాకబ్ గ్లెన్‌విల్లే 2017లో ఎక్కడో చదివారు. వాటి విషాన్ని వందలాదిసార్లు ఒంట్లోకి ఎక్కించుకున్నాడని తెలిసి ఆశ్చర్యపోయారు. తిమోతీ ట్రక్ మెకానిక్‌గా చేసేవాడు. తర్వాత రకరకాల పాములను గురించి ఆసక్తికరమైన వీడియోలు చేసి ఫేమస్ అయ్యాడు. ఆ క్రమంలో ఒకసారి రెండు నాగుపాములు వెంటవెంటనే కరవడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా ఇలా విషం పుచ్చుకోవడం మొదలుపెట్టాడు. తిమోతీ అంగీకారంతో గ్లెన్‌విల్లే అతని రక్త నమూనాలు సేకరించారు. ఎలాంటి పాము విషాన్నైనా తట్టుకోగలిగే తిరుగులేని యాంటీబాడీలు వాటిలో పుష్కలంగా ఉన్నట్టు తేల్చారు. కొలంబియా వర్సిటీకి చెందిన మెడికల్ సైన్సెస్ నిపుణుడు రిచర్డ్ స్టాక్ తదితరుల సాయంతో సైంటిస్టులు ఆ యాంటీబాడీలను సేకరించారు. ఎనిమిదేళ్లపాటు సుదీర్ఘ శ్రమకోర్చి వాటి సాయంతో అత్యంత ప్రభావవంతమైన యాంటీ వెనమ్ ఇంజక్షన్ తయారు చేశారు. దానికి ఎల్ఎన్ఎక్స్-డీ09 అని పేరు పెట్టారు. ప్రయోగాత్మకంగా బ్లాక్‌మాంబాతో పాటు 19 అత్యంత విషపూరిత పాముల విషాన్ని ఒక్కొక్కటిగా ఎలుకలకు ఎక్కించి, అనంతరం వాటికి ఈ విరుగుడు ఇచ్చారు. బ్లాక్ మాంబాతో పాటు 13 రకాల విషాల బారినుంచి ఎలుకలను ఈ యాంటీ వెనమ్ కాపాడటం చూసి ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారు! ఆరు అత్యంత విషపూరిత పాముల విషాన్ని కలగలిపి ఇచ్చినా అదే ఫలితం వచ్చింది. మిగతా 6 రకాల విషాలకు కూడా ఎల్ఎన్ఎక్స్-డీ09 పాక్షికంగా విరుగుడుగా పని చేసింది. ఇది ప్రస్తుతానికి ప్రయోగాల దశలోనే ఉన్నట్టు గ్లెన్‌విల్లే చెప్పారు. ఈ పరిశోధన ఫలితాలను తాజాగా సైంటిఫిక్ జర్నల్ 'సెల్'లో ప్రచురించారు.

**శ్రమతో కూడిన ప్రక్రియ**

యాంటీ వెనమ్ తయారీ ఓ సంక్లిష్ట ప్రక్రియ. పాముల నుంచి సేకరించిన విషయాన్ని చిన్న డోసుల్లో గుర్రాల వంటి జంతువులకు ఎక్కిస్తారు. ఆ విషానికి రోగనిరోధకత సమకూరాక వాటి రక్తం నుంచి సేకరించిన యాంటీబాడీలతో విరుగుడు తయారు చేస్తారు. అయితే ఇది శ్రమతో కూడినదే గాక ప్రమాదకరమైన ప్రక్రియ కూడా. చాలాసార్లు సరిగా పని చేయకపోవడంతో పాటు సీరియస్ సైడ్ ఎఫెక్టులు కూడా తలెత్తుతాయి. పాముకాటుకు ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.4 లక్షల మంది బలవుతున్నట్టు అంచనా. 4 లక్షల మంది దాకా వికలాంగులుగా మారుతున్నారు. గ్వాటిమాలా గ్రామాల్లో పెరిగిన గ్లెన్‌విల్లే ఈ సమస్యకు మెరుగైన, శాశ్వత పరిష్కారం కోసం చాన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నారు. అది ఎల్ఎన్ఎక్స్-డీ09 కాగలదని ఆయన ధీమాగా చెబుతున్నారు.

**– సాక్షి, నేషనల్ డెస్క్**

# ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా భేటీ

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పహల్గాంలో గత వారం జరిగిన ఉగ్ర దాడి సహా పలు కీలక పరిణామాలపై వీరు చర్చలు జరిపారని అధికారులు వెల్లడించారు. ప్రధాని నివాసంలో జరిగిన వీరి భేటీ అరగంటపాటు సాగింది. పర్యాటక పట్టణం పహల్గాంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను సీఎం ఒమర్ వివరించారు. ముష్కర మూకల హేయమైన చర్యలపట్ల కశ్మీర్ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ప్రధానికి ఆయన తెలిపారు. అదేవిధంగా, జూలై 3 నుంచి మొదలయ్యే అమర్‌నాథ్ యాత్ర అంశంపైనా చర్చ జరిగిందని అధికారులు తెలిపారు.

## షిర్డీ సాయి ఆలయానికి బాంబు బెదిరింపు

**ముంబై:** మహారాష్ట్రలోని షిర్డీలోని ప్రసిద్ధ సాయిబాబా ఆలయానికి శనివారం బాంబు బెదిరింపు అందింది. వెంటనే తనిఖీలు చేపట్టిన భద్రతా సిబ్బంది అదంతా వట్టిదేనని తేల్చారు. ఆలయాన్ని బాంబుతో పేల్చేస్తామంటూ శుక్రవారం ఆలయ ట్రస్ట్‌కు ఈ మెయిల్ అందింది. ఆలయ నిర్వాహకులు ఈ మేరకు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆలయ భద్రతా సిబ్బంది, పోలీసులు కలిసి ఆలయం, చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షుణ్నంగా సోదాలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదని శ్రీ షిర్డీ సాయి బాబా సంస్థాన్ సీఈవో గోరక్ష గడిల్కర్ వెల్లడించారు. ఘటన నేపథ్యంలో ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశామన్నారు.

# 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథ రచయిత?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ


## జీవశాస్త్ర పరిచయం

భూమిపై ఎన్నో వైవిధ్యభరితమైన జీవులుంటాయి. జీవుల శాస్త్రీయ అధ్యయనమే బయాలజీ. సుమారు 4.5–5 బిలియన్ ఏళ్ల క్రితం భూమి ఏర్పడింది. భూమి ఏర్పడిన 1 నుంచి 1.5 బిలియన్ ఏళ్ల తర్వాత జీవం ఆవిర్భవించింది. ఆ తర్వాత జరిగిన జీవ పరిణామం ద్వారా ఎన్నో రకాలు జీవులు ఆవిర్భవించాయి.

- భూమిపై జీవ ఆవిర్భావాన్ని వివరించే సిద్ధాంతాల్లో ప్రధానమైంది పాన్‌స్పెర్మియ, జీవావిర్భావ సిద్ధాంతాలు. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించనే లేదు. భూమి వెలుపల నుంచి గ్రహ శకలాల ద్వారా లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామం చెందాయని ఈ సిద్ధాంతం వి వరిస్తోంది. స్వాంటె అర్హీనియస్ దీన్ని వివరించాడు. ప్రస్తుతం అధిక ఆమోదంలో ఉన్న సిద్ధాంతం Theory of orgin of life(జీవావిర్భావ సిద్ధాంతం). దీన్ని A.I. ఒపారిన్ అనే రష్యాకు చెందిన జియోకెమిస్ట్, జేబీఎస్ హాల్డేన్ అనే బ్రిటన్ జన్యుశాస్త్రవేత్తలు స్వతంత్రంగా ప్రతిపాదించారు. వీరు ప్రతిపాదించిన వివరాల ప్రకారం భూమిపై జీవావిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి.
- పూర్వభూమి వాతావరణం కార్బన్, హైడ్రోజన్, నత్రజని వాయువుల మిశ్రమంగా ఉండేది. నీరు, నీటి ఆవిరి ఉన్నప్పటికీ స్వేచ్ఛా ఆక్సిజన్ ఉండేది కాదు. ఇలాంటి వాతావరణాన్ని క్షయకరణ(Reducing) వాతావరణం అంటారు. అప్పటి అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి కార్బన్, హైడ్రోజన్, నత్రజని మధ్య రసాయన చర్యలు జరిగి మీథేన్, హైడ్రోజన్ సయనైడ్, అమోనియా లాంటివి ఏర్పడ్డాయి. వీటితో నీటి ఆవిరి చర్యపొందడం ద్వారా ప్రస్తుతం కేవ లం జీవుల్లో మాత్రమే కనిపించే అమైనో ఆమ్లాలు, చక్కెరలు, కొవ్వు ఆమ్లాలు, నత్రజని క్షారాలు లాంటి సరళ జీవ రసాయనాలు ఏర్పడ్డాయి. ఈ సరళమైన అణువుల మధ్య చర్యల ద్వారా ప్రోటీన్లు, కొవ్వులు, కేంద్రకామ్లాలు, పిండి పదార్థాలు తయారయ్యాయి. సముద్ర నీటిలో ఈ రసాయనాలు కలిసిపోయి జరిగిన కొన్ని చర్యల ద్వారా పూర్వపర జీవకణం ఏర్పడింది.
- భూమిపై ఏర్పడిన మొదటి జీవులన్నీ అవాయుజీవులు(Anaerobes). వీటి చర్యల ద్వారా నీటి అణువు విచ్ఛిన్నమై క్రమంగా స్వేచ్ఛా ఆక్సిజన్ విడుదలైంది. ఆ తర్వాత మొక్కలు ఆవిర్భవించి వాటిలోని కిరణజన్య సంయోగక్రియ ద్వారా మరింత ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదలైంది. ప్రస్తుతం భూమిపై ఉన్న 21 శాతం ఆక్సిజన్‌కు ప్రధాన మూలం మొక్కల్లోని కిరణజన్య సంయోగ క్రియ. భూమిపై జీవం ఆవిర్భవించిన తర్వాత, జీవ పరిణామం జరిగింది. సరళస్థాయి నుంచి సంక్లిష్ట స్థాయి జీవులు ఎలా పరిణామం చెందాయన్నది మూడు ప్రధాన సిద్ధాంతాలు వివరిస్తాయి. వీటిలో మొదటిది 'ఫ్రాన్స్‌కు చెందిన జంతుశాస్త్రవేత్త జె.బీ.లామార్క్ ప్రతిపాదించిన ఆర్జిత లక్షణాల అనువంశిక సిద్ధాంతం (Theory of Inheritance of Aquired characters). పర్యావరణ ప్రభావం ద్వారా జీవుల్లో కొత్త లక్షణా లు ఏర్పడి అవి తర్వాతి తరాలకు అవిచ్ఛిన్నంగా సంక్రమించడం ద్వారా కొత్త జాతు లు ఆవిర్భవిస్తాయని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఇంగ్లండ్‌కు చెందిన ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకృతివరణ సిద్ధాంతం.దీని ప్రకారం ప్రకృతిలోని పోటీ ఫలితంగా ఆ పోటీ తట్టుకొని నిలిచే జీవజాతులను ప్రకృతి వరిస్తుంది. హ్యూగోడివ్రీస్ అనే డచ్ వృక్ష శాస్త్రవేత్త ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
- భూమిపై ఉన్న జీవులను వర్గీకరించడం ద్వారా వాటిపై సమగ్ర అవగాహన సాధ్యమవుతుంది. అన్ని జీవులు పెరుగుదల, జీవక్రియ, ప్రత్యుత్పత్తి లాంటి సమాన లక్షణాలను ప్రదర్శించినప్పటికీ వాటిలోని కొన్ని ప్రత్యేకతల కారణంగా వాటిని విభజించాల్సిన అవసరముంటుంది. భూ మిపై ఉన్న జీవులన్నింటినీ మొక్కలు, జంతువులు అనే రెండు రకాలుగా అరిస్టాటిల్ వర్గీకరించాడు. అనంతరం అనేక సూక్ష్మజీవులను గుర్తించిన తర్వాత వాటిని కూడా కలుపుకొని అర్థవంతంగా వర్గీకరించాల్సిన అవసరం ఏర్పడింది.

### వివిధ జీవుల శాస్త్రీయ అధ్యయనాల పేర్లు

| | |
|---|---|
| శిలీంధ్రాలు | మైకాలజీ |
| శైవలాలు | ఫైకాలజీ |
| మొక్కలు | ఫైటాలజీ/బోటనీ |
| జంతువులు | జువాలజీ |
| స్పంజికలు | పారాజువాలజీ |
| గడ్డి మొక్కలు | అగ్రోస్టాలజీ |
| వృక్షాలు | డెండ్రాలజీ |
| క్షీరదాలు | మామోలజీ |
| పక్షులు | ఆర్నిథాలజీ |
| సరీసృపాలు | హెర్పటాలజీ |
| సర్పాలు | సర్పెంటాలజీ/ఒఫియాలజీ |
| కప్పలు | బాట్రకాలజీ |
| చేపలు | ఇక్తియాలజీ |
| కీటకాలు | ఎంటమాలజీ |
| తిమింగలాలు | సెటాలజీ |
| సీతాకోక చిలుకలు | లెపిడో టిరాలజీ |
| సాలీడు | అరెనియాలజీ |



రాబర్ట్ విటేకర్ అనే జీవశాస్త్రవేత్త జీవులన్నింటినీ ఐదు ప్రధాన రాజ్యాలుగా వర్గీకరించాడు. ప్రస్తుతం ఈ వర్గీకరణే ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉంది. కణ సంక్లిష్టత, శరీర సంక్లిష్టత, పోషణ ఆధారంగా జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

I. **మొనీరా రాజ్యం:** కేంద్రక పూర్వ జీవులన్నింటినీ ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ ఏక కణజీవులు. ఇవి కేంద్రక పూర్వ కణాలతో నిర్మితమై ఉంటాయి.
**ఉదా:** బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా (పూర్వనామం: నీలి ఆకుపచ్చ శైవలాలు)

II. **ప్రొటిస్టా రాజ్యం:** నిజ కేంద్రక జీవుల్లో ఏక కణ జీవులను ఈ రాజ్యంలో చేర్చారు. జంతువుల్లో ప్రోటోజోవా అనే ఏక కణ జీవులను, మొక్కల్లోని ఏకకణ శైవలాలను ఈ రాజ్యంలో చేర్చారు.

III. **శిలీంధ్ర రాజ్యం:** మొక్కలు, జంతువులు కానీ శిలీంధ్రాలు (Fungi) ఈ వర్గంలో చేర్చారు. శిలీంధ్రాలు పరపోషకాలు. అత్యధిక శిలీంధ్రాలు విచ్ఛిన్నకారులు. జంతు, వృక్ష కళేబరాలపై ఆధారపడతాయి. శిలీంధ్రాల ద్వారా మానవుల్లో, పంట మొక్కల్లో అనేక వ్యాధులు కలుగుతాయి. ఉదా: కాండిడా, పెన్సీలియం.

IV. **వృక్ష రాజ్యం:** అన్ని బహుకణ మొక్కలను ఈ వర్గంలో చేర్చారు. కిరణ జన్య సంయోగక్రియ ద్వారా వాటి ఆహారాన్ని అవే తయారు చేసుకుంటాయి. ఇవన్నీ స్వయం పోషకాలు.
**ఉదా:** బహుకణ శైవలాలు, బ్రయోఫైట్స్, టెరిడోఫైట్స్, వివృత బీజాలు, ఆవృత బీజాలు.

V. **జంతురాజ్యం (Animalia):** అన్ని బహుకణ జంతువులను ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ పరపోషకాలు. అత్యధికంగా స్వేచ్ఛా జీవులు. కొన్ని పరాన్న జీవులు కూడా ఉంటాయి.
**ఉదా:** రక్తాన్ని పీల్చే ఆడదోమలు, పేగులోని బద్దెపురుగులు. అత్యధిక జంతువులు శాకాహారులు. కొన్ని మాంసాహారులు, మరికొన్ని సర్వభక్షకాలు కూడా ఉంటాయి.

### మాదిరి ప్రశ్నలు

1. ప్రకృతి అధ్యయనం కోసం 1831–36 మధ్యకాలంలో డార్విన్ ఏ నౌకలో ప్రయా ణించాడు?
   1) HMS బీగిల్ 2) టైటానిక్
   3) KSK జైగాంట్ 4) TTS పర్ల్
2. ఏ మొక్కపై పరిశోధన ద్వారా హ్యూగో డివ్రీస్ ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపా దించాడు?
   1) తోట బఠాని 2) గులాబీ
   3) ఈనోథిర 4) ఏదీకాదు
3. భూమిపై ఆవిర్భవించిన తొలి కణాలకు ఒపారిన్ పెట్టిన పేరు?
   1) ప్రొటినాయిడ్ 2) కొయసర్వేట్
   3) కణం 4) న్యూక్లియాయిడ్
4. కిందివాటిలో సరైంది?
   ఎ) ప్రస్తుత భూమి వాతావరణం ఆక్సీకరణ వాతావరణం
   బి) పూర్వభూమిలోని సముద్రనీరు అంతస్సారు జలం
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) ఏదీకాదు
5. కిందివాటిలో శిలీంధ్రం ఏది?
   1) ఈస్టు 2) పుట్టగొడుగు
   3) పెన్సీలియం 4) పైవన్నీ
6. అతిపెద్ద జంతు వర్గం?
   1) మొలస్కా 2) ఆర్థ్రోపొడా
   3) కార్డేటా 4) నిడేరియా
7. జంతు, మొక్క లక్షణాలు రెండూ ఉన్న జీవి?
   1) అమీబా 2) పారమీసియం
   3) ప్లాస్మోడియం 4) యూగ్లీన
8. బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?
   1) ప్లటనిస్ట గాంజిటిక
   2) ఆర్డియోటిస్ నైగ్రీసెప్స్
   3) అకినోనిక్స్ జుబేటస్
   4) సిట్టాకుల క్రామెరీ
9. కింది ఏ పక్షులను డార్విన్ పేరుతో పిలుస్తారు?
   1) స్వాలోస్ 2) ఫించ్
   3) వల్చర్ 4) సీగల్
10. మొక్కలన్నింటిలో ఉన్నతమైనవి?
    1) ఆవృత బీజాలు 2) వివృత బీజాలు
    3) బ్రయోఫైట్స్ 4) టెరిడోఫైట్స్
11. కిందివాటిలో ద్విదళబీజం ఏది?
    1) కొబ్బరి 2) మొక్కజొన్న
    3) వరి 4) మామిడి
12. వృక్ష శాస్త్ర పితామహుడు?
    1) అరిస్టాటిల్ 2) థియోఫ్రాస్టస్
    3) లిన్నెయస్ 4) డార్విన్
13. 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథ రచయిత?
    1) ఛార్లెస్ డార్విన్ 2) జె.బి. లామార్క్
    3) హ్యూగో డెవ్రీస్ 4) జి.జె. మెండెల్
14. కిందివాటిలో నిజమైన చేప ఏది?
    1) స్కార్పియాన్ ఫిష్ 2) స్టోన్ ఫిష్
    3) పఫర్ ఫిష్ 4) పైవన్నీ
15. కిందివాటిలో బ్యాక్టీరియం ఏది?
    1) నాస్టాక్ 2) అనబిన
    3) రైజోబియం 4) క్యాలోథ్రిక్స్
16. ఈస్టు శాస్త్రీయ నామం?
    1) సెకరో మైసిస్ సెరివిజియే
    2) పెన్సీలియం నొటేటం
    3) కాండిడా ఆల్బికన్స్ 4) ఏదీకాదు
17. కిందివాటిలో పాక్షిక జల క్షీరదం ఏది?
    1) సీల్ 2) వాల్‌రస్
    3) ఆటర్ 4) పైవన్నీ
18. జీవ వైవిధ్యం అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ స్థానం?
    1) 1 2) 6 3) 12 4) 24
19. శిలీంధ్రం, మొక్క వేర్ల మధ్య ఏర్పడే సహజీవనం?
    1) లైకెన్ 2) మైకోరైజా
    3) మైకోబియాంట్ 4) ఫైకోబియాంట్
20. ప్రస్తుతం ప్రపంచంలో ఎన్ని పులుల ఉపజాతులు ఉన్నాయి?
    1) 6 2) 8 3) 10 4) 12

**సమాధానాలు**

1) 1; 2) 3; 3) 2; 4) 3; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 2; 10) 1; 11) 4; 12) 2; 13) 1; 14) 4; 15) 3; 16)1; 17) 4; 18) 2; 19) 2; 20) 1.

# బుధ గ్రహం పరిభ్రమణ కాలం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

## మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్రరాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటివరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12 పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాగాలను గుణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి.. 1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పనిచేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957, అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్-1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961, ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 ని॥ల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్-6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969, జులై 21న అమెరికాకు చెందిన అపోలో-11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలుమోపారు.
- 1984, ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్-టి-11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర 1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ – 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్వీ – డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలున్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములున్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.
- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు. $1AU = 1.496 \times 10^{11}$ మీ॥
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యం లో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం $= 9.3 \times 10^{15}$ మీ॥ $= 6.33 \times 10^4$ AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26 కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం– 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సం॥లు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం – గురుడు (బృహస్పతి)
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం – బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ట దూరంలో బుధుడు, గరిష్ట దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం–శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు–బుధుడు,శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు ఉండటానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత $25^0$ సెంటీగ్రేడ్ నుంచి $40^0$ సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం– ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం – హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

### మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట 2) భాస్కర-1
   3) ఇన్‌శాట్ – 1బి 4) భాస్కర – 2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం 2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం 4) ఏదీకాదు
4. సూర్యగ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతిపెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా 4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

**సమాధానాలు**

1) 1; 2) 3; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 1; 8) 2; 9) 3; 10) 2.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ–2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ – 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ–2001)
   1) $3 \times 10^4 \times 60 \times 60 \times 24 \times 365.25$
   2) $3 \times 10^2 \times 60 \times 60 \times 24 \times 365.25$
   3) $3 \times 10^5 \times 60 \times 60 \times 24 \times 365.25$
   4) $3 \times 10^3 \times 60 \times 60 \times 24 \times 365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లా లంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ–2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక?(డీఎస్సీ–2002)
   1) ఇన్‌శాట్-1బి 2) పీఎస్ఎల్వీడీ-2
   3) భాస్కర-2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి,భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు?(డీఎస్సీ–2003)
   1) స్కాటర్న్ – 5, స్కాటర్న్ – 6
   2) అపోలో – 11, సోయూజ్-టీ-11
   3) వైకింగ్-1, వైకింగ్-2
   4) సోయూజ్ -టీ-11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం?(డీఎస్సీ–2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ–2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ – 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ – 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు 4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ–2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర – 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ–2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్

**సమాధానాలు**

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 3; 12) 1; 13) 1.

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఎయిమ్స్ గువాహటిలో ట్యూటర్/క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

గువాహటిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)..నర్సింగ్ కాలేజ్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ట్యూటర్/క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నర్సింగ్/పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:**నెలకు రూ.56,100 నుంచి 1,77,500
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.05.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsguwahati.ac.in

### ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ వర్క్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **వేతనం:** నెలకు రూ.40,000.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.04.2025 నాటికి 35 ఏళ్ల లోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేజీఎం, హెచ్‌ఆర్‌ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110 017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.05.2025.
» **వెబ్‌సైట్:** https://ircon.org

### కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కోల్‌కతా షిప్ రిపేర్ యూనిట్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ (మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(మెకానికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 12.05.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.46,000 నుంచి 54,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.05.2025
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

# తక్కువ కాలం పదవిలో ఉన్న రాష్ట్రపతి ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### పాలిటీ

## మాదిరి ప్రశ్నలు

1. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ప్రకరణ 43ఎ - కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించడం
   బి) ప్రకరణ 43బి: సహకార సంఘాలను ప్రోత్సహించడం
   సి) ప్రకరణ 48ఎ - అడవులు, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి
   డి) ప్రకరణ 39ఎ - సమన్యాయం, ఉచిత న్యాయ సహాయం
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
2. స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) స్పీకర్‌ను రాష్ట్రపతి తొలగించవచ్చు
   2) ఎన్నిక సమయంలో స్పీకర్ సభలో సభ్యుడు కానవసరం లేదు. కానీ నియమించిన ఆరు నెలల్లో పార్లమెంట్‌కు ఎన్నికవ్వాలి
   3) సభ సాధారణ కాలపరిమితి కంటే ముందే రద్దయితే దానితో పాటే స్పీకర్ కూడా తన పదవిని కోల్పోతారు
   4) రాజీనామా పత్రాన్ని డిప్యూటీ స్పీకర్‌కు సమర్పించాలి
3. కింది వాటిలో భారత ఎన్నికల సంఘం విధులు ఏవి?
   ఎ) లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించడం
   బి) కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
   సి) ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు, వివాదాలపై నిర్ణయం
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) పైవేవీకావు
4. అతి తక్కువ కాలం పదవిలో ఉన్న రాష్ట్రపతి ఎవరు?
   1) సర్వేపల్లి రాధాకృష్ణన్
   2) జాకీర్ హుస్సేన్ 3) జ్ఞానీ జైల్ సింగ్
   4) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
5. రాజ్యసభ ద్రవ్యబిల్లుకు సవరణలు సూచించినప్పుడు..?
   1) లోక్‌సభ ఆ సవరణలను ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు
   2) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును వదిలేస్తుంది
   3) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును రాజ్యసభకు పునఃపరిశీలనకు పంపిస్తుంది
   4) రాష్ట్రపతి ఆ ద్రవ్య బిల్లు గురించి ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు
6. కింది వాక్యాల్లో సరైంది ఏది?
   1) ఒక వ్యక్తిని ఏక కాలంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించరాదు
   2) సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమించిన విధంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను గవర్నర్ నియమిస్తారు
   3) గవర్నర్‌ను పదవి నుంచి తొలగించే విధానం రాజ్యాంగంలో పేర్కొనలేదు
   4) కేంద్రపాలిత ప్రాంతాలకు శాసనసభ ఉంటే లెఫ్టినెంట్ గవర్నర్ మెజార్టీ పార్టీ నాయకుడిని సీఎంగా నియమిస్తారు
7. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ప్రకరణ 123-ఆర్డినెన్సులను జారీ చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారం
   బి) ప్రకరణ 213 - గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేసే అధికారం
   సి) ప్రకరణ 262 - అంతర్రాష్ట్రీయ మండలి ఏర్పాటు
   1) ఎ, బి, సి 2) బి, సి
   3) ఎ, బి 4) ఎ, సి
8. రాజ్యాంగ పరిషత్ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
   జాబితా - I
   i) సారథ్య సంఘం
   ii) క్రెడెన్షియల్ కమిటీ
   iii) ప్రాథమిక హక్కుల ఉపకమిటీ
   iv) యూనియన్ పవర్స్ కమిటీ
   జాబితా - II
   a) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
   b) రాజేంద్ర ప్రసాద్ c) జె.బి. కృపలానీ
   d) జవహర్ లాల్ నెహ్రూ
   1) i-b, ii-a, iii-c, iv-d
   2) i-a, ii-b, iii-c, iv-d
   3) i-b, ii-c, iii-a, iv-d
   4) i-c, ii-a, iii-b, iv-d
9. అటార్నీ జనరల్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) లోక్‌సభ చర్చలో పాల్గొనవచ్చు
   బి) లోక్‌సభ కమిటీ సభ్యుడు
   సి) లోకసభలో మాట్లాడొచ్చు
   డి) లోక్‌సభలో ఓటు వేయవచ్చు
   1) ఎ మాత్రమే 2) బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, సి
10. 'భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతలను సమర్థించడం, సంరక్షించడం'లను దేనిలో పేర్కొన్నారు?
    1) రాజ్యాంగ ప్రవేశిక 2) ఆదేశిక సూత్రాలు
    3) ప్రాథమిక హక్కులు 4) ప్రాథమిక విధులు
11. మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?
    1) కె. సంతానం 2) ఎ.కె. చాంద్
    3) కె.సి. నియోగి 4) వై.బి. చవాన్
12. కింది వాటిలో అఖిల భారత సర్వీసులకు సంబంధించి నియామకాలు చేసేది?
    1) రాష్ట్రపతి
    2) ఏ రాష్ట్రానికి చెందితే ఆ రాష్ట్ర గవర్నర్లు
    3) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
    4) ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు
13. 'జీరో అవర్' అని దేన్ని అంటారు?
    1) సభ ప్రారంభమైన తొలి గంట
    2) సభ్యులు ఎవరూ హాజరుకాని సమయం
    3) ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత, సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు ఉన్న సమయం
    4) ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి, సభా కార్యక్రమాల ముగింపునకు మధ్య సమయం
14. రాజ్యాంగ రిట్లలో 'ఆజ్ఞ' అనేది దేని అర్థం?
    1) ప్రొహిబిషన్ 2) మాండమస్
    3) సెర్షియోరరి 4) కో వారెంటో
15. కేంద్రంలో ఏర్పాటైన మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏది?
    1) జనతా ప్రభుత్వం
    2) యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం
    3) నేషనల్ డెమొక్రటిక్ ప్రభుత్వం
    4) నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం
16. కింది వారిలో ఉన్నతాధికార, దౌత్య సంబంధ పదవులు చేపట్టి ఉపరాష్ట్రపతులుగా కొనసాగిన వారెవరు?
    1) డా.ఎస్.రాధాకృష్ణన్ 2) జి.ఎస్. పథక్
    3) వి.వి. గిరి 4) బి.డి. జెట్టి
17. పీఠికలోని 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే భావాలను ఏ విప్లవం నుంచి గ్రహించారు?
    1) రష్యా 2) ఫ్రెంచ్
    3) అమెరికా 4) జర్మనీ
18. 'సామ్యవాదం, లౌకికవాదం' అనే పదాలను భారత రాజ్యాంగంలో ఎన్నో సవరణ ద్వారా చేర్చారు?
    1) 44 2) 40 3) 38 4) 42
19. 'కో వారెంటో' అంటే..?
    1) బంధీ ప్రత్యక్ష 2) అధికార పృచ్ఛ
    3) పరమాదేశ 4) ఉత్ప్రేషణ
20. 'స్థానిక సంస్థల పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?
    1) లార్డ్ రిప్పన్ 2) లార్డ్ కానింగ్
    3) లార్డ్ రిప్పన్ 4) లార్డ్ మౌంట్ బాటన్
21. 'ఒక తప్పునకు రెండుసార్లు శిక్షార్హం కాదు' అని తెలిపే సిద్ధాంతం ఏది?
    1) రిపగ్నస్ సిద్ధాంతం
    2) ద్వంద్వ శిక్ష నిషేధ సిద్ధాంతం
    3) గ్రహణ సిద్ధాంతం
    4) రెట్రిబ్యూషన్ సిద్ధాంతం
22. కమిటీలు, అవి సిఫారసు చేసిన అంశాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా - I
    i) బల్వంతరాయ్ మెహతా కమిటీ
    ii) అశోక్ మెహతా కమిటీ
    iii) సి.హెచ్. హనుమంతరావు కమిటీ
    iv) ఎల్.ఎం. సింఘ్వి కమిటీ
    జాబితా - II
    a) రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
    b) జిల్లా ప్రణాళికా బోర్డుల ఏర్పాటు
    c) మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
    d) పంచాయతీరాజ్ సంస్థలను రాజ్యాంగ బద్ధం చేయాలి
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-d, ii-a, iii-b, iv-c
23. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    ఎ) జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఏటా జనవరి 25న నిర్వహిస్తారు
    బి) ఎన్నికల సంఘం తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది
    సి) ఎన్నికల సంఘం తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పిస్తుంది
    డి) ఎన్నికల సంఘం తన నివేదికను ఎవరికీ సమర్పించాల్సిన అవసరంలేదు
    1) ఎ, డి 2) బి, డి
    3) ఎ, సి 4) సి, డి
24. కింది వాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు ఏవి?
    ఎ) ఏక పౌరసత్వం
    బి) ద్వంద్వ ప్రభుత్వం
    సి) లిఖిత రాజ్యాంగం
    డి) ద్విసభా పద్ధతి ఇ) ఒకే రాజ్యాంగం
    ఎఫ్) కేంద్రం రాష్ట్రాలను పునర్‌వ్యవస్థీకరించడం
    1) ఎ, బి, సి, ఎఫ్ 2) బి, సి, డి
    3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ
25. కింది వాటిలో ఏక కేంద్ర లక్షణాలు ఏవి?
    ఎ) అఖిల భారత సర్వీసులు
    బి) అత్యవసర అధికారాలు
    సి) అధికార విభజన
    డి) స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయవ్యవస్థ
    ఇ) గవర్నర్ వ్యవస్థ
    ఎఫ్) రాజ్యాంగేతర సంస్థలు
    1) ఎ, బి, ఇ, ఎఫ్ 2) బి, సి, డి
    3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ
26. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం - ఏప్రిల్ 24
    బి) ప్రవాస భారతీయ దివస్ - జనవరి 9
    సి) ప్రాథమిక విధుల దినోత్సవం - జనవరి 3
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, బి, సి 4) సి, డి
27. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలి పదవీ కాలం ఎన్నేళ్లు?
    1) రెండేళ్లు 2) మూడేళ్లు
    3) నాలుగేళ్లు 4) ఐదేళ్లు
28. ప్రాంతీయ పార్టీలు, వాటి వ్యవస్థాపక అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి?
    జాబితా - I
    i) శివసేన ii) ద్రవిడ మున్నేట్ర కజగం
    iii) ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం
    iv) దేశీయ ముర్‌పొక్కు ద్రవిడ మున్నేట్ర కజగం
    జాబితా - II
    a) సి.ఎన్. అన్నాదురై
    b) ఎం.జి. రామచంద్రన్
    c) బాల్‌థాకరే d) విజయ్‌కాంత్
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-d, ii-a, iii-b, iv-c
29. ప్రాంతీయ పార్టీలు, వాటిని ఏర్పాటు చేసిన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా - I
    i) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్
    ii) అసోం గణ పరిషత్
    iii) తెలంగాణ రాష్ట్ర సమితి
    iv) తెలుగుదేశం పార్టీ
    జాబితా - II
    a) 2001 b) 1985
    c) 1998 d) 1982
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-c, ii-b, iii-a, iv-d
    3) i-b, ii-c, iii-a, iv-d
    4) i-d, ii-c, iii-a, iv-b
30. షెడ్యూల్ 12లో పేర్కొన్న అంశాలు ఎన్ని?
    1) 19 2) 18 3) 29 4) 28
31. అధికరణ 136 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం?
    1) సివిల్ జూరిస్‌డిక్షన్
    2) అప్పిలేట్ జూరిస్‌డిక్షన్
    3) స్పెషల్ లీవ్ పిటిషన్
    4) ట్రాన్స్‌ఫర్డ్ జూరిస్‌డిక్షన్
32. ఏ రాజ్యాంగ సవరణ ప్రకారం 2020 వరకు రిజర్వేషన్లు పొడిగించారు?
    1) 77 2) 98 3) 95 4) 84
33. కింది వాటిలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు లేనివారు?
    1) లోక్‌సభ సభ్యులు
    2) రాజ్యసభ సభ్యులు
    3) ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభల సభ్యులు
    4) రాష్ట్ర శాసన మండలి సభ్యులు
34. స్వతంత్ర భారత తొలి ఆర్థిక మంత్రి?
    1) ఆర్.కె. షణ్ముగం చెట్టి
    2) జాన్ మత్తాయ్ 3) సి.డి. దేశ్‌ముఖ్
    4) టి.టి. కృష్ణమాచారి
35. వివిధ జాతీయ పార్టీలు, అవి ఏర్పాటైన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
    జాబితా - I
    i) బహుజన్ సమాజ్ పార్టీ
    ii) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ
    iii) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
    iv) భారతీయ జనతా పార్టీ
    జాబితా - II
    a) 1925 b) 1980
    c) 1999 d) 1984
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-b, ii-c, iii-a, iv-d
    4) i-d, ii-c, iii-a, iv-b

#### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) 4 | 2) 4 | 3) 4 | 4) 2 | 5) 1 |
| 6) 3 | 7) 3 | 8) 1 | 9) 3 | 10) 4 |
| 11) 3 | 12) 1 | 13) 3 | 14) 2 | 15) 1 |
| 16) 1 | 17) 2 | 18) 4 | 19) 2 | 20) 1 |
| 21) 2 | 22) 3 | 23) 1 | 24) 2 | 25) 1 |
| 26) 3 | 27) 2 | 28) 3 | 29) 2 | 30) 2 |
| 31) 3 | 32) 3 | 33) 4 | 34) 1 | 35) 4 |

# Who among them is taller...



## Bank Exams

### Reasoning

***Directions(Q.1-4):*** **Five friends Lokesh, Manoj, Gopal, Raveesh and Rohit have agreed to work together on a part-time job offered by a local restaurant. The restaurant opens 5 days a week and this group have following schedules when they can work.**

- Neeraj and Raveesh can work on Monday, Tuesday and Wednesday
- Raveesh and Rohit can work on Monday, Wednesday and Thursday
- Rohit and Lokesh can work on Monday, Friday and Thursday
- Lokesh and Manoj can work on Friday, Tuesday and Thursday.
- Neeraj and Manoj can work on Friday, Tuesday and Wednesday.

***Based on the above passage, answer the following questions.***

1. **Which one of the five friends cannot work on Thursday?**
   a) Neeraj b) Raveesh
   c) Rohit d) Lokesh
   e) Manoj
2. **Which is the one who cannot work on Tuesday?**
   a) Neeraj b) Raveesh
   c) Rohit d) Lokesh
   e) Manoj
3. **Name the person who cannot work on Friday?**
   a) Neeraj b) Rohit
   c) Manoj d) Raveesh
   e) Lokesh
4. **Name the person who cannot work on Monday?**
   a) Rohit b) Manoj
   c) Raveesh d) Lokesh
   e) Neeraj

**Answers(1-4):** To answer this kind of questions, tabulating the given information is very useful.

- People working on monday- Neeraj, Raveesh, Rohit and Lokesh.
- People working on Tuesday- Neeraj, Raveesh, Lokesh and Manoj
- People working on Wednesday - Neeraj, Raveesh, Rohit and Manoj
- People working on Thursday - Raveesh, Rohit, Lokesh and Manoj
- People working on Friday - Rohit, Lokesh, Manoj and Neeraj

1. **Ans:** a.
   From the above table, it is clear that Neeraj Cannot work on Thursday.
2. **Ans:** c.
   Rohit Cannot work on Tuesday.
3. **Ans:** d.
   Raveesh Cannot work on Friday.
4. **Ans:** b.
   Manoj cannot work on Monday.

***Directions(Q.5-7):*** **Four couples are invited to a dinner party. They will be seated at a circular table. Follo- wing are the seating conditions.**

- Geeta refuses to sit next to Ali
- Lata wants to sit in between Tilak and Hari
- Champa refuses to sit next to Farooq
- Niti is seated on Ali's right hand side
- Farooq and Tilak are seated exactly opposite to each other
- The seating arrangement is such that one women is always between two men.

5. **Which of the following is the only possible seating arrange-ment to suit the above condi-tions?**
   a) Niti is to the right of Tilak
   b) Lata is in between Geeta and Farooq
   c) Champa is opposite to Geeta
   d) Farooq is adjacent to Champa
   e) Ali is to the right of Geeta
6. **Which of the following combi-nations is not as per the instru-cted sitting arrangement?**
   a) Geeta, Farooq, Lata
   b) Ali, Champa, Tilak
   c) Hari, Lata, Tilak
   d) Farooq, Niti, Ali
   e) Hari, Geeta, Farooq
7. **Which of the following state-ments are correct?**
   **I.** Ali is on Champa's right
   **II.** Lata is on Tilak's left
   **III.** Farooq is between Niti and Geeta
   1) I 2) II 3) III 4)

**Answers(5-7):**
**Male members:**
Ali, Lata, Hari and Farooq
**Female members:**
Geeta, Lata, Champa and Niti.
From the given data the seating arrangement of the 4 couples is as follows.




5. **Ans:** c.
   From the above arrangement, it is clear that Champa and Geeta are exactly opposite.
6. **Ans:** a.
   Geeta, Farooq, Lata are not seated in this order.
7. **Ans:** e.
   From the above arrangement, it is clear that Ali is on Champa's right, Lata is on Tilak's left and Farooq is between Niti and Geeta.

***Directions(Q.8-12):*** **Read the following information carefully and answer the questions.**

- Six friends P,Q,R,S,T and U are members of a club and play a different game of Football, Cricket, Tennis, Basket ball, Badminton and Volleyball.
- 'T' who is taller than 'P' and 'S' plays Tennis.
- The tallest among them plays Basketball
- The shortest among them plays Volleyball
- 'Q'&'S' neither plays Volleyball nor Basketball
- 'R' plays Volleyball
- 'T' is between Q who plays Football and 'P' in order of height

8. **What does 'S' play?**
   a) Football
   b) Either cricket or Badminton
   c) Cricket d) Badminton
   e) None of these
9. **Who among them is taller than 'R' but shorter than P?**
   a) T b) Data inadequate
   c) Q d) U
   e) None of these
10. **Which of the following state-ments is not true?**
    a) 'T' is taller than 'R'
    b) 'U' is taller than 'Q'
    c) 'P' is shorter than 'R'
    d) 'Q' is taller than 'S'
    e) 'S' is taller than 'P'
11. **Who among the following plays Basketball?**
    a) S b) U c) Q d) K
    e) None of these
12. **Who will be at the third place if they are arranged in descen- ding order of their height?**
    a) T b) Q c) P d) S
    e) None of these

**Answers(8-12):** From the given information, it is clear that 'R' plays Volleyball, 'T' plays Tennis and 'Q' plays Football. 'S' plays either Cricket or Badminton.

Order of Heights
Q>T>P and T>P&S
⇒ Q>T>P> S>P
(∴R is the shortest)
The tallest person shall plays Basketball, so it is only 'U' who can play Basketball. Hence 'P' also plays either Cricket or Badminton. Tabulating the above information...

| Name | Game | Rank in Height |
|---|---|---|
| U | Basketball | 1 |
| Q | Football | 2 |
| T | Tennis | 3 |
| P } | Cricket & | } 4 |
| S } | Badminton | } 5 |
| R | Volley ball | 6 |

8. **Ans:** b.
   'S' plays either cricket or Badminton
9. **Ans:** e.
   'S' is taller than 'R' but shorter than 'P'
10. **Ans:** c.
    From the above table, it is clear that 'P' is taller than 'R'
11. **Ans:** b.
    'U' Plays Basketball.
12. **Ans:** a.
    From the table, it is clear that 'T' is third from top if they are arranged in descending order.

***Directions(Q.13):*** **Persons X,Y,Z and Q live in red, green, yellow and blue coloured houses not necessarily in the same order. 'Z' lives in a yellow house. The green house is adjacent to the blue house. 'X' does not live adjacent to 'Z'. The yellow house is in between the green and red houses. The colour of the house X lives in is**

a) blue b) green
c) red
d) can't be determined

**Ans:** a.
From the given information, Z lives in a yellow house, Which is in between green and red houses. and also 'X' is not adjacent to 'Z'. Therefore 'X' lives in blue house.

***Directions(Q.14):*** Five persons with names P, M, U, T and 'X' live separately in A palace, a hut, a fort, a house, a hotel. Each one likes two different colours from among the Blue, Black, Red, Yellow, Green. 'U' likes red and blue. 'T' likes black. The person living in a palace does not like black or blue. 'P' likes blue and red. 'M' likes yellow. 'X' lives in a hotel.

14. **'M' lives in a ——?**
    a) hut b) fort
    c) palace d) house

**Ans:** c.
Given information can be tabulated as follows.

| Person: | U | T | P | M | X |
|---|---|---|---|---|---|
| Colours: | Red/ Blue | Black | Blue/ Red | Yellow | – |

It is given that the person living in palace does not like black or blue. so U, T and P cannot live in palace. Also it is given that 'X' lives in a hotel. Therefore the only person left over is 'M' and he lives in palace.